బుధవారం
9•08•2017
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 63
• పేజీలు : 16 + 24 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW.NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

సర్కారు పెద్దమనసు

ప్రభుత్వ కొలువుల్లో అర్హత వయస్సు సడలింపు..

మరో రెండేండ్లు పొడిగింపు

- జూలై 2019 వరకు వర్తించేలా జీవో

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

సర్కారు కొలువుల కోసం పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం చల్లని ముచ్చట చెప్పింది. వయసు దాటిపోతున్నదని ఆందోళన చెందుతున్నవారికి భరోసా కల్పిస్తూ.. ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రస్తుతం ఉన్న పదేండ్ల వయోపరిమితి సడలింపు నిబంధనను మరోసారి పొడిగించింది. ఉద్యోగాల్లో చేరేందుకు వయోపరిమితిని 34 సంవత్సరాల నుంచి 44 ఏండ్లకు పెంచుతూ గతంలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే. ఈ ఉత్తర్వులకు కాలపరిమితి ఈ ఏడాది జూలైతో ముగిసిపోయింది. ఈ నేపథ్యంలో పదేండ్ల సడలింపు నిబంధనను మరో రెండు సంవత్సరాలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. అంటే జూలై-2019 వరకు ఈ అడ్‌హక్ నిబంధన అమలులో ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఇతర ప్రభుత్వ సంస్థలు నేరుగా నియామకాలు జరిపే ఏజెన్సీలు ఇచ్చే ప్రతి నోటిఫికేషన్‌కు ఈ నిబంధన వర్తించనున్నది. జూలై -2019 నాటికి 44 ఏండ్ల వయోపరిమితిని దాటని అభ్యర్థులందరూ నేరుగా నియామకాల పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది.



వేములవాడ దవాఖానలో చికిత్స పొందుతున్న నేరెళ్ల వాసులను మంగళవారం పరామర్శిస్తున్న మంత్రి కే తారక రామారావు

నేరెళ్ల ఘటన దురదృష్టకరం

డీఐజీ స్థాయి అధికారితో విచారణ చేయిస్తున్నాం

బాధ్యులపై చర్యలు తప్పవు.. ఇసుక ద్వారా వెయ్యి కోట్ల ఆదాయం తెచ్చినం

ఇసుకాసురులెవరో ప్రజలు గమనిస్తున్నరు: మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

'నేరెళ్ల ఘటన దురదృష్టకరం. కోర్టు అనుమతి తీసుకొని వారికి హైదరాబాద్‌లో మెరుగైన వైద్యం అందిస్తాం. ప్రజాస్వామ్యంలో అలా జరుగాలని ఎవరూ కోరుకోరు. డీఐజీస్థాయి అధికారితో విచారణ జరిపిస్తున్నం. నివేదిక వచ్చిన తరువాత బాధ్యులపై చర్యలు తీసుకుంటాం' అని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చెప్పారు. ఇసుక లారీల దహనం ఘటనలో వేములవాడలో చికిత్స పొందుతున్న నేరెళ్లవాసులను మంత్రి కేటీఆర్ మంగళవారం పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ఆశీర్వదిస్తే అధికారంలోకి వచ్చామని, తమకు ప్రజల ప్రాణాలే ముఖ్యమని స్పష్టంచేశారు. ప్రజాస్వామ్య ఉద్యమ స్ఫూర్తితో అవతరించిన టీఆర్ఎస్‌కు

మిగతా 2వ పేజీలో

పక్కాగా భూముల లెక్క

రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటది

సమైక్య రాష్ట్రంలో మన నోళ్లు కొట్టి.. ఆంధ్రాకు నీళ్లు తీసుకుపోయారు

దెబ్బతిన్న రైతాంగానికి పూర్వవైభవం తెస్తా: సీఎం కేసీఆర్

మేడ్చల్ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి:

రాష్ట్రంలో భూముల లెక్కలన్నీ ఇక పక్కాగా ఉంటాయని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెప్పారు. సమైక్య రాష్ట్రంలో దెబ్బతిన్న తెలంగాణ రైతాంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్న కేసీఆర్.. ఈ క్రమంలోనే రైతులకు పెట్టుబడి కింద ప్రతి సీజన్‌కు ఎకరాకు నాలుగు వేలు చొప్పున వచ్చే యాసంగి పంట నుంచి ఇవ్వబోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం పారదర్శకంగా ఉండేందుకు త్వరలోనే రాష్ట్రంలోని రెవెన్యూ రికార్డులన్నింటినీ క్రమబద్ధీకరించనున్నామని వెల్లడించారు. మూడు నెలల్లో ఈ కార్యక్రమం పూర్తవుతుందని తెలిపారు. రాష్ట్రంలోని పల్లెలన్నీ పాడిపంటలతో వర్ధిల్లాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని చెప్పారు. మంగళవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం పరిధిలోని కేశవరంలో గ్రామ పంచాయతీ కార్యాలయానికి శంకుస్థాపన చేసిన అనంతరం మూడుచింతలపల్లికి వచ్చిన ముఖ్యమంత్రి.. 1969 తెలంగాణ ఉద్యమ యోధుడు వీరారెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో సీఎం మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా అభివృద్ధి చేసుకోవాలంటే ప్రజలంతా సంఘటితమై సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. వచ్చే యాసంగినుంచి 24గంటల విద్యుత్ సరఫరాచేస్తామని ప్రకటించారు. మూడుచింతలపల్లి గ్రామానికి వరాలు కురిపించారు. సీఎం ఏమన్నారో ఆయన మాటల్లోనే..

రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటది

రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి సాధించాలంటే రైతు బాగుండాలి. రైతుకు కులం ఉండదు. అలాంటి ఆ రైతు బాగుండాలంటే అతనికి ముఖ్యంగా నీరు, విద్యుత్, పెట్టుబడి

మిగతా 2వ పేజీలో



మంగళవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం పరిధిలోని మూడుచింతలపల్లి సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి కూడా ఉన్నారు.

వచ్చే ఏడాదిలోనే మనకు గోదావరి నీరొస్తది

- యాసంగి నుంచి రైతులకు 24గంటల విద్యుత్
- ఎన్నికలనాటికి గ్రామ పంచాయతీలుగా తండాలు
- గ్రామాల అభివృద్ధికి అందరూ కథానాయకులు కావాలె
- తెలంగాణ ఆదాయాన్ని చూసి ప్రధాని ఆశ్చర్యపోయారు
- శామీర్‌పేట మండలానికి రూ.100-120 కోట్లు
- మీ ఊళ్లో ఇంటికి 6 మొక్కలు నాటండి
- నాటిన ప్రతిమొక్కను సంరక్షిస్తే.. ఇంటింటికీ రెండు పాడిగేదెలిస్తాం
- మీ గ్రామం, తండాలోని నిరుపేదలకు 100 డబుల్ బెడ్‌రూం ఇండ్లు
- మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి గ్రామసభలో ముఖ్యమంత్రి కేసీఆర్

ప్రాజెక్టులపై జీఎస్టీ వద్దు

ఐదు శాతం పన్నును యథాతథంగా కొనసాగించాలి

జీఎస్టీ కారణంగా రాష్ట్రంపై 19,200 కోట్ల భారం

లోక్‌సభ జీరో అవర్‌లో ఎంపీ జితేందర్‌రెడ్డి

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ:



రాష్ట్ర ప్రాజెక్టులపై 18% జీఎస్టీని ఉపసంహరించి, ప్రస్తుత ఐదు శాతాన్ని యథాతథంగా కొనసాగించాలని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్ష నేత జితేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం లోక్‌సభ జీరోఅవర్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించిన జితేందర్‌రెడ్డి.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన వివిధ ప్రాజెక్టులపై 18% జీఎస్టీతో పడే ఆర్థికభారాన్ని వివరించారు. సభా మర్యాదలకు అనుగుణంగా తాను వాయిదా తీర్మానాన్ని ఇవ్వలేదని గుర్తుచేశారు. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు జీఎస్టీ అమలు చేయడం సమంజసం కాదని స్పష్టంచేశారు. తెలంగాణ ప్రభుత్వం రెండున్నరేండ్లుగా మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టులు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం, రోడ్ల నిర్మాణం తదితరాలను 2.30 లక్షల కోట్లతో చేపట్టిందని, వీటిని జీఎస్టీ పరిధిలోకి తేవడంద్వారా సుమారు 19,200 కోట్ల మేరకు రాష్ట్రంపై అదనపు భారం పడుతుందని వివరించారు. జీఎస్టీ అమలులోకి రాకముందు వీటికి 5% వ్యాట్ మాత్రమే ఉండేదని, దీన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లలో కేటాయింపులు చేసిందని తెలిపారు. ఇప్పుడు అనూహ్యంగా జీఎస్టీ భా రం 18% కావడంతో బడ్జెట్ కేటాయింపుల కసరత్తు మళ్ళీ చేయాల్సి ఉంటుందని, ఇది ఆచరణ సాధ్యం కాదని స్పష్టం చేశారు. అందువల్ల 18% పన్ను విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపసంహరించుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ జోక్యం చేసుకుని ఇప్పటికే దీనిపై ఒకసారి సభలో

మిగతా 12వ పేజీలో

అభ్యంతరాలను పట్టించుకోని కేంద్రం

- న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నాం
- రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల



నిజామాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: జీఎస్టీ ఎంపవర్‌మెంట్ కౌన్సిల్ సమావేశాల్లో 33 అంశాలపై తెలంగాణ సర్కార్ అభ్యంతరాలను వ్యక్తం చేసిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. కేంద్రం తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. మంగళవారం నిజామాబాద్ నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో, మెండోర మండలం పోచంపాడ్‌లోనూ ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధానంగా గ్రానైట్, బీడీ పరిశ్రమ, ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఎరువులు తదితర వాటిపై భారం పడుతున్నదని చెప్పారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదన్నారు. ఈ విషయంలో కేంద్రం దిగిరాకపోతే న్యాయ పోరాటానికైనా సిద్ధమని హెచ్చరించారు. పేదలపై భారం పడితే కచ్చితంగా వ్యతిరేకిస్తామని తెలిపారు. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. జీఎస్టీ కౌన్సిల్ దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకొని వాటిని గౌరవించాలని, ఈ సంస్కారం కేంద్రానికి ఉండాలని సూచించారు. అవగాహన లేకుండా జీఎస్టీపై సంతకాలు చేశామన్న ప్రతిపక్షాలు ఆరోపణలను ఈటల కొట్టిపారేశారు. మినిట్స్‌లోని 33 అంశాలపై జీఎస్టీని వ్యతిరేకించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

తాగునీటికి

15 టీఎంసీలు వదులండి

కర్ణాటక మంత్రి పాటిల్‌కు మంత్రి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



హైదరాబాద్, సికింద్రాబాద్‌తోపాటు నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ పీడత ప్రాంతాల్లో తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున 15 టీఎంసీల కృష్ణా జలాలను వదులాలని కర్ణాటక జలవనరుల శాఖమంత్రి ఎంబీ పాటిల్‌ను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ లేఖ రాశారు. జంటనగరాలు, నల్లగొండ ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు నాగార్జునసాగర్ పరిధిలోని పుట్టంగండి ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని లేఖలో పేర్కొన్నారు. సాగర్‌లో కనిష్ఠ నీటిసేకరణ స్థాయి 510 అడుగులు కాగా, ప్రస్తుతం 500.5 అడుగులు మాత్రమే ఉన్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎగువన ఆల్మట్టి/ నారాయణపూర్ నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో వస్తేనే తాగునీటి అవసరాలకు నీటిని సరఫరా చేసే పరిస్థితి ఉన్నదన్నారు. తాగునీటి అవసరాల దృష్ట్యా నారాయణపూర్ నుంచి దిగువ జూరాలకు 15 టీఎంసీలు వదులాలని కోరారు.

సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా



జస్టిస్ దీపక్ మిశ్రా

5

అంతర్రాష్ట్ర బదిలీలకు

మార్గదర్శకాలు

సర్క్యులర్ జారీచేసిన తెలంగాణ, ఏపీ ప్రధానకార్యదర్శులు

సెక్షన్ 77 కింద పరస్పర, భార్యాభర్తల బదిలీలు

జిల్లా, జోనల్, మల్టీజోనల్ నుంచి రాష్ట్రస్థాయి వరకు అందరు ఉద్యోగులకు అవకాశం

ఉద్యోగులు నెలరోజుల్లోగా దరఖాస్తు చేయాలి ▪ రెండు నెలల్లో బదిలీ ప్రక్రియ పూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఎంతోకాలంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదురు చూస్తున్న అంతర్రాష్ట్ర బదిలీలకు ఎట్టకేలకు మార్గం సుగమమైంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు మార్గదర్శకాలు విడుదల చేశాయి. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, ఏపీ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి దినేశ్‌కుమార్ సంయుక్తంగా సంబంధిత సర్క్యులర్‌ను మంగళవారం జారీ చేశారు. రెండు ప్రభుత్వాలు పరస్పర బదిలీలు, ఉద్యోగ దంపతుల(స్పౌజ్) బదిలీలకు అంగీకరించినందున ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. రెండు రాష్ట్రాల ఉద్యోగులు ఈ బదిలీలకోసం రెండు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారు. కానీ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేయడంతో మార్గదర్శకాల విడుదల ఆలస్యమైంది. ఇప్పుడు జారీ అయిన సర్క్యులర్ ప్రకారం ఏపీలోని తెలంగాణ ఉద్యోగులు తెలంగాణకు, తెలంగాణలోని ఏపీ ఉద్యోగులు ఏపీకి పరస్పర బదిలీలకోసం దరఖాస్తుచేసుకోవచ్చు. జిల్లా, జోనల్, మల్టీజోనల్ క్యాడర్ ఉద్యోగుల నుంచి బదిలీ దరఖాస్తులు స్వీకరిస్తారు. కమలనాథన్ సారథ్యంలోని ఉద్యోగుల సలహాసంఘం తుది జాబితా రూపొందించిన ప్రకారం రాష్ట్రస్థాయి ఉద్యోగులు కూడా బదిలీలకోసం విజ్ఞాపనలు ఇవ్వవచ్చు. ఏపీ రీఆర్గనైజేషన్ చట్టం-2014లోని సెక్షన్ 77కు అనుగుణంగా బదిలీలు జరుగనున్నాయి. అయితే ఈ విధానంలో సొంత రాష్ట్రానికి బదిలీ కానున్న ఉద్యోగులు ఆ రాష్ట్రంలో సీనియారిటీ జాబితాలో చివరన

మిగతా 12వ పేజీలో

చైనాలో భారీ భూకంపం

దాదాపు 100 మంది మృతి!

వేలాది మందికి గాయాలు

5



27, 28 తేదీల్లో పీజీటీ..

వచ్చేనెల 3, 4న టీజీటీ భాషాపండిత పరీక్షలు

గురుకుల కొలువుల పరీక్షల రీషెడ్యూల్ విడుదల

టీఎస్‌పీఎస్సీ ప్రకటన

3

క్షణం.. క్షణం.. ఉత్కంఠ!

తీవ్ర ఆసక్తి రేపిన గుజరాత్ రాజ్యసభ ఎన్నికలు

ఈసీ జోక్యంతో అర్ధరాత్రి ప్రారంభమైన కౌంటింగ్

అంతకుముందు ఈసీకి కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ అభ్యర్థనలు

ఇద్దరు కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేల ఓట్లు చెల్లవన్న ఈసీ

5



మంగళవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం మూడుచింతలపల్లి గ్రామసభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు లక్ష్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, ఎంపీ మల్లారెడ్డి, మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, కలెక్టర్ ఎంవీరెడ్డి తదితరులు



సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న మహిళలు



మూడుచింతలపల్లిలో 1969 తెలంగాణ ఉద్యమ యోధుడు వీరారెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న సీఎం కేసీఆర్

పక్కాగా భూముల లెక్క

మొదటిపేజీ తరువాయి...

కావాలి. ఆంధ్రలో రైతులు బాగుపడ్డారంటే అక్కడ రెండు డెల్టాలున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో మన నోళ్లు కొట్టి నీళ్లు తీసుకుపోయారు కనుక అక్కడ రైతులు బాగుపడ్డరు. మనకు కరెంటు పీడ పోయింది. ఇప్పుడు బోర్లు వేసే బాధకూడా పోతది. వచ్చే యాసంగి నుంచి రైతుఖాతాల్లోనే ఎకరాకు రూ.4వేలచొప్పున వేస్తాం. కొందరు పెద్ద రైతులకు మేలు అనే ప్రచారంచేస్తున్నారు. తెలంగాణలో 25 ఎకరాలకు మించిన పెద్ద రైతులు లేరు. అంతా పారదర్శకంగా అర్హులైన రైతులకే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నం. గ్రామం యూనిట్‌గా రెవెన్యూ రికార్డులను క్రమబద్ధీకరించాలని సూచించిన. ఏ గ్రామంలో ఏ భూమి ఎవ్వరి పేరుమీద ఉంది? అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది. మూడు నెలల్లోనే భూములను క్రమబద్ధీకరించడంతోపాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పాసుపుస్తకాలను ప్రతి రైతుకు ఇస్తం. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఇలా అనేక అంశాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నరు. కానీ భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితి ఉండదు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ రైతాంగం దెబ్బతిన్నది. ఒకప్పుడు ఇంటి ముందు బాలసంతాయన హార్మోనియం పట్టుకొని వస్తేనే సాటెడు.. బుడ్డెడు వడ్లను దానంగా పెట్టే రైతులు నేడు దీనావస్థలో ఉన్నరు. వారిని ఆదుకొని, దెబ్బతిన్న నా తెలంగాణ రైతాంగానికి పూర్వవైభవం తీసుకువస్తాను. మిత్తి లేని, అప్పుకాని పెట్టుబడి ఇవ్వాలనే నేను నగదును రైతుల ఖాతాల్లోనే వేస్తున్న. ప్రతి గ్రామంలో రైతు సంఘం ఏర్పాటుచేస్తున్నం. అలాగే గ్రామ రైతు సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తం. ఆ కమిటీ సంతకంచేసిన వారికే డబ్బులు వస్తయి. భూముల సర్వేకు అధికారులు వచ్చినప్పుడు వారికి సహకరించి ఏ భూమి ఎవ్వరిదో స్పష్టంగా చెప్పాలి.

తండాలన్నింటినీ పంచాయతీలుగా మార్చుతం

ప్రత్యేక గ్రామ పంచాయతీ కావాలని లింగాపూర్ తండావాసులు అడిగారు. ఇప్పటికిప్పుడు సాధ్యం కాదు.. కానీ వచ్చే ఎన్నికలనాటికి రాష్ట్రంలోని తండాలన్నింటినీ గ్రామ పంచాయతీలు చేస్తాం. గ్రామంలో మహిళా సంఘం భవనం కావాలన్నారు.. ఎకరం లేదా అరెకరం స్థలంలో సుమారు రూ.30లక్షలతో మంచిగా భవనం నిర్మించి ఇస్తం.

చావునోటి వరకు పోయిన..

స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో నేను కూడా చావునోటి వరకు పోయిన. మొత్తంగా తెలంగాణ సాధించుకున్నం. నాడు తెలంగాణలోని పల్లె, పట్టణం అనే తేడా లేకుండా పక్షిలాగ తిరిగిన. ఢిల్లీలో కూడా చెప్పిన.. మా తెలంగాణ బంగారు చిలుక.. మా ప్రాంతాన్ని ఇతరులు దోచుకుంటున్నారని, మా రాష్ట్రం మాకు వస్తే దేశంలోనే నంబర్‌వన్‌గా ఉంటదని చెప్పిన. అన్నట్లుగానే నాతో నాలుగైదుసార్లు ప్రధానమంత్రి ఆశ్చర్యం వ్యక్తంచేశారు. 'మీ రాష్ట్రానికి నిధులు ఎలా సమకూర్చుకుంటున్నరు?' అని అడిగిండ్రు. ప్రతి రాష్ట్రానికి సొంత ఆదాయం ఉంటుంది. దీనిని స్టేట్ ఓన్ రెవెన్యూ అంటరు. రాష్ట్ర స్వీయ ఆదాయంలో 21.7% వృద్ధితో దేశంలో నేడు తెలంగాణ ప్రథమ రాష్ట్రంగా అవతరించింది. ఆ రోజు నేను ఏమని వాదించినానో నేడు అది నూటికి నూరుశాతం నిజమైంది. నేను వచ్చి ఒక గ్రామానికి రూ.10కోట్లు ఇవ్వడంతోపాటు వెంటనే జీవోలు జారీ చేయగల్గుతున్నానంటే మనకు ఆదాయం ఉంది. అలాగే కమిట్‌మెంట్ కూడా ఉంది. మన రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందం. బంగారు తెలంగాణ కావాలంటే అందరు సంఘటితంగా కష్టపడాలె. ప్రభుత్వానికి సహకరించాలె.

వీరారెడ్డి పేరిట ప్రజావైద్యశాల..

మనుషులు పుడుతుంటారు.. పోతుంటారు. కానీ కొందరు చరిత్ర సృష్టిస్తారు. అలాంటి ఇద్దరు యోధులు ఈ మేడ్చల్ గడ్డపై పుట్టారు. ఇందులో ఎస్ వెంకట్‌రామిరెడ్డి, మరొకరు ఈ గ్రామ ముద్దుబిడ్డ వీరారెడ్డి. వీరిద్దరూ 1969 తెలంగాణ ఉద్యమంలో చెన్నారెడ్డికి కుడి ఎడమ భుజాలు. వీరారెడ్డి హయాంలో కట్టిన పశువుల దవాఖాన శిథిలావస్థలో ఉందని మీ సర్పంచ్ చెప్పారు. దానిస్థానంలో మంచి దవాఖాన కట్టిస్తాం. లక్ష్మాపూర్ వచ్చినప్పుడు, ఈ ప్రాంతాల్లో తిరుగుతున్నప్పుడు, ఇక్కడి ప్రజలు 15-20 కిలోమీటర్లు పోతేతప్ప ప్రభుత్వ దవాఖాన లేదని చెప్పారు. ఇదే విషయంపై ఆరోగ్యమంత్రి లక్ష్మారెడ్డితో మాట్లాడాను. సుమారు 14 గ్రామాల్లోని 30వేల జనాభాకు అందుబాటులో మూడుచింతలపల్లిలోనే ప్రభుత్వ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏర్పాటుచేస్తాం. వారంలోపే జిల్లా మంత్రి మహేందర్‌రెడ్డితోపాటు లక్ష్మారెడ్డి వచ్చి శంకుస్థాపన చేస్తారు. 'వీరారెడ్డి ప్రజావైద్యశాల'గా నామకరణంచేస్తాం. ఆరు నెలల్లోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

బానిసలుగా బతుకొద్దనే..

ఇంకొకరి కింద బానిసలుగా బతుకొద్దనే లక్ష్యంతోనే నాడు చెన్నారెడ్డితోపాటు వెంకట్‌రామిరెడ్డి, వీరారెడ్డి పోరాటం చేశారని వారిని ఈ రోజు స్మరించుకున్నం. కానీ ఈ రోజు మనం మంచిగా ఉన్నామా? అని ఆలోచించాలి. ఐకమత్యంగాలేము. జీవితాన్ని ఎక్కడో వెతుకుతున్నం. అది మారాలి. అప్పుడెప్పుడో గజ్వేల్ సమీపంలో వ్యవసాయ భూమి కొన్నప్పుడు ఒకరిద్దరు రైతులను అడిగిన.. ఏమయ్యా ఇక్కడ గ్రౌండ్ వాటర్ ఉంటాయా? అని. అప్పుడు వాళ్లు 'మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్ గ్రామాల చెరువులు నిండితే మన భూములలో ఊటలు వస్తాయి. పుల్లునీళ్లు ఉంటాయి' అన్నరు. అలాంటి ఈ ప్రాంతం నేడు ఎడారిలా మారింది. ఈ ప్రాంతాన్ని చూస్తుంటే బాధ కల్గుతది. ఈ బాధ వచ్చే సంవత్సరం నుంచి మనకు దూరమైతుంది. మనకు త్వరలోనే గోదావరి నీళ్లు రాబోతున్నాయి. మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని మేడ్చల్, కీసర, శామీర్‌పేట్, ఘట్‌కేసర్ మండలాలకు 70-75వేల ఎకరాలకు గోదావరి నీరు ఇస్తరు. నియోజకవర్గ పరిధిలోని 374 చెరువులను ఏటా నింపుతరు. ఒక్కసారి చెరువును నింపడం కాదు.. 365 రోజులు చెరువుల్లో నీళ్లుండేలా చర్యలు తీసుకుంటం. శామీర్‌పేట చెరువు కూడా నింపుతం. దానివల్ల చాలావరకు చెరువు కింది, కాలువల కింది రైతులకు మేలు జరుగుతది.

సమస్యల పరిష్కారానికి రూ.10కోట్లు..

మూడుచింతలపల్లిలో ఉన్న సమస్యలను మీ సర్పంచ్ చెప్పారు. అలాగే కలెక్టర్ ఎంవీ రెడ్డి బృందం సర్వేచేసి సమస్యలను గుర్తించింది. మోరీలు బాగులేవు.. రూ.1.30లక్షలు కావాలన్నారు. మరో రూ.50లక్షలు అదనం అయినా ఫర్వాలేదు. అవసరమైన నిధులిస్తాం. మూడుచింతలపల్లి నుంచి చీకటి మామిడి వరకు డబుల్ రోడ్ నిర్మిస్తాం. మూడుచింతలపల్లి నుంచి మునీరాబాద్, ప్యారారం మీదుగా యాదాద్రి వరకు బస్సు కావాలన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలి. గ్రామంలో సమస్యల పరిష్కారానికి రూ.10కోట్లు ఇస్తాను. మరో రూ.5 కోట్లను కలెక్టర్ వద్ద ఉంచుతాను. చిన్నచిన్న సమస్యలు ఆ నిధులతో పరిష్కరించుకోవాలి.

మినీ స్టేడియం.. రేపు సాయంత్రానికల్లా ట్రాన్స్‌ఫార్మర్లు

యువకులకు ఆటస్థలం కావాలన్నారు. మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్ గ్రామానికి వెళ్లే రూట్లో 30-40 ఎకరాల స్థలంలో మినీస్టేడియం ఏర్పాటుచేస్తాం. గ్రామంలో సీసీ రోడ్లు కావాలన్నారు. ఓ పెండ్లి చేసుకోవాలన్నా.. గ్రామసభ జరుగాలన్నా.. ఏదైనా కార్యక్రమం చేసుకోవాలన్నా మంచి మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ అవసరం. రూ.70-80లక్షలతో కమ్యూనిటీ హాల్‌ను కూడా నిర్మిస్తాం. రోడ్లు, శ్మశానం, దోబీఘాట్, వెటర్నరీ హాస్పటల్, బీటీరోడ్డుకు ఇరువైపులా మోరీలు, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు కావాలన్నారు. రేపు సాయంత్రానికల్లా మూడుచింతలపల్లిలో ఐదు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటుచేస్తారు. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు అధికారుల వెంటపడి పనులు చేయించుకోవాలి.

నాడు నదులు ఎండినయి..

సమైక్య పాలనలో మన నదులు ఎండిపోయినయి. నా చిన్నతనంలో బస్సులో వస్తుంటే చూసేవాడిని. మే నెలలో కూడా పుష్కలంగా నీరుండే శామీర్‌పేట చెరువులో తుమ్మ లేచింది. ఒక్క పాలమూరు జిల్లా నుంచి 15-16లక్షల మంది వలసపోయే పరిస్థితి వచ్చింది. ఈ క్రమంలోనే నేడు గోదావరి మీద ప్రాజెక్టులను కట్టుకొని, వచ్చే ఏడాదికి లక్షల ఎకరాలకు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నం. 'యాదవ సోదరులకు 84లక్షల గొర్రెలను పంపిణీ చేయాలని నిర్ణయించాం. ఈ రోజువరకు సుమారు 10లక్షల గొర్రెలను పంపిణీ చేసినట్లుగా సమాచారం ఉంది. ఈ గ్రామంలో కూడా 62మందికి గొర్రెల యూనిట్లు అవసరం కాగా ఇప్పటికే 31 మందికి ఇచ్చారు. మిగిలిన వారికి త్వరలోనే ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం'.

అడవులపై విధ్వంసం జరిగింది

మూడుచింతలపల్లిలో సుమారు 2160 ఎకరాల అటవీ భూములున్నాయి. నేడు అవి అడవులుగా లేవు.. ఎడార్లుగా మారినవి. దీంతో కోతులు ఇండ్ల మీద పడ్డాయి. వాటిని అడవులకు వాపసు పంపాలె. మనకు వానలు రావాలంటే విరివిగా మొక్కలు నాటాలె. గ్రామాలు మంచిగా కావాలె. నేడు 48-50 డిగ్రీలకు ఎండలు పోతున్నాయి. ఎంత డబ్బులున్నా బతుకలేని పరిస్థితి ఉంటే ఎందుకు? ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కలను నాటాలె. సర్పంచ్‌లు తలచుకుంటే మీ గ్రామం పచ్చబడదా? ప్రతి సర్పంచ్ బాధ్యత తీసుకోవాలె. వీఆర్‌ఏ, వీఆర్వో, సఫాయికర్మచారీలతోపాటు ప్రజల సహకారంతో మొక్కలు నాటి, సంరక్షించాలె. ఇక్కడ సుమారు 600 కుటుంబాలున్నాయి. ప్రతి ఇంటికీ ఆరు మొక్కలను నాటడంతోపాటు వాటికి మన కుటుంబ సభ్యుల పేర్లు పెట్టాలె. మరణించిన వారి పేరును కూడా పెట్టి వాటిని సంరక్షించాలె. మనం మంచినీళ్లు తాగేటప్పుడు ఒక మగ్గు నీరు పోయాలి. మూడుచింతలపల్లిలో ఇండ్లుకాదు, చెట్లు మాత్రమే కనిపించాలి. ఇలా పెంచిన వారికి ఉచితంగా రెండు పాడిపశువులను ఇస్తం. నిరుపేదలకు 100 (గ్రామ పేదలకు 50, తండాకు 50) డబుల్‌బెడ్‌రూం ఇండ్లను మంజూరు చేస్తాం' అని సీఎం చెప్పారు. ఆరోగ్యం బాగలేకున్నా ఈ ఊరికి వచ్చానని, మిమ్ములను దర్శనం చేసుకున్నానని చెప్తూ సీఎం తన ప్రసంగం ముగించారు. ఆగస్టు 15 తరువాత మళ్లీ గ్రామాల్లో పర్యటిస్తానని సీఎం ప్రకటించారు. అనంతరం లక్ష్మాపూర్‌లో నిర్మించ తలపెట్టిన మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు నిరంజన్‌రెడ్డి, ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కేపీ వివేకానంద, కృష్ణారావు, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ అండ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, సీఎం అడిషనల్ సెక్రటరీ స్మితా సబర్వాల్, కుటుంబం, వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ కరుణ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ నీతుకుమారి ప్రసాద్, జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ధర్మారెడ్డి, టీ న్యూస్ ఎండీ సంతోష్, వివిధ శాఖల రాష్ట్ర అధికారులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

మీ ఎమ్మెల్యే హుషారున్నడు..

'మీ ఎమ్మెల్యే.. చాలా హుషారున్నడు మనిషి. మొన్న లక్ష్మాపూర్ వచ్చినప్పుడు 'సార్ మూడుచింతలపల్లి మిస్ అయ్యాం' అన్నడు. సరే పోదాంలే అని ఇయ్యాలొచ్చిన. వస్తుంటే అలియాబాద్ దగ్గర, పోతారం చౌరస్తా మరికొన్నిచోట్ల మందిని నిలబెట్టిండు. 'దొడ్లకైతే రానీ గోద పేడ పెట్టదా' అన్నట్లుంది ఈయన కథ. ఇయ్యాల నన్ను మంది ముందుకు తీసుకువచ్చి పడేసిండు' అంటూ చమత్కరించారు.



శామీర్‌పేట మండలం కేశవరం పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, టీఎస్‌ఎండీసీ చైర్మన్ శేరి సుభాశ్‌రెడ్డి తదితరులు

రేపు ఢిల్లీకి సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గురువారం ఢిల్లీకి వెళ్లనున్నారు. శుక్రవారం ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సీఎం హాజరుకానున్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో వెంకయ్యనాయుడుకు టీఆర్‌ఎస్ మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రమాణ స్వీకారోత్సవానికి రావాల్సిందిగా వచ్చిన ప్రత్యేక ఆహ్వానం మేరకు సీఎం ఢిల్లీకి వెళుతున్నారు.

నీళ్లొస్తున్నాయో లేదోనని దిగిన.. ఇగ తిప్పుతున్నారు

మూడు నాలుగు రోజుల కిందట పోతాపోతా నా నియోజకవర్గం పక్కనే ఈ గ్రామాలుంటంతో అక్కడ తాగునీళ్లు మంచిగా వస్తున్నాయా లేదా కనుక్కుందామని కొద్దిమంది గ్రామస్థుల వద్ద కారుదిగిన. అప్పుడు నా వెంట ఎవ్వరు లేరు. వాళ్లు 'నీళ్లు మంచిగా వస్తున్నాయి.. కానీ ఓ ట్యాంక్ కావాలి..' అంటే ఇస్తానని చెప్పి.. రెండు మూడు రోజుల్లో మీ ఊరుకు వస్తానన్న. ఇగ నన్ను వరుసపెట్టి తిప్పుతున్నరు. అయినా సరే ప్రజలకు మేలు జరుగుతున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. అభివృద్ధి, ప్రజల అవసరాలు తీర్చేందుకు ఎన్ని నిధులు ఇవ్వడానికైనా ప్రభుత్వం సిద్ధం. అవసరమైతే శామీర్‌పేట మండలానికి రూ.100-120 కోట్లు ఇవ్వడానికైనా సిద్ధమే. నేను ఆనాడే చెప్పిన ఏ ఊరులోని యువతీయువకులు ఆ ఊరికి కథానాయకులు కావాలని. అలా అయితేనే గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తాయి.

కలెక్టర్ మంచోడు...

'మేడ్చల్ జిల్లాకు కలెక్టర్‌గా మంచి వ్యక్తి ఉన్నారు. వాళ్ల అమ్మనాన్న చదువుకోలేదు.. కానీ ఆయన చిన్నప్పటినుంచి కష్టపడి చదువుకొని నేడు జిల్లా కలెక్టర్‌గా ఉన్నాడు. ప్రజల కష్టం, సుఖం, మంచిచెడులు తెలిసినవాడు కాబట్టి.. లక్ష్మాపూర్, కేశవరం, మూడుచింతలపల్లి గ్రామాలకు మేమిచ్చే అనౌన్స్‌మెంట్‌తోపాటు కలెక్టర్‌కు రూ.5కోట్లు ఇచ్చి, ఈ గ్రామాల్లో ఉన్న గ్యాప్‌వర్కులను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటా' అని సీఎం చెప్పారు. అలియాబాద్, జగన్‌గూడ, పోతారం, లాల్‌గడి మలక్‌పేట్, ఉద్దమర్రితో పాటు మిగిలిన గ్రామాలలో ఉన్న సమస్యలపై స్కెచ్ రూపొందించాలని కలెక్టర్‌కు సూచించారు. 'ఈ గ్రామాలన్నీ తిరుగడంకంటే శామీర్‌పేట మండల కేంద్రంలోనే మీటింగ్ పెట్టుకొని అన్ని గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి నిధులిస్తే మంచిగుంటదేమో' అని సీఎం అనగా.. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కల్పించుకొని 'అట్లైతే శామీర్‌పేట మండలం మొత్తం అయిపోతది' అన్నారు. వెంటనే మళ్లీ సీఎం చమత్కరిస్తూ... 'ఆహా.. శామీర్‌పేట అయిపోగానే మరో మండలానికి పట్టుకుపోతవా' అనడంతో సభలో ఒక్కసారిగా నవ్వులు విరబూశాయి. ఈ సందర్భంగా సీఎం ఒక పిట్ట కథ చెప్తూ.. 'ఒక ఊళ్లే ఎగిర్తపు చుట్టం వచ్చాడట. పొద్దుగాల్నే.. పోతాపోతా అంటున్నాడట. ఆ ఇంట్లో ఉన్న ఓ పెద్దావిడ పోతే పోతివిగానీ బిడ్డా రాతిరిదింత సలి అన్నం ఉంది తినిపోతవా? అందట. 'హహ ఎందుకు పెద్దమ్మా.. రాతిరిదింత తింట ఉడుకన్నం అయిందాక ఉంట' అన్నడంట. ఇగో మీ సుధీర్‌రెడ్డి కూడా గిట్లనే ఉన్నడు..' అని సీఎం చమత్కరించడంతో మరోసారి సభికులు అంతా నవ్వేశారు.

లోకం పోకడ



పార్టీ పటిష్ఠతకు బుర్ర బద్దలు చేసుకొని మేధోమథనం జరుపమన్నది ఇలా కాదేమో సార్!!





మంగళ వారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం మూడుచింతలపల్లి గ్రామసభకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు

ముహూర్తం



సూర్యోదయం: 6.01 గంటలకు



సూర్యాస్తమయం: 6.42 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, పాడ్యమి 12.28 వరకు. తదుపరి విదియ. నక్షత్రం: ధనిష్ఠ తె. 4.54 వరకు, తదుపరి శతభిషం. అమృత ఘడియలు: రాత్రి 10.19 నుంచి 11.55 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.21 నుంచి 1.56 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.56 నుంచి 12.47 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 12.22 నుంచి 1.58 వరకు.

నేరెళ్ల ఘటన దురదృష్టకరం




మంగళవారం ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు నివాసంలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు చెన్నమనేని రమేశ్‌బాబు, పుట్ట మధు, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తదితరులు

మొదటిపేజీ తరువాయి...

ప్రజలే అధికారం కట్టబెట్టారని, ఉద్యమ నాయకుడే ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమాన్ని కోరుతున్న ప్రభుత్వం, ఇలాంటి ఘటనలను ఏనాడూ ప్రోత్సహించదని అన్నారు. ఇలాంటి పద్ధతి నాడు లేదు, నేడు అంతకన్నా లేదన్నారు. క్షణికావేశంలో లారీలు తగులబెట్టడంవల్ల పోలీసులు కేసులుపెట్టారని, అందులో దళితులతోపాటు బీసీలున్నారని తెలిపారు. తనకు ఎవరిపైనా ఎలాంటి దురుద్దేశం లేదని చెప్పారు. మధ్యమానేరులో పది టీఎంసీల నీటిని నింపేందుకు ఇసుకను ఖాళీ చేస్తున్నామని తెలిపారు. పదవులు, రాజకీయాలు శాశ్వతం కాదని, ప్రజలు, వారి ప్రాణాలు కాపాడటమే ముఖ్యమని స్పష్టం చేశారు. యాభై ఏండ్ల కాంగ్రెస్ పాలనలో రాని ఆదాయం మూడేండ్లలో.. అదికూడా రూ.వెయ్యి కోట్లు వచ్చిందంటే.. ఇసుకాసురులెవరో ప్రజలందరికీ అర్థమవుతున్నదన్నారు. ఎవరైనా రాజకీయంగా విమర్శించినా, తిట్టినా దీవెనలుగా స్వీకరిస్తామన్నారు. కేవలం టూరిస్టుల్లా వచ్చి పోతూ ఘటనను జాతీయస్థాయి సమస్యగా చిత్రీకరించాలని చూస్తున్న విపక్షాల కుట్రలు బహిర్గతమయ్యాయని వ్యాఖ్యానించారు. సిరిసిల్ల ప్రజలనుంచి తనను దూరంచేయాలన్న ప్రతిపక్షాల కుటిల బుద్ధిని ప్రజలే తిప్పికొడుతారన్నారు. తాను అందరిలా టూరిస్టును కాదని, సిరిసిల్ల ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ ఎల్లకాలం వారితోనే ఉంటానని పునరుద్ఘాటించారు. స్వార్థ రాజకీయాలు వదిలి, విమర్శలు మానుకొని, ప్రజల మేలుకోసం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి సహకరించాలని ప్రతిపక్షాలకు కేటీఆర్ హితవు చెప్పారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా అభివృద్ధి ఆగదని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, ప్రజలకు జవాబుదారీగా ఈ ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టంచేశారు. సమావేశంలో కలెక్టర్ కృష్ణభాస్కర్, ఎమ్మెల్యేలు చెన్నమనేని రమేశ్‌బాబు, పుట్ట మధు, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, చీటి నర్సింగరావు, తోట ఆగయ్య, అల్లాడి రమేశ్, పొలాస నరేందర్, ఆకునూరి శంకరయ్య, ఓరుగంటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి అధికారం లేదని ఏ చట్టం చెప్తుంది?

డ్రగ్స్ స్కాం దర్యాప్తుపై రేవంత్‌రెడ్డిని ప్రశ్నించిన హైకోర్టు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డ్రగ్స్ స్కాం వ్యవ హారంపై దర్యాప్తు చేపట్టే అధికారం రాష్ట్ర ప్రభుత్వా నికి లేదని ఏ చట్టం చెప్తున్నదో తెలియజేయాలని టీడీపీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డిని ఉమ్మడి హైకోర్టు ప్రశ్నించింది. డ్రగ్స్ స్కాంపై కేంద్ర ప్రభుత్వ సంస్థల పర్యవేక్షణలోనే దర్యాప్తు జరుపాలని, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడానికి వీల్లేదని ఏ చట్టం చెప్తున్నదో తెలుపాల ని పేర్కొన్నది. దీనిపై వారంలోగా తమకు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఇటీవల వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ వినియోగం వ్యవహారంపై రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దర్యాప్తు చేపట్టడాన్ని సవాల్‌చేస్తూ రేవంత్‌రెడ్డి హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఉమాదేవి ధర్మాసనం మంగళవారం విచారించి ఈ మేరకు ప్రశ్నించింది. డ్రగ్స్ వ్యవహారంపై నార్కోటిక్స్ డ్రగ్స్, సైకోట్రాఫిక్ సబ్‌స్టాన్‌సెస్ చట్టం-1985 సెక్షన్ -7 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి దర్యాప్తు చేపట్టే అవకాశం ఉన్నదని ప్రభుత్వం వాదనలు వినిపించింది.

మంత్రి కేటీఆర్‌కు మరో విశిష్ట ఆహ్వానం

గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌లో ప్రసంగించాలని కోరిన నిర్వాహకులు

సెప్టెంబర్ 12న వాషింగ్టన్ డీసీలో సదస్సు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఎన్నారై వ్యవహారాలశాఖల మంత్రి కే తారకరామారావుకు మరో ప్రత్యేక ఆహ్వానం అందింది. యూఎస్ ఇండియా బిజినెస్ కౌన్సిల్ సారథ్యంలో నిర్వహించనున్న గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌లో ప్రసంగించాలని మంత్రి కేటీఆర్‌ను నిర్వాహకులు కోరారు. అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో సెప్టెంబర్ 12న ఈ సదస్సు జరుగనున్నది. ఈ సమ్మిట్‌లో ప్రసంగించాలని కోరుతూ యూఎస్ ఇండియా బిజినెస్ లీగల్ పాలసీ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎమి హరియాని మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం పంపించారు. అమెరికాతో సహా భారతదేశానికి చెందిన అత్యున్నతస్థాయి వ్యక్తులు ఇందులో పాల్గొంటారని, అమెరికా-భారతదేశాల మధ్య వాణిజ్యాన్ని మెరుగుపరిచే అంశాలపై బృంద చర్చలు ఉంటాయని తెలిపారు. 'రెండుదేశాల వ్యాపారాలను ప్రభావితం చేసే ఈ అత్యున్నతస్థాయి సమావేశంలో మీ అభిప్రాయాలను తెలుసుకోవాలని భావిస్తున్నాం. ఈ సమావేశంలో అమెరికా విదేశాంగమంత్రి రెక్స్ టిల్లర్‌సన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూతురు ఇవాంకా ట్రంప్ కూడా ప్రసంగించనున్నారు' అని ఎమి హరియాని పేర్కొన్నారు. తమ ఆహ్వానాన్ని గౌరవించి ఈ సమ్మిట్‌కు హాజరవుతారని భావిస్తున్నట్లు విశ్వాసం వ్యక్తం చేశారు.

చేనేత వస్త్రాలు @ అమెజాన్

ఆన్‌లైన్‌లో అమ్మకాలకు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం

ట్వీట్ ద్వారా హర్షం వ్యక్తం చేసిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చేనేత అమ్మకాలను ప్రోత్సహించే క్రమంలో ప్రభుత్వం, చేనేతశాఖ మరో ముందడుగు వేసింది. ఆన్‌లైన్‌లో చేనేత అమ్మకాలను ప్రోత్సహించేందుకు ప్రఖ్యాత అంతర్జాతీయ ఈ కామర్స్ వేదిక అమెజాన్‌తో జట్టుకట్టింది. ఈ ఒప్పందంలో భాగంగా అమెజాన్ కస్టమర్లకు చేనేత కార్మికులు ఉత్పత్తులను విక్రయించవచ్చు. దీంతో రాష్ట్రంలోని దాదాపు 17,000కు పైగా చేనేతమగ్గాల కార్మికులకు మెరుగైన మార్కెట్ సౌకర్యం లభించనున్నది. పోచంపల్లి, వరంగల్, గద్వాల, నారాయణపేట, సిద్దిపేట వస్త్రాలను ఆన్‌లైన్‌లో విక్రయించేందుకు అమెజాన్ శిక్షణ ఇవ్వనున్నది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఇంటర్నెట్ ఆధారిత అమ్మకాలు, మార్కెట్ అభిరుచులు, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు వంటి అంశాలపై నేత కార్మికులకు, కళాకారులకు తర్ఫీదు ఇవ్వనున్నది. ఆన్‌లైన్ వినియోగదారుల అభిరుచుల మేరకు ఉత్పత్తులను తయారుచేసేలా తీర్చిదిద్దనున్నది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ ఒప్పందం కుదుర్చుకోవడంపై ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, అమెజాన్ ఇండియా అమ్మకాల జీఎం గోపాల్ పిళ్లై సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంపై హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.'అమెజాన్ తీసుకున్న చొరవకు కృతజ్ఞతలు. ఈ ఒప్పందం ద్వారా అంతర్జాతీయ మార్కెట్లో మన నేతన్న ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుంది' అని సంతోషం వ్యక్తం చేశారు.

వీవోఏల గౌరవభృతి చెల్లింపులకు 83.17కోట్లు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామీణాభివృద్ధిశాఖలో పనిచేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ల(వీవోఏ)కు గౌరవభృతి చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదలచేసింది. ఇందుకు 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ.83.17 కోట్ల నిధులను కేటాయించింది. గౌరవభృతి చెల్లింపునకు పరిపాలన అనుమతులిస్తూ మంగళవారం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. వీవోఏలకు నెలకు రూ.3 వేల గౌరవభృతిని ఇస్తామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇచ్చిన హామీ మేరకు సంబంధిత జీవో ఇదివరకే విడుదలైంది. గౌరవభృతి చెల్లింపులు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వర్తింపజేస్తారు.

మూడునెలల్లోపు సమగ్ర భూ సర్వే

విధివిధానాల రూపకల్పనకు కమిటీ

వచ్చే 'మే' లో పట్టాదారులకు సాగు పెట్టుబడి

అధికారులకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం

పహాణిలో అనుభవదారుడేమిటి?

రికార్డులే లేకుంటే పాలన ఎందుకు?

రెవెన్యూశాఖ సమీక్షలో సీఎం భావోద్వేగం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వచ్చే మూడునెలల్లో రాష్ట్రంలోని భూరికార్డులన్నీ సరిచేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులకు గడువు విధించారు. కేంద్రం నిధులు ఇచ్చినా ఇవ్వకున్నా భూసర్వే జరిగితీరాలని స్పష్టంచేశారు. భూసమగ్ర సర్వే జరిపేందుకు అవలంబించాల్సిన విధివిధానాల రూపకల్పనకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్ చైర్మన్‌గా ఖమ్మం, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు సభ్యులుగా ఒక కమిటీని ఏర్పాటు చేశారు. భూ రికార్డుల్లోని వివిధ అంశాలు ఎందుకు ఉన్నాయో.. వాటి అవసరమేమిటో కూలంకషంగా పరిశీలించి వారంలోగా నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పాస్‌పుస్తకాలు, పహాణిల్లో ఎలాంటి గందరగోళం, గజిబిజి లేకుండా సరళంగా రూపొందించాలని చెప్పారు. సమగ్ర భూసర్వేపై సీఎం కేసీఆర్ ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

ఎందుకీ కాలమ్?

సమావేశంలో భూ రికార్డులు, పహాణిలోని పలు అంశాలను ప్రస్తావిస్తూ వీటి అవసరమేమిటని అధికారులను సీఎం ప్రశ్నించారు. పాస్‌పుస్తకాలు గజిబిజి ఎందుకు ఏర్పడుతున్నదని అడిగారు. 'భూమి రిజిస్ట్రేషన్ తరువాత పట్టాదారుడు యజమాని అవుతాడుకదా...? మరి అనుభవదారుడి కాలం పహాణిలో ఎందుకు ఉంది?' అన్న ప్రశ్నకు రెవెన్యూ అధికారులు జవాబు చెప్పలేక పోయారు. డెత్ ఖాతా, డబుల్ ఖాతా, అబ్సెంట్ ఖాతాలున్నాయని అధికారులు చెప్పగా.. డెత్ ఖాతా అంటే ఏమిటని అడిగారు. ఒక భూ యజమానికి గతంలో భూమి ఉంటుందని, ఈ భూమిని అమ్ముకున్న తరువాత అతనికి భూమి ఉండదని, అలా భూమి లేకున్నా కూడా అతని ఖాతా కొనసాగుతుందని, భూమి చరిత్ర కోసం అలా ఖాతా నిర్వహిస్తామని అధికారులు వివరించారు. డబుల్ ఖాతా ఎందుకన్న ప్రశ్నకు అధికారులు సరిగ్గా సమాధానం ఇవ్వలేదని తెలిసింది. అబ్సెంట్ ఖాతా అంటే భూమి ఉంటుంది కానీ భూ యజమాని ఉండడని, ఎక్కడ ఉంటాడో తెలియని ఖాతా అని వివరించారు. అలాగే ప్రొటెక్ట్ టెనెన్సీ ఏమిటి, ఇది ఎందుకు, దీని కాన్సెప్ట్ ఏమిటి? గత ప్రభుత్వం ఎందుకు తీసుకువచ్చింది అని సీఎం వాకబు చేశారు. పలు అంశాలకు అధికారుల సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో అన్ని విషయాలు పరిశీలించి తగు వివరాలతో వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. భూ పత్రాలకు సంబంధించి పాత రికార్డులు,లెక్కలపై నమ్మకం లేదని, కాన్ఫిడెన్స్‌లోకి తీసుకుంటే నాకేమి అభ్యంతరం లేదన్నారు. రికార్డులు మూడు నెలల్లో సరి చేయాల న్నారు. రికార్డులు కూడా సరిగ్గా లేకపోతే నేను సీఎంగా ఎందుకు? సరిగ్గా లేని ఈ రికార్డులతో ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందకపోతే ఎలా?' అని సీఎం ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. రికార్డులు బాగుంటేనే పాలన బాగుంటుందన్న సీఎం, అరాచకం ఉన్న కాడ సీఎంగా చేస్తూ ఈ గొప్పతనానికి ఇంకోసారి సీఎంగా చేయాలా? అని అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది.

తహసీల్దారులకు అవసరమా?



ఈ సందర్భంగా తహసీల్దార్ల పని భారంపై ప్రస్తావన వచ్చింది. వారు చేసే పనులను సమీక్షించిన సీఎం 'వాళ్లు ఇప్పటికే చెత్త పనులన్నీ చేస్తున్నారు? ఎవరైనా చనిపోతే పంచనామా చేయాలి. మంత్రులు వచ్చినా, వీఐపీల పర్యటనలు జరిగినా ప్రోటోకాల్ పాటించాలి. ఇతర సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలి. ఇవన్నీ ఉండగా ఇంకా పౌరసరఫరాల శాఖ భారంకూడా తహసీల్దార్లకు ఎందుకు?'అని ప్రశ్నించారు. దీనిపై కూడా వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులకు చెప్పారు.

ఎన్నో పద్ధతులు..

ఈ సందర్భంగా వివిధ దేశాల్లో ఉన్న భూ రికార్డుల విధానాలను సీఎం ప్రస్తావించారు. 'కమ్యూనిస్టు దేశాల్లో 'కర్టెన్ ప్రిన్సిపుల్' విధానం ఉంటుంది. ఈ రోజున భూమి మీద ఎవరుంటే వారికే మ్యుటేషన్ చేసి పాత రికార్డుకు పరదా వేస్తారు. ఆస్ట్రేలియా, అమెరికాలో 'మిర్రర్ ప్రిన్సిపుల్' విధానంలోచరిత్ర మొత్తం చూస్తారు. పాత రికార్డులను పరిశీలిస్తారు. రికార్డులను సరిచేయడమే కార్యక్రమంగా ముందుకు పోవాలి'అని దిశానిర్దేశనం చేశారు.

లెక్కలు లేకుండా అసైన్డ్ భూముల అభివృద్ధి ఎలా?

'అసైన్డ్ భూములను అభివృద్ధి చేద్దామనుకున్నాం. కానీ లెక్కలే సరిగ్గా లేవు. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎస్ఐఐసీ) భూములు ఎక్కడెక్కడ ఎంత ఉన్నాయో, వాటి పరిస్థితి ఏమిటో తెలియదు. రికార్డులు సరిగ్గా లేకపోతే ఎవరికి డబ్బులు ఇవ్వాలి? రికార్డులే సరిగ్గా చేయలేకపోతే మీరెందుకు? మీ అధికారాలు ఎందుకు? అని ఐఏఎస్‌లను ప్రశ్నించినట్లు తెలిసింది. సాదాబైనామాలు చేశారు పాస్‌పుస్తకాలు ఎన్ని ఇచ్చారు? 13(బి) కింద రిజిస్ట్రేషన్లు ఎంతమందికి చేశారు?' అని సీఎం అడిగారు.

ఖర్చు గురించి ఆలోచన వద్దు..

సమావేశంలో భూసర్వేకు ఎంత ఖర్చవుతుందనే విషయమై రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనా సమాధానమిస్తూ భూసర్వేకు ఎన్‌ఎల్‌ఆర్‌ఎంపీ కింద కేంద్రమే భరిస్తుందని చెప్పారు.కేంద్ర ల్యాండ్ సర్వే రికార్డులశాఖ జాయింట్ సెక్రెటరీ హుకుం సింగ్‌కూడా సర్వేఖర్చు ఇస్తామన్నారని చెప్పారు. రాష్ట్రం, కేంద్రం 50 శాతం చొప్పున భరించే ఓ స్కీమ్ కింద కేంద్రమిచ్చిన నిధులు కూడా మన వద్ద ఉన్నాయని చెప్పారు. సర్వేకు 225 కోట్లు ఖర్చయ్యే అవకాశముందని చెప్పగా, కేంద్రం నిధులు ఇవ్వకపోయినా భరిద్దామని సీఎం కేసీఆర్ చెప్పారు.

బ్యాంకు వాళ్ల లాగా పాస్‌బుక్‌ల నిర్వహణ..

మోడల్ పట్టాదారు పాస్‌పుస్తకాలను పరిశీలించిన సీఎం కేసీఆర్ పాస్‌బుక్‌లో 18 ఫీచర్లు బాగానే ఉన్నా పుస్తకం పెద్దగా ఉన్నందున తగ్గించాలని సీఎం చెప్పారు. పాస్ పుస్తకం బ్యాంకు పాస్‌పుస్తకంలాగ సరళంగా ఉండాలని, బ్యాంకులు వాడే టెక్నాలజీ వాడాలని చెప్పారు. బ్యాంకులో డబ్బులు వేయగానే పాస్‌బుక్‌లో జమకావడం, తీయగానే మిగిలింది చూపించినట్టే భూముల క్రయవిక్రయాలు నమోదు కావాలన్నారు.

దేశంలో మూడు పద్ధతుల్లో సర్వే..

సీసీఎల్‌ఏగా ఇటీవల పదవీ విరమణ చేసిన రేమండ్ పీటర్ వివిధ రాష్ట్రాల్లో భూసర్వే విధానాలపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చారు. దానిప్రకారం దేశంలో సర్వేకోసం 3రకాల పద్ధతులు ఉన్నాయి. ఇందులో ఫొటోగ్రఫీ విధానం, డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (డిజీపీఎస్), లైడార్ విధానాలు ఉన్నాయి. తెలంగాణలో మొత్తం భూమి 1.14 లక్షల చదరపు కిలోమీటర్లు.. అంటే 2.76 కోట్ల ఎకరాలు. ఇందులో వ్యవసాయ భూమి 86 వేల చ.కి.మీలు. అంటే 2,12,42,000 ఎకరాలు. డీజీపీఎస్ విధానంలో 3 నెలల్లో సర్వే చేయాలంటే 2,400 టూల్ మిషన్స్ కొనుగోలు చేయాలి. ఒక్కో టూల్‌మిషన్ ఖరీదు రూ.5 నుంచి రూ. 7 లక్షల వరకు ఉంటుంది. సర్వేకు 100 హెక్టార్లకు రూ. 30 వేల ఖర్చు వస్తుంది. లైడార్ ద్వారా రోజుకు 2వేల కిలోమీటర్లు సర్వే చేయవచ్చు. సర్వేకు వెళ్లేప్పుడు కంట్రోల్ పాయింట్లను కాంక్రీట్ పిల్లర్లు వేసి సర్వే చేయాల్సి ఉంటుంది. మధ్యప్రదేశ్‌లో 16 కి.మీలకు ఒక మెయిన్ కంట్రోల్ పాయింట్, 4 కి.మీలకు ఒక మిడిల్ కంట్రోల్‌పాయింట్, ప్రతి కి.మీకి ఒక చిన్న కంట్రోల్ పాయింట్ ఏర్పాటుచేసి సర్వే చేశారు.

రాజకీయాలను దుర్వినియోగం చేయలేదు

కుమారుడు, కుమార్తె సంస్థలపై ఆరోపణలు బాధ కలిగించాయి

'అలుపెరుగని గళం.. విరామమెరుగని పయనం' పుస్తక ఆవిష్కరణ సభలో వెంకయ్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇన్నేండ్ల జీవితంలో ఏనాడూ రాజకీయాల్ని దుర్వినియోగంచేయలేదని, ఇంటి నుంచి ఎలా వచ్చానో ఇపుడూ అలాగే ఉన్నానని ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడు అన్నారు. నమ్మిన సిద్ధాంతాన్ని ఏనాడూ వదిలిపెట్టలేదని, రాజకీయ ప్రయాణంలో ఎన్నో పదవులు అనుకోకుండానే తనను వరించాయని ఆయన పేర్కొన్నారు. వెంకయ్య ఉపన్యాసాలు, రచనలు, పార్లమెంటు ప్రసంగాలతో ఎమెస్కో ప్రచురించిన 'అలుపెరుగని గళం.. విరామమెరుగని పయనం' పుస్తకావిష్కరణ కార్యక్రమం కొండాపూర్‌లోని సైబర్‌సిటీ కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో బీజేపీని గెలిపించిన తర్వాత రాజకీయాల నుంచి తప్పుకుంటానని తన భార్య, కుటుంబసభ్యులకు తెలిపానని వెంకయ్య పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి పదవి చేపట్టేముందు ఇదే తన చివరి ప్రసంగం కావొచ్చన్న ఆయన తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుని ఉద్వేగానికి గురయ్యారు. ఉమ్మడి రాష్ట్రాన్ని విడదీసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను ఏర్పాటు చేయాలని తాను ఎప్పుడో చెప్పానని వెంకయ్య తెలిపారు. తన కుమారుడికి సంబంధించిన కంపెనీ గురించి ఆరోపణలుచేశారని, అలాగే తన కూతురు నిర్వహిస్తున్న స్వర్ణభారతి ట్రస్టుకు నోటీసులు రావడంపై కూడా రాజకీయం చేయాలని చూశారని, ఇది తనను బాధించిందని వెంకయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ట్రస్టుకు ఎలాంటి నిధులు దానికి అందవన్నారు. తాను ఏనాడు సొంతపనులకు అధికారాన్ని వినియోగించుకోలేదని, నిజాయితీగా బతికానన్నారు. తన తండ్రి చెప్పిన మాట ప్రకారం ఎవరి కాళ్లకు దండం పెట్టలేదన్నారు.

వెంకయ్య, కేసీఆర్ మహానుభావులు: మధుసూదనాచారి, తెలంగాణ శాసనసభాపతి

ప్రసంగాలతో ప్రజల్ని చైతన్యపరిచే అద్భుతమైన కళ వెంకయ్యనాయుడు, కేసీఆర్‌ల సొంతమని శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. అంతటి మహానుభావులతో కలిసి పనిచేయడం గర్వంగా ఉందన్నారు. రాజకీయరంగంలో తెలుగు ప్రజల ఖ్యాతిని దశదిశలా చాటిన వ్యక్తుల్లో వెంకయ్య ఒకరని స్పీకర్ పేర్కొన్నారు. ఆయన ప్రసంగం అంటే ఇష్టపడనివారు ఉండరని చెప్పారు. పదునైన మాటలతో ప్రభుత్వాలను ఇరుకున పెట్టి.. సమస్యలకు పరిష్కారం రాబట్టడంలో వెంకయ్య దిట్ట అని మధుసూదనాచారి పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతిగా ఎదిగిన వెంకయ్య రాష్ట్రపతి పదవిని సైతం చేపట్టాలని ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీ శాసనసభాపతి కోడెల శివప్రసాద్, బీజేపీ తెలంగాణశాఖ అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రముఖ విశ్లేషకులు ఎస్ గురుమూర్తి, ఎమెస్కో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



కొండాపూర్‌లో 'అలుపెరుగని గళం..విరామమెరుగని పయనం' పుస్తకావిష్కరణలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రామోజీరావు, స్పీకర్లు మధుసూదనాచారి, కోడెల, గురుమూర్తి, ఎమెస్కో విజయ్‌కుమార్

విలువలతో కూడిన విద్య అవసరం: వెంకయ్యనాయుడు

నెల్లూరు: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరమని ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన ఎం వెంకయ్యనాయుడు అన్నారు. పాఠ్యాంశాల్లో నైతికవిలువలు చేర్చే అంశంపై ప్రధానమంత్రితో చర్చిస్తానన్నారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలో మంగళవారం స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. నోట్లు ఇచ్చేవారికి ఓట్లువేయొద్దన్నారు. స్వగ్రామం చవటపాలెంలో పర్యటించిన ఆయనను స్థానికులు ఆత్మీయంగా సత్కరించారు.గ్రామంలో కమ్యూనిటీహాల్, రైల్వేస్టేషన్ ఏర్పాటు చేస్తానన్నారు.

నోటిఫికేషన్ నంబరు	పోస్ట్	పరీక్ష నిర్వహణ తేదీ
17/2017	ఆర్ట్ టీచర్	31.8.2017 (మధ్యాహ్నం)
18/2017	క్రాఫ్ట్ టీచర్	31.8.2017 (ఉదయం)
19/2017	మ్యూజిక్ టీచర్	01.09.2017 (ఉదయం&మధ్యాహ్నం)
20/2017	లైబ్రేరియన్స్ (స్కూల్స్)	17.09.2017 (ఉదయం&మధ్యాహ్నం)
21/2017	స్టాఫ్ నర్స్	17.09.2017 (మధ్యాహ్నం) 18.09.2017 (మధ్యాహ్నం)
16/2017	పీఈటీ	17.09.2017 (మధ్యాహ్నం) 18.09.2017 (మధ్యాహ్నం)
22/2017	డిగ్రీ కాలేజీ లెక్చరర్లు	10.09.2017
23/2017	ఫిజికల్ డైరెక్టర్స్ (డిగ్రీ కాలేజీ)	10.09.2017
24/2017	లైబ్రేరియన్స్ (డిగ్రీ కాలేజీ)	10.09.2017
25/2017	ప్రిన్సిపల్స్ (జూనియర్ కాలేజీ)	10.09.2017
26/2017	ఫిజికల్ డైరెక్టర్స్ (జూనియర్ కాలేజీ)	10.09.2017
27/2017	జూనియర్ లెక్చరర్లు	10.09.2017
28/2017	లైబ్రేరియన్స్ (జూనియర్ కాలేజీ)	10.09.2017
29/2017	ప్రిన్సిపల్స్ (స్కూల్స్)	10.09.2017
14/2017	(ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు) ఫిజికల్ సైన్స్	29.08.2017 (ఉదయం&మధ్యాహ్నం)
14/2017	సోషల్	29.08.2017 (ఉదయం&మధ్యాహ్నం)
14/2017	సైన్స్	30.08.2017 (ఉదయం&మధ్యాహ్నం)

గురుకుల కొలువుల పరీక్షల రీషెడ్యూల్ విడుదల

27, 28 తేదీల్లో పీజీటీ, వచ్చేనెల 3, 4న టీజీటీ భాషాపండిత పరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గురుకులాల్లోని బోధన, బోధనేతర సిబ్బంది నియామకాల కోసం నిర్వహించాల్సిన పరీక్షల రీషెడ్యూల్‌ను టీఎస్‌పీఎస్సీ మంగళవారం ప్రకటించింది. హైకోర్టు స్టే విధించడంతో పరీక్షల నిర్వహణ వాయిదా పడగా.. ప్రస్తుతం మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో పరీక్షల రీషెడ్యూల్‌పై టీఎస్‌పీఎస్సీ కసరత్తు చేసింది. ఈ మేరకు షెడ్యూల్‌ను విడుదలచేసింది. పీజీటీల్లోని భాషాపండిత పోస్టులకు పరీక్షలను ఈ నెల 27, 28 తేదీల్లో, టీజీటీల్లోని భాషాపండిత పోస్టులకు పరీక్షలను సెప్టెంబర్ 3, 4 తేదీల్లోనే నిర్వహించనున్నట్టు పేర్కొన్నది. టీజీటీ హాల్‌టికెట్లను 21వ తేదీ నుంచి, పీజీటీ భాషాపండిత హాల్‌టికెట్లను 28వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది.

9, 10 షెడ్యూల్ ఉద్యోగుల వయోపరిమితి పెంపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: షెడ్యూల్ 9, 10 సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వయో పరిమితిని 60 సంవత్సరాలకు పెంచుతూ ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం- 2014ను అనుసరించి అధికారులు నిర్ణయం తీసుకున్నారు. 9, 10 సంస్థలపైన హైకోర్టు, సుప్రీం కోర్టులో వ్యాజ్యాలు నడుస్తున్నాయి. వీటి ఆస్తులు, అప్పుల పంపిణీపైన వివాదాలున్నాయి. 60 సంస్థలపైన శీలాబీడే కమిటీ ఇచ్చిన నివేదిక ఇప్పటివరకు అమలులోకి రాలేదు. 10వ షెడ్యూల్‌లో 142 సంస్థలు, 9వ షెడ్యూల్‌లో 90 సంస్థలు ఉన్నాయి. వీటన్నింటిలో ఈ నిబంధన వర్తిస్తుందని ఏపీ పునర్వ్యవస్థీకరణ సెల్ అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



ఉత్తర కొరియా విదేశీ వాణిజ్యంలో 90 శాతం చైనాతోనే సాగుతున్నది. అందువల్ల ఐరాస ఉత్తర కొరియాపై విధించిన ఆంక్షలు అమలు చేయడంలో చైనాదే ప్రధాన పాత్ర. తాము ఆంక్షలను అమలు చేస్తామని చైనా ప్రకటించింది. ఈ దిశగా అంతర్జాతీయ సమాజాన్ని కూడా ప్రోత్సహించింది.

నిక్కి హేలీ, ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి

ఉత్తర కొరియాతో చైనాకు సంప్రదాయక ఆర్థిక సంబంధాలు ఉన్నాయి. ఉత్తర కొరియాపై ఆంక్షల వల్ల ఎక్కువగా నష్టపోయేది చైనాయే. అయినప్పటికీ అంతర్జాతీయంగా అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక వ్యవస్థను, ప్రాంతీయ శాంతి సుస్థిరతలను కాపాడవలసి ఉన్నది. అందువల్ల చైనా ఉత్తర కొరియాపై ఆంక్షల తీర్మానాన్ని పూర్తిగా అమలు చేస్తుంది.

వాంగ్ యీ, చైనా విదేశాంగ మంత్రి



చరిత్రలో నేడు




1173

పీసా టవర్ నిర్మాణం ప్రారంభం. రెండు వందల ఏళ్లలో పూర్తి.

1831

అమెరికాలో మొదటి స్టీమ్ ఇంజిన్ రైలు ప్రారంభం.





1859

ఓటిస్ కంపెనీ లిఫ్టులను తయారుచేసింది.

ఇంతకాలం వాహనాలను నడిపించిన 'యంత్రం' (ఇంజిన్) మాయం కాబోతున్నది. విద్యుత్ కార్లు రావడంతో పాటు వాటికి సెన్సార్లు కూడా బిగిస్తున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరుగకుండా కార్లు మలుపులు తిరుగుతూ నడుస్తాయి. కార్లలో డ్రైవరు ఉండడు. వీటికి యజమానులే అవసరం ఉండదు. అవి ట్యాక్సీల మాదిరిగా పిలిస్తే వస్తయి. అందుకే ఉబర్ ఎంత నష్టం వచ్చినా ఈ కొత్త కాలానికి అనుగుణంగా అడుగులు వేస్తున్నది. ప్రైవేటు కార్లే ప్రజా రవాణాకు కొత్త రూపు ఇస్తయి. ఇక మన స్వతంత్రత ఏమవుతది అంటారా? విద్యుత్ సైకిళ్ళు తొక్కుకోవచ్చు!

ది గార్డియన్

మెక్సికో అధ్యక్షుడు ఎన్రిక్ నీటోతో, ఆస్ట్రేలియా ప్రధాని మాల్కం టర్న్‌బుల్‌తో జరిపిన సంభాషణలను ఇటీవల 'ది వాషింగ్టన్ పోస్ట్' ప్రచురించడంతో ట్రంప్ ఎంత గట్టిగా సంప్రదింపులు జరుపగలరో వెల్లడైంది. ఎన్నికల సభల్లో మెక్సికో ఖర్చుతోనే సరిహద్దు గోడ కట్టిస్తానని చెప్పుకున్న ట్రంప్ ఇప్పుడు గోడ నిర్మాణం ఖర్చును మెక్సికో చెల్లించనవసరం లేదని, కానీ ఆ విషయం ప్రజలకు తెలువనీయకూడదని కోరారు. టర్న్‌బుల్‌తో జరిపిన సంభాషణలో వలస ఒప్పందంపై ట్రంప్ అవగాహనా రాహిత్యం బయటపడ్డది.

ది న్యూయార్క్ టైమ్స్

భూ దస్త్రాల దిద్దుబాటు

రాష్ట్ర ప్రభుత్వం మరో చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలో గ్రామం యూనిట్‌గా సమగ్ర భూసర్వేను శాస్త్రీయంగా నిర్వహించి భూ దస్త్రాల్లో నెలకొన్న గందరగోళానికి తెర దించటానికి సమాయత్తమవుతున్నది. రాష్ట్రంలోని రెండు కోట్ల డెబ్భై లక్షల ఎకరాల భూమి ని సర్వే ఆఫ్ ఇండియాతోపాటు దేశంలోని ప్రతిష్ఠాత్మక ఇతర ఏజెన్సీల సాయంతో సమగ్ర భూసర్వే, సెటిల్‌మెంట్ చేయ తలపెట్టింది. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో భూమి కేంద్రంగా సాగుతున్న వివాదాలకు, నేరాలకు అడ్డుకట్టవేసే దిశగా అడుగులు వేస్తున్నది. దీనికిగాను రాష్ట్రంలోని 3,500 మంది రెవెన్యూ అధికారులు 10,850 గ్రామాల్లో సర్వే నిర్వహించి భూకమతా లు, సాగుదారులు, సొంతదారులు, పట్టాదారుల వివరాలను వాస్తవ రూపంలో పొందుపరు స్తూ, ప్రతి పట్టా భూమికి ఒక నంబర్ కేటాయించి భూ రికార్డులన్నింటినీ ప్రక్షాళన చేయనున్నారు. ఈ సమగ్ర సర్వే తర్వాత భూ రికార్డులన్నింటినీ సమస్త వివరాలతో కంప్యూటర్‌లో చేరుస్తారు. ఈ వివరాలను అనుసంధానించడం (ఆన్‌లైన్) ద్వారా భూ యాజమాన్యంలో ఏ చిన్న మార్పు జరిగినా క్షణాల్లో 'సీసీఎల్‌ఏ'లో కూడా నమోదవుతుంది. దీన్ని భూ సర్వేలో విప్లవాత్మక చర్యగా చెప్పుకోవచ్చు. అలాగే పట్టాదారు పాస్ పుస్తకాలను, పహాణీ పత్రాలను కూడా సరళతరం చేసి ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంచటం హర్షించదగిన విషయం.

అత్యంత క్లిష్టమైన, ఎవరికీ అర్థం కాని విషయమేదైనా ఉన్నదంటే అది భూ యాజమాన్య వివరాలే అన్నది అందరికీ అనుభవమే. ఏ ఊరికి వెళ్ళి చూసినా, సాధారణంగా రైతు ఆధీనంలో ఉన్న భూమికి, పట్టాదారు పాసు పుస్తకంలో ఉన్న దానికి పొంతన ఉండదు. విస్తీర్ణంలో లెక్క అసలే సరిపోదు. ఇట్లా ఏ గ్రామం తీసుకున్నా భూ యాజమాన్యం, పట్టా, సాగు వివరాలన్నీ పెద్ద అంతుచిక్కని సంక్లిష్ట సమస్యగా ఉంటున్నది. ఈ క్రమంలోంచి భూ విక్రయాలు జరిగినప్పుడో, పంపకాలు చేసుకుంటున్నప్పుడో తలెత్తే సమస్యలు అన్నీ ఇన్నీ కావు. ఈ నేపథ్యంలోంచే భూమి కేంద్రంగా అనేక కోర్టు వివాదాలు, కొట్లాటలు ఏర్పడి హత్యానేరాల దాకా పోయినవి కోకొల్లలు. గ్రామీణ సమాజంలో నేరాలన్నీ భూ వివాదాల్లోంచే జరుగుతున్నవిగా తేటతెల్లమవుతున్నది. ఇలాంటి అయోమయం ఏన్నో ఏండ్ల నుంచి తెలంగాణ గ్రామీణ సమాజాన్ని పట్టి పీడిస్తున్నా పాలకులు పట్టించుకున్న పాపానపోలేదు. పైగా సీమాంధ్ర పాలనలో తీసుకున్న నిర్ణయాలన్నీ గ్రామీణ సమాజాన్నీ, భూ యాజమాన్య వివరాలను మరింత సంక్లిష్టం చేశాయి. గ్రామాల్లో పట్వారీ వ్యవస్థను రద్దుచేసి దాన్నొక విప్లవాత్మక నిర్ణయంగా ప్రచారం చేసుకున్న పాలకులు, నిజానికి భూ సంబంధిత విషయాల్లో మరింత అయోమయం సృష్టించారు. అప్పటివరకు భద్రంగా ఉన్న పట్టణ ప్రాంత విలువైన భూములను బంధుమిత్రులకు సంతర్పణ చేయడానికే హటాత్తుగా పట్వారీ వ్యవస్థను రద్దు చేశారనే ఆరోపణలను కొట్టిపారేయలేం. టీడీపీ పాలనా కాలం నుంచి తెలంగాణ భూములన్నీ వలసవాదుల వశమవడం ప్రారంభమైంది. దీంతో పాటు భూముల ఆధీనంపై మరింత అస్పష్టత ఏర్పడ్డది. ఈ నేపథ్యంలో తెలంగాణ అవతరణ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రజోపయోగ విప్లవాత్మక నిర్ణయాల్లో సమగ్ర భూసర్వే అత్యంత కీలకమైనది.

స్వాతంత్య్రానంతరం డెబ్భై ఏండ్ల కాలంలో శాస్త్రీయంగా, సమగ్ర భూ సర్వే జరుగకపోవటం పెద్ద లోపం. నిజాం కాలంలో 1936లో భూ బందోబస్తు పేర సర్వే జరిగింది. ఆ తర్వాతి కాలంలో ప్రభుత్వాలెన్ని మారినా భూ సర్వే గురించి ఎవరూ పట్టించుకోలేదు. చిన్న, సన్న కారు రైతుల పేరుతో అనేక ప్రభుత్వ పథకాలు ప్రారంభించిన పాలకులు అవి ఎవరికి చేరుతున్నాయో, అర్హులైన లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అన్నది పట్టించుకోలేదు. స్వరాష్ట్రంలో ఒక్కరోజే సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి చరిత్ర సృష్టించిన కేసీఆర్ ప్రభుత్వం ఇప్పుడు సమగ్ర భూ సర్వే నిర్వహించటం ముదావహం.

స్వాతంత్య్రానంతరం డెబ్భై ఏండ్ల కాలంలో శాస్త్రీయంగా, సమగ్ర భూ సర్వే జరుగకపోవటం పెద్ద లోపం. నిజాం కాలంలో 1936లో భూ బందోబస్తు పేర సర్వే జరిగింది. ఆ తర్వాతి కాలంలో ప్రభుత్వాలెన్ని మారినా భూ సర్వే గురించి ఎవరూ పట్టించుకోలేదు. చిన్న, సన్న కారు రైతుల పేరుతో అనేక ప్రభుత్వ పథకాలు ప్రారంభించిన పాలకులు అవి ఎవరికి చేరుతున్నాయో, అర్హులైన లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అన్నది పట్టించుకోలేదు. స్వరాష్ట్రంలో ఒక్కరోజే సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి చరిత్ర సృష్టించిన కేసీఆర్ ప్రభుత్వం ఇప్పుడు సమగ్ర భూ సర్వే నిర్వహించటం ముదావహం. గ్రామ రెవెన్యూ అధికారి అక్కడే పదిహేను రోజులుండి ప్రతి అంగుళం భూమినీ పరిశీలించి దాని యాజమాన్య, సాగు వివరాలను నమోదు చేస్తాడు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వదలిచిన ఎకరాకు 8000 రూపాయల పెట్టుబడి సాయం పథకం నిజమైన లబ్ధిదారులకు చేరే అవకాశం ఉంటుంది. అలాగే దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాలను అతలాకుతలం చేస్తున్న భూ వివాదాలు మటుమాయం అవుతాయి. కోర్టు కేసులు, నేరాలు తగ్గుముఖం పడుతాయి. మొత్తంగా చూస్తే తెలంగాణ గ్రామీణ సామాజిక వాతావరణాన్ని సంపూర్ణంగా మార్చి వేసేందుకు ఈ సమగ్ర భూసర్వే దన్నుగా నిలుస్తుందనటంలో సందేహం లేదు. భూ సర్వేలో గ్రామ రైతుల పాత్ర క్రియాశీలమైంది. ఈ భూ యాజమాన్యంపై స్పష్టత ఏర్పడితే గ్రామాలలో శాంతియుత వాతావరణం నెలకొంటుంది. ఇప్పటికే అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ప్రభుత్వం సమగ్ర భూ సర్వే ద్వారా మరో బృహత్కార్యం చేపట్టడం అభినందనీయం.

జనగళం

రద్దుచేయాలె

ట్రాఫిక్ నిబంధనల్లో భాగంగా పోలీసులు అమలుచేస్తున్న పాయింట్ల విధానం వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నది. ఆర్నెళ్లు ఏమో కానీ 12 రోజుల్లోనే 12 పాయింట్లు పడే అవకాశాలున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, పోలీసులు ఈ పాయింట్ల విధానంపై పునరాలోచించాలి. లేకుంటే ఎక్కువమంది లైసెన్సులు తొందరలోనే రద్దయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో లైసెన్స్ రద్దు చేయటం మానుకొని జరిమానాతో సరిపెట్టాలి. అప్పుడే వాహనదారులకు విముక్తి కల్పించినవారవుతారు.

- ప్రవీణ్ కొత్వాల్, బేగంపేట్, హైదరాబాద్

గర్హనీయం

ఏండ్ల తరబడి ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న ప్రజల మనోభావాలను అర్థం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నది. ఇవి ఓర్వలేని ప్రతిపక్షాలు వాటిపై 'స్టే'లు తేవడం బాధాకరం. భాషోపధ్యాయుల అప్‌గ్రేడ్, విద్యుత్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రాజెక్టుల నిర్మాణం లాంటి విషయాల్లో ప్రతిపక్షాల తీరు గర్హనీయం.

- డాక్టర్ సాహెబ్ జోద, విజయభాస్కర్, మలక్‌పేట్, హైదరాబాద్

సన్మార్గంలో నడిపించాలె

ఇవ్వాళ ప్రపంచమే మత్తులో జోగుతున్నది. రాత్రి పగలు తేడా లేకుండా పాఠశాల మొదలు కళాశాల విద్యార్థుల వరకు డ్రగ్స్‌కు బానిస కావడం చూస్తుంటే ఆశ్చర్యమేస్తున్నది. విద్యార్థులను సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులపై కూడా ఉన్నది. డ్రగ్స్‌ను పూర్తిస్థాయిలో కట్టడి చేయాలి.

- బైరి జనార్దన్, ప్రగతినగర్, హైదరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ప్రాజెక్టులు



వి.ప్రకాశ్

శ్రీరాంసాగర్ విషాద గాథ

మన ప్రియతమ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గారిచే పూర్వవైభవం పొందుతున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుది వందేళ్ల విషాద చరిత్ర. ఇరువై లక్షల ఎకరాలకు సాగు నీరందించాల్సిన ఈ ప్రాజెక్టు నాలుగైదు లక్షల ఎకరాలకు మించి ఎందుకు నీరందించలేకపోతున్నది? ఈ ప్రాజెక్టును నిర్వీర్యం చేసిన పాపం ప్రకృతిదా? లేక పాలకులదా? మరో చరిత్రను లిఖించుకోబోతున్న శ్రీరాంసాగర్ చరిత్రను ఒక్కసారి మననం చేసుకుందాం.

ప్రఖ్యాత తెలంగాణ ఇంజినీర్ నవాబ్ అలీ నవాబ్ జంగ్ బహద్దూర్ 1918లో చీఫ్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టగానే ఆయన పర్యవేక్షణలో ఎస్.ఇ.గా ఉన్న అబ్దుల్ ఖయూమ్ ఖాన్ గోదావరి బహుళార్థ సాధక ప్రాజెక్టు ప్రణాళికను 1942 నాటికే రూపొందించారు.

ఇ.డబ్ల్యు స్లాటర్ గోదావరి లోయ అభివృద్ధి పథకం అమలులో భాగం గా గోదావరి బహుళార్థ సాధక ప్రాజెక్టులో అంతర్భాగమైన కడెం ప్రాజెక్టుకు 1949 ఏప్రిల్లో జనరల్ చౌదరి మిలిటరీ ప్రభుత్వం అనుమతులు మంజూరుచేసి అంచనా వ్యయం 8 కోట్ల 40 లక్షలుగా నిర్ధారించింది. ఆ గోదావరి ప్రాజెక్టు పూర్తి స్వరూపం ఇలా ఉంది.

1.నాందేడ్–బాసర మధ్య గోదావరిపై 94 టీఎంసీల సామర్థ్యంతో కవాల్‌గూడా స్టోరేజీ రిజర్వాయర్ నిర్మాణం. 2.పై రిజర్వాయర్‌కు 50 మైళ్ల దిగువన గోదావరిపై 55 టీఎంసీల కుష్టాపురం డ్యాం. 3.కుష్టాపురం డ్యాంకు కుడిపక్కన 166 మైళ్ల పొడువైన దక్షిణ కాల్వ హన్మకొండ దిగువన గల కృష్ణా–గోదావరి రిట్జ్ వరకు. 4.కుష్టాపురం డ్యాంకు ఎడమ పక్కన విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచేసే కాల్వ కడెం రిజర్వాయర్ (పెద్దూరు గ్రామం) వరకు 43 మైళ్ల పొడవు. 5. పెద్దూరు (కడెం) రిజర్వాయర్ నుంచి ఆదిలాబాద్ జిల్లాలోని చెన్నూరు వరకు గోదావరి ఉత్తర కాల్వ నిర్మాణం. ఈ ప్రణాళిక ప్రకారం దక్షిణ కాల్వ ద్వారా 21.50 లక్షల ఎకరాల కమాండ్ ఏరియా, ఉత్తర కాల్వ ద్వారా 5.60 లక్షల ఎకరాల కమాండ్ ఏరియా, కడెం డ్యాం వరకు ఎడమ కాల్వ ద్వారా 84000 ఎకరాల కమాండ్ ఏరియా కవాల్‌గూడ ఎడమ కాల్వ ద్వారా మరో లక్ష కరాల కమాండ్ ఏరియాలో ఆయకట్టుకు సాగునీరందించాలని నిర్ణయించింది ప్రభుత్వం.

ఆ తర్వాత వచ్చిన వెల్లోడి ప్రభుత్వం ఈ పథకాన్ని మరిం త అభివృద్ధి చేసి దక్షిణ కాల్వను 166 మైలు నుంచి 240 మైలు వరకు పొడిగించింది. దీనివల్ల 35.67 లక్షల ఎకరాల కమాండ్ ఏరియాలో 21 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టుకు తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో సాగు నీరందించే అవకాశం ఏర్పడింది. గోదావరి ప్రాజెక్టు ద్వారా మొత్తం 144 మెగావాట్ల జల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని నిర్ణయించింది. ఈ ప్రతిపాదనలను వెల్లోడి 1951 జూలై 27, 28 తేదీల్లో ఢిల్లీలో ప్రణాళికా సంఘం నిర్వహించిన అంతర్రాష్ట్ర నదీజలాల సమావేశంలో చర్చించి భవిష్యత్‌లో గోదావరిపై చేపట్టే ప్రాజెక్టుల కోసం 494 టీఎంసీల కేటాయింపులు పొందారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీరు ఈ కేటాయింపుల వల్ల లభ్యమైంది. మరో 8 నెలలకే వెల్లోడి పాలన ముగిసి బూర్గుల ప్రభుత్వం ఏర్పడింది. 1956లో బూర్గుల ప్రభుత్వం కవాల్‌గూడ, కుష్టాపురం డ్యాంలకు బదులు పోచంపాడు గ్రామం వద్ద రిజర్వాయర్ నిర్మించాలని నిర్ణయించింది. కవాల్‌గూడ వల్ల నాందేడ్ పట్టణం, కుష్టాపురం డ్యాం వల్ల బాసర రైల్వే లైన్ ముంపునకు గురవుతుందని భావించారు.

1956 పోచంపాడు పథకం: 1.డ్యాంకు ఇరువైపులా కాల్వల నిర్మాణం. డ్యాంతో పాటు స్లూయిస్‌ల వద్ద 60 మెగావాట్ల విద్యుదుత్పాదన. 2.1200 క్యూ సెక్కులతో ఉత్తర కాల్వ ద్వారా 21,000 ఎకరాలకు ఆదిలాబాద్ జిల్లాలో సాగునీరు, కడెం ఆయకట్టు తర్వాత ఉత్తర కాల్వ 79వ మైలు వరకు 1,03,000 ఎకరాలకు సాగునీరు (కడెం ఆయకట్టు కలిపి 1,89,000 ఎకరాల ఆయకట్టు). 3.251 మైళ్ల పొడువైన పోచంపాడు కుడి కాల్వ 17,000 క్యూసెక్కులతో (గోదావరి దక్షిణ కాల్వ) నిర్మాణం. దీనిద్వారా 5 జిల్లా ల్లో 18,06,000 ఎకరాలకు సాగునీరు. కరీంనగర్ బ్రాంచ్ కెనాలపై 20 మెగావాట్ల విద్యుదుత్పత్తి.

సుమారు 20 లక్షల ఎకరాల ఆయకట్టుకు తెలంగాణ ఆరు జిల్లాల్లో సాగు నీరందించే లక్ష్యంతో బూర్గుల ప్రభుత్వం రూపొందించిన ఈ గోదావరి ప్రాజెక్టు పథకాన్ని 1958లో అప్పటి నీటి పారుదల శాఖా మంత్రి జె.వి.నర్సింగరావు కేంద్రాన్ని రెండో ప్రణాళికలో చేర్చవలసిందిగా కోరారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 117 కోట్లుగా నిర్ధారించారు. కానీ కేంద్ర ప్రభుత్వ సలహాపై సంజీవరెడ్డి ప్రభుత్వం పోచంపాడు ప్రాజెక్టును కేవలం 3 లక్షల 60 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే చిన్న సైజు ప్రాజెక్టుగా కుదించి ఆ ప్రతిపాదనలను కేంద్ర కమిషన్‌కు పంపింది. నిధుల ప్రస్తావనను కేంద్రం తేకుండానే ఈ చిన్న సైజు పోచంపాడును రెండో ప్రణాళికలో చేర్చడానికి అప్పటికే ప్రణాళికలో చేర్చిన దేవునూరు ప్రాజెక్టును తమ ప్రభుత్వం వదులుకుంటున్నదని, దేవునూరు నిధులను పోచంపాడుకు వ్యయం చేయాలని సంజీవరెడ్డి ప్రభుత్వం కేంద్రమంత్రికి లేఖలో తెలిపింది. దేవునూరును రాష్ట్ర ప్రభుత్వం వదులుకున్నా పోచంపాడును కేంద్రం రెండో ప్రణాళికలో చేర్చ

పెండింగ్ ప్రాజెక్టులకు మరింత ప్రయోగం చేకూరే విధంగా రీ డిజైనింగ్ చేయాలని, కృష్ణా గోదావరి జలాల్లో మన వాటాను పూర్తిగా వినియోగించుకుంటూ వృథాగా సముద్రంలో కలిసే గోదావరి, కృష్ణా జలాలను మళ్లించి నిల్వ చేసుకోవడానికి పలు రిజర్వాయర్లను, ఎత్తిపోతల పథకాలను నిర్మించాలని త్రిముఖ వ్యూహాన్ని అమలుచేస్తున్నారు.

లేదు. సెంట్రల్ వాటర్, పవర్ కమిషన్‌లో కె.ఎల్.రావు సభ్యులు. నాగార్జునసాగర్‌లోనే కాక పోచంపాడులో కూడా కె.ఎల్.రావు ద్రోహం స్పష్టంగా అర్థమవుతుంది. 1961 మే 2న కేంద్రం గుల్హాతీ ఛైర్మన్‌గా కృష్ణా–గోదావరి కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ నివేదిక వచ్చే దాకా పోచంపాడు, శ్రీశైలం ప్రాజెక్టుల నిర్మాణం ఆపాలని కేంద్రం ఆదేశించింది. ఈ రెండు ప్రాజెక్టులు కోస్తాంధ్రకు నీటి ప్రవాహాన్ని అడ్డుకునే ప్రాజెక్టులేనని కె.ఎల్.రావు భావించినట్లున్నారు. పోచంపాడును ధవళేశ్వరానికి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చుకోవాలనేది ఆయన ఆలోచన. చివరికి 1963 జూలై 26న పోచంపాడుకు, 25న శ్రీశైలంకు ప్రధాని నెహ్రూ శంకుస్థాపన చేశారు.

రెండవసారి ముఖ్యమంత్రిగా నీలం సంజీవరెడ్డి పదవి చేపట్టిన తర్వాత 1963 మార్చి 23న పోచంపాడును స్టోరేజీ ప్రాజెక్టుగా మార్చుతూ మరో ప్రతిపాదనను సిద్ధం చేసి కేంద్రానికి పంపింది. ఈ ప్రతిపాదన ప్రకారం 66 టీఎంసీలను పోచంపాడు ఆయకట్టుకు వినియోగిస్తారు. ప్రధాన కాల్వ (దక్షిణ కాల్వ డిశ్చార్జి) కెపాసిటీ 8500 క్యూసెక్కులుగా నిర్ధారించారు. రెండోదశలో 1091 అడుగుల ఎత్తులో 112 టీఎంసీల స్టోరేజీతో పోచంపాడు రిజర్వాయర్ నిర్మించినా ఆ నీటిని తెలంగాణ వినియోగించుకునే అవకాశం లేదు. ఈ స్టోరేజీ కేవలం ధవళేశ్వరం ఆయకట్టు అవసరాలకే ఉపయోగపడుతుంది.

సంజీవరెడ్డి ప్రభుత్వం, తర్వాత వచ్చిన బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం పోచంపాడు కోసం తెచ్చిన యంత్రాలను, వాహనాలను, పరికరాలను, సిబ్బందిని శ్రీశైలం ప్రాజెక్టు పనుల కోసం మళ్ళించింది. పోచంపాడుకు నిధులివ్వలేదు. 1965–68 మధ్య కాలంలో ఆరుట్ల కమలాదేవి వంటి వామపక్ష నేతలు, శాసనసభ అంచనాల కమిటీ తెలంగాణ రీజినల్ కమిటీ, తెలంగాణ ప్రాంత శాసనసభ్యులు పలుమార్లు ప్రభుత్వాన్ని నిలదీసినా 1968 నాటికి 90 కోట్లు వ్యయమయ్యే ప్రాజెక్టుకు 7 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పోచంపాడు, నాగార్జునసాగర్ ఎడమ కాల్వలో జరుగుతున్న అన్యాయాలను ఎజెండాలో చేర్చి ప్రభుత్వాన్ని నిలదీసింది. 1969 ఉద్యమ ఫలితమే వెంగళరావు ప్రభుత్వం 06–10–75న మహారాష్ట్రతో చేసుకున్న ఒప్పందం. దాని పర్యవసానమే 1978లో చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పోచంపాడును శ్రీరాంసాగర్ ప్రాజెక్టుగా పేరు మార్చి మొదటి దశలో 9,68,000 ఎకవరాలకు , రెండో దశలో 4,40,000 ఎకరాలకు సాగు నీరు ఇస్తూ నిజాంప్రభుత్వం రూపొందించిన ప్రతిపాదనలను అమలు చేయాలని నిర్ణయించారు. ప్రధాని ఇందిరాగాంధీ జనగామ వచ్చిన సందర్భంగా ప్రజల, ప్రజాప్రతినిధుల కోరికపై శ్రీరాంసాగర్ వరద కాల్వకు హామీ ఇచ్చారు. ఫలితంగా రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు ఇచ్చే విధంగా వరద కాలువ ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈ ప్రతిపాదనలకు అనుమతులు ఇవ్వడానికి కేంద్రం రెండు దశాబ్దాల సమయం తీసుకున్నది.అనుమతులు రాకముందే కాలువలు నిర్మించారు తప్ప ఒక్క చుక్క కూడా నీరు పారలేదు.3–4–96న రెండోదశ, వరద కాల్వకు కేంద్రం అనుమతులు లభించినా నేటికీ ఒక్క ఎకరానికీ సాగునీరివ్వలేదు. రెండో దశ కింద కేవలం 27 వేల ఎకరాలకు చెరువులను నింపి నీరిచ్చారు. ఎస్సారెస్పీ మొదటిదశ పూర్తై చాలా ఏళ్లయినా 9,68,000 ఎకరాల్లో ఏనాడూ 5 లక్షల ఎకరాలకు మించి నీరివ్వలేదు. గత ఏడాది రబీలో మాత్రమే 6 లక్షల ఎకరాలకు మొదటిసారి నీరిచ్చి వందలాది చెరువులు నింపినారు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ పాత ప్రాజెక్టులకు పూర్వవైభవం తేవాలని, పెండింగ్ ప్రాజెక్టులకు మరింత ప్రయోగం చేకూరే విధంగా రీ డిజైనింగ్ చేయాలని, కృష్ణా గోదావరి జలాల్లో మన వాటాను పూర్తిగా వినియోగించుకుంటూ వృథాగా సముద్రంలో కలిసే గోదావరి, కృష్ణా జలాలను మళ్లించి నిల్వ చేసుకోవడానికి పలు రిజర్వాయర్లను, ఎత్తిపోతల పథకాలను నిర్మించాలని త్రిముఖ వ్యూహాన్ని అమలుచేస్తున్నారు. ఈ వ్యూహంలో భాగమే శ్రీరాంసాగర్‌కు పునరుజ్జీవం.

1963 జూలై 26న నెహ్రూ పోచంపాడుకు శంకుస్థాపన చేసినప్పుడు తెలంగాణ ప్రజలు లక్షల సంఖ్యలో వచ్చి ప్రాజెక్టు ద్వారా తమకు కలుగబోయే ప్రయోజనాలను ప్రధాని ద్వారా విని ఎంతో ఆనందించారు. 54 ఏళ్లలో ప్రదాని నోటిమాటలు ఏనాడూ నిజం కాలేదు. నవాబ్ అలీ నవాజ్ జంగ్ కలల్ని, నెహ్రూ మాటలను నిజం చేస్తూ మన ప్రియతమ ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీరాంసాగర్ వద్ద ఏర్పాటుచేసే పునరుజ్జీవ సభకు అందరం కదులుదాం.

(వ్యాసకర్త: రాష్ట్ర జల వనరుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్)

సకలజన సమగ్రాభివృద్ధి

తెలంగాణం



మెట్టు శ్రీనివాస్

కోటి ఆశలు, ఆకాంక్షలు, మరోవైపు సమస్యలు సవాళ్లతో దేశంలో ఏ రాష్ట్రం ఏర్పడని విధంగా తెలంగాణ ఏర్పాటైంది. రాష్ట్ర పరిస్థితి అంత ఆగమాగం. భర్తృహరి చెప్పినట్లు 'ధీరులు ఎల్లప్పుడు అవరోధాలను అధిగమిస్తూ, ఆటంకాలను ధిక్కరిస్తూ.. రెట్టించిన ఉత్సాహంతో గమ్యం చేరేదాక, ఫలితం దక్కేదాక పట్టినపట్టు వదలర'ని కేసీఆర్ గారి నాయకత్వాన ప్రభుత్వం పరిస్థితులను చక్కదిద్దుకుంటూ, పరిపాలనను పట్టాలెక్కిస్తూ, సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిల్చింది. బంగారు తెలంగాణ నిర్మాణంలో ప్రజలే కేంద్రబిందువుగా ఉండేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ విధానాలుంటున్నాయి.

అభివృద్ధి అందరి ఆకాంక్షలను నెరవేర్చేవిధంగా పాలన సాగుతుండ బట్టి రాష్ట్రమంతా నిత్యపండుగ వాతావరణం నెలకొంటున్నది. కేవలం ఆరు నెలల్లో నిరంతరం విద్యుత్ సరఫరా అయింది. చాలీచాలని కరెంటుతో అగచాట్లు పడ్డ రైతాంగానికి తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ అందింది. పారిశ్రామిక రంగానికి సక్రమంగా విద్యుత్ అందించడం వల్ల పరిశ్రమల అధిపతుల ప్రశంసలు పొందింది. అన్ని మతాలపట్ల సామరస్య ధోరణి, రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న వివిధ రాష్ట్రాలతో పరస్పర సహకారం (మహారాష్ట్రతో సాగునీటి ప్రాజెక్టుల ఒప్పందం) అన్నివర్గాల అభ్యున్నతి ప్రభుత్వ విధిగా మారడంతో సమస్యలన్నీ కనుమరుగవుతున్నాయి.

అభివృద్ధిని అంచనా వేయడానికి వృద్ధిరేటు కీలకం. రాష్ట్రంలో వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల్లోని 18 విభాగాల్లో ఒక ఏడాది ఎంతైతే ఉత్పత్తిని సాధిస్తారో దాన్నే రాష్ట్ర స్థూల ఉత్పత్తిగా వ్యవహరిస్తారు. గతేడాది జీడీపీతో పోలిస్తే ఇప్పుడు ఎంతమేర పెంపు ఉంటుందో దానినే వృద్ధిరేటుగా పరిగణిస్తారు. రాష్ట్ర జీడీపీ వృద్ధిరేటు జాతీయస్థాయి వృద్ధిరేటు కంటే ఎక్కువ. 2011–12 సంవత్సరం స్థిర ధరల వద్ద 2015 –16లో మన రాష్ట్ర జీఎస్‌డీపీ 4.64 లక్షల కోట్లు, కాగా 2016–17లో అది 5.11లక్షల కోట్లు. వృద్ధిరేటు 10.1శాతం, జాతీయస్థాయి వృద్ధిరేటు 7.1, మన వృద్ధిరేటు జాతీయస్థాయి కంటే 3శాతం ఎక్కువ. 2012–13లో తెలంగాణలో 2.7 శాతం వృద్ధిరేటు ఉంటే జాతీయస్థాయి వృద్ధిరేటు 5.5 శాతం. రాష్ట్రం ఏర్పడ్డాక మూడేండ్లలో జాతీయస్థాయి వృద్ధిరే టు 2014 –15లో 7.2, 2015–16 7.9, 2016–17 7.1శాతంగా నమోదైంది. తెలంగాణ రాష్ట్ర వృద్ధిరేటు 2014–15లో 8.7, 2015–169.5, 2016–17 10.1 శాతంగా ఉన్నది. ఈ అంకెలను బట్టి అర్థం అయ్యేదేమంటే రాష్ట్ర ప్రభుత్వం దశాబ్దాల పాటు ఆంధ్ర పెట్టుబడిదారుల దోపిడీకి గురై వెనుకబడిన తెలంగాణలో సంపదను వృద్ధి చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలుపడానికి ఎనలేని కృషి చేస్తున్నది.

సంపద పెరుగడం, రాష్ట్రం అభివృద్ధి చెందడం వేర్వేరు అంశాలు. సంపద పెరిగినంత మాత్రాన రాష్ట్ర ప్రజలు అభివృద్ధి చెందినట్లు కాదు. పెరిగిన సంపద ప్రజలకు పంచబడాలి. వారిజీవన ప్రమాణాలు మెరుగవ్వాలి. అదే నిజమైన అభివృద్ధి. ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. సంక్షేమ రంగానికి ప్రథమ ప్రాధాన్యం ఇచ్చారు. బడ్జెట్లో సింహభాగం సంక్షేమానికి కేటాయించారు. తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుపెట్టని విధంగా 33 రకాల పథకాలతో 40 వేల కోట్లు ప్రజా సంక్షేమానికి ఖర్చుచేస్తున్నది.

గతంలో సంక్షేమ పథకాల అమలు పేరుమీద కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకుల అనుయాయులు బాగుపడ్డారు తప్ప నిజమైన ప్రజలకు ఒరిగిందేమి లేదు. పేదోడికి పట్టెడన్నం పెడితే వృథా అని, సామాన్యులకు సబ్సిడీలు ఇస్తే తిరోగమనమని భావించిన గత పాలకులు సామాన్యుల జీవితాలు గాలికి వదిలేశారు. ప్రజా ఉద్యమం నుంచి ఉద్భవించిన నాయకత్వం ప్రభుత్వాన్ని నడుపడం వల్ల ప్రజాసంక్షేమాన్ని తన బాధ్యతగా తీసుకున్నది. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అసమానతలను తొలిగించడానికి తోడ్పడే విధంగా పథకాలు రూపొందిస్తున్నది. దీర్ఘకాలంలో ఆర్థికంగా, సామాజికంగా వాళ్ళ కాళ్ళమీద వాళ్లే నిలబడి స్వశక్తివంతులుగా తయారుచేస్తున్నది.

ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయడం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, జిల్లాలో ఉండే వనరులను, అవకాశాలను బట్టి పంటలు పండించడం, పరిశ్రమలు స్థాపించడం, రవాణా సౌకర్యాల అభివృద్ధి ప్రభుత్వమే బాధ్యత తీసుకొని చేస్తున్నది.

రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాల జనాభా ఎక్కువ. 2014 సమగ్ర కుటుంబసర్వే లెక్కల ప్రకారం ఎస్సీలు 17.5 శాతం, ఎస్టీలు 9.91, బీసీలు 51.08, మైనార్టీలు 14.46.. మొత్తం జనాభాలో దాదాపు 93 ఉన్నారు. వీరందరికీ లబ్ధి జరిగేవిధంగా వారందరూ ఆత్మగౌరవంగా జీవించేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టి చేస్తూ, వృత్తి పనులకు ప్రోత్సాహమందిస్తున్న ది. దళిత గిరిజనులకు భూ పంపిణీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక ప్రగతి నిధి ఏర్పాటు, నిధులు మురిగిపోకుండా మరుసటి ఏడాదికి బదలాయింపు జరిగేవిధంగా చట్టాన్ని రూపొందించింది. గొర్రెలు, చేపల పెంపకం, చేనేత కార్మికుల సంక్షేమం, ఎంబీసీలకు కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. 4 శాతంగా ఉన్న ముస్లిం మైనార్టీ రిజర్వేషన్లను 12 శాతానికి, ఎస్టీ రిజర్వేషన్ 6–10 శాతం పెంచేందుకు కృషిచేస్తున్నది. త్వరలో ఎస్సీ, బీసీలకు రిజర్వేషన్లు పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వం ప్రకటించింది.

సామాజిక న్యాయసాధనలో మహిళా సంక్షేమం అత్యంత కీలకం. గర్భిణీ స్త్రీలకు రూ.13000 వేల ఆర్థిక సాయం, వితంతువు, ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు పింఛన్, కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలతో సంక్షేమ చర్యలు తీసుకుంటున్నది. పథకం, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల జీతాలు పెంచింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతాంగానికి ఎకరానికి పెట్టుబడి కోసం నాలుగు వేలు అందించనుంది. విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నది. సామాజిక న్యాయం ఒక సుదీర్ఘ ప్రక్రియ. అది ఒక రాష్ట్రంతో పరిమితమైన అంశం మాత్రమే కాదు. దేశ వ్యాప్తంగా జరుగాల్సిన కృషి. ఈ విషయంలో దేశానికి ఆదర్శంగా తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయం కోసం పాటుపడుతున్నది.

ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయడం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, జిల్లాలో ఉండే వనరులను, అవకాశాలను బట్టి పంటలు పండించడం, పరిశ్రమలు స్థాపించడం, రవాణా సౌకర్యాల అభివృద్ధి ప్రభుత్వమే బాధ్యత తీసుకొని చేస్తున్నది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా



న్యూఢిల్లీ: జస్టిస్ దీపక్ మిశ్రా తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ మంగళవారం ఒక ప్రకటన జారీచేసింది. ప్రస్తుత చీఫ్ జస్టిస్ జేఎస్ ఖేహర్ ఈ నెల 27న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో జస్టిస్ దీపక్ మిశ్రా బాధ్యతలు చేపడతారు. 2013లో ఢిల్లీలో 'నిర్భయ'పై జరిగిన సామూహిక లైంగిక దాడి కేసులో నలుగురికి విధించిన మరణశిక్షను ధ్రువీకరించిన సుప్రీంకోర్టు బెంచ్ సభ్యుల్లో జస్టిస్ దీపక్ మిశ్రా ఒకరు. ముంబై బాంబుపేలుళ్ల కేసులో ఉగ్రవాది యాకూబ్ మెమన్‌కు విధించిన ఉరిశిక్ష కేసును కూడా ఆయన విచారించారు. 2013 జూలైలో ఉరిశిక్ష అమలుకు ముందు చివరి క్షణంలో దాఖలైన పిటిషన్‌ను విచారించిన త్రిసభ్య బెంచ్‌లోనూ జస్టిస్ దీపక్ మిశ్రా ఒకరు. ఆ రోజు ఉదయం ఐదు గంటలకు త్రిసభ్య ధర్మాసనం తీర్పును ప్రకటించిన జస్టిస్ దీపక్‌మిశ్రా.. మెమన్‌కు విధించిన ఉరిశిక్ష అమలును నిలిపివేస్తే అది న్యాయాన్ని అవహేళన చేసినట్లవుతుందన్నారు. స్టే పిటిషన్‌ను కొట్టేసిన రెండు గంటల తర్వాత మెమన్‌ను ఉరితీశారు.

చైనాలో భారీ భూకంపం

■ దాదాపు 100 మంది మృతి!

■ వేలాది మందికి గాయాలు

బీజింగ్: చైనాలోని సిచుయాన్ రాష్ట్రం జియుజైగౌలో మంగళవారం రాత్రి 9.19గంటలకు(స్థానిక కాలమానం ప్రకారం) భారీ భూకంపం సంభవించింది. దాదాపు 100 మంది మృతి చెందినట్లు, వేలాది మంది గాయపడినట్లు తెలుస్తున్నది. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషయంగా ఉన్నది. 1.3 లక్షలకుపైగా ఇండ్లు దెబ్బతిన్నట్లు సమాచారం. చెంగ్డూ ప్రాంతానికి దాదాపు 284 కిలోమీటర్ల దూరంలో 20 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రీకృతమైనదని అధికారులు తెలిపారు. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 7.0గా నమోదైందని చెప్పారు. జియుజైగౌ చైనాలోనే ప్రముఖ పర్యాటక ప్రాంతమని, అక్కడ ప్రఖ్యాతిగాంచిన జాతీయ పార్కులు ఉన్నాయని పేర్కొన్నారు. భూకంప ప్రభావంతో పార్కుల్లో దాదాపు 100 మంది చిక్కుకుపోయినట్లు వివరించారు. స్థానికులు మాట్లాడుతూ జియుజైగౌ ప్రాంతంలో 2008లో భారీ భూకంపం సంభవించి 87,000 మంది ప్రాణాలు కోల్పోయారని, మళ్లీ ఇప్పుడు అలాంటి భూకంపమే సంభవించిందని చెప్పారు. ఒక్కసారిగా భూకంపం రావడంతో ఇండ్లు కుప్పకూలాయని, ప్రజలు భయంతో ఇండ్ల నుంచి బయటికి పరుగులు తీశారని తెలిపారు. మరోవైపు చైనా ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. సైనికులు, అగ్నిమాపక సిబ్బంది, ప్రకృతి వైపరీత్యాల ప్రతిస్పందన దళాలను రంగంలోకి దింపింది. భూకంప ప్రభావంతో విద్యుత్, మొబైల్, ఇంటర్నెట్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

పోటెత్తిన వరదలు.. 24 మంది మృతి

చైనాలోని సిచుయాన్ రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల వల్ల 24 మంది మృతిచెందారు. పలువురు గాయపడ్డారు. ప్రధానంగా జెంగ్డీ గ్రామాన్ని వరద ముంచెత్తింది. వర్షాలు కురవడం, వరద ముంచెత్తడంతో కొండచరియలు విరిగిపడ్డాయని దీంతో ఈ గ్రామంలో 24మంది మృతిచెందారని అధికారులు తెలిపారు.



భూకంపం ధాటికి కుప్పకూలిన భవనం

క్షణం.. క్షణం.. ఉత్కంఠ!

తీవ్ర ఆసక్తి రేపిన గుజరాత్ రాజ్యసభ ఎన్నికలు ■ ఈసీ జోక్యంతో అర్ధరాత్రి ప్రారంభమైన కౌంటింగ్

అంతకుముందు ఈసీకి కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ అభ్యర్థనలు ■ ఇద్దరు కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేల ఓట్లు చెల్లవన్న ఈసీ

గుజరాత్, ఆగస్టు 8:

కాంగ్రెస్, బీజేపీ మధ్య ప్రతిష్ఠాత్మకంగా మారిన గుజరాత్ రాజ్యసభ ఎన్నికలు అనుక్షణం ఉత్కంఠను రేకెత్తించాయి. గుజరాత్‌లో రెండువారాలుగా పదునెక్కిన రాజకీయ వ్యూహాలకు కొనసాగింపుగా మంగళవారం పోలింగ్‌లోనూ, కౌంటింగ్‌లోనూ నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. పోలింగ్‌లో క్రాస్ ఓటింగ్ కలకలం రేపింది. కాంగ్రెస్ అభ్యర్థన మేరకు ఆ పార్టీకి చెందిన ఇద్దరు తిరుగుబాటు ఎమ్మెల్యేల ఓట్లు చెల్లవని ఈసీ ప్రకటించింది. అనంతరం బుధవారం అర్ధరాత్రి కౌంటింగ్ ప్రారంభమైంది.

మూడు రాజ్యసభ స్థానాలకు మంగళవారం ఉదయం 9గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం రెండుగంటలకు ముగిసింది. గుజరాత్ అసెంబ్లీలో మొత్తం 182 స్థానాలుండగా, 176మంది ఎమ్మెల్యేలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి బీబీ స్వాయిన్ తెలిపారు. నలుగురు హేమాహేమీలు పోటీపడుతున్న ఈ ఎన్నికలపై అంతటా ఆసక్తి నెలకొన్నది. బీజేపీ చీఫ్ అమిత్‌షా, కేంద్రమంత్రి స్మృతి ఇరానీ గెలుపు దాదాపు ఖరారైనట్లే. ఇక మూడోస్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్‌పటేల్ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇటీవల కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన బల్వంత్‌సిన్హ్ రాజ్‌పుత్‌తో అహ్మద్ పటేల్ పోటీపడుతున్నారు. పోలైన ఓట్లలో నాలుగోవంతు ఓట్లతో పాటు అదనంగా ఒక్క ఓటు వచ్చినా విజయం సాధించినట్లే. 176మంది ఓటర్లలో మ్యాజిక్ సంఖ్య 44+1 అవుతుంది. ఈలెక్కన విజయం సాధించాలంటే ఒక్కో అభ్యర్థికి 45 ఓట్లు పొంది తీరాలి. రెండుదశాబ్దాలుగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఏకగ్రీవంగానే రాజ్యసభకు ఎన్నికవుతూ వస్తున్న గుజరాత్‌లో ఈసారి మాత్రం పార్టీల చాణక్యానికి హోరాహోరీ ఎన్నికలు వేదికయ్యాయి.

అహ్మద్‌పటేల్‌పైనే అందరి దృష్టి

మంగళవారం పోలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే ఆనంద్ నుంచి బయల్దేరిన 44మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల బస్సు రాష్ట్ర సెక్రటేరియట్ 'స్వర్ణిమ్ సంకుల్'కు చేరుకుంది. ఆ ఎమ్మెల్యేలంతా విజయచిహ్నాన్ని చూపుతూ ఓటువేసేందుకు వెళ్లారు. అహ్మద్ పటేల్ కాంగ్రెస్ అధినేత్రి సోనియా రాజకీయవ్యవహారాల కార్యదర్శి కావడంతో ఆ పార్టీ ఆయన గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది. 51మంది ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ నుంచి శంకర్‌సింగ్ వాఘేలా ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేలతో బయటకు వచ్చేశారు. దీంతో మిగిలిన 44మంది ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ బెంగళూరులో వారం రోజులపాటు ఓ క్యాంప్‌ను నిర్వహించింది. అయినప్పటికీ క్రాస్ ఓటింగ్ జరిగినట్లు తెలుస్తున్నది. అహ్మద్ పటేల్‌కు తాను ఓటు వేయలేదని, ఆయన ఓడిపోబోతున్నారని శంకర్‌సింగ్ వాఘేలా తెలిపారు. తాము బీజేపీ అభ్యర్థి బల్వంత్‌సిన్హ్ రాజ్‌పుత్‌కే ఓటేశామని కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలు రాఘవ్‌జీ పటేల్, ధర్మేంద్రసింహ్ జడేజా చెప్పారు. వాఘేలా తనయుడు మహేంద్రసింహ్ వాఘేలా తాను ఓటెవరికి వేశారన్నది వెల్లడించలేదు. సనంద్ ఎమ్మెల్యే కరంసీ పటేల్, మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారని సమాచారం. అహ్మద్ పటేల్ మాత్రం తన గెలుపుపై ధీమా వ్యక్తంచేశారు. బెంగళూరు నుంచి వచ్చిన ఎమ్మెల్యేలను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ ఎంత ప్రయత్నించినా, తన గెలుపు ఖాయమని చెప్పారు.

పటేల్‌కు రావాల్సిన ఓట్లకన్నా రెండు ఓట్లు అధికంగానే వచ్చినట్లు కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ చెప్పారు. శంకర్‌సింగ్ వాఘేలా గ్రూపునకు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు క్రాస్‌ఓటింగ్‌కు పాల్పడ్డారని అంగీకరించిన గెహ్లాట్, ఎన్సీపీ నుంచి ఒక ఓటు కాంగ్రెస్ అభ్యర్థికే పడిందని వివరించారు. కాగా, మరో ఎన్సీపీ ఎమ్మెల్యే కాంధాల్ జడేజా మాత్రం 'నేను ఎవరికి ఓటేశానో మీకే తెలుస్తుంది' అని చెప్పారు. ఏకైక జేడీ(యూ) ఎమ్మెల్యే చోటుభాయ్ వాసవ తాను దేశ ప్రయోజనాల కోసం ఓటేశానని తెలుపడంతో కలకలం రేగింది. ఆ తర్వాత తాను అహ్మద్ పటేల్‌కే ఓటేశానని ఆయన స్పష్టతనిచ్చారు. ఇది తన సొంత నిర్ణయమని, బీజేపీకి ఓటేయాలని పార్టీ అధ్యక్షుడు నితీశ్ చెప్పలేదని అన్నారు. మరోవైపు ఓ పోలింగ్ ఏజెంట్ నియామకంపై అనధికారికంగా రిటర్నింగ్ అధికారికి లేఖరాసిన జేడీయూ ప్రధాన కార్యదర్శి, శరద్‌యాదవ్ అనుచరుడు అరుణ్ శ్రీవాస్తవపై ఆ పార్టీ వేటు వేసింది. ప్రధాన కార్యదర్శి పదవి నుంచి అతడిని తొలగిస్తూ కేసీ త్యాగి ఉత్తర్వులు జారీ చేశారు.

అమిత్‌షా, స్మృతి గెలిచినట్లే..

ఇక బీజేపీకి 121మంది ఎమ్మెల్యేలున్నారు. ఒక్కో రాజ్యసభ అభ్యర్థి గెలుపునకు 45 ఓట్లు అవసరం కాగా, అమిత్‌షా, స్మృతిఇరానీ సునాయాసంగా గెలుస్తారు. ఇక మూడో అభ్యర్థి బల్వంత్‌సిన్హ్ రాజ్‌పుత్ గెలుపునకు అవసరమైన సంఖ్యాబలం బీజేపీ వద్ద లేదు. మరో 14 ఓట్లు అదనంగా అవసరం. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను, వాఘేలా గ్రూపును, చిన్న పార్టీలను బీజేపీ నమ్ముకున్నట్లు తెలుస్తున్నది. ఆ మేరకు పక్షం రోజులుగా గుజరాత్‌లో చకచకా మారుతున్న రాజకీయ సమీకరణాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.

ఇద్దరు ఎమ్మెల్యేల ఓట్లు తిరస్కరించిన ఈసీ

గుజరాత్‌లోని రాజ్యసభ ఎన్నికల్లో నెలకొన్న గందరగోళానికి ఈసీ తెరదించింది. ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లు చెల్లవని ప్రకటించింది. పోలింగ్ సందర్భంగా ఇద్దరు కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలు రాఘవ్‌జీ పటేల్, భోలా గోహిల్ తమ ఓటును బీజేపీ అభ్యర్థి అమిత్‌షాకు చూపడంపై కాంగ్రెస్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసింది. వారి ఓట్లను చెల్లనివిగా పరిగణించాలని పట్టుబట్టింది. దీంతో కొద్దిసేపు ఓట్ల లెక్కింపు నిలిచింది. మరోవైపు కాంగ్రెస్ ఆరోపణలు నిరాధారమైనవని పేర్కొన్న బీజేపీ లెక్కింపు ఆపవద్దని అభ్యర్థించింది. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించిన ఈసీ ఇద్దరు కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలు రహస్య బ్యాలెట్ పద్ధతిని ఉల్లంఘించినందున వారి ఓట్లు చెల్లవని ప్రకటించింది. ఈసీ నిర్ణయం అహ్మద్ పటేల్‌కు కలిసిరానుంది.





ఓట్ల లెక్కింపు కేంద్రంలో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, గుజరాత్ సీఎం విజయ్ రూపానీ తదితరులు; ఈసీకి ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్న కాంగ్రెస్ నేతలు గులాం నబీ ఆజాద్, చిదంబరం, ఆనంద్‌శర్మ తదితరులు

నువ్వు రాజ్‌పుత్‌వు.. అహ్మద్ పటేల్‌ను గెలిపించు

■ వాఘేలానుద్దేశించి దిగ్విజయ్ వివాదస్పద ట్వీట్

■ కులం పేరిట ఓట్లడిగిన కాంగ్రెస్ సీనియర్ నేత

న్యూఢిల్లీ: వివాదాస్పద వ్యాఖ్యలకు పెట్టింది పేరైన కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారని పలువురు పేర్కొంటున్నారు. గుజరాత్ రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ మాజీ నాయకుడు శంకర్‌సింగ్ వాఘేలాకు కులాన్ని ఆపాదించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వాఘేలాను ఉద్దేశించి మంగళవారం వరుస ట్వీట్లు చేశారు. 'నువ్వు రాజ్‌పుత్‌వు. దయచేసి అహ్మద్ భాయ్‌ని గెలిపించు. ఆయన మన స్నేహితుడు, మద్దతుదారు. నీ కోసం కాంగ్రెస్ ఏం చేసిందో మర్చిపోకు. నీకు ఏమైనా సమస్యలుంటే పార్టీలో చర్చించుకుందాం' అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. అంతటితోఆగకుండా వాఘేలా ముఖ్యమంత్రి కాకముందు మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలో తాను ఆతిథ్యం ఇచ్చిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. కాగా కులం పేరుతో వాఘేలాను ఓటు అడుగడంపై పలు అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కులం, మతం పేరుతో ఓట్లు అడుగడాన్ని సుప్రీంకోర్టు నిషేధించింది. ఈ విధంగా ఓట్లు అడుగడం అవినీతికి పాల్పడటమేనని, తద్వారా సదరు అభ్యర్థిని అనర్హుడిగా కూడా ప్రకటించవచ్చునని కోర్టు పేర్కొంది. ఎన్నికల సంఘం ఎన్నికల నియమావళి కూడా ఇదే విషయాన్ని నిర్ధారిస్తున్నది. ప్రస్తుతం గుజరాత్ నుంచి బీజేపీ తరపున మూడో అభ్యర్థిగా రాజ్యసభకు పోటీచేస్తున్న బల్వంత్‌సింగ్ రాజ్‌పుత్, శంకర్‌సింగ్ వాఘేలా గత నెలలో కాంగ్రెస్ రాజీనామా చేశారు.

వ్యూహకర్త

బీజేపీ అధ్యక్షునిగా మూడేండ్లు పూర్తి చేసుకున్న అమిత్ షా

న్యూఢిల్లీ, ఆగస్టు 8: బీజేపీకి అంది వచ్చిన వరంగా అమిత్ షా పేరుగాంచారు. పార్టీ అధ్యక్షునిగా నేటితో (బుధవారం) ఆయన మూడేండ్లు పూర్తి చేసుకున్నారు. వ్యూహకర్త, కార్యదక్షుడిగా పేరొందిన అమిత్ షా పార్టీకి మెజారిటీ సీట్లు లేకపోయినా రాజకీయ యుక్తులతో గోవా, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బీజేపీని అధికారంలోకి తెచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీకున్న జనాకర్షణ, అమిత్ షా నైపుణ్యం, తెలివితేటల వల్ల ఈనాడు బీజేపీ సొంత బలంతో 13 రాష్ట్రాల్లో, కూటమి భాగస్వాములతో మరో ఐదు రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. అమిత్ షా పర్యవేక్షణలోనే బీజేపీ దాని మిత్రపక్షాలు ఉత్తర్‌ప్రదేశ్‌లో 80 లోక్‌సభ స్థానాలకు గాను 73 సీట్లను గెలుచుకున్నాయి. ఇప్పటికి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఈ గుజరాతీ నాయకుడు లోక్‌సభ ఎన్నికల్లో కీలకమైన ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ ప్రచార బాధ్యతలు నిర్వహించారు. పార్టీ అధ్యక్షునిగా నాలుగో ఏట ప్రవేశిస్తున్న అమిత్ షా రాజ్యసభ సభ్యునిగా పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నారు.



గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేసిన అనంతరం బయటకు వస్తూ విజయసంకేతం చూపుతున్న అమిత్‌షా

అధ్యక్షుడిగా విజయం

2014లో నాడు పార్టీ అధ్యక్షునిగా ఉన్న రాజ్‌నాథ్‌సింగ్ మోదీ మంత్రివర్గంలో చేరడంతో బీజేపీ పగ్గాలను అమిత్‌షాకు అప్పగించారు. ప్రజల్లో పార్టీకి పెరుగుతున్న మద్దతును పార్టీ అధ్యక్షుని ప్రాబల్యానికి కొల్లబద్ధగా భావిస్తే.. అమిత్ షాను బీజేపీకి అత్యంత విజయవంతమైన అధ్యక్షునిగా పేర్కొనవచ్చు. షా నేతృత్వంలో బీజేపీ అనేక ఎన్నికల్లో గెలువడమే కాక, ఓట్ల శాతాన్ని కూడా పెంచుకున్నామని పార్టీ నేతలు చెప్తుంటారు. బీహార్ వంటి రాష్ట్రాల్లో ఓటమి చవిచూసినప్పటికీ పార్టీకి లభించిన ఓట్ల శాతం పెరిగిందని వారు గుర్తు చేస్తున్నారు. అమిత్ షా నేతృత్వంలో బీజేపీ ఢిల్లీ, బీహార్‌లో తప్ప అన్ని చోట్ల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించింది. అసోం, హర్యానా, జమ్ముకశ్మీర్ రాష్ట్రాల్లో తొలిసారి ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. షా నాయకత్వంలోనే బీజేపీ తన చిరకాల మిత్రపక్షమైన శివసేనను బేఖాతరు చేస్తూ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి అత్యధిక స్థానాలు గెలుచుకున్నది. అమిత్ షా నేతృత్వంలోనే బీజేపీ 11 కోట్ల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఆవిర్భవించింది. ప్రతి నెల మొదటి, మూడవ సోమవారం సామాన్యులను, పార్టీ కార్యనిర్వాహక సభ్యులను కలుసుకోవాలన్న ఆయన నిర్ణయం పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తున్నదని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.

కశ్మీర్‌లోకి ప్రవేశిస్తే ఏం చేస్తారు?

డోక్లాం వివాదంపై భారత్‌ను ప్రశ్నించిన చైనా




న్యూఢిల్లీ, ఆగస్టు 8: డోక్లాం వివాదంపై ఇప్పటివరకు అధికారికంగా స్పందించని చైనా మంగళవారం నోరు విప్పింది. డోక్లాం ముక్కోణ జంక్షన్ నుంచి భారత్ సైనిక బలగాలు వైదొలిగితే తప్ప ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చల ప్రసక్తే లేదని పేర్కొన్నది. భారత్ – పాకిస్థాన్ మధ్య వివాదంగా ఉన్న కశ్మీర్‌తోపాటు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని కాలాపానీ, నేపాల్ సరిహద్దుల్లోని భారత భూభాగంలోకి తమ సైన్యం చొచ్చుకువస్తే భారత్ ఏ విధంగా స్పందిస్తుందని చైనా విదేశాంగ శాఖలో సరిహద్దు, సముద్ర వ్యవహారాల విభాగం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వాంగ్‌వెన్లీ ప్రశ్నించారు. అఖిల చైనా జర్నలిస్టుల సంఘం (ఏసీజేఏ) ఆహ్వానం మేరకు చైనాలో పర్యటిస్తున్న భారత జర్నలిస్టుల బృందంతో ఆమె మాట్లాడారు. సరిహద్దుల్లో ఒక్క భారత సైనికుడు ఒక్కరోజు తమ భూభాగంలో కొనసాగినా తమ దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను ఉల్లంఘించడమేనని ఆమె స్పష్టం చేశారు. 'భారత్ వైపు పలు ముక్కోణ జంక్షన్లు ఉన్నాయి. ఒకవేళ రెండు దేశాల మధ్య కాలాపానీ (ఉత్తరాఖండ్), భారత్ – నేపాల్ – చైనా మధ్య గల ముక్కోణ జంక్షన్లు, భారత్ – పాకిస్థాన్ మధ్య గల జంక్షన్లలో మేం జోక్యం చేసుకుంటే ఏం చేస్తారు' అని ప్రశ్నించారు. డోక్లాం వివాదంపై కశ్మీర్ అంశాన్ని చైనా ప్రస్తావించడం ఇదే మొదటిసారి.

ఆలయానికి దూరంగా మసీదు

■ ముస్లింలున్న ప్రాంతంలో నిర్మించాలి

■ బాబ్రీ స్థలం మాది.. వివాదంపై మమ్మల్నే సంప్రదించాలి

■ సుప్రీంకోర్టుకు షియా వక్ఫ్‌బోర్డు వినతి



న్యూఢిల్లీ: అయోధ్యలో రామజన్మభూమి వివాదాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేందుకు ఉత్తరప్రదేశ్ షియా సెంట్రల్ వక్ఫ్‌బోర్డు సానుకూల ప్రతిపాదన చేసింది. వివాదాస్పద స్థలానికి దూరంగా ముస్లింల జనాభా ఎక్కువగా ఉన్న చోట మసీదును నిర్మించాలని కోరింది. మంగళవారం సుప్రీంకోర్టుకు సమర్పించిన 30 పేజీల అఫిడవిట్‌లో ఈ మేరకు విజ్ఞప్తి చేసింది. బాబ్రీ మసీదు ఉన్న స్థలం తమ ఆస్తి అని, దానిపై సంప్రదింపులు జరిపే హక్కు తమకు మాత్రమే ఉన్నదని పేర్కొన్నది. దశాబ్దాలుగా నలుగుతున్న ఈ వివాదంపై అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను ఇకపై వేగంగా విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు జూలై 21న ప్రకటించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జేఎస్ ఖేహర్ ఇందుకోసం జస్టిస్‌లు దీపక్ మిశ్రా, అశోక్ భూషణ్, ఎస్‌ఏ నజీర్‌లతో కూడిన ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. ఈ ధర్మాసనం ఈ నెల 11 నుంచి విచారణ ప్రారంభించనున్నది. ఈ లోగానే షియాబోర్డు ఈ విధంగా సానుకూలంగా ప్రతిస్పందించడం అది కూడా వివాదాస్పద స్థలానికి దూరంగా మసీదు నిర్మాణం జరుగాలని కోరుకోవడం విశేషం. సామరస్య పూర్వక పరిష్కారానికి కృషి చేసేందుకు వీలుగా తాము ఒక కమిటీని ఏర్పాటు చేసుకుంటామని అందుకు తమకు కొంత సమయం ఇవ్వాలని సుప్రీంకోర్టును షియాబోర్డు అభ్యర్థించింది. ముస్లిం వర్గాల తరపున ఈ వివాద పరిష్కారానికి కృషి చేసేందుకు తమకే హక్కు ఉన్నది తప్ప ఇతర సంస్థలకు లేదని సున్నీ షియా సెంట్రల్ వక్ఫ్‌బోర్డును దృష్టిలో ఉంచుకొని షియా బోర్డు వ్యాఖ్యానించింది.

పాఠశాలల్లో యోగాపై కేంద్రం నిర్ణయం తీసుకోవాలి: సుప్రీం

దేశవ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు పాఠశాలల్లో విద్యార్థులు యోగా చేయడాన్ని తప్పనిసరి చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దీనిపై కేంద్రం నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది.

స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కాపాడాలి

సీడబ్ల్యూసీలో సోనియాగాంధీ పిలుపు

న్యూఢిల్లీ, ఆగస్టు 8: వ్యక్తులు, సంస్థల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కాంగ్రెస్ కాపాడాలని ఆ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ పిలుపునిచ్చారు. మంగళవారం ఢిల్లీ లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడుతూ, 'స్వయం నియమిత రక్షకుల' కేసులు పెరుగడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తుల స్వేచ్ఛపై దాడులు జరుగుతున్నాయని, స్వయం నియమిత రక్షకులు స్వేచ్ఛకు ముప్పుగా, బహుళత్వానికి, భిన్నత్వానికి శత్రువులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మాట్లాడుతూ, భారత యువత, రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలు అనంతరం అనేక సమస్యలు పుట్టుకొస్తున్నాయని అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సీడబ్ల్యూసీ భేటీకి జ్వరం కారణంగా రాహుల్‌గాంధీ హాజరుకాలేదు.

వచ్చే విద్యాసంవత్సరం ఉర్దూలోనూ నీట్!

సుప్రీంకోర్టుతో కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 8: వైద్య కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే నీట్‌ను 2018–19 విద్యాసంవత్సరం నుంచి ఉర్దూ భాషలోనూ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2018 నుంచి ఉర్దూ మాధ్యమంలో నీట్‌ను నిర్వహించేందుకు కేంద్రం వ్యతిరేకం కాదని జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనానికి సొలిసిటర్ జనరల్ రంజిత్ కుమార్ వివరించారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన పరీక్ష పూర్తయిందని, సమయాన్ని వెనుకకు తీసుకురాలేమని మరో న్యాయమూర్తి జస్టిస్ ఏఎం ఖాన్‌విల్కార్ అన్నారు. నీట్‌ను ఉర్దూలో నిర్వహించాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఐవో) జాతీయ కార్యదర్శి థౌసీఫ్ అహమద్ గతంలో సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయగా, దీనిపై వివరణ ఇవ్వాలని కోర్టు.. కేంద్రం, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించింది.

శతాబ్దపు అతిపెద్ద కుంభకోణం


■ వేర్వేరు పరిమాణాల్లో పెద్ద నోట్ల ముద్రణ!

■ రూ.500, రూ.2,000 నోట్లపై విపక్షం రభస

■ రాజ్యసభ ఆరుసార్లు వాయిదా



వేర్వేరు సైజుల్లో పెద్ద నోట్లను ముద్రించడంపై మంగళ వారం రాజ్యసభలో నిరసన తెలుపుతూ వెల్‌లోకి దూసుకెళ్లిన ప్రతిపక్ష ఎంపీలు



వేర్వేరు సైజుల్లో ఉన్న రూ.500 నోట్లను చూపుతున్న కాంగ్రెస్ ఎంపీ కపిల్ సిబల్

న్యూఢిల్లీ, ఆగస్టు 8: పెద్ద నోట్ల రద్దు తరువాత ముద్రించిన రూ.500, రూ.2,000 నోట్లు వేర్వేరు పరిమాణాల్లో ఉన్నాయని, వాటిని ఎక్కడ ఎలా ముద్రించారో వెల్లడించాలని ప్రతిపక్షాలు మంగళవారం రాజ్యసభలో డిమాండ్ చేశాయి. వేర్వేరు పరిమాణాల్లో నోట్ల ముద్రణ 'ఈ శతాబ్దపు అతిపెద్ద కుంభకోణం' అని అభివర్ణించాయి. ఇది భారతదేశ కరెన్సీకున్న విశ్వసనీయతను దెబ్బతీసిందని విరుచుకుపడ్డాయి. దీనిపై ప్రధాని మోదీ వివరణ ఇవ్వాలని పట్టుబట్టాయి. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ 'పనికిమాలిన' అంశాలను లేవనెత్తుతూ సభా సమయాన్ని వృథా చేస్తున్నదని అన్నారు. కాంగ్రెస్, తృణమూల్ సభ్యులు పెద్దగా నినాదాలు చేయడంతో సభ ఆరుసార్లు వాయిదా పడింది. సభను బుధవారానికి వాయిదా వేశారు.

ప్రభుత్వానికి అధికారంలో ఉండే అర్హత లేదు : ఆజాద్

ఉదయం 11 గంటలకు సభ సమావేశం కాగానే కాంగ్రెస్ సభ్యుడు కపిల్ సిబల్ నోట్ల అంశాన్ని లేవనెత్తారు. పెద్ద నోట్లను రెండు పరిమాణాల్లో ముద్రించారని, ఒకటి అధికార పక్ష సభ్యుల కోసం, మరొకటి ఇతరుల కోసమని ఎద్దేవా చేశారు. గత నవంబర్‌లో ప్రభుత్వం పాత పెద్ద నోట్లు (రూ.500, రూ.1000) ఎందుకు రద్దు చేసిందో ఇప్పుడు తెలుస్తున్నదన్నారు. ఇది ఈ శతాబ్దపు అతిపెద్ద స్కామ్ అని మరో కాంగ్రెస్ నాయకుడు గులాం నబీ ఆజాద్ ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి ఐదు నిమిషాలు కూడా అధికారంలో ఉండే అర్హత లేదన్నారు. తృణమూల్ సభ్యుడు డెరెక్ ఓబ్రియన్ లేచి ఇది చాలా తీవ్రమైన అంశమని పేర్కొంటూ తన వద్ద వేర్వేరు పరిమాణాలు, డిజైన్లలో ఉన్న రూ.500 నోట్లను ప్రదర్శించారు. జేడీయూ నాయకుడు శరద్ యాదవ్ మాట్లాడుతూ ఏ దేశంలో కూడా ఒకే కరెన్సీ నోటు వేర్వేరు సైజుల్లో ఉండదని చెప్పారు. వేర్వేరు నోట్ల వల్ల ప్రస్తుతం చెలామణిలో ఉన్న నోట్ల విశ్వసనీతయకు సవాలు ఎదురవుతున్నదని కాంగ్రెస్ సభ్యుడు ఆనంద్ శర్మ అన్నారు.

ఆ నోట్లు ఎక్కడ దొరికాయో చెప్పాలి : మంత్రులు

ప్రతిపక్ష సభ్యుల ఆరోపణలను న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ తోసిపుచ్చారు. ఆ నోట్లు వారికి ఎక్కడ లభించాయో చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ సభ్యులు ఈ అంశాన్ని 'పాయింట్ ఆఫ్ ఆర్డర్' ద్వారా లేవనెత్తడంపై డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపై చర్చకు ముందుగా నోటీసు ఇవ్వాలని చెప్పారు. అయినా సభ్యులు తమ ఆందోళనను కొనసాగించడంతో సభను 15 నిమిషాలు వాయిదా వేశారు. సభ మళ్లీ సమావేశమైనప్పుడు ప్రశ్నోత్తరాల సమయాన్ని కొనసాగనివ్వాలని చైర్మన్ హమీద్ అన్సారీ కోరినా ప్రతిపక్షం తమ ఆందోళనను కొనసాగించింది. దీంతో సభను మళ్లీ, మళ్లీ వాయిదా వేయాల్సి వచ్చింది. నోట్ల అంశం ఎంతో తీవ్రమైనదని, మొత్తం ద్రవ్య వ్యవస్థ ప్రభావితమవుతుందని కపిల్‌సిబల్ పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి సభలో ఉన్నందున తాము కొన్ని వాస్తవాలను సభ ముందుంచుతామని చెప్పారు. ఇది జాతీయ భద్రత, విశ్వాసంతో ముడిపడి ఉందని, దేశంకన్నా ముఖ్యమైనది మరేమీ లేదని ప్రమోద్ తివారీ (కాంగ్రెస్) అన్నారు. ఇది 'హీనమైన నేరం.. పెద్ద కుంభకోణం' అని వ్యాఖ్యానించారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ అంశాన్ని సభలో అనుమతించే ప్రసక్తే లేదని కురియన్ తేల్చి చెప్పారు. అధికార పక్ష సభ్యులను కూడా ఆయన మందలించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా తాము వాకౌట్ చేస్తున్నట్టు సమాజ్‌వాదీ నేత నరేశ్ అగర్వాల్ చెప్పారు.

రాహుల్.. 100 ఉల్లంఘనలు: రాజ్‌నాథ్



కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీపై గుజరాత్‌లో ఇటీవల జరిగిన దాడిపై ఆ పార్టీ సభ్యులు మంగళవారం లోక్‌సభలో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ అంశం అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. గుజరాత్‌లో రాహుల్‌పై జరిగిన రాళ్లదాడి ఆయన ప్రాణాలు తీసి ఉండేదని కాంగ్రెస్ సభ్యులు ఆరోపించారు. దీనిపై హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పందిస్తూ రాహుల్ అనేకమార్లు ప్రత్యేక రక్షణ దళం (ఎస్పీజీ) రక్షణ లేకుండా విదేశాలకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. భారత్‌తోపాటు విదేశాలలో కూడా రాహుల్‌గాంధీ అనేకమార్లు భద్రత నిబంధనలను ఉల్లంఘించారని రాజ్‌నాథ్ తెలిపారు. గత రెండేండ్లలో రాహుల్ 121 పర్యటనలు చేశారని, వందసార్లు బుల్లెట్ ప్రూఫ్ కారును ఉపయోగించలేదని చెప్పారు. గత రెండేండ్లలో రాహుల్ ఆరుసార్లు మొత్తం 72 రోజులపాటు విదేశీ పర్యటనలు చేశారని, ఆ సమయంలో ఆయన ఎస్పీజీ రక్షణ తీసుకోలేదని హోంమంత్రి చెప్పారు. 'ఎస్పీజీ రక్షణ లేకుండా రాహుల్ ఎక్కడికి వెళ్లారు? ఆ విషయాలను ఎందుకు దాచిపెట్టారు? ఈ దేశానికి, సభకు తెలియాలి' అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. హోం మంత్రి వ్యాఖ్యలపై రెచ్చిపోయిన కాంగ్రెస్ సభ్యులు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. అంతకుముందు కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, 'జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు రాళ్లు రువ్వుతారని చెప్పారు, మరి గుజరాత్‌కు కశ్మీర్ టెర్రరిస్టు వచ్చాడా లేక బీజేపీ కార్యకర్తలు ఉగ్రవాదులుగా మారారా?' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో అధికార, కాంగ్రెస్ సభ్యుల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఈ గందరగోళంలో సభ తొలుత 30 నిమిషాలపాటు వాయిదా పడింది. సభ మళ్లీ సమావేశమైన తరువాత కూడా కాంగ్రెస్ సభ్యులు నినాదాలు కొనసాగించడంతో సభ బుధవారానికి వాయిదా పడింది.



రాజేంద్రనగర్ సర్కిల్‌లో మంచినీటి రిజర్వాయర్‌ను ప్రారంభిస్తున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

ఔటర్ లోపలి గ్రామాలకు సమృద్ధిగా తాగునీరు

శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ • రాజేంద్రనగర్‌లో తాగునీటి రిజర్వాయర్లు ప్రారంభం

రాజేంద్రనగర్: ఔటర్ రింగ్‌రోడ్ లోపలి గ్రామాలకు త్వరలోనే తాగునీటి కష్టాలు తీరనున్నాయని శాసనమండలి చైర్మన్ కే స్వామిగౌడ్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో రూ.314 కోట్ల జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం నిధులతో నిర్మించిన 22 మిలియన్ లీటర్ల మంచినీటి రిజర్వాయర్లను ఎమ్మెల్యే టీ ప్రకాశ్‌గౌడ్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదన్నారు. నగర ప్రజలకు నిత్యం తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికాబద్ధంగా రిజర్వాయర్లను నిర్మించిందని చెప్పారు. మిషన్ భగీరథ పథకంతో ప్రతి ఇంటికీ నల్లా ద్వారా తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శాస్త్రీపురంలో 9 మిలియన్ లీటర్లు, బుద్వేల్లో 6 మిలియన్ లీటర్లు, డెయిరీఫాంలో గోల్డెన్ హైట్స్‌లో 5 మిలియన్ లీటర్లు, సులేమాన్‌నగర్‌లో 2 మిలియన్ లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లను నిర్మించడం ఈ ప్రాంతవాసుల అదృష్టమన్నారు. కేటీఆర్ మున్సిపల్‌శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక గ్రేటర్‌లో రూ.వేల కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గానికి తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కోరగా అందుకు అనుమతినిచ్చారన్నారు. దీంతో నేడు 22 మిలియన్ లీటర్ల రిజర్వాయర్లు నిర్మించి ప్రారంభించుకున్నామని చెప్పారు. ఈ రిజర్వాయర్లతో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని తొంబై శాతం బస్తీలకు పుష్కలంగా తాగునీరు అందుతుందన్నారు. మైలార్‌దేవ్‌పల్లి మధుభన్‌కాలనీలో నిర్మిస్తున్న రిజర్వాయర్‌తో సర్కిల్‌లోని ప్రతీ బస్తీకి తాగునీరు అందుతుందన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో హైఅలర్ట్

పంద్రాగస్టు సందర్భంగా పటిష్ట నిఘా • విజిటర్స్ పాసులపై 20వ తేదీ వరకు ఆంక్షలు



శంషాబాద్: శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో హైఅలర్ట్ ప్రకటించారు. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) ఆదేశాల మేరకు విజిటర్స్ ప్రవేశ పాసులపై ఆంక్షలు విధించినట్టు జీఎంఆర్ కార్పొరేట్ కమ్యూనికేషన్ వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. మంగళవారం నుంచి ఈ నెల 20వ తేదీవరకు ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. డొమెస్టిక్ ప్రయాణికులు రెండు గంటల ముందు, ఇంటర్నేషనల్ ప్రయాణికులు మూడు గంటల ముందు ఎయిర్‌పోర్టుకు చేరుకొని తనిఖీలు, ఇతర భద్రతాపరమైన అంశాల్లో సహకరించాలని కోరారు. దీంతోపాటు ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ నేపథ్యంలో ఐబీ హెచ్చరికలతో ఎయిర్‌పోర్టు, దాని పరిసరాల్లో నిఘా, భద్రతలను కట్టుదిట్టం చేశారు. రైల్వేస్టేషన్, ఎయిర్‌పోర్టు తదితర జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సీఐఎస్‌ఎఫ్, ఆక్టోపస్, రాష్ట్ర పోలీసులు, డాగ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లుచేసినట్టు స్థానిక పోలీసులు తెలిపారు.



డ్రగ్స్‌పై అవగాహన సదస్సులు

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ తెలిపారు. డ్రగ్స్‌కు అలవాటై దానికి బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్న తీరుతెన్నులపై అవగాహన కల్పించాల్సి ఉన్నదన్నారు. ఇందుకోసం విద్యార్థులతో ర్యాలీలు చేపట్టి ప్రతిజ్ఞ చేయించాలని అభిప్రాయపడ్డారు. మత్తుకు బానిసలుగా మారొద్దు.. జీవితాన్ని నాశనం చేసుకోవద్దు..అనే నినాదంతో ప్రభుత్వం రూపొందించిన పోస్టర్లతో ప్రచారం చేయాలని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అకున్ సబర్వాల్ పేర్కొన్నారు. మొదటివిడుతగా జూలైలో 108 విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు ఏర్పాటుచేశామని చెప్పారు. ఈ నెలలో 198 విద్యా సంస్థల్లో సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ నెలలో అవగాహన కల్పించే విద్యాసంస్థల్లో 142 కళాశాలలు, 56 పాఠశాలలు ఉన్నాయి. హెరాయిన్, కొకైన్, చరాస్, ఎల్‌ఎస్‌డీ, ఎండీఎంఏ, డీఎంటీ, కెటామైన్ అనర్థాలకు దారితీస్తాయన్నారు.

లాటరీలో మీకు కారొచ్చింది!

ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.82 వేలు కాజేసిన సైబర్ చీటర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: 'సర్.. మేం అమేజింగ్ డీల్స్ నుంచి మాట్లాడుతున్నాం. డ్రీం గోల్డ్ కాంటెస్ట్‌లో మీరు సెకండ్ విన్నర్‌గా నిలిచారు. మీకు హ్యూందాయ్ క్రెటా కారు బహుమతిగా వచ్చింది. దాన్ని తీసుకోవాలంటే ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి' అంటూ సైబర్‌చీటర్లు ఓ యువకుడికి గాలం వేసి.. బెదిరించి రూ.82 వేలు కాజేశారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌కు చెందిన అభినవ్ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నారు. కొన్ని రోజుల కిందట ఓ వ్యక్తి ఫోన్‌చేసి అమేజింగ్ డీల్స్ మేనేజర్‌నని పరిచయం చేసుకున్నాడు. తాము గూగుల్ నుంచి ఫోన్‌నంబర్లు సేకరించి లాటరీ తీశామని, మీ నంబర్‌పై కారు గెలుచుకున్నారని చెప్పాడు. కారు రావాలంటే తమ వెబ్‌సైట్‌లో రెండు ఐడీలు క్రియేట్ చేసుకోవాలని, ఇందుకు రూ.25 వేలు చొప్పున ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని సూచించాడు. నిజంగానే తనకు లాటరీ తగిలిందని భావించిన అభినవ్ రూ.50 వేలు బ్యాంకులో జమ చేశాడు. నేరగాళ్లు తమ నకిలీ వెబ్‌సైట్‌లో ఐడీలు క్రియేట్ చేసి అభినవ్‌కు చూపించారు. తర్వాత ఇన్సూరెన్స్, కారు ట్యాక్స్‌ల కోసం రూ.2 లక్షలు చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. తాను డబ్బు చెల్లించలేనని, రూ.50 వేలు తిరిగి ఇచ్చేయాలని అభినవ్ కోరారు. కారు వద్దనుకుంటే కాంట్రాక్టు రద్దు చేసుకోవాల్సి ఉంటుందని, అందుకు రూ.32 వేలు తప్పనిసరిగా చెల్లించాలని నేరగాళ్లు దబాయించారు. డబ్బు చెల్లిస్తే సోనీ ఎల్‌ఈడీ టీవీని గిఫ్ట్‌గా ఇస్తామని, రూ.50 వేలు తిరిగి ఇస్తామని నమ్మబలికారు. వారు చెప్పింది నమ్మిన అభినవ్ రూ.32 వేలు చెల్లించాడు. ఆ తర్వాత అవతలి వ్యక్తులు ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేసుకోవడంతో మోసపోయానని గ్రహించి సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కల్నల్‌కు రూ.50 వేలు టోకరా

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఆన్‌లైన్‌లో ఏసీలు కొనేందుకు ప్రయత్నించిన ఓ ఆర్మీ కల్నల్‌కు సైబర్ మోసగాళ్లు రూ.50 వేలు టోకరా వేశారు. సికింద్రాబాద్‌లో నివాసం ఉంటున్న ఓ కల్నల్ నాలుగు ఏసీలు కొనుక్కునేందుకు ఈ-బే ఆన్‌లైన్ పోర్టల్‌లో వెతికారు. ఒక వెండర్‌కు సంబంధించిన ఆఫర్లు బాగుండడంతో ఆ వ్యాపారికి ఫోన్ చేశాడు. డబ్బులు పేటీఎం ద్వారా చెల్లించాలని ఆ వ్యాపారి నిబంధన పెట్టాడు. అడ్వాన్స్ చెల్లిస్తే ఏసీలను రెండు మూడు రోజుల్లో కల్నల్ స్వస్థలమైన చండీగఢ్‌లో డెలివరీ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కల్నల్ వారు చెప్పిన పేటీఎం ఖాతాలోకి రూ.50 వేలు బదిలీ చేశాడు. ఆ తర్వాత నుంచి అవతలి వ్యక్తులు ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేయడంతో తాను మోసపోయానని గుర్తించారు. వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు పేటీఎంలో జమ అయిన డబ్బు రెండు బ్యాంక్ ఖాతాల్లోకి బదిలీ చేసినట్టు గుర్తించారు. ఒక ఖాతా చెన్నైలో ఉండగా, మరొకటి బెంగళూరులో ఉన్నట్టు తేల్చారు. మరిన్ని వివరాల కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



కల్తీ కుర్‌కురే తయారీ కేంద్రం సీజ్

యంత్రాలు, సామగ్రి, ఇతర పదార్థాలు స్వాధీనం

శంషాబాద్: కల్తీ కుర్‌కురే, పాపడాల తయారీ కేంద్రంపై ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసి ఓ నిందితుడిని అరెస్ట్ చేయడంతోపాటు రూ.2 లక్షల విలువైన యంత్రాలు, సామగ్రి, పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్థావరాన్ని సీజ్ చేశారు. శంషాబాద్ జోన్ ఎస్‌వోటీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బేగంబజార్‌కు చెందిన మహ్మద్ ఇర్ఫాన్(35) కల్తీ పదార్థాలతో కుర్‌కురే, పాపడాల తయారీ స్థావరాన్ని శంషాబాద్ పరిధిలో ఏర్పాటు చేశాడు. నిబంధనలకు విరుద్ధంగా మైదా, ఇతర కెమికల్స్‌ను మిశ్రమంగా చేసి కుర్‌కురే, పాపడాలను తయారు చేసి సరఫరా చేస్తున్నాడు. లైసెన్స్ పహాడిషరీఫ్‌లో తీసుకుని శంషాబాద్‌లో అక్రమంగా స్థావరాన్ని నడుపుతున్నాడు. ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు కేంద్రంపై దాడి చేసి రూ.2 లక్షల విలువైన రెండు యంత్రాలు, మూడు కెమికల్ కలర్స్ డబ్బాలు, 115 ప్యాకెట్ల ముడిసరుకు స్వాధీనం చేసుకున్నారు. కేంద్రాన్ని సీజ్ నిందితుడు ఇర్ఫాన్‌ను అరెస్ట్ చేశారు.

ట్యాంక్‌బండ్‌కు నయా లుక్

లోయర్ ట్యాంక్‌బండ్‌లో హైరైజ్ భవనాల నిర్మాణం • కార్యాలయాలు, వాణిజ్యం, వినోదం, పార్కింగ్ సౌకర్యాలు

భవనాలనుంచి ట్యాంక్‌బండ్‌పైకి రాకపోకలకు అవకాశం • పీపీపీ పద్ధతిలో చేపట్టేందుకు ప్రతిపాదనలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:



హైరైజ్ భవనాల ఊహాచిత్రం

ట్యాంక్‌బండ్‌కు నయాలుక్ తీసుకొచ్చేందుకు జీహెచ్‌ఎంసీ ప్రయత్నిస్తున్నది. హైదరాబాద్ విశ్వనగరంగా మారుతున్న తరుణంలో దీనికి అనుగుణంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లో 'హైరైజ్' భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. వినోదం, వాణిజ్యం, కార్యాలయాలు, పార్కింగ్ తదితర సౌకర్యాలన్నీ ఉండేలా భవనాలను డిజైన్ చేస్తున్నారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ ఆకాశహర్మ్యాలు నిర్మించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ట్యాంక్‌బండ్ ప్రాంతాన్ని ప్రధాన వినోద, వాణిజ్య పరంగా తీర్చిదిద్దాలనే ప్రతిపాదన కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. ఈ క్రమంలోనే తెలుగుతల్లి ఫ్లైఓవర్ కింద గల అంబేద్కర్ విగ్రహం నుంచి సికింద్రాబాద్‌లోని సిటీలైట్ హోటల్ వద్దగల రైల్వే వంతెన వరకు రోడ్డును 100 అడుగులకు విస్తరించాలని నిర్ణయించారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో ప్రస్తుతం చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్ కొనసాగుతున్న ప్రాంతంతో పాటు ఇరువైపులా గల ఖాళీ స్థలంలో హైరైజ్ భవనాలు నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ భవనాలనుంచి ట్యాంక్‌బండ్‌పైకి వచ్చిపోయేలా మార్గాన్ని ఏర్పాటుచేయాలని కూడా నిర్ణయించారు. ఆ మార్గాన్ని అంబేద్కర్ విగ్రహం నుంచి ఏర్పాటు చేయనున్న 100 అడుగుల రోడ్డుకు అనుసంధానించనున్నారు. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో పనులు చేపట్టాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఈ మేరకు ప్రాజెక్టు సమగ్ర నివేదిక తయారీలో అధికారులు నిమగ్నమయ్యారు.

బహుళ ప్రయోజనకర భవనాలు

హైరైజ్ భవనాలను బహుళ ప్రయోజనకరంగా ఉండేలా నిర్మించనున్నారు. ట్యాంక్‌బండ్ ఎత్తు వరకు పార్కింగ్ కాంప్లెక్స్‌లు, ఆ పై భవనాలను కార్యాలయాలు, మాల్స్, వినోద కార్యకలాపాలకు ఉపయోగపడేలా డిజైన్ చేస్తున్నారు. ఈ భవనాలను ట్యాంక్‌బండ్‌తో అనుసంధానిస్తూ మార్గాలను ఏర్పాటు చేయనున్నారు. తాజాగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం లోయర్ ట్యాంక్‌బండ్ ప్రాంతంలోని టూరిస్ట్ హోటల్, స్నో వరల్డ్ భవనాలు మినహా మిగిలిన ఖాళీ స్థలంలో హైరైజ్ భవనాలు నిర్మించనున్నారు. గతంలో ఈ ప్రాంతంలో 15 అంతస్తుల భవనాన్ని నిర్మించి బల్దియా కార్యాలయాన్ని ఇక్కడికి తరలించాలని భావించారు. అయితే ఆ ప్రతిపాదన ముందుకు సాగలేదు. హైరైజ్ భవనాలు పూర్తయిన తర్వాత వీలైతే జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్ని కూడా ఇక్కడికి తరలించాలని, ప్రస్తుత భవనాన్ని వేరే అవసరాలకు ఉపయోగించాలని యోచిస్తున్నారు.

టీడీఆర్‌లకు గిరాకీ కల్పించేదిశగా..

ప్రైవేట్ వ్యక్తులు తమ భూమి అభివృద్ధి హక్కును డెవలపర్స్‌కు అప్పగించే ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) విధానానికి ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో విపరీతమైన గిరాకీ ఉండగా, హైదరాబాద్‌లో ఆ పరిస్థితి లేదు. దీంతో ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం భూములను సేకరించాల్సి వస్తున్నది. ప్రస్తుతమున్న భూసేకరణ నిబంధనల ప్రకారం నగరంలో రోడ్ల విస్తరణతో పాటు ప్రాజెక్టుల నిర్మాణానికి భారీగా నిధులు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో నగరంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా టీడీఆర్‌లకు డిమాండ్ కల్పించాలని జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్ణయించారు. హైరైజ్ భవనాలు, ఇతర ప్రాజెక్టుల నిర్మాణంలో డీటీఆర్‌లు ఉన్న డెవలపర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నారు. దీంతో నగరంలోని రోడ్ల విస్తరణ త్వరితగతిన పూర్తికావడమే కాకుండా హైరైజ్ భవనాల వల్ల డెవలపర్లకు భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఏర్పడుతుంది.

ప్రత్యేక ఆకర్షణగా ట్యాంక్‌బండ్



ట్యాంక్‌బండ్ ప్రాంతాన్ని ప్రధాన వినోద, వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించాం. ముందుగా లోయర్ ట్యాంక్‌బండ్ రోడ్డును సిటీలైట్ హోటల్ రైల్వే వంతెన వరకు 100 అడుగుల మేర విస్తరిస్తాం. తర్వాత లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఖాళీ స్థలంలో హైరైజ్ భవనాలు నిర్మిస్తాం. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో డీపీఆర్‌లు రూపొందుతున్నాయి. తర్వాత ప్రభుత్వం అనుమతి తీసుకొని టెండర్లు పిలుస్తాం. సాధ్యమైనంత త్వరగా పనులు చేపడుతాం. టీడీఆర్‌లకు ప్రాధాన్యం ఇస్తాం.

– బొంతు రామ్మోహన్, మేయర్

నకిలీ విత్తనాల తయారీదారుడిపై పీడీ యాక్ట్

గోపీకృష్ణ సీడ్స్ కంపెనీ యజమాని చిన్నం జానకీరాంపై ప్రయోగం



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నకిలీ విత్తనాలు తయారు చేసి రైతులను మోసం చేస్తున్న విత్తనాల తయారీ సంస్థ యజమానిపై రాచకొండ పోలీసులు మంగళవారం పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఇటీవల పీడీ యాక్ట్‌లో చేసిన మార్పులతో కొత్తగా రూపొందించుకున్న యాక్ట్‌ను గోపీకృష్ణ సీడ్స్ యజమాని చిన్నం జానకీరాంపై ప్రయోగించారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ ప్రాంతానికి చెందిన చిన్న జానకీరాం అలియాస్ గోపీకృష్ణ బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశాడు. 2004లో అతని తండ్రి ఏర్పాటు చేసిన గోపీకృష్ణ సీడ్స్ కంపెనీ నిర్వాహణ బాధ్యతలను చేపట్టాడు. అధిక లాభాలు రాబట్టాలనే దురాశతో నకిలీ విత్తనాలను తయారు చేయడం ప్రారంభించాడు. ఇందుకు సృష్టి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరు మీద ఇంద్ర, భీష్మ, బలరాం పేర్లతో నకిలీ సీడ్స్ తయారు చేసి రైతులకు విక్రయించాడు. వీటి విక్రయానికి ప్రత్యేకంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో ఏజెంట్లను నియమించుకుని దందా చేశాడు. గత జూన్ 27వ తేదీన హయత్‌నగర్ పోలీసులు గోపీకృష్ణ సీడ్స్ కంపెనీపై దాడి చేసినప్పుడు అధికారులకు ఈ విషయం తెలిసింది. ఇప్పటి వరకు చిన్నం జానకీరాంపై నకిలీ విత్తనాల తయారీకి సంబంధించి మొత్తం మూడు కేసులు నమోదయ్యాయి. గోపీకృష్ణ సీడ్స్ తయారు చేస్తున్న ఇంద్రా బీజీ-2 విత్తనాలను స్వాధీనం చేసుకుని అసిస్టెంట్ డైరక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ సీడ్ అనాలసిస్ట్ విశ్లేషించి ఓ రిపోర్ట్ ఇచ్చారు. ఆ నివేదిక ప్రకారం బీటీ స్టాండర్డ్ కు cry1ac, cry2ab లలో 90 శాతం ప్రొటీన్ ఉండాల్సి ఉంటుంది. కానీ ఈ విత్తనాల్లో ఆ స్టాండర్డ్ లేదని వ్యవసాయశాఖ అధికారులు, పోలీసులు తేల్చారు. కుట్రపూరితంగానే నకిలీ విత్తనాలు తయారుచేసి అమాయకులైన రైతులను మోసం చేస్తున్నాడని తేలింది. అతని చర్యల వల్ల రైతులు మోసపోవడంతో పాటు పంటలు చేతికి రాక ఆర్థికంగా చితికిపోతుండడంతో జానకీరాంపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు రాచకొండ పోలీసులు నకిలీ విత్తనాలు తయారు చేస్తున్న వ్యాపారి జానకీరాంపై పీడీ యాక్ట్ విధించి ఏడాదిపాటు జైలుకు పంపారు.

ఇబ్రహీంపట్నంలో కల్తీపాలు పట్టివేత

యాచారం నుంచి నగరానికి తరలిస్తున్న వ్యాపారి



ఇబ్రహీంపట్నం, నమస్తేతెలంగాణ: రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మొగుళ్లవంపు గ్రామానికి చెందిన కొందరు వ్యాపారులు కల్తీపాలను తయారుచేసి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో కల్తీ పాల తయారీ యథేచ్ఛగా సాగుతున్న నేపథ్యంలో మంగళవారం 'నమస్తే తెలంగాణ' టాబ్లాయిడ్‌లో ప్రచురితమైన 'ఆగని అక్రమ దందా' కథనానికి స్పందించిన ఇబ్రహీంపట్నం పోలీసులు పాల రవాణాపై కన్నేశారు. యాచారం మండలం మొగుళ్లవంపునకు చెందిన వ్యాపారి యాదగిరిరెడ్డి కల్తీ పాలు తయారు చేసి నగరానికి తరలిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై సీఐ స్వామి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలో భాగంగా హైదరాబాద్ వైపు పాలను తరలిస్తున్న ఆటో ఆపారు. పాలను పరిశీలించగా కల్తీగా తేలడంతో 280 కల్తీ పాలను స్వాధీనం చేసుకుని, నిందితుడు యాదగిరిరెడ్డి, ఆటోడ్రైవర్ మహేశ్‌ను రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఠాణాలో ఏసీపీ మల్లారెడ్డి మాట్లాడుతూ కల్తీపాల తయారీదారులు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకనుంచి ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల నుంచి నగరానికి తరలించే పాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

నైపుణ్యాభివృద్ధి @ న్యాక్

- ఇంజినీరింగ్‌లో ఉత్తమ శిక్షణకు కేరాఫ్‌గా న్యాక్
- విద్యార్థులను చేర్చేందుకు పోటీపడుతున్న కాలేజీలు
- కోర్సులపై ఆసక్తి చూపుతున్న యూనివర్సిటీలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నగరంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)ఇస్తున్న శిక్షణపై దేశంలోని పలు యూనివర్సిటీలతోపాటు ఇంజినీరింగ్ కాలేజీలు ఆసక్తి చూపుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన న్యాక్.. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని అత్యున్నత శిక్షణతో దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తున్నది. ఇక్కడి శిక్షణ పద్ధతులను పరిశీలించిన పలు ఇంజినీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీలు తమ విద్యార్థులను చేర్చేందుకు మొగ్గు చూపుతున్నాయి. ఇక్కడ శిక్షణ పొందితే దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతుండడంతో విద్యార్థులు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులను హైదరాబాద్‌లోని న్యాక్‌లో శిక్షణ పొందేందుకు పంపిస్తున్నాయి. ఇక్కడ శిక్షణ పొందుతున్నవారిని తమ సంస్థల్లో చేర్చుకునేందుకు ప్రముఖ కంపెనీలు కూడా తరలివస్తున్నాయి. దీంతో న్యాక్‌లో శిక్షణ పొందితే ఉద్యోగం ఖాయమనే భావన విద్యార్థుల్లో ఏర్పడి ఇక్కడి కోర్సులకు డిమాండ్ పెరుగుతున్నది. దీనికి తగ్గట్టే న్యాక్ సైతం ఎప్పటికప్పుడు తన శిక్షణ పద్ధతులను మెరుగుపరుచుకుంటున్నది. అదే సమయంలో విద్యార్థులకు ఉపయోగపడేలా నూతన కోర్సులను ప్రవేశపెడుతున్నది. ఇటీవలే జేఎన్‌టీయూ స్పాన్సర్‌షిప్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పాపారావు దీనిని ప్రారంభించారు. ఇప్పటికే బాసర ట్రిపుల్ ఐటీ, మేవార్ యూనివర్సిటీ, గీతం యూనివర్సిటీ, ఎస్సీ కార్పొరేషన్, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ డిపార్ట్‌మెంట్ ఎంపిక చేసిన ఇంజినీరింగ్ విద్యార్థులకు.. కన్‌స్ట్రక్షన్ ట్రేడ్స్‌తోపాటు ఆటో క్యాడ్, క్వాలిటీ కంట్రోల్ అండ్ సూపర్‌వైజరీ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ డిపార్ట్‌మెంట్, ట్రైకార్(ఏపీ) ద్వారా న్యాక్‌కు పంపిన 102 మంది విద్యార్థులకు 'కాంట్రాక్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం' కింద శిక్షణ ఇచ్చారు. అంతేకాకుండా ఏవీసీఆర్, వీఎస్‌ఐటీ కాలేజ్, లార్డ్స్, అయాన్, నవాబ్‌షా ఇంజినీరింగ్ కళాశాలతోపాటు గ్రామీణ పాలిటెక్నిక్, జేఎన్‌ఏ అండ్ ఎఫ్‌ఏయూ సంస్థలతోపాటు పలు కాలేజీల విద్యార్థులు న్యాక్‌లో శిక్షణ పొందారు. ఇక్కడ కోర్సు పూర్తి చేసుకున్నవారికి ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి.



న్యాక్‌లో కొత్త కోర్సును ప్రారంభిస్తున్న ప్రభుత్వ సలహాదారు పాపారావు

పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా

కోర్సు	స్పాన్సర్	ప్రస్తుతం శిక్షణలో	శిక్షణ పూర్తి
		(2017-18)	(2016-17)
పీజీడీసీఎం	జేఎన్‌టీయూ	38	40
పీజీడీక్యూఎస్‌సీఎం	జేఎన్‌టీయూ	22	0

మూడు నెలల ఫినిషింగ్ ప్రోగ్రాం

సంస్థ	శిక్షణ పూర్తి చేసుకున్నవారు
బాసర ట్రిపుల్ ఐటీ	11
ఎస్సీ కార్పొరేషన్	27
మేవార్ యూనివర్సిటీ	29

కాంట్రాక్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (2017-18)

స్పాన్సర్	అభ్యర్థులు
ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ డిపార్ట్‌మెంట్	73
ట్రైకార్(ఏపీ)	29

ఒక నెల ఫినిషింగ్ ప్రోగ్రాం

కాలేజీ/యూనివర్సిటీ	శిక్షణపొందినవారు	
	2017-18	2016-17
ఏవీసీఆర్ అండ్ వీఎస్‌ఐటీ ఇంజినీరింగ్ కాలేజీ	12	00
గీతం యూనివర్సిటీ	18	30
మేవార్ యూనివర్సిటీ	20	69
లార్డ్స్, అయాన్, నవాబ్‌షా ఇంజినీరింగ్ కాలేజీలు	40	56
నిజాం కాలేజీ	00	01
వీఐఎఫ్ కాలేజీ	00	02
గ్రామీణ పాలిటెక్నిక్ కాలేజీ	00	114
జేఎన్‌ఏ అండ్ ఎఫ్‌ఏయూ	00	51

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi
హైదరాబాద్
బుధవారం 9 ఆగస్టు 2017
WWW. NTNEWS.COM

ఓహో.. గులాబీ భామ



మనం రోజుకో కలర్ షర్ట్, ప్యాంట్ ధరిస్తాం. వాడిన కలర్ వస్తువులే మళ్లీ వాడాలంటే కొంచెం కష్టమే. మహా అయితే ఆర్నెల్లో, ఏడాదో నడిపిస్తాం. కానీ ఒకే రంగును దాదాపు 36 ఏళ్ల పాటు వాడుతూనే ఉంటే ఏమనాలి..?

కాలిఫోర్నియాలో నివసిస్తున్న 52 ఏళ్ల కిట్టెన్ కే సెరా మీట్.. పింక్ కలర్ లైఫ్‌ను అనుభవిస్తున్నది. దాదాపు 36 ఏళ్లుగా గులాబీ రంగు తప్ప మరో రంగును ఆమె వాడడం లేదు. తన కాలి గోళ్లకు వేసుకునే నెయిల్ పాలీష్ నుంచి జుట్టుకు పెట్టుకునే క్లిప్పుల వరకూ అంతా పింక్ కలరే. ఇక ఇల్లంటారా.. ఒంటికే అంత ప్రాధాన్యం ఇచ్చినప్పుడు ఇల్లును ఎలా వదిలిపెడుతుంది. కిట్టెన్ ఇంట్లో కనిపించే ప్రతి వస్తువూ గులాబీ రంగుదే అయి ఉండాల్సిందే. చివరికి తన కుక్కపిల్ల కూడా పింక్ కలరే. దీంతో 'వరల్డ్ పింకెస్ట్ ఉమన్'గా కిట్టెన్ పేరుగాంచింది. తను అనుభవించే పింక్ లైఫ్ ఖర్చు దాదాపు ఒక మిలియన్ వెయ్యి పౌండ్లు. 'పింక్ కలర్ నా బలహీనత అయిపోయింది. అది లేకుండా నేను ఉండలేకపోతున్నాను' అని చెబుతున్నది కిట్టెన్. చివరికి భోజనాన్ని కూడా పింక్ కలర్‌లోనే వండుకోవడం, తీసుకునే పానియాలు కూడా అదే రంగులో ఉండడం, జుట్టుకూ గులాబీరంగు వేయడంతో.. కిట్టెన్‌కు గులాబీ పిచ్చిపట్టిందని కొందరంటుంటే.. మరికొందరు అలా జీవించడం చాలా గ్రేట్ అంటున్నారు.

ఇది డేంగ్యూ జ్వరమా?




నా వయసు 24 సంవత్సరాలు, ఈ మధ్య నేను మా ఊరు వెళ్లి వచ్చాను. తెల్లవారి నుంచి జ్వరం వస్తూ పోతున్నది. ఊర్లో చాలా మందికి డెంగ్యూ జ్వరం వస్తున్నట్టు అమ్మ చెప్పింది. డెంగ్యూ జ్వరం లక్షణాలు ఎలా ఉంటాయి. ఎలాంటి చికిత్స అవసరమవుతుందో చెప్పగలరు.

ప్రవీణ్, హైదరాబాద్

ముందుగా మీకు వచ్చిన జ్వరం ఎలాంటిదో నిర్ధారణ చెయ్యాల్సి ఉంటుంది. డెంగ్యూ జ్వరాన్ని నిర్ధారించడానికి డెంగ్యూ సీరాలజీ, డెంగ్యూ ఐజీజి, ఐజీఎం అనే పరీక్షలు అవసరమవుతాయి. అయితే ఫలితాలు రావడానికి 4-6 రోజుల సమయం పడుతుంది. కాబట్టి లక్షణాలను బట్టి ముందుగానే చికిత్స ప్రారంభించడం మంచిది. బ్లడ్ ప్లేట్‌లెట్ కౌంట్ పరీక్షలు ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ అవి తగ్గిపోకుండా చూసుకోవాలి. డెంగ్యూ జ్వరానికి ప్రత్యేక మందులు లేవు. కాబట్టి లక్షణాలు తగ్గించేందుకు మాత్రమే మందులు ఇస్తారు. చికిత్స కంటే నివారణ మేలు వీలైనంత వరకు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం, దోమలు వృద్ధి కాకుండా జాగ్రత్తలు తీసుకుంటే డెంగ్యూ రాకుండా నివారించడం సాధ్యమే. ఒక్కోసారి మలేరియా కూడా డెంగ్యూ మాదిరిగానే అనిపిస్తుంది. కాబట్టి మీకు వస్తున్న జ్వరం ఎలాంటిదో ముందుగా నిర్ధారించుకోవడం అవసరం. చర్మం మీద మచ్చలు కనిపించడం, జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి డెంగ్యూ లక్షణాలుగా చెప్పవచ్చు. జ్వరం తరచుగా వస్తున్నట్టు చెబుతున్నారు కాబట్టి వీలైనంత త్వరగా మీకు దగ్గరలో ఉన్న డాక్టర్‌ను సంప్రదించి చికిత్స ప్రారంభించడం అవసరం.

డాక్టర్ గోవర్ధన్
కన్సల్టెంట్ ఫిజీషియన్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్





అమ్మో...!
ఇంత పైనుంచి చూస్తే
నాకు భయం, కళ్లు తిరుగుతాయి..

★ ★ ★

అబ్బా..! ఊపిరి సలుపడం లేదు ఇంత ఇరుకులో ఎలా? ఇక్కడ ఉండడం నా వల్ల కాదు..

★ ★ ★

ఇప్పుడు ఈ ఫంక్షన్‌కు వెళ్లకపోతే ఏమి..?
అక్కడ ఎంత మంది జనాలో..
తప్పించుకుంటే బెటర్..

★ ★ ★

బీచ్‌కా..! నా వల్ల కాదు ఎన్ని నీళ్లో ...!
నీళ్లంటే నాకు భయం..

దుప్పట్లో మిన్నాగు

ఫోబియా



పైన చెప్పినట్లు రకరకాలుగా భయపడే వ్యక్తుల్ని మనం నిత్యం చూస్తూనే ఉంటాం. పిల్లి పేరెత్తితేనే ఠారెత్తిపోయే వ్యక్తి పిల్లితో ఒకే గదిలో ఉండాల్సి వస్తే ఏమైపోతాడు? ఒకసారి ఆలోచించండి? నాలుగు గోడల మధ్య ఉండడానికి భయపడే వ్యక్తిని 70 రోజుల పాటు నాలుగు గోడల మధ్య ఉండాల్సిందే అంటే ఎలా ఉండగలడు? బిగ్ బాస్ షోలో పాల్గొనేందుకు వెళ్లిన సంపూర్ణేష్ బాబుకు అదే జరిగింది. పరిమిత స్థలంలో ఉండాలంటే తన వల్ల కాదని షో నుంచి బయటకు వచ్చేస్తూ ఆయనే అన్నారు. ఇలా పరిమిత స్థలంలో ఉండేందుకు భయపడడాన్ని క్లస్ట్రో ఫోబియా అంటారు. సంపూర్ణేష్ బాబు బహిరంగంగా చెప్పారు కాబట్టి తెలిసింది. సమాజంలో చాలామంది ఒప్పుకోరు కానీ ఇలాంటి రకరకాల భయాలతో బాధపడుతుంటారు. భయం అనడం కంటే కూడా భయాన్ని మించిన ఫోబియాతో భయపడే వారు కోకొల్లలు.

భయం చాలా సాధారణమైన స్థితి. కానీ కొందరు కొన్ని ప్రత్యేక సందర్భాలను అస్సలు భరించలేరు. విపరీతమైన ఆందోళనకు లోనవుతారు. ఇలాంటి స్థితిని ఫోబియాగా చెప్పుకోవచ్చు. ఇవి చాలా వరకు పసితనంలోనే ఏర్పడుతాయి. ఇలా ఏర్పడిన ఫోబియాలను వయసు పెరిగే కొద్దీ అధిగమించేస్తుంటారు చాలామంది. కానీ కొంతమంది మాత్రం వాటి నుంచి బయటపడలేరు. ఇలాంటి వారు చాలా తక్కువ మందే ఉంటారు. మన సమాజంలో ఏదో ఒకరకమైన ఫోబియాతో బాధ పడుతున్న పెద్ద వారు దాదాపు 4-8 శాతం వరకు ఉంటారని నిపుణుల అంచనా.

ఒక రకమైన ఆందోళనే : ఫోబియాను కూడా ఆందోళనగానే చెప్పుకోవచ్చు. కానీ, ఆందోళన అంటే యాంగ్జైటీ. ఇదొక సైకలాజికల్ డిజార్డర్. ఎందుకు కలుగుతుందో ప్రత్యేకంగా కారణాలు చెప్పలేం. కూర్చున్న వాళ్లు కూర్చునట్టే అకస్మాత్తుగా ఆందోళనకు లోనవుతారు. కానీ ఫోబియాలో అలా కాదు. దేని కోసం వారికి ఆందోళన కలుగుతున్నదో కారణం తెలుసు. అందువల్ల సాధారణంగా ఫోబియాతో బాధపడే వ్యక్తులు తమకు ఆందోళన కలిగించే పరిస్థితులు ఎదురుకాకుండా తప్పించుకు తిరుగుతుంటారు.

అభివృద్ధికి ఆటంకం: కొందరిలో ఈ ఫోబియా చాలా ఎక్కువగా ఉంటుంది. అది వారి పూర్తి జీవన విధానాన్ని మార్చేస్తుంది. అభివృద్ధికి ఆటంకంగా పరిణమిస్తుంది. జీవితం ఆ పరిమితుల్లోనే ఉండిపోతుంది. ఉదాహరణకు తరుచుగా ప్రయాణాలు చెయ్యాల్సి ఉన్న వృత్తిలోనో, వ్యాపారంలోనో ఉన్న వ్యక్తికి పరిమిత స్థలాలంటే భయం అని చెప్పి విమాన ప్రయాణాన్ని తప్పించుకోవాలనుకుంటే అతడి అభివృద్ధి ఎలా సాధ్యం? పూర్తిగా మూసి ఉండే లిఫ్ట్‌లో ఎక్కడానికి భయపడే వ్యక్తి ఆఫీస్ బహుళ అంతస్తుల భవనంలో ఉంటే పరిస్థితి ఏమవుతుంది? ఫోబియాతో బాధపడేవారు తమకు ఆందోళన కలిగించే సందర్భాలను అస్సలు ఎదుర్కొలేరు. విపరీతమైన ఆందోళనను తట్టుకోలేక స్పృహ తప్పడం వరకు వెళ్తారు కూడా.

అసలెందుకు ఈ ఫోబియా : ఫోబియా ఏర్పడేందుకు రకరకాల కారణాలు ఉంటాయి. అది పసితనంలో వారి మనసు మీద వేసిన ముద్ర కావచ్చు. వంశపారంపర్యంగా కూడా కావచ్చు. అంటే దగ్గరి రక్త సంబంధీకుల్లో ఫోబియా ఉంటే అది తర్వాత తరంలో వారికి రావచ్చు. పరిసరాల ప్రభావం కావచ్చు. ఒక్కోసారి ఏదైనా విషయానికి ఎవరైనా తీవ్రంగా భయపడడం చూసి కూడా ఆ విషయం పట్ల భయం ఏర్పడవచ్చు. ఉదాహరణకు తల్లికి బొద్దింకంటే ఫోబియా ఉండి బొద్దింక కనిపించిన ప్రతిసారీ భయంతో వణికిపోవడం గమనించిన పాపాయికి కూడా బొద్దింకంటే భయం ఏర్పడవచ్చు. ఆది ఫోబియాగా మారొచ్చు.



క్లస్ట్రోఫోబియా : ఇరుకు స్థలాలంటే భయం.
అగరోఫోబియా : విశాలంగా కనిపించే స్థలాలంటే భయం, లేదా ఇంటికి దూరంగా ఉండడమంటే భయం.
గ్లోసోఫోబియా : దీన్ని స్టేజ్ ఫియర్‌గా చెప్పుకోవచ్చు. కానీ చాలా ఎక్కువగా ఉంటుంది.
ఆక్రోఫోబియా : ఎత్తైన ప్రదేశాలంటే భయం.
ఎవియోఫోబియా : ఎగురడం అంటే భయం.
డెంటోఫోబియా : డెంటిస్ట్‌ను కలువడమన్నా, దంతాలకు చికిత్స తీసుకోవడమన్నా భయం.
హీమోఫోబియా : రక్తం చూస్తే భయం.
సయనో ఫోబియా : కుక్కలంటే భయం.
ఓఫిడియోఫోబియా : పాములంటే భయం.
నెక్టోఫోబియా : చీకటంటే భయం.
అక్వా ఫోబియా : నీళ్లంటే భయం.
ఇవి కొన్ని మాత్రమే. నిజానికి చాలా రకాల ఫోబియాలు మనుషులను బయపెడుతున్నాయి.

భయానికి, ఫోబియాకి తేడా: చిన్న ఆందోళనను భయం అనుకుంటే, అదే ఆందోళన చాలా ఎక్కువగా నిలువలేనంత, భరించలేనంత ఉండడాన్ని ఫోబియాగా చెప్పుకోవచ్చు. ఫోబియా స్థితి ఎదురుకాగానే నాలుక తడి ఆరిపోవడం, చేతుల్లో చిన్నగా వణుకు రావడం, అక్కడి నుంచి ఎలాగైనా పారిపోవాలని అనిపించడం, చాలా అరుదుగా కొంత మందిలో భ్రమలు ఏర్పడడం, స్కిజోఫినిక్‌గా మారడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఇలాంటి వారు ఒక్కోసారి హింసకు కూడా పాల్పడవచ్చు. సమస్య తీవ్రతను బట్టి లక్షణాలు ఉంటాయి. కానీ ఫోబియాతో బాధపడుతున్న వారిలో మనం సాధారణంగా గమనించే లక్షణం ఏమిటంటే వాస్తవాన్ని గుర్తించేందుకు సిద్ధంగా లేకపోవడం.

అతి సాధారణమే ఇది! : దాదాపుగా అన్ని వేదికల మీద పోడియం ఉంటుంది. ఎందుకుంటుందో ఎప్పుడైనా ఆలోచించారా? ఎందుకంటే వేదిక మీద నలుగురిని ఉద్దేశించి మాట్లాడడమంటే దాదాపు అందరికీ భయంగానే ఉంటుంది. చాలా తక్కువ మందికి మాత్రమే ఇలా భయం లేకుండా వేదిక మీద ప్రవర్తించే కళ తెలిసి ఉంటుంది. పోడియం ఇలా భయపడే వ్యక్తులకు సపోర్టుగా ఉండడం కోసం ఏర్పాటు చేస్తారు. భయం వల్ల శరీర కదలికల్లో వచ్చే మార్పులు పోడియం చాటున ప్రేక్షకులకు కనిపించకుండా దాచెయ్యడం కోసమే దాన్ని ఏర్పాటు చేస్తారు. ఫోబియాలు చాలా రకాలుగా ఉన్నాయి. కానీ ఇందులో ఎక్కువ కనిపించేది సోషల్ ఫోబియా. అంటే నలుగురిలో కలువడమంటే భయం. ఈ రకమైన భయం చాలా మందికి ఉంటుంది. ఇలాంటి వారు చిన్నచిన్న జనసమూహాలలో సైతం కలువలేరు. ఒంటరిగా ఉండేందుకు లేదా తమకు తెలిసిన వారితో మాత్రమే ఉండేందుకు ప్రాధాన్యం ఇస్తారు. తన గురించి ఎవరేమనుకుంటారో అనే భయం వీరిని వెంటాడుతుంటుంది. నలుగురు వింటుండగా మాట్లాడడం, భోంచెయ్యడం వంటి సాధారణ పనులు కూడా చెయ్యలేరు. ఇక నలుగురిని ఉద్దేశించి మాట్లాడడమైతే అస్సలు వీరికి సాధ్యపడదు.

- హెల్త్ డెస్క్

ఫోబియా ఇలా ఉంటుంది..



ఏదో రకమైన భయం లేని వారు ఎవరూ ఉండరు కానీ, కొంత మందిలో లాజిక్‌కు అందని భయాలు తీవ్రంగా ఉంటాయి. భయం కలిగించే సందర్భాలు ఎదురైనపుడు గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస వేగం పెరుగడం, తత్తరపడడం, నోరు తడి ఆరిపోవడం, స్టమక్ అప్‌సెట్, వికారంగా ఉండడం, బీపీ పెరిగిపోవడం, వణుకు రావడం, గొంతులో ఏదో అడ్డు పడుతున్నట్టు అనిపించడం, కళ్లు తిరుగడం, చెమటలు పట్టడం, స్పృహ కోల్పోతున్నట్టు అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఎంత తీవ్రమైన పరిణామాలు ఉంటాయంటే క్లస్ట్రోఫోబియా వల్ల విమాన ప్రయాణాలకు పూర్తిగా దూరంగా ఉండే వారు నా అనుభవంలో తెలుసు. ఇలాంటి వారికి తప్పనిసరిగా చికిత్స అవసరం. సంపూర్ణేష్ బాబు విషయాన్నే తీసుకుంటే అక్కడ అతడు ఉన్న ఇల్లు చాలా పెద్దది. ఎన్నో గదులున్న విశాల భవంతి కానీ అతడికి అది ఇరుకుగా అనిపించింది. అంటే కేవలం ఈ పరిమిత ప్రదేశంలోనే ఉండాలన్న భావన అతడికి భయాన్ని కలిగించింది తప్ప నిజానికి ఊపిరాడని పరిస్థితి అక్కడ లేదు. ఆ విషయం అతడికి కూడా స్పష్టంగా తెలుసు, అయినా ఉండలేకపోయాడు. ఫోబియా అలా ఉంటుంది. సమస్య తీవ్రస్థాయిలో ఉన్నపుడు నిపుణుల సహాయం తీసుకోవడమే మంచిది. కొంత మందికి మందులు, కౌన్సెలింగ్ కూడా అవసరం కావచ్చు. కీటకాలకు భయపడే వారు ఇతర పరిస్థితులకు భయపడే వారు నెమ్మది నెమ్మదిగా, తరుచుగా అలాంటి పరిస్థితులను కల్పించుకొని భయాన్ని అధిగమించేందుకు ప్రయత్నించాలి. ఉదాహరణకు బొద్దింకను చూస్తే భయం కలిగే వారు బొద్దింక మీద ఒక గాజు గ్లాసు బోర్లించి దాన్ని చూస్తూ గడుపడం వంటివి చెయ్యడం ద్వారా భయాన్ని అధిగమించవచ్చు. ఏ రకమైన ఫోబియా అయినా అధిగమించలేనంత పెద్దది మాత్రం కాదు.

డాక్టర్ ఎం. ఎస్. రెడ్డి
డైరెక్టర్
ఆశ హాస్పిటల్స్
హైదరాబాద్



టాకీస్

అదే నేను సంపాదించుకున్న గొప్ప అవార్డ్!

'క్లాస్, మాస్ సినిమాలనే తేడాలేవి నాకు లేవు. కథకు అవసరమైన సంగీతాన్ని అందించడానికే ప్రాధాన్యతనిస్తాను' అని అన్నారు దేవిశ్రీప్రసాద్. విలక్షణ స్వరకర్తగా తెలుగు సినీ సంగీత ప్రపంచంలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారాయన. జనరంజకమైన బాణీలతో రాక్‌స్టార్‌గా సంగీతప్రియుల నీరాజనాలందుకుంటున్నారు. ఆయన సంగీతాన్నందించిన తాజా చిత్రం 'జయ జానకి నాయక'. బోయపాటి శ్రీను దర్శకుడు. ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో దేవిశ్రీప్రసాద్ పాత్రికేయులతో ముచ్చటించిన విశేషాలివి...



దేవిశ్రీప్రసాద్

- **'జయజానకి నాయక'లో సంగీతానికి ఎంతవరకు ప్రాధాన్యముంటుంది. ?**

బోయపాటితో నా కాంబినేషన్‌లో వచ్చిన ప్రతి సినిమాలో పాటలు నేపథ్య సంగీతానికి మంచి పేరు వచ్చింది. సాధారణంగా ఆయన సినిమాల్లో కథా పరిధి ఎక్కువగా ఉంటుంది. అలాంటి కథల్లో నేపథ్య సంగీతం కీలకభూమిక పోషిస్తుంది. అందమైన ప్రేమకథకు తన పంథాలోనే మాస్, కమర్షియల్ హంగుల మేళవింపుతో ఈ కథను సిద్ధం చేశారు బోయపాటి శ్రీను. పాటలు, పోరాట ఘట్టాలు కూడా భావోద్వేగాలతో ముడిపడి ఉంటాయి.

- **బోయపాటి శ్రీను ఎక్కువగా మాస్ సినిమాలు చేశారు. ఆయన ప్రేమకథను వినిపించగానే ఏమనిపించింది?**

చాలా రోజుల క్రితమే ఆయన ఈ కథను వినిపించారు. మాస్ సినిమాలు చేస్తూ వచ్చిన ఆయన ఓ ప్రేమకథను వినిపించగానే సర్‌ప్రైజ్ అయ్యాను.

- **టైటిల్ ఈ కథకు ఎంతవరకు సరిపోతుందని అనుకుంటున్నారు?**

ప్రస్తుతం ప్రేక్షకుల ధోరణి మారింది. కొత్తదనాన్ని వారు కోరుకుంటున్నారు.'అత్తారింటికి దారేది' సమయంలో త్రివిక్రమ్ ఫోన్ చేసి టైటిల్ ఎలా ఉంది అని అడిగారు. పవన్ ఇమేజ్‌కు ఆ టైటిల్ ఏంటి? సరిపోతుందా అనుకున్నాను. కానీ అందులో తెలియని అందమేదో ఉందనిపించింది. ఆ తర్వాత అదే ట్రెండ్‌గా మారింది. 'శ్రీమంతుడు' సమయంలో కొరటాల శివ టైటిల్ గురించి చెప్పినప్పుడు మహేష్ స్టార్‌డమ్‌కు అది సరైనదేనా అనుకున్నాను. కానీ రెండుసార్లు వినగానే అందరికి నచ్చింది. వాటిలాగే ఈ సినిమా పేరు కూడా మెప్పిస్తుందనే నమ్మకముంది. కథకు సరిపోయే టైటిల్ ఇది.

- **మాస్ కథలకు సంగీతం సమకూర్చడం సంగీత దర్శకులకు ఎంతవరకు ఛాలెంజింగ్‌గా వుంటుంది?**

మాస్, క్లాస్ అనే తేడాలేవి నాకు లేవు. మన జీవితం ఒక్కో రోజు ఒక్కో విధంగా గడుస్తుంది. ఓ రోజు గర్ల్ ఫ్రెండ్, స్నేహితులు, కుటుంబ సభ్యులతో సంతోషంగా, క్లాస్‌గా గడిచిపోతుంది. మరోరోజు హడావిడిగా ట్రాఫిక్‌లో ఇబ్బందులు పడుతూ ఇతరులపై చిరాకు పడుతూ వెళుతుంది. అదే విధంగా సినిమాల విషయంలో కథకు ఎలాంటి సంగీతం కావాలనేది మాత్రమే చూస్తాను. కథ చెప్పినపుడే ఎక్కడ ఏ పాట ఉండాలో తెలిసిపోతుంది.

- **సుకుమార్, వినాయక్‌తో పాటు చాలా మంది అగ్ర దర్శకులతో మీకు మంచి సాన్నిహిత్యముంది? కథల విషయంలో వారికి సలహాలు ఇస్తుంటారా?**

ప్రతి దర్శకుడు నన్ను నమ్మి కథ చెబుతారు. నా జడ్జిమెంట్‌పై అందరికి నమ్మకం ఎక్కువ. అదే నేను సంపాదించుకున్న గొప్ప అవార్డుగా భావిస్తున్నాను. సుకుమార్, బోయపాటి శ్రీను, త్రివిక్రమ్... అందరూ మీరు మంచి శ్రోత అని చెబుతుంటారు. వినడం కూడా ఓ కళే అని అంటుంటారు.

- **పాటల విషయంలో దర్శకుల సలహాల్ని పాటిస్తారా? మీ స్వంత నిర్ణయాలను అనుసరిస్తారా ?**

సాధారణంగా దర్శకులు కథలను సిద్ధం చేసినప్పుడే పాటల స్థానాన్ని నిర్ణయిస్తుంటారు. కొన్ని సార్లు నేను సందర్భానుసారం ఎక్కడ పాటలు ఉంటే బాగుంటాయో చెబుతుంటాను. నా దృష్టిలో అవసరమైన చోట పాట పెట్టడం ఎంత ముఖ్యమో, అనవసరమైన చోట పాట రాకుండా చూడటం అంతే ముఖ్యం.

- **చిన్న సినిమాలకు దూరంగా ఉంటున్నారెందుకని?**

కుమారి 21ఎఫ్, నేను లోకల్ చిన్న సినిమాలే. వాటికి పనిచేశాను. నా దృష్టిలో చిన్న, పెద్దా అనే భేదాలేవి లేవు. రెండింటిని ఒకేలా భావించి కష్టపడతాను.

- **పాటలు రాయాలనే స్ఫూర్తి మీకు ఎక్కడ నుంచి వచ్చింది?**

ప్రత్యేకంగా పాటలు రాయాలని నేనెప్పుడు అనుకోలేదు. అనుకోకుండా అలా చేయాల్సివచ్చింది. ' ఖైదీ నంబర్ 150'లో అమ్మడు కుమ్ముడు' పల్లవి పూర్తిచేసిన తర్వాత చరణాల్ని వేరే వారితో రాయించాలని ప్రయత్నించాను. కానీ కుదరలేదు. దాంతో వేరే దారి లేక 45 నిమిషాల్లో ఆ పాట పూర్తిచేశాను. చిరంజీవి ఆ పాట విని ఇరగదీశావ్ అన్నారు. సింగిల్స్ ట్రెండ్ ఆ పాటతోనే మొదలైంది. నా ఆలోచన నచ్చి చిరంజీవి ప్రోత్సహించారు.



వైభవి, ఆది

తరువాత నువ్వే!

ఆది కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి 'నెక్ట్స్ నువ్వే' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. పి. ప్రభాకర్ దర్శకుడు. వైభవి, రష్మీ కథానాయికలుగా నటిస్తున్నారు. వి4 మూవీస్ పతాకంపై బన్ని వాసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను ఇటీవల విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'హిలేరియస్ కామెడీ థ్రిల్లర్‌గా సరికొత్త నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రమిది. ఈ సినిమా ద్వారా బుల్లితెరపై మంచి విజయాల్ని సొంతం చేసుకున్న ప్రభాకర్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తున్నాం. కాన్సెప్ట్ ప్రధానంగా సాగుతుంది. ఆది పాత్ర చిత్రణ కొత్తగా వుంటుంది. ఆయన కెరీర్‌లోనే విభిన్నమైన సినిమా అవుతుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి చిత్రాన్ని విజయదశమికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. అవసరాల శ్రీనివాస్, బ్రహ్మాజీ, జయప్రకాష్‌రెడ్డి, పృథ్వీ, ఎల్.బి.శ్రీరామ్, రఘుబాబు, పోసాని కృష్ణమురళి తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి పాటలు: కె.కె.సాగర్, ఛాయాగ్రహణం: కార్తిక్ పళని.

బంగారి-బాలరాజు ప్రేమకథ!



దర్శకుడు కోలేంద్రకు స్క్రిప్ట్ అందజేస్తున్న కృష్ణారెడ్డి

నూతన తారలను పరిచయం చేస్తూ కోలేంద్ర దుద్యాల రూపొందిస్తున్న 'బంగారి బాలరాజు' చిత్రం ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. కె.ఎం.డి. రఫీ నిర్మిస్తున్నారు. పూజాకార్యక్రమాల అనంతరం చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు సాగర్ క్లాప్ నివ్వగా, యువ హీరో నాగ్ అన్వేష్ కెమెరా స్విఛాన్ చేశారు. నిర్మాత 'సింధూర పువ్వు' కృష్ణారెడ్డి స్క్రిప్ట్ అందించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'దశాబ్దాలు మారినా ప్రేమ మారదు కానీ ప్రేమికులు మాత్రమే మారుతుంటారు. చరిత్రలో రోమియో-జూలియట్, సలీం-అనార్కలీ, దేవదాసు-పార్వతి, లైలా-మజ్ను తమ ప్రేమను త్యాగం చేసి చరిత్రలో నిలిచిపోయారు. వీరిలాగే బంగారి-బాలరాజు తమ ప్రేమను త్యాగం చేశారా? లేక తమ ప్రేమను సఫలం చేసుకుని చరిత్ర సృష్టించారా అనేదే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. ప్రేమకథా చిత్రాలకు పూర్తి భిన్నంగా సాగుతుంది' అన్నారు. రోహిణి, అజయ్ ఘోష్, అప్పారావు, లేఖన, ఆర్.పి, మహేంద్రనాథ్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: చిన్నికృష్ణ, చిట్టిబాబు ఎడ్డిపోగు, కెమెరా: బాబు జి.ఎల్, ఆర్ట్: కృష్ణమాయ, ఎడిటింగ్: సాయిబాబు, హరి, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: కోటేంద్ర దుద్యాల.

ప్రతి శుక్రవారం పార్టీ మారుతారు!

'రూల్స్‌ని బ్రేక్ చేయాలి. సృజనకు పదునుపెట్టాలి. అప్పుడే నవ్యమైన కథ చిత్రాలొస్తాయ'ని అంటున్నారు సీనియర్ దర్శకుడు తేజ. కెరీర్ ఆరంభంలో ట్రెండ్‌సెట్టింగ్ సినిమాల్ని అందించి అగ్ర దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు. తన మనుసులోని భావాల్ని నిర్మొహమాటంగా వ్యక్తం చేయడం ఆయన నైజం. 'మనకు వచ్చిందే సినిమాలు తీయడం. ఆడినా ఆడకపోయినా సినిమాలు తీస్తుండాలి' అని చెబుతున్నారు తేజ. ఆయన దర్శకత్వంలో రానా కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. ఈ నెల 11న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా తేజ పాత్రికేయులతో తన మనోభావాల్ని పంచుకున్నారు...



తేజ

• రెండేళ్ల విరామం తర్వాత మెగాఫోన్ పట్టుకున్నారు. ఈ సినిమాలో రానాను కథానాయకుడిగా ఎంచుకోవడానికి కారణమేమిటి?

తొలుత 'అహం' పేరుతో కథ రాసుకొని సీనియర్ హీరో రాజశేఖర్‌కు వినిపించాను. అనుకోని కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చలేదు. అదే స్క్రిప్ట్‌ను సురేష్‌బాబుగారితో చర్చించి చాలా మార్పులు చేశాను. ఆ తర్వాత రానాను సంప్రదించి కథ వినిపించాను. ఆయన ఓకే చెప్పడంతో ఈ సినిమా పట్టాలెక్కింది.

• ఈ సినిమాలో రానా పాత్ర ప్రతినాయక ఛాయలతో సాగుతుందని అంటున్నారు...?

ప్రతి మనిషిలో రెండు పార్శ్వాలుంటాయి. నా విషయాన్నే తీసుకుంటే..ఓ దర్శకుడిగా సూపర్‌హిట్‌లు తీయగలను. అట్టర్‌ఫ్లాప్‌ల్ని కూడా అందివ్వగలను. ప్రతి ఒక్కరిలో పాజిటివ్, నెగెటివ్ ఛాయలుంటాయి. సాధారణంగా హీరో అనగానే అతనిలోని సుగుణాలను మాత్రమే చూపించే ప్రయత్నం చేస్తారు. అందుకు భిన్నంగా మనిషి నిజరూపమేమిటో ఈ చిత్రంలో చూపించే ప్రయత్నం చేశాను.

• ఇంతకి సినిమా కథ ఏమిటి..?

ఐదు సంవత్సరాల కాల వ్యవధిలో జోగేంద్ర అనే వ్యక్తి జీవితంలో జరిగిన సంఘటనలేమిటన్నదే చిత్ర ఇతివృత్తం. అతను చేసిన మంచిచెడుల సమ్మేళనంగా సాగుతుంది. కథలో వాణిజ్య హంగులన్నీ వుంటాయి. అయితే కథాగమనాన్ని ఆవిష్కరించే విధాన మాత్రం ఓ ఆర్ట్ ఫిల్మ్‌లా అనిపిస్తుంది.

• మీకు ఇగో (అహం) ఎక్కువని, నటీనటులతో కోపంగా ప్రవర్తిస్తుంటారని చెబుతుంటారు?

ప్రతి నటుడికి ఓ యాటిట్యూడ్(వ్యక్తిగత దృక్పథం) వుంటుంది. కొంతమంది ఏం చెప్పినా వెంటనే అర్థం చేసుకుంటారు. కొందరి వ్యక్తిత్వానికి, ఆచరణకు మధ్య ఓ అడ్డుతెర వుంటుంది. దానిని ఛేదించుకొని బయటకు రాలేకపోతుంటారు. అది బయటకు రావాలంటే వారిని కొన్నిసార్లు బ్రతిమిలాడాలి...తిట్టాలి...ఏదో ఒక ట్రిక్ వాడాలి. అంతిమంగా సినిమా బాగా రావాలనేదే ముఖ్యం. ఎందుకంటే సినీరంగంలో ఏది వ్యక్తిగతం కాదు. ఫలానా వారిపై పగ తీర్చుకోవాలని సినిమాల్లోకి తీసుకోం గదా?. నా దృష్టిలో నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరి కంటే ఎక్కువ రోజులు బ్రతికేది సినిమా. 'మాయాబజార్' సినిమా తీసిన వాళ్లెవరూ లేరు. అయినా ఆ సినిమా ప్రజల హృదయాల్లో ఇంకా బ్రతికే వుంది. ఏదో చిల్లరగా సినిమా తీసేయడం నాకు నచ్చదు. సినిమా సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తుంది. దీన్ని కరెక్ట్‌గా వాడాలి. మంచి సినిమాలు తీసే ప్రయత్నం చేయాలి. సినిమా అనేది భారీ తెరపై జరిగే ఓ మ్యాజిక్. ప్రతి ఒక్కరు దానికి ఆకర్షితులవుతారు. అందుకే మంచి సినిమాలు తీయాలి. థియేటర్లో చప్పట్లు కొడుతున్న ప్రేక్షకుల్ని చూడటమే నా దృష్టిలో మంచి విజువల్. దానిని మించిన గొప్ప దృశ్యం మరొకటి వుండదు.

• ఒకప్పుడు అగ్ర దర్శకుడిగా చలామణి అయ్యారు. ఆ తర్వాత వరుసగా అపజయాల్ని ఎదుర్కొన్నారు. ట్రెండ్‌కు తగినట్లుగా అప్‌డేట్ కాకపోవడమే మీ పరాజయాలకు కారణమనుకుంటున్నారా?

నేను తీసిన కొన్ని సినిమాలు అట్లర్‌ఫ్లాప్ అయ్యాయి. ఆ విషయాన్ని ఒప్పుకుంటాను. ఒకసారి తప్పు జరిగితే ఇక వరుసగా తప్పులు చేస్తూ పోతాం. 'నేనే రాజు నేనే మంత్రి' సినిమాకు మంచి కాంబినేషన్ కుదిరింది. ఇక నుంచి అంతా మంచే జరుగుతుందేమో అనిపిస్తుంది.

• తప్పని తెలిసి కూడా ఎందుకు సరిదిద్దుకోలేకపోయారు?

సినిమా ఫలితం వాస్తవం, ఆశ అనే రెండు దృగ్విషయాల మధ్య ఊగిసలాడుతుంటుంది. మనం ఎప్పుడు గెలుస్తామని ఆశ చెబుతుంటుంది. వాస్తవం..సినిమా పోతుందనే అసలు నిజాన్ని తెలియజేస్తుంటుంది. ఈ రెండింటి రేసులో వాస్తవమే ఎక్కువసార్లు గెలుస్తుంటుంది. నా విషయంలో అదే జరిగిందేమో (నవ్వుతూ).

• ఈ ప్రయాణంలో మీ వ్యక్తిగత దృక్కోణంలో ఏమైనా మార్పు వచ్చిందా?

ఈ ప్రపంచంలో ఎవడూ మారడు. అలాగే వుంటారు. మారినట్లు నటిస్తారంతే. నాకు నటన రాదు. కాబట్టి ఎప్పుడూ ఒకేలా వుంటాను. ప్రతి విషయంలో నిర్మొహమాటంగా అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తుంటాను.

• మీ తదుపరి సినిమాకు ఎలాంటి సన్నాహాలు చేసుకుంటున్నారు?

ప్రస్తుతానికి ఎలాంటి ఆలోచనల లేవు. రాజకీయ నాయకులు ఐదేళ్లకొకసారి పార్టీ మారతారు. కానీ సినిమావాళ్లు ప్రతి శుక్రవారం పార్టీ మారతారు. వారిని అస్సలు నమ్మకూడదు (నవ్వుతూ). మార్నింగ్ షోలో సినిమా ఫలితం తెలిసిపోతే...మ్యాట్నీకల్లా జనాలు మనల్ని రిసీవ్ చేసుకునే వైఖరిలో కూడా మార్పువస్తుంది. కాబట్టి నేను జయాపజయాల గురించి పట్టించుకోను. సినిమా విమర్శకులు..వారిచ్చే స్టార్‌రేటింగ్స్ గురించి ఏమాత్రం ఆలోచించను. ఇక్కడ ఎవరి జాబ్ వారు చేస్తుంటారు.

ఐబీఎస్‌కు హోమియో బెస్ట్



సలహా

మానవ జీర్ణ వ్యవస్థను మ్యాజిక్ బాక్స్ అని అంటారు. కడుపు నొప్పికి కారణాలు అనేకం. ఇది ఎందువల్ల వస్తుందో నిర్ధారించడం కష్టం. దీర్ఘకాలికంగా కడుపునొప్పి, విరేచనాలు వేధిస్తున్నాయంటే పేగుల్లో ఇబ్బందికర మార్పులేవో ఇందుకు కారణం కావచ్చు. ముఖ్యంగా పేగుల్లో పూత, వాపు వల్ల ఇటువంటి లక్షణాలు కనిపించవచ్చు. ఈ సమస్యలను ఇన్‌ఫ్లమేటరీ బవెల్ సింఢ్రోమ్ అంటారు.

ఇన్‌ఫ్లమేటరీ బవెల్ సింఢ్రోమ్ ఆహార నాళాలకు సంబంధించిన ఒక దీర్ఘకాలిక సమస్య. మన శరీరంలో జీర్ణాశయానికి లోపలి వైపున అనేక మ్యూకోసిల్ పొరలు ఉంటాయి. వీటిలో వాపు, మంట, తాపానికి గురి కావడాన్ని ఇన్‌ఫ్లమేషన్ అని అంటారు. ఈ సమస్య వయసుతో సంబంధం లేకుండా స్త్రీ, పురుషులెవరిలోనైనా సమానంగా కనిపిస్తుంది. సాధారణంగా 30 సంవత్సరాల లోపు వయసు వారిలో ఎక్కువగా కనిపిస్తుంది.

కారణాలు

జన్యుపరమైన సమస్యలు, రోగనిరోధక వ్యవస్థ పొరపాటున జీర్ణవ్యవస్థ పైన దాడి చెయ్యడం, కుటుంబ చరిత్ర, కాలుష్యం, పొగతాగడం వంటివి ప్రధాన కారణాలు. ఇన్‌ఫ్లమేటరీ బవెల్ సింఢ్రోమ్ రెండు రకాలుగా ఉంటుంది.

- **అల్సరేటివ్ కోలైటిస్** – చాలావరకు ఈ సమస్య పెద్దపేగుకు మాత్రమే పరిమితం అవుతుంది. పెద్దపేగుకు లోపల వైపుగా ఉండే మ్యూకోసిల్ పొరలు ఎర్రగా మారి, వాపునకు గురి కావడం, పుండ్లు ఏర్పడడం వల్ల విరేచనాలు, కొందరిలో రక్తంతో కూడిన విరేచనాలు, మలవిసర్జనలో ఆతురత, కడుపునొప్పి వంటి సమస్యలు వస్తుంటాయి.
- **క్రౌన్స్ డిసీజ్**– ఈ సమస్య జీర్ణవ్యవస్థ అనగా నోటి నుంచి మొదలుకొని మలద్వారం వరకు ఎక్కడైనా రావచ్చు. ముఖ్యంగా చిన్న పేగు చివరి భాగంలో వచ్చే అవకాశాలు ఎక్కువ. ఇది కేవలం పైన ఉండే మ్యూకోసిల్ పొరలకు మాత్రమే కాకుండా లోపల ఉండే అన్ని పొరలకు ఇన్‌ఫ్లమేషన్ వ్యాపిస్తుంది. దీని వల్ల దీర్ఘకాలికంగా విరేచనాలు, కడుపులో నొప్పి మెలి తిప్పినట్టు ఉండడం, రక్తంతో కూడిన విరేచనాలు ప్రధానంగా ఉంటాయి. నిర్లక్ష్యం చేస్తే చిన్న పేగు మూసుకుపోవడం, పుండ్లు ఏర్పడడం, పేగులో రంధ్రాలు ఏర్పడడం, ఫిస్టులాస్ వంటి తీవ్ర సమస్యలకు దారి తీస్తుంది. ఫలితంగా రక్తహీనత, నీరసం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయి.
- ఐబీఎస్ కేవలం జీర్ణవ్యవస్థకే కాకుండా కీళ్లు, చర్మం, కాలేయం, కళ్లు వంటి అవయవాల పైన కూడా ప్రభావం చూపుతుంది.

పరీక్షలు

రోగి లక్షణాలను బట్టి రక్త పరీక్ష, మల పరీక్ష, కొలనోస్కోపి, సిగ్మాయిడోస్కోపి, ఎక్స్‌రే, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎండోస్కోపీ వంటి పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించడమే కాకుండా ఇతర జీర్ణవ్యవస్థలకు సంబంధించిన సమస్యలు కూడా నిర్ధారించడం జరుగుతుంది.

హోమియో చికిత్స

జెనెటిక్ కాన్స్‌టిట్యూషనల్ సిమిలియం ద్వారా ఇన్‌ఫ్లమేటరీ బవెల్ సింఢ్రోమ్ వల్ల దీర్ఘకాలికంగా వచ్చే కడుపునొప్పి, విరేచనాలు ఇతర లక్షణాలను తగ్గించడమే కాకుండా ఐబీఎస్‌కి గల కారణాలను ముఖ్యంగా వికటించిన రోగనిరోధక వ్యవస్థను చికిత్స ద్వారా సరిచేసి ఈ సమస్యను, శాశ్వతంగా దూరం చేయవచ్చు. హోమియోకేర్‌లో వైద్యం ద్వారా ఐబీఎస్ సమస్యతో బాధపడుతున్న వారిలో సుమారు 82 శాతం మందిలో మంచి ఫలితాలు కనిపించాయి.



డా. శ్రీకాంత్ మోర్లావార్ CMD
హోమియోకేర్ ఇంటర్‌నేషనల్
టోల్ ఫ్రీ 1800 1081212
ఉచిత కన్సల్టేషన్
955 000 1188/99
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళ నాడు

కీళ్లనొప్పులకు జానువస్తి చికిత్స

ఆస్టియో ఆర్థరైటిస్‌తో బాధపడేవాళ్లలో ఎక్కువ మంది వయసు పైబడిన వాళ్లే ఉంటారు. 30ల వయసులో ఉన్నవారు మోకాళ్ల నొప్పులతో బాధపడేవాళ్లు ఇటీవలి కాలంలో పెరిగిపోతున్నారు. మారిన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ బొత్తిగా లేకపోవడం వంటివే ప్రధాన కారణంగా ఉంటున్నాయి. పెయిన్ కిల్లర్లు కొన్ని గంటల పాటు నొప్పి తెలియకుండా కీళ్లను మొద్దుబరుస్తాయే తప్ప నొప్పికి అసలు కారణమైన సంధివాతాన్ని తీసేయలేవు.

సంధివాతం అంటే..?

శరీరంలోని సమస్త కదలికలకు అవసరమైన వాతం అందరి శరీరంలోనూ సహజంగానే ఉంటుంది. అయితే ఈ వాతం ప్రకోపితమైనప్పుడు అంటే దాని సమతుల్యత కోల్పోయినప్పుడు మొదలయ్యేదే సంధివాతం లేదా ఆస్టియో ఆర్థరైటిస్. దీన్నే వాతం దూషితం కావడంగా పరిగణిస్తారు. సాధారణంగా కఫాన్ని వాతం దూషితం చేసినప్పుడే సంధివాతం మొదలవుతుంది. ఇలాంటప్పుడు కీళ్లు బిగుసుకుపోవడం, కదిలినప్పుడు శబ్దాలు రావడం, ముట్టుకున్నప్పుడు ఆ భాగం వేడిగా అనిపించడం, ఎరుపుదనం కలిగివుండడం, నిలబడినప్పుడు, కూర్చున్నప్పుడు నొప్పి అనిపించడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. కొంతమందిలో చాలాసేపు కూర్చున్న తరువాత గాని, పడుకుని లేచినప్పుడు గాని, వెంటనే లేచి నడవలేని పరిస్థితి ఏర్పడుతుంది. కాసేపు నడిచాక బిగుసుకుపోయిన భాగాలు సడలిపోయి, నడకలో కొంత సౌకర్యం ఏర్పడుతుంది. సంధివాతంలో ఇది ఒక ముఖ్య లక్షణంగా ఉంటుంది.

కీళ్లు.. రకాలు

కీళ్లను చల, స్థిర సంధులని రెండు భాగాలుగా విడదీయవచ్చు. కదిలే కీళ్లను చల సంధులనీ, కదలని కీళ్లను స్థిర సంధులనీ అంటారు. ఈ కదిలే చల సంధుల్లోనే కీళ్ల వాతం వస్తుంది. చల సంధుల్లోనే కీళ్లవాతం రావడానికి శరీర భాగాలన్నింటినీ ఆవరించుకొని, కొన్ని పొరలు (మెంబ్రేన్‌లు) దెబ్బతినడమే కారణం. మొత్తంగా అష్టాధర కలలు (ఎనిమిది పొరలు) ఉంటాయి. వాటిలో శ్లేష్మధరా కల అనే ఒక పొర ఉంటుంది. దీన్నే సైనోవియల్ మెంబ్రేన్ అంటారు. ఈ సైనోవియల్ ఫ్లూయిడ్ కీళ్లు కదులడానికి తోడ్పడుతూ ఉంటుంది. కదిలే కీళ్లు సహజంగా శ్లేష్మం, సిరలు, కండరాలతో కూడుకొని ఉంటాయి. ఈ శ్లేష్మధరా కల వాత ప్రకోపంతో దూషింపబడినప్పుడు అది తన సహజస్థితిని కోల్పోతుంది. దీని వల్ల శరీరంలో ఆమం అంటే వ్యర్థ విష పదార్థాలు ఏర్పడుతాయి. ఫలితంగా కొన్ని సమస్యలు తలెత్తుతాయి.

ఆహార, విహార లోపాలు..

ఆహార విషయాల్లో.. సరైన ఆహారం తీసుకోవడం, తీసుకున్న ఆహారం జీర్ణం కాకముందే మళ్లీ తినడం, పొడి ఆహారాన్ని తీసుకోవడం వంటి కారణాల వల్ల మనం తీసుకున్న ఆహారం పూర్తిగా జీర్ణం కాకుండా, ఆమం అనే ఒక విష పదార్థం శరీరంలో ఏర్పడుతుంది. సరైన వేళకు నిద్రించకపోవడం, ఉదయం ఎక్కువ సమయం పడుకునే ఉండడం, రాత్రివేళ ఎక్కువ సమయం మేల్కొని ఉండడం, ఎక్కువ గంటలు కదలకుండా పనిచేసే వృత్తిలో ఉండడం, ఇటువంటి విహార కారణాల వల్ల మోకాళ్లలోని వాతం దూషించబడుతుంది. ఈ దూషిత వాతమే మోకాళ్ల నొప్పులకు కారణమవుతుంది.

ఆయుర్వేద చికిత్స


సంధివాతం (కీళ్లనొప్పులు) ఏ కారణంగా మొదలైనా, వాత హర చికిత్సలు చేయడం ద్వారా ఆ సమస్యను తొలగించవచ్చు. అయితే, అరిగిపోయిన కార్టిలేజ్ తిరిగి వృద్ధి చేయడం ద్వారా మాత్రమే ఈ సమస్య శాశ్వతంగా తొలిగిపోతుంది. అందుకుగాను ఆయుర్వేదంలో కొన్ని ప్రత్యేకమైన ఔషధయుక్త తైలాలతో చేసే జానువస్తి చికిత్స ఉంటుంది. దీనివల్ల మోకాళ్లలో అరిగిపోయిన భాగాలన్నీ తిరిగి వృద్ధి చెందుతాయి. తైలాలు, కొన్ని రకాల మాత్రల ద్వారా అరిగిపోయిన కార్టిలేజ్‌ను తిరిగి ఉద్ధరించే పూర్తి అవకాశం ఏర్పడుతుంది. వాస్తవానికి కార్టిలేజ్‌ను పునరుద్ధరించే శక్తి ఆయుర్వేద తైలాలకు మాత్రమే ఉంది. జానువస్తి చికిత్సలు ఎవరైనా చేయవచ్చు. కానీ ఆ సమయంలో కీళ్లలోకి పంపించే తైలం పాత్రే ఇక్కడ కీలకం. ఆ తైలం ఎంతో ప్రత్యేకమైనది. ప్రత్యేక తైలాలు, ప్రత్యేకమైన ఔషధాలతో మోకాళ్ల నొప్పులు సమూలంగా తొలగిపోతాయి. ఆయుర్వేద వైద్యుల్ని సూచించిన చికిత్సలన్నీ క్రమం తప్పకుండా తీసుకుంటే, తిరిగి యుక్త వయసులోకి ప్రవేశించినంత ఆనందం, ఉత్సాహం కలుగుతాయి.



డా॥ టి.ఎల్. శ్రీనివాస్
సహజ ఆయుర్వేదిక్
హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్
9160 994 455
9160 994 456
హైదరాబాద్, హన్మకొండ, రాజమండ్రి, నెల్లూరు, విజయవాడ, అనంతపురం, జోగిపేట

హెపటైటిస్‌కు నివారణ సాధ్యమే!

సలహా



క్రానిక్ హెపటైటిస్ శరీరంలో చాలా నెమ్మదిగా లక్షణాలు కలిగిస్తుంది. ఇది అకస్మాత్తుగా ఒక్కసారిగా కనిపించే జబ్బు కాదు. ఇలా కనిపించేది కేవలం అక్యూట్ హెపటైటిస్‌లో మాత్రమే. హెపటైటిస్ బి, సి వైరస్‌ల వల్ల కలిగే అనారోగ్యం.

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 40 మిలియన్ల జనాభా క్రానిక్ హెపటైటిస్ బి తో బాధపడుతున్నారు. భారతీయుల్లో 6-12 మిలియన్ల మంది క్రానిక్ హెపటైటిస్ సితో బాధపడుతున్నారు. ఈ దీర్ఘకాలిక అనారోగ్య సమస్యను రెండు విధాలుగా నిర్ధారణ చెయ్యవచ్చు. చాలాసార్లు ఇతర రక్త దానం కోసమో రక్త పరీక్షలు చేయించినప్పుడు ఈ వ్యాధి బయట పడుతుంది. అప్పటి వరకు వారిలో ఎలాంటి లక్షణాలు కనిపించవు.

కొంత మందిలో మరేదో సర్జరీ కోసమో లేక జ్వరం కోసమో రక్త పరీక్ష చేయించినప్పుడు హెపటైటిస్ బయటపడుతుంది. ఇలాంటి సందర్భాల్లో ఒక్కోసారి కామెర్లు, చర్మం మీద దద్దుర్ల వంటి లక్షణాలు కనిపించవచ్చు. రక్తంలో ప్లేట్లెట్ల సంఖ్య తగ్గిపోవడం కూడా హెపటైటిస్ మరో లక్షణమే. దీన్ని కూడా రక్త పరీక్షద్వారానే నిర్ధారించాల్సి ఉంటుంది.

ఆరునెలల కంటే ఎక్కువ కాలంగా శరీరంలో హెపటైటిస్ ఇన్‌ఫెక్షన్ కొనసాగుతుంటే క్రానిక్ హెపటైటిస్ అని చెప్పవచ్చు.

వ్యాధి చాలా ముదిరిపోతే తప్ప క్రానిక్ హెపటైటిస్‌లో లక్షణాలు కనిపించవు. లక్షణాలు కనిపిస్తున్నాయంటే వారిలో జబ్బు చేరి కొన్ని నెలలు ఒక్కోసారి సంవత్సరాల సమయం కూడా అయి ఉండొచ్చు. ఇలాంటి వారిలో లివర్ కూడా చెడిపోయి ఉండే ప్రమాదం ఉంటుంది. కొంతమందిలో ఎన్నో సంవత్సరాలుగా ఇన్ఫెక్షన్ ఉన్నప్పటికీ వారిలో లివర్‌కు ఎలాంటి నష్టం జరుగకుండా ఉంటారు. వీరు కేవలం క్యారీయర్లుగా ఉంటారు. ఒక్కోసారి జీవితపర్యంతం వీరు ఇలాగే ఉండిపోవచ్చు కూడా. ఇందుకు విరుద్ధంగా కొంత మందిలో మాత్రం ఈ ఇన్ఫెక్షన్ వల్ల లివర్ సిర్రోసిస్ సమస్య రావచ్చు. సిర్రోసిస్ ప్రారంభ దశలో పూర్తిగా నయం చెయ్యడానికి అవకాశం ఉంటుంది కానీ సమస్య ముదిరిపోతే మాత్రం దీనికి చికిత్స అందుబాటులో లేదు. చాలా అరుదుగా కొంత మంది హెపటైటిస్ బి, సి రెండు రకాల ఇన్ఫెక్షన్లు ఏకకాలంలో కనిపిస్తాయి.

క్రానిక్ హెపటైటిస్‌కి చికిత్స

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మందులతో హెపటైటిస్‌కు మంచి చికిత్స లభిస్తున్నది. చాలారకాల చికిత్సలు ప్రత్యేకంగా హెపటైటిస్-సికి అందుబాటులో ఉన్నాయి. ఈ చికిత్సలకు ఫలితాలు 40 నుంచి 50 శాతం వరకు మాత్రమే ఉండేవి ఇదివరకు. కానీ ఇప్పుడు దాదాపు 90-95 శాతం వరకు ఉంటున్నాయి. హెపటైటిస్ బిని నివారించవచ్చు. దీనికి వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ఇది చిన్నపిల్లలకు ఇమ్యూనైజేషన్ షెడ్యూల్‌లో భాగంగా ఇస్తున్నారు. హెపటైటిస్-సిని పూర్తిగా నయం చెయ్యడం సాధ్యమే. ఈ వైరస్‌ను మందులతో పూర్తిస్థాయిలో శరీరం నుంచి తొలగించి లివర్‌ను కాపాడవచ్చు.

నివారణ

వ్యాధి ఎలా వ్యాప్తి చెందుతుందన్న అవగాహన ఉంటే దాన్ని వ్యాప్తి చెందకుండా ఆపవచ్చు. సాధారణంగా కొన్ని జాగ్రత్తలు పాటించడం వల్ల ఈ ఇన్ఫెక్షన్‌ను పూర్తిగా అరికట్టవచ్చు. ఈ ఇన్ఫెక్షన్ చాలా రకాలుగా వ్యాప్తి చెందుతుంది. అందులో ముఖ్యమైనవి

- రక్త మార్పిడి
- మెడికల్ లేదా డెంటల్ ప్రక్రియల్లో ఉపయోగించే పరికరాలు
- ప్రసవ సమయంలో తల్లి నుంచి బిడ్డకు
- ఇంజక్షన్‌లలో ఉపయోగించే సూదులు.
- రేజర్లు, టూత్‌బ్రష్‌లు, ఇతర గృహావసరాలకు ఉపయోగించే వస్తువులు ఇతరులు ఉపయోగించడం
- పచ్చబొట్టు పొడిచే సూదులు, చెవి కుట్టడానికి ఉపయోగించే పరికరాల వంటి వాటి వల్ల కూడా ఈ ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందేందుకు ఆస్కారం ఉంటుంది. కాబట్టి ఇలాంటి సందర్భాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.



డాక్టర్ శరత్ రెడ్డి పుట్ట
చీఫ్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్
కిమ్స్ హాస్పిటల్స్
సికింద్రాబాద్
040-4488 5000

'ఉద్యాన వర్సిటీ'లో డిప్లొమా కోర్సు



శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ ఉద్యాన విశ్వవిద్యాలయం 2017-18 విద్యా సంవత్సరానికి రెండేండ్ల ఉద్యాన డిప్లొమా కోర్సులో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

గ్రామాల్లో నివసించే యువతీయువకులు స్వయం ఉపాధి కల్పించుకోవాలనే లక్ష్యంతోనూ, వారు కాలేజీల్లో చేరి డిగ్రీలు చదువలేరనే ఉద్దేశంతో వారికి ఉద్యాన పరిజ్ఞానంలో శిక్షణ ఇవ్వడానికి ఈ పాలిటెక్నిక్‌లను ఏర్పాటుచేశారు.

- కోర్సుపేరు: రెండేండ్ల ఉద్యాన డిప్లొమా
- మొత్తం సీట్ల సంఖ్య: 50
- ఉద్యాన పాలిటెక్నిక్ కాలేజ్, దసనాపూర్ (ఆదిలాబాద్)-25 సీట్లు
- ఉద్యాన పాలిటెక్నిక్ కాలేజ్, రామగిరి ఖిల్లా (కరీంనగర్)-25 సీట్లు
- **అర్హత:** తెలంగాణలోని అభ్యర్థులు వారి పదేండ్ల చదువు కాలంలో కనీసం నాలుగేండ్లు గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో చదివినవారు మాత్రమే అర్హులు. ఇంటర్ పాసైనవారు, డిగ్రీ చదివినవారు అర్హులుకారు.
- **వయస్సు:** 2017 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో రూ. 500/- (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ. 250/- చెల్లించాలి)
- **ఎంపిక:** గ్రేడ్ పాయింట్ యావరేజ్ ప్రకారం విద్యార్థి ఎంపిక ఉంటుంది. డిప్లొమా కోర్సు ఎంపికలో రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి ఉంటాయి.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా. నిర్ణీత నమూనాలో దరఖాస్తులను పూర్తిచేసి, డిమాండ్ డ్రాఫ్ట్‌ను జతపరిచి కింది అడ్రస్‌కు పంపాలి.

చిరునామా: The Registrar, Sri Konda Laxman Telangana State Horticultural University Rajendranagar, Hyderabad - 500 030

- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్టు 16
- **వెబ్‌సైట్:** www.skltshu.ac.in

హెచ్‌ఎంటీలో మేనేజర్లు



HMT Machine Tools Limited

బెంగళూరులోని హెచ్‌ఎంటీ మెషీన్ టూల్స్ లిమిటెడ్ సేల్స్ అండ్ సర్వీస్ విభాగంలో ఖాళీగా ఉన్న మేనేజర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

హెచ్‌ఎంటీ మెషీన్ టూల్స్ లిమిటెడ్ అనేది హెచ్‌ఎంటీ లిమిటెడ్ అనుబంధ సంస్థ.

- **పోస్టు పేరు :** ఏజీఎం, మేనేజర్, డిప్యూటీ మేనేజర్
- **మొత్తం పోస్టులు:** 12
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్, ఎంబీఏ (మార్కెటింగ్) ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 33 ఏండ్లకు మించరాదు (మేనేజర్, ఏజీఎం పోస్టులకు 35 ఏండ్లు/ 37 ఏండ్లు)
- **పే స్కేల్ :** డిప్యూటీ మేనేజర్‌కు రూ. 10,750-16,750/-
- మేనేజర్‌కు రూ. 13000-18,250/-, ఏజీఎంకు 14,500-18,700/- అదనంగా డీఏ, హెచ్‌ఆర్‌ఏ, సీసీఏ తదితర అలవెన్స్‌లు ఉంటాయి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా. నిర్ణీత నమూనాలో దరఖాస్తులను నింపి, సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.

చిరునామా: The Deputy General Manager (MP/HR), HMT Machine Tools Limited, HMT Bhavan, #59, Bellary Road, Bangalore -32

- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **వెబ్‌సైట్ :** www.hmtindia.com

ఇస్రోలో 128 డ్రైవర్ పోస్టులు

- లైట్, హెవీ వెహికిల్ డ్రైవర్ పోస్టులు
- పదోతరగతి, వ్యాలిడిటీ ఉన్న డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉన్నవారు అర్హులు
- మంచి జీతభత్యాలు, భద్రమైన కొలువు
- రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ద్వారా ఎంపిక



దేశవ్యాప్తంగా పలు యూనిట్లలో ఖాళీగా ఉన్న లైట్ వెహికిల్, హెవీ వెహికిల్ డ్రైవర్ పోస్టుల భర్తీకి ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

ఇస్రో భారత ప్రభుత్వ రంగ సంస్థ. ఇస్రో పరిధిలో పలు యూనిట్లు ఉన్నాయి. వీటన్నింటిలో ఖాళీల భర్తీకి ఇస్రో సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఐసీఆర్‌బీ) నోటిఫికేషన్‌ను విడుదలచేసింది.

- మొత్తం ఖాళీల సంఖ్య - 128. యూనిట్ల వారీగా ఖాళీల వివరాలు...
- లైట్ వెహికిల్ డ్రైవర్ ఏ పోస్టులు - 50
- అహ్మదాబాద్ - 1, బెంగళూరు - 15, హైదరాబాద్ -4, న్యూఢిల్లీ - 1, శ్రీహరికోట - 10, తిరువనంతపురం - 19 ఖాళీలు ఉన్నాయి. వీటిలో రిజర్వేషన్ల ప్రకారం జనరల్ - 27, ఓబీసీ - 15, ఎస్సీ -7, ఎస్టీ - 1 ఖాళీ ఉన్నాయి.
- హెవీ వెహికిల్ డ్రైవర్ ఏ పోస్టులు - 76. యూనిట్ల వారీగా ఖాళీలు..
- అహ్మదాబాద్ -3, బెంగళూరు - 5, శ్రీహరికోట - 8, తిరువనంతపురం - 60 ఖాళీలు ఉన్నాయి. రిజర్వేషన్ల ప్రకారం జనరల్ - 47, ఓబీసీ - 21, ఎస్సీ - 7, ఎస్టీ - 1 ఖాళీ ఉన్నాయి.
- స్టాఫ్ కార్ డ్రైవర్ ఏ - 2 ఖాళీలు. ఇవి బెంగళూరు యూనిట్‌లో ఉన్నాయి. ఈ ఖాళీలు జనరల్ కేటగిరీలో ఉన్నాయి.
- **అర్హతలు:** పదోతరగతి/ ఎస్సెస్సీ లేదా మెట్రిక్యులేషన్ పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
- లైట్ వెహికిల్ డ్రైవర్ పోస్టుకు మూడేండ్ల అనుభవం, వ్యాలిడిటీ ఉన్న ఎల్‌వీడీ లైసెన్స్, పబ్లిక్ సర్వీస్ బ్యాడ్జి కలిగి ఉండాలి.
- హెవీ వెహికిల్ డ్రైవర్ పోస్టు - ఐదేండ్ల అనుభవం ఉండాలి. దీనిలో కనీసం మూడేండ్ల హెవీ వెహికిల్ నడిపిన అనుభవం ఉండాలి. దీంతోపాటు వ్యాలిడిటీ ఉన్న హెచ్‌వీడీ లైసెన్స్, పబ్లిక్ సర్వీస్ బ్యాడ్జి ఉండాలి.
- స్టాఫ్ కార్ డ్రైవర్ పోస్టు - మూడేండ్లు లైట్ వెహికిల్ డ్రైవర్‌గా అనుభవం ఉండాలి. వ్యాలిడిటీ ఉన్న ఎల్‌వీడీ లైసెన్స్, పబ్లిక్ సర్వీస్ బ్యాడ్జి ఉండాలి.
- **వయస్సు:** 2017, ఆగస్టు 28 నాటికి 35 ఏండ్లు మించరాదు. ఎస్సీ, ఎస్టీలకు 40 ఏండ్లు, ఓబీసీలకు 38 ఏండ్లు మించరాదు.

నోట్: అభ్యర్థులు ఒకే జోన్‌లో మూడు పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒకే పోస్టుకు వేర్వేరు జోన్లలో దరఖాస్తు చేసుకోరాదు.

- **అప్లికేషన్ ఫీజు:** రూ. 100 (ప్రతి దరఖాస్తుకు అంటే ఒక్క పోస్టుకు)

నోట్: ఎస్సీ, ఎస్టీ, ఎక్స్‌సర్వీస్‌మెన్, మహిళా అభ్యర్థులకు ఎటువంటి ఫీజు లేదు.

- **ఎంపిక విధానం:** దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులను మొదట షార్ట్‌లిస్ట్ చేస్తారు. అనంతరం రాత పరీక్షను నిర్వహిస్తారు.

రాతపరీక్ష విధానం:

- ఇది నాలుగు పార్ట్‌లు ఉంటుంది.
- పార్ట్- ఏ 50 మార్కులు. దీనిలో మోటార్ వెహికిల్ యాక్ట్, 1939 సవరణలపై ప్రశ్నలు ఇస్తారు.
- పార్ట్ - బీలో 15 మార్కులు ఇంగ్లిష్‌పై ఇస్తారు.
- పార్ట్ - సీలో 15 మార్కులు అర్థమెటిక్‌పై ప్రశ్నలు ఉంటాయి.
- పార్ట్ -డీలో 20 మార్కులకు జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు ఇస్తారు.

గమనిక: పార్ట్ -ఏలో కనీసం 50 శాతం మార్కులు, ఇతర విభాగాలన్నీ కలిపి 50 శాతం (కనీసం) మార్కులు వచ్చినవారిని క్వాలిఫైగా పరిగణిస్తారు. పోస్టుల సంఖ్యను బట్టి వీరిని షార్ట్‌లిస్ట్ చేస్తారు.

- షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులకు స్కిల్‌టెస్ట్ నిర్వహిస్తారు.
- స్కిల్‌టెస్ట్ కేవలం క్వాలిఫయింగ్ పరీక్ష మాత్రమే. 100 పాయింట్ల స్కేల్‌పై కనీసం 60 శాతం మార్కులు రావాలి.
- **పరీక్షతేదీ:** నవంబర్ 26
- **పరీక్ష కేంద్రాలు:** అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, డెహ్రాడూన్, గువాహటి, హైదరాబాద్, కోల్‌కతా, న్యూఢిల్లీ, తిరువనంతపురం.
- **పేస్కేల్:** లెవల్ 2 ఆఫ్ పే మ్యాట్రిక్స్ కింద కనీస జీతం రూ. 19,990/- ఇస్తారు. దీనికి అదనంగా హెచ్‌ఆర్‌ఏ, టీఏ తదితరాలు ఉంటాయి.
- నేషనల్ పెన్షన్ సిస్టం, వైద్యసౌకర్యాలు, సబ్సిడీ క్యాంటీన్ సౌకర్యం, టీఏ తదితర అలవెన్స్‌లు ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 28
- **ఫీజు చెల్లించడానికి చివరి తేదీ:** ఆగస్టు 29
- **వెబ్‌సైట్:** http://www.isro.gov.in

టీవీవీపీలో డాక్టర్లు



రంగారెడ్డి జిల్లాలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) ఏరియా హాస్పిటల్లో ఖాళీగా ఉన్న స్పెషాలిటీ డాక్టర్ పోస్టుల (నిర్ణీత కాలానికి) భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖలో అనుబంధగా ఉన్న టీవీవీపీ మొత్తం 102 హాస్పిటల్స్‌ను పర్యవేక్షిస్తున్నది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 12 పోస్టులు (గైనకాలజీ-5, పీడియాట్రిక్స్-4, అనస్థీషియా-3)
- **పోస్టు పేరు:** స్పెషాలిటీ డాక్టర్
- ఏరియా హాస్పిటల్ కొండాపూర్, ఏరియా హాస్పిటల్ వనస్థలిపురం, సీహెచ్‌సీ షాద్‌నగర్‌లో ఈ ఖాళీలను భర్తీచేస్తారు.
- **అర్హత:** గుర్తింపు పొదిన యూనివర్సిటీ నుంచి సంబంధిత ఎంబీబీఎస్, మెడికల్ పీజీ డిగ్రీ/పీజీ డిప్లొమా లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **ఎంపిక:** అకడమిక్ మెరిట్/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా. నిర్ణీత నమూనా దరఖాస్తులను నింపి పర్సనల్ అధికారికి పంపాలి.

చిరునామా: సూపరింటెండెంట్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, కొండాపూర్, రంగారెడ్డి జిల్లా

- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** http://vvp.telangana.gov.in

ఐఐఎస్‌సీలో ఇన్‌స్ట్రక్టర్లు



బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ)లో ఖాళీగా ఉన్న ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి అర్హులై అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

దేశంలోనే ఐఐఎస్సీ ఉన్నత విద్య, పరిశోధనల కోసం నిర్దేశించిన అత్యున్నత విశ్వవిద్యాలయం. 1909లో జంషెడ్జీ టాటా స్థాపించారు.

- **పోస్టు పేరు:** ఇన్‌స్ట్రక్టర్
- **విభాగాలు:** బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, మెటీరియల్స్
- **మొత్తం ఖాళీలు:** 7 (జనరల్-2, ఓబీసీ-3, ఎస్సీ-1, ఎస్టీ-1).
- **వేతనం:** రూ. 52,000 నుంచి రూ. 77,000.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి పీహెచ్‌డీ, రెండేండ్ల ఉద్యోగానుభవం.
- **వయోపరిమితి:** 2017 ఆగస్టు 11 నాటికి 35 ఏండ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, పీహెచ్‌సీ కేటగిరీ అభ్యర్థులకు సంస్థ నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** సీవీ, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు :** ఆఫ్‌లైన్ ద్వారా. నిర్దేశిత నమూనాలో దరఖాస్తు పత్రాన్ని నింపి, దానికి తాజా రెజ్యూమే లేదా సీవీని జతచేసి ఈ-మెయిల్ ద్వారా(recruitment@admin.iisc.ernet.in లేదా ugpr@ug.iisc.in) నిర్ణీత గడువులోగా పంపాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్టు 11
- **వెబ్‌సైట్:** www.iisc.ac.in

అలహాబాద్ హైకోర్టులో ఉద్యోగాలు



ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టు సివిల్ కోర్టు స్టాఫ్ సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్, ప్రాసెస్ సర్వర్, స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఉత్తరప్రదేశ్ హైకోర్టు రాజధాని లక్నోలో కాకుండా అలహాబాద్‌లో ఉంది. ఈ కోర్టును ఆగ్రా (1866) నుంచి అలహాబాద్ (1869)కు మార్చారు. లక్నోలో హైకోర్టు బెంచ్ మాత్రమే ఉన్నది.

- ఖాళీల సంఖ్య: 4,386
- స్టెనోగ్రాఫర్ (గ్రేడ్-III (కేటగిరీ-సి క్యాడర్)-543 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. కంప్యూటర్ ఆపరేషన్‌లో నాలెడ్జ్‌ను కలిగి ఉండాలి.
- జూనియర్ అసిస్టెంట్, పెయిడ్ అప్రెంటిస్ (కేటగిరీ-సి క్యాడర్) - 1786 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. ఇంగ్లిష్/ హిందీ టైపింగ్‌లో ప్రావీణ్యం ఉండాలి.
- డ్రైవర్స్ (కేటగిరీ-సి క్యాడర్)-37 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన సంస్థ నుంచి హైస్కూల్/తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. వినియోగంలో ఉన్న ఫోర్‌వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి.
- కేటగిరీ-డి క్యాడర్- 2020 పోస్టులు
- ఈ పోస్టుల్లో ట్యూబ్‌వెల్ ఆపరేటర్ కమ్ ఎలక్ట్రీషియన్, ప్రాసెస్ సర్వర్, ఆర్డర్లీ, ప్యూన్, ఆఫీస్ ప్యూన్/ఫర్రష్, చౌకీదార్, వాటర్‌మ్యాన్, స్వీపర్, మాలీ, కూలీ, బిస్తీ/లిఫ్ట్‌మ్యాన్, స్వీపర్ కమ్ ఫర్రష్ పోస్టులు ఉన్నాయి.
- **అర్హత:** గుర్తింపు పొందిన సంస్థ నుంచి జూనియర్ హైస్కూల్/ హై స్కూల్‌లో ఉత్తీర్ణత (పోస్టుల వారీగా విద్యార్హతలు ఉండాలి)
- **వయస్సు:** 2016 జూలై 1 నాటికి 18 నుంచి 40 ఏండ్ల మధ్య ఉండాలి.
- **పే స్కేల్:** జూనియర్ అసిస్టెంట్‌కు రూ.5200-20200+ గ్రేడ్ పే రూ.2000 (అన్ని పోస్టులకు గ్రేడ్ పే మాత్రమే వేర్వేరుగా ఉంది)
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 750/-, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 500/- (కొన్ని పోస్టులకు రూ. 500/-, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 300/-)
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, టైపింగ్ టెస్ట్, ప్రోగ్రామింగ్ టెస్ట్
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 22
- **ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** ఆగస్టు 24
- **వెబ్‌సైట్:** www.allahabadhighcourt.in.

ఓబీసీలో 382 అడ్వకేట్స్

జాతీయ బ్యాంకుల్లో ఒక్కటైన ఓరియంటల్ బ్యాంక్ కామర్స్ (ఓబీసీ) జైపూర్, ఆగ్రా వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న అడ్వకేట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

రాయ్ బహదూర్ లాలా సోహన్‌లాల్ 1943లో ఓబీసీని స్థాపించారు. 1980 ఏప్రిల్ 15న జాతీయ బ్యాంక్‌గా ఏర్పాటుచేశారు.

- మొత్తం ఖాళీల సంఖ్య : 382 పోస్టులు (జైపూర్ పరిధి-296, ఆగ్రా పరిధి-86)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంస్థ నింబంధన ప్రకారం సంబంధిత లా డిగ్రీ/పీజీ. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** బ్యాంక్ నిబంధనల ప్రకారం ఉండాలి
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా. నిర్నీత నమూనాలో దరఖాస్తులను నింపి, సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 26, ఆగ్రా రిజీయన్‌కు ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.obcindia.co.in

కెన్‌ఫిన్‌లో ప్రొబేషనరీ అసిస్టెంట్లు

CanFin Homes Ltd
(Sponsor: CANARA BANK)
HOME LOANS ◆ DEPOSITS
Translating Dreams into Reality

బెంగళూరులోని కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్ వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రొబేషనరీ అసిస్టెంట్ (క్లరికల్ క్యాడర్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్ అనేది కెనరా బ్యాంక్ అనుబంధ సంస్థ

- **పోస్టు పేరు:** ప్రొబేషనరీ అసిస్టెంట్
- మొత్తం పోస్టుల సంఖ్య-30
- **ప్రాంతాలవారీగా ఖాళీలు:** బెంగళూరు-8, చెన్నై-4, హైదరాబాద్-5, ముంబై-4, జైపూర్-2, భోపాల్-1, ఇండోర్-1, ఢిల్లీ/నోయిడా-5
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ ఏదైనా పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీలో ఉత్తీర్ణత. కంప్యూటర్ అప్లికేషన్/డాటా ఎంట్రీలో పరిజ్ఞానం ఉండాలి. ప్రాంతీయభాషతోపాటు ఇంగ్లిష్‌లో రాయడం, మాట్లాడటం, చదవడం రావాలి.
- **వయస్సు:** 2017 మే 1 నాటికి 21 నుంచి 28 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ప్రొబేషనరీ పీరియడ్:** ఏడాది
- **పే స్కేల్ :** రూ. 9200-28750/- అదనంగా డీఏ, హెచ్‌ఆర్‌ఏ తదితర అలవెన్సులు ఇస్తారు.
- డ్రైవర్ కమ్ ప్యూన్-2 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన సంస్థ నుంచి ఎనిమిదో తరగతిలో ఉత్తీర్ణత. మోటారుకారు డ్రైవింగ్‌లైసెన్స్ ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 15,000+ ఇతర అలవెన్సులు నెలకు రూ. 2000/- ఇస్తారు.
- **వయస్సు:** 36 ఏండ్లకు మించరాదు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 100/-
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా
- **చివరి తేదీ:** ఆగస్టు 14 (డ్రైవర్ కమ్ ప్యూన్, పోస్టుకు ఆగస్టు 16)
- **వెబ్‌సైట్:** www.canfinhomes.com.

హెచ్‌సీయూలో

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) ఖాళీగా ఉన్న ట్యూటర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

హెచ్‌సీయూని పీజీలోని టీచింగ్ అండ్ రిసెర్చ్ రంగంలో మెలకువలను అందించడానికి ప్రాథమిక విద్యాసంస్థగా 1974 అక్టోబర్ 2న ఏర్పాటు చేశారు.

- ఖాళీల సంఖ్య: 2 పోస్టులు
- **విభాగాలు:** స్పోకెన్ ఇంగ్లిష్ గ్రామర్
- **అర్హత:** ఇంగ్లిష్‌లో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత. పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.
- ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ద్వారా.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 10
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

హాల్‌లో అప్రెంటిస్‌షిప్ ట్రెయినింగ్

हिएलि
HAL
Propel your dreams

బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) వివిధ విభాగాల్లో అప్రెంటిస్‌షిప్ ట్రెయినింగ్ (ఏడాది వ్యవధికి) చేయడానికి అర్హులైన ఇంజినీరింగ్, డిప్లొమా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఇది మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ పరిధిలో పనిచేస్తుంది. ఈ సంస్థను 1940లో హిందుస్థాన్ ఎయిర్‌క్రాఫ్ట్‌గా స్థాపించగా, 1964లో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌గా పేరు మార్చారు.

- ఇంజినీరింగ్ అప్రెంటిస్‌షిప్ ట్రెయినింగ్
- **విభాగాలు:** ఏరోనాటికల్/ఏరోస్పేస్ ఇంజినీరింగ్, కెమికల్, సివిల్, కంప్యూటర్, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్, ఏవియానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, టెలికమ్యూనికేషన్, మెకానికల్, ఇండస్ట్రియల్, ఇండస్ట్రియల్ ప్రొడక్షన్, ప్రొడక్షన్ ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్, ఆటోమొబైల్, ఫౌండ్రీ టెక్నాలజీ, మెటలర్జీ అండ్ మెటీరియల్ సైన్స్ ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత బ్రాంచిలో నాలుగేండ్ల బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత.
- **డిప్లొమా అప్రెంటిస్‌షిప్ ట్రెయినింగ్**
- **విభాగాలు:** ఏరోనాటికల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఏవియానిక్స్, సివిల్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, డిప్లొమా కమర్షియల్ ప్రాక్టీస్, మెటలర్జీ ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత.
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డ్/సంస్థ నుంచి సంబంధిత ఇంజినీరింగ్‌లో మూడేండ్ల డిప్లొమా ఉత్తీర్ణత.
- **ఎంపిక:** అకడమిక్ మెరిట్ ఆధారంగా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్టు 22
- **వెబ్‌సైట్:** www.hal-india.com

నిట్ రూర్కెలాలో ప్రొఫెసర్లు



రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:


ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీలో ఉన్నతవిద్యను అభ్యసించడానికి దీన్ని ఏర్పాటుచేశారు. గతంలో దీన్ని రీజినల్ ఇంజినీరింగ్ కాలేజ్ రూర్కెలా గా పిలిచేవారు.

- **పోస్టు పేరు:** ప్రొఫెసర్. వీటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ . సంబంధిత పీజీలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. టీచింగ్/రిసెర్చ్‌లో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** సంస్థ నింబంధనల ప్రకారం అర్హతలను కలిగి ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా
- **చివరి తేదీ:** సెప్టెంబర్ 11
- **వెబ్ సైట్:** www.nitrkl.ac.in

కాగజ్‌నగర్ టైగర్ రిజర్వులో 18 ఎకో బ్రిడ్జిలు

- తమ్మిడిహట్టి బరాజ్‌లో భాగంగా నిర్మాణం
- రూ.440 కోట్లతో సమగ్ర ప్రణాళిక సిద్ధం
- దేశంలో తొలిసారిగా పులుల వంతెనలు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో పర్యావరణ వంతెనల (ఎకో-బ్రిడ్జిల) నిర్మాణం జరుగబోతున్నది. ఆసిఫాబాద్ కాగజ్‌నగర్ టైగర్ కారిడార్ మార్గంలో ఈ వంతెనలు ఏర్పాటు కానున్నాయి. తమ్మిడిహట్టి బరాజ్ నిర్మాణంలో భాగంగా పెద్దపులులు, వన్యప్రాణుల సంచారానికి ఆటంకం లేకుండా ఈ వంతెనలను నిర్మించడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత ప్రాజెక్టులో భాగంగా తమ్మిడిహట్టి బరాజ్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందుకోసం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డివిజన్‌లో 622 హెక్టార్ల అటవీభూమి అవసరమవుతున్నది. అటవీశాఖ ఆధీనంలోని బెజ్జూరు, గూడెం, కడంబ, హెట్టి రిజర్వ్ ఫారెస్టుల్లో బరాజ్‌ల నిర్మాణ పనులు కొనసాగనున్నాయి. ఈ రిజర్వ్ ఫారెస్ట్ టైగర్ కారిడార్ ప్రాంతంలో ఉన్నది. మహారాష్ట్ర అంధేరి తడోబా అభయారణ్యం నుంచి ఆసిఫాబాద్- కుమ్రం భీం జిల్లాలోని కాగజ్‌నగర్ మార్గంలో కవ్వాల్ టైగర్ రిజర్వ్ వరకు పెద్దపులులు వలస వస్తుంటాయి. ప్రస్తుతం కాగజ్‌నగర్ ప్రాంతంలో దాదాపు నాలుగు నుంచి ఆరుపులులు సంచరిస్తున్నాయి. కొన్ని కవ్వాల్‌లో స్థిరపడుతుండగా మరి కొన్ని తిరిగి తడోబాకు వెళ్తున్నాయి. టైగర్ కారిడార్ మొత్తం 80వేల హెక్టార్లలో విస్తరించి ఉన్నది. తమ్మిడిహట్టి బరాజ్ నిర్మాణం వల్ల ఆసిఫాబాద్-కుమ్రం భీం జిల్లాలోని రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇందుకోసం సేకరిస్తున్న అటవీభూమికి ప్రత్యామ్నాయంగా కంపా కింద ప్రభుత్వభూమిని, నెట్ మార్కెట్ వాల్యూ ప్రకారం నగదు పరిహారాన్ని ప్రభుత్వం ఇస్తున్నది. దీంతోపాటు దేశంలో మొదటిసారిగా పర్యావరణహిత వంతెనలను, కర్టెన్ కవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి దాదాపు రూ.440 కోట్లు అవసరమవుతాయని నీటి పారుదలశాఖ అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారు. దాదాపు 300 అడుగుల వెడల్పులో ఎనిమిది కర్టెన్ కవర్ బ్రిడ్జిలను, 90 అడుగుల వెడల్పులో పది పర్యావరణ వంతెనలను నిర్మిస్తారు. మొదట కాంక్రీట్ వంతెనలను నిర్మించి వాటిపై మట్టి పోసి అడవులను తలపించే వాతావరణాన్ని సృష్టిస్తారు. వంతెనలకు ఇరువైపులా చెట్లను నాటి సహజసిద్ధ వాతావరణాన్ని కల్పిస్తారు. తద్వారా పెద్దపులులు, ఇతర వన్యప్రాణులు బెదిరిపోకుండా తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల్లో అటూఇటు తిరుగడానికి వీలుంటుందని అధికారులంటున్నారు. ఈ బ్రిడ్జిల నిర్మాణానికి నేషనల్ వైల్డ్‌లైఫ్ బోర్డు, నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ అధికారులు ఇప్పటికే అంగీకారం తెలిపారు. ఈ మేరకు తాము రూపొందించిన సమగ్ర నివేదికను రాష్ట్ర నీటిపారుదల, అటవీశాఖల అధికారులు ఒకటి రెండురోజుల్లో కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖకు సమర్పించనున్నారు.



ఆసిఫాబాద్ కాగజ్‌నగర్ టైగర్ కారిడార్ మార్గంలో నిర్మించనున్న ఏకో బ్రిడ్జిల నమూనాలు

ముందు బుకింగ్ .. తర్వాత చెల్లించండి

తత్కాల్ టికెట్లకు ఐఆర్సీటీసీ వెసులుబాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తత్కాల్ టికెట్ల బుకింగ్ సమయంలో ఇబ్బందులుపడుతున్న ప్రయాణికులకు రైల్వేశాఖ భారీ ఊరటనిచ్చింది. అత్యవసరంగా ప్రయాణించాలనుకునే వారు ఆన్‌లైన్‌లో తక్షణం టికెట్ బుక్ చేసుకుని, డబ్బు తర్వాత చెల్లించే వెసులుబాటు కల్పించింది. టికెట్ స్వీకరించినప్పుడే డబ్బు చెల్లించే (పే ఆన్ డెలీవరీ) సౌలభ్యాన్ని కల్పిస్తున్నామని ఇటీవల రైల్వేశాఖ వెల్లడించింది. ఇదివరకు, ఈ సదుపాయం సాధారణ టికెట్ రిజర్వేషన్లకు మాత్రమే అందుబాటులో ఉండేది. తాజా నిర్ణయంతో ఐఆర్సీటీసీ తత్కాల్ బుకింగ్‌లోనూ ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందుకువినియోగదారు irctc.payondelivery.co.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్ లేదా పాన్ వివరాలు జతచేయాలి. టికెట్ బుకింగ్ చేస్తున్నప్పుడు పే-ఆన్ డెలివరీ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. డిజిటల్ ఎస్సెమ్మెస్ / ఈ-మెయిల్ ద్వారా తక్షణమే సమాచారం అందుతుంది. 24 గంటలలోపు రుసుమును స్వీకరిస్తారు. ఒకవేళ టికెట్ల డెలివరీలోపు రద్దుచేసుకుంటే చట్టప్రకారం భారీ జరిమానా తప్పదు. ఐఆర్సీటీసీ ఖాతా శాశ్వతంగా క్లోజ్ అవుతుంది. టికెట్లు తమ ఇంటి వద్దకు బట్వాడా చేయాలనుకుంటే, వినియోగదారులు నగదు, డెబిట్ లేదా క్రెడిట్‌కార్డు ద్వారా చెల్లించాలి. ఈ-పే డెలివరీ ఫీచర్ ద్వారా వినియోగదారులు కొన్ని సెకండ్లలో తత్కాల్ టికెట్లు బుక్ చేసుకునే అవకాశం కలుగుతుందని ఐఆర్సీటీసీ అండూరిల్ టెక్నాలజీస్ సీఈవో అనురాగ్ బాజ్‌పాయ్ తెలిపారు. తద్వారా లక్షలమంది ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. తత్కాల్ బుకింగ్ సమయంలో తరుచుగా డబ్బు డెబిట్ అయినా టికెట్ బుక్ కాకపోవడం, డబ్బులు తిరిగి మన ఖాతాలోకి చేరడానికి కనీసం 7 నుంచి 15 రోజుల సమయం పట్టడం లాంటి సమస్యలు ఉండేవి.

450 కోట్ల బీఆర్‌జీ నిధుల విడుదల

ఉత్తర్వులు జారీచేసిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ
సీఎం కేసీఆర్ విజ్ఞప్తికి స్పందించిన ప్రధాని

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న 'ప్రత్యేక ఆర్థిక సాయం' ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వాల్సిన రూ.450 కోట్లను విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి విడుదల కావాల్సిన రూ.450 కోట్లను వెంటనే విడుదలచేయాలని ప్రధాని నరేంద్రమోదీకి సీఎం కేసీఆర్ గతనెల 26న చేసిన విజ్ఞప్తితో.. ఐదు రోజుల్లోనే నిధులు విడుదలయ్యాయి. ఈ నెల 1వ తేదీన నిధులను విడుదల చేసినట్టు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నది. పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ప్రత్యేక ఆర్థికసాయం పేరుతో వెనుకబడిన జిల్లాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఒక్కో జిల్లాకు ఏటా రూ.50 కోట్లను అందజేయాల్సి ఉంది. తెలంగాణలోని మొత్తం పది జిల్లాల్లో తొమ్మిది వెనుకబడినవిగానే గతంలోని ప్లానింగ్ కమిషన్ నిర్ణయించడంతో ఒక్కో జిల్లాకు రూ. 50 కోట్ల చొప్పున ఏటా రూ. 450 కోట్లను విడుదలచేయాల్సి ఉంది. ఇప్పటివరకు రెండు విడుతలుగా రాష్ట్రానికి రూ.900 కోట్లు విడుదలయ్యాయి.

రెండేండ్లలో 10,345 కోట్లు ఇచ్చాం

తెలంగాణకు నిధుల విడుదలపై కేంద్రం వివరణ

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: రెండేండ్లలో కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి తెలంగాణకు రూ.10,345.98 కోట్లను విడుదల చేసినట్టు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తెలిపింది. తాజాగా విడుదల చేసిన రూ.450 కోట్ల వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు కూడా ఇందులో ఉన్నాయి. ఇప్పటివరకు తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలను తెలుపాల్సిందిగా రాజ్యసభ సభ్యుడు డీ శ్రీనివాస్ అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ మంగళవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

ఆరువారాల్లోగా ఆర్టీఐ కమిషనర్ల నియామకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర సమాచార హక్కు ప్రధాన కమిషనర్‌తో పాటు ఇతర కమిషనర్లను ఆరువారాల్లో నియమిస్తామని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నివేదించింది. నియామక ప్రక్రియను పూర్తిచేసి నివేదికను సమర్పించాలని, తదుపరి విచారణను సెప్టెంబర్ 21వ తేదీకి వాయిదా వేసింది. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ స్వచ్ఛంద సంస్థ వ్యాజ్యం దాఖలు చేసింది.

ఫార్మసీ కాలేజీల్లో సీట్ల కేటాయింపు పూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని డీ ఫార్మసీ కాలేజీల్లో సీట్ల భర్తీ ప్రక్రియ మంగళవారం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 830 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వెబ్ కౌన్సెలింగ్ ముగిసేనాటికి 595 సీట్లు మిగిలాయని డీఫార్మసీ కౌన్సెలింగ్ కన్వీనర్ ఏ వాణీప్రసాద్ తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 11లోగా తమ కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

రుణాల మంజూరులో జాప్యం తగదు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎస్సీలకు స్వయం ఉపాధి పథకం కింద సబ్సిడీ రుణాల మంజూరులో ఏ మాత్రం జాప్యం చేయరాదని ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ ఎండీ లచ్చిరాం బూక్యా అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో 25 బ్యాంకులకు చెందిన కంట్రోలింగ్ అధికారులు, జాతీయ ఎస్సీ కులాల ఆర్థిక అభివృద్ధి సంస్థ ప్రతినిధులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. 2016-17 ఆర్థిక సంవత్సరానికి పెండింగ్‌లో ఉన్న బ్యాంకు ఖాతాలను 15వ తేదీలోపు తెరిచేందుకు కృషిచేయాలన్నారు.

వారంలో వర్షానుకూల పరిస్థితులు

తగిన చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ కార్యదర్శి ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వారంరోజుల్లో వర్షానుకూల పరిస్థితులు ఉన్న నేపథ్యంలో రైతులకు తగిన సూచనలు ఇస్తూ.. వానాకాలంలో వేసిన పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి అధికారులకు సూచించారు. మంగళవారం కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనసంస్థ (క్రిడా)లో నిర్వహించిన అవగాహన సదస్సుకు పార్థసారథి అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్రధానంగా 2017 వానాకాలం సీజన్‌లో ఇప్పటివరకు వివిధ జిల్లాల్లో నమోదైన వర్షపాతం, పంటల వివరాలపై చర్చించారు. వర్షాభావ పరిస్థితుల మూలంగా పంటలకు తెల్లదోమ ఆశించే అవకాశం ఉన్నందున రైతలకు అవగాహన కల్పించాలన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, క్రిడా, వ్యవసాయశాఖ, తెలంగాణ ప్రభుత్వం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన ఈ సమావేశంలో క్రిడా డైరెక్టర్ డాక్టర్ సమ్మిరెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ప్రవీణ్‌రావు, వ్యవసాయ కమిషనర్ జగన్మోహన్, శాస్త్రజ్ఞులు, 30 జిల్లాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో మూడు విద్యాపథకాల విలీనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉద్దేశించిన మధ్యాహ్న భోజన పథకం, రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్, సర్వశిక్ష అభియాన్‌ను సెప్టెంబర్‌లోగా ఒకేగొడుగు కిందకు తీసుకురావాలనే కేంద్రప్రభుత్వ నిర్ణయానికి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆమోదం తెలిపింది. ఎస్ఎస్ఏ పరిధిలో ఆర్ఎంఎస్ఏ, మధ్యాహ్న భోజన పథకాలను విలీనం చేయాలనే కేంద్రం ప్రతిపాదనలను అంగీకరించిన రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్.. ఆమోదం కోసం త్వరలో ప్రభుత్వానికి ఫైల్ పంపనున్నట్టు తెలిసింది.

బడి ఫీజుల ఖరారుకు కసరత్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అన్ని రకాల ప్రైవేటు పాఠశాలల్లో వసూలుచేస్తున్న అధిక ట్యూషన్ ఫీజుల విధానాన్ని నియంత్రించడంపై ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ కసరత్తు చేస్తున్నది. మూడేండ్ల ఫీజుల వివరాలను ఆన్‌లైన్ ద్వారా సేకరించేందుకు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ సహాయంతో ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించింది. సీజీజీ సహకారంతో తయారుచేసిన పోర్టల్‌ను తిరుపతిరావు మంగళవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం లో పరిశీలించారు. ఫీజుల వివరాల సేకరణకు 15 రోజుల గడువు విధిస్తామన్నారు.

సదావర్తి భూ వేలంపై ఏపీ సర్కార్‌కు చుక్కెదురు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తమిళనాడులో ఉన్న ఏపీ చెందిన 83 ఎకరాల సదావర్తి భూములకు గతంలో నిర్వహించిన వేలంపాట స్థానంలో ఆరువారాల్లోగా మళ్లీ వేలంపాటను నిర్వహించాలని ఉమ్మడి హైకోర్టు న్యాయస్థానం తేల్చిచెప్పింది. ప్రభుత్వ ఖజానాకు అధిక మొత్తం వచ్చేందుకు వీలుగా పునః వేలానికి ఆదేశాలు జారీచేస్తున్నట్టు స్పష్టంచేసింది. 83 ఎకరాల సదావర్తి భూములను టీడీపీ ప్రభుత్వం తమ అనుయాయులకు చౌకగా కట్టబెట్టిందని వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారించింది.

ఒడిశా టు ముంబై

గంజాయి రవాణాకు కేరాఫ్‌గా 'కోణార్క్' ◆ నిత్యం రైల్లో పట్టుబడుతున్న వైనం ◆ అడపాదడపా ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లోనూ.. నిఘాను పసిగట్టి సరుకు వదిలి వెళ్తున్న అక్రమార్కులు ◆ 15 రోజుల్లో నాలుగున్నర క్వింటాళ్ల పట్టివేత



కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (ఫైల్)

వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ గంజాయి రవాణాకు కేరాఫ్‌గా మారింది. ఒడిశా నుంచి ఏపీ, తెలంగాణ మీదుగా ముంబై వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో నిత్యం గంజాయి పట్టుబడుతూనే ఉంది. పక్షం రోజుల్లోనే వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్లలో దాదాపు 4.78 క్వింటాళ్ల గంజాయిని పట్టుకున్నారు. ఈ కేసుల్లో 12 మంది మాత్రమే దొరికారు. మిగతా వారంతా నిఘాను గుర్తించి సరుకు వదిలి పారిపోయారు. హైదరాబాద్‌లో డ్రగ్ మాఫియా గుట్టురట్టు చేసిన తెలంగాణ సర్కార్ డ్రగ్స్‌తోపాటు ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెలిసిందే. రంగంలోకి దిగిన వివిధ విభాగాల అధికారులు విస్తృత తనిఖీలు చేపడుతుండటంతో గంజాయి, గుట్కా రవాణాదారుల వెన్నులో వణుకు మొదలైంది. కాగా భువనేశ్వర్ నుంచి ముంబై వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లోనే సింహభాగం గంజాయి పట్టుబడింది. ఇదే మార్గంలో నడిచే ఎల్‌టీటీ (లోకమాన్య తిలక్ టర్మినల్) ఎక్స్‌ప్రెస్‌లోనూ గంజాయితోపాటు నిషేధిత గుట్కా సహా ఇతర పొగాకు ఉత్పత్తులు దొరికాయి.

బరంపురం, అరకు నుంచి..

ఒడిశా రాష్ట్రంలోని బరంపురం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అరకు (విశాఖపట్నం) ఏజెన్సీ ప్రాంతాల్లో దొరికే గంజాయిని చౌకగా కొనుగోలు చేసి అక్కడి నుంచి అత్యంత ఆధునిక పద్ధతుల్లో ప్యాకింగ్ చేసి ముంబై తరలిస్తున్నారు. అదే సమయంలో మహబూబాబాద్, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ సహా ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు గంజాయిని తరలిస్తున్నారని అనుమానించిన పోలీసులు అప్రమత్తమై అనుమానాస్పద ప్రాంతాలపై ప్రత్యేక నిఘా వేశారు. దీంతో వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలోని హన్మకొండ పట్టణం జవహర్‌నగర్‌లో గతనెల చివరివారంలో గంజాయి వ్యాపారం చేస్తున్న ఏడుగురు మహిళలను ఎక్సైజ్ పోలీసులు పట్టుకొని జైలుకు పంపారు.

ముంబైకి తరలిస్తున్న ముఠా...

గతనెల 26న వరంగల్ రైల్వే పోలీసులు 24 కిలోల గంజాయిని పట్టుకున్నారు. అదే రోజు విశాఖపట్నానికి చెందిన శేఖర్‌ను, మరుసటి రోజు ముంబైకి చెందిన సురేంద్ర సుదర్శన్ అనే విద్యార్థిని పట్టుకొని విచారించి మరింత సమాచారాన్ని సేకరించారు. ఈనెల 6న కాజీపేట పోలీసులకు సర్దార్ శంభూ రతన్ సింగ్ పట్టుబడ్డాడు. వారం రోజుల క్రితం కాజీపేట రైల్వే పోలీసులు అరెస్టు చేసిన సఫల్ ఉల్ రహెమాన్ కూడా ముంబై వాసే కావడంతో ముంబై గంజాయి మాఫియా రైలు మార్గాన్ని తమకు అనుకూలంగా ఎంచుకున్నట్టు తెలుస్తున్నది. అందుకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను గంజాయి రవాణాకు ఉపయోగించుకుంటున్నారు.

తెలివిగా తప్పించుకుంటున్న అక్రమార్కులు

గంజాయి తరలిస్తున్న వారిలో ఇప్పటివరకు 12 మంది పట్టుబడ్డారు. రైల్వేస్టేషన్లలో పోలీసుల గస్తీ, నిఘా పెరుగడంతో చాలామంది తాము సరుకును వదిలి వెళ్తున్న ఉదంతాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ దశ రైల్వే పోలీసులు వ్యూహం మారుస్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి నిఘా ఏర్పాటు చేశారు. విజయవాడ స్టేషన్‌లో పోలీసులు రైలు ఎక్కి అక్కడి నుంచి నిఘా పెడుతున్నారు. మహబూబాబాద్, వరంగల్, కాజీపేటలో గాలింపు వ్యూహాన్ని అమలు చేస్తున్నట్టు కాజీపేట రైల్వే డీఎస్పీ శ్రీనివాస్‌రావు తెలిపారు.

156 కిలోల గంజాయి పట్టివేత: ఎనిమిది మంది అరెస్టు

ఒడిశా నుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి తరలిస్తున్న ఎనిమిది మందిని వరంగల్ రైల్వే పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నిందితుల్లో నలుగురు మహిళలు కూడా ఉన్నారు. 15 బ్యాగుల్లో తరలిస్తున్న 156 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన రేబతి నాయక్ అలియాస్ పరిచా (36), పంకజ్ మిశాల్ (35), నిస్తా లిమా (36), గౌరీ (36), కుమారమని నాయక్ (40), ప్రమోద్ పరిచా (19), గజేంద్ర బేహేరా (22), దీప్తి మిశాల్ (27) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఎండిన గంజాయి తరలిస్తూ వరంగల్‌లో రైల్వేపోలీసులు జరిపిన సోదాల్లో పట్టుబడ్డారు.

గంజాయిపై నిఘా పెట్టాం

7 నెలల్లో 26 కేసులు: డీజీపీ (రైల్వే) కృష్ణప్రసాద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైలుమార్గాల్లో గంజాయి రవాణాచేస్తున్న వారిపై నిఘా పెట్టినట్టు డీజీపీ (రోడ్ భద్రత-రైల్వేస్) కృష్ణప్రసాద్ చెప్పారు. ప్రతి రైల్వేస్టేషన్‌లో నిఘా బృందాలు, టాస్క్‌ఫోర్స్ పనిచేస్తున్నదని అన్నారు. రాష్ట్రంలోని అన్ని రైల్వే పోలీస్‌స్టేషన్లను అప్రమత్తం చేయడంతోపాటు ఇతర రాష్ట్రాల రైల్వే పోలీసుల సహాయం కూడా తీసుకుంటున్నట్టు మంగళవారం ఆయన చెప్పారు. ఏడునెలల్లో గంజాయి సరఫరాచేసే వారిపై 26 కేసులు పెట్టి, 38 మందిని అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి 1078 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మూడేండ్లలో 62 కేసులు నమోదు కాగా, 94 మందిని అరెస్టుచేయడంతోపాటు 2,528 కిలోల గంజాయి స్వాధీనం పర్చుకున్నామని వివరించారు. హరితహారంలో పోలీస్‌శాఖకు నిర్దేశించిన లక్ష్యానికి చేరువలో ఉన్నట్టు కృష్ణప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన జియగూడలోని శ్రీసద్గురు సామ్రాట్ నారాయణ ఆశ్రమంలో మొక్కలు నాటారు.

కాలుష్యంపై పోరుకు క్లీన్ ఎయిర్ అథారిటీ!

- రాష్ట్రవ్యాప్తంగా అమలుకు చర్యలు
- టోక్యో తరహాలో పక్కాగా ప్రణాళికలు
- పరిశీలిస్తున్న పురపాలక మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి క్లీన్ ఎయిర్ అథారిటీని ఏర్పాటుచేస్తే అది రాష్ట్రవ్యాప్తంగా పనిచేసే విధంగా ఉండాలని పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు యోచిస్తున్నారు. క్లీన్ ఎయిర్ అథారిటీని హైదరాబాద్‌కే పరిమితం చేయాలని మంత్రి తొలుత భావించారు. అయితే జపాన్ వెళ్లి వచ్చిన అధికారుల బృందం చేసిన సూచనలతో ఆయన రాష్ట్రవ్యాప్తంగా క్లీన్ ఎయిర్ కార్యక్రమం ఉండాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణకు టోక్యో ఇస్తున్న ప్రాధాన్యం, వినియోగిస్తున్న ఆధునిక పరిజ్ఞానం గురించి అధికారులు మంత్రికి వివరించారు. త్వరలో వారు ప్రభుత్వానికి నివేదిక కూడా అందజేయనున్నారు. ఆ నివేదికను అధ్యయనం చేసిన తరువాత క్లీన్ ఎయిర్ అథారిటీపై తుది నిర్ణయం తీసుకుంటారని సమాచారం. రాష్ట్రంలో గాలితోపాటు చెరువులు, నదులు వంటి జలవనరులు ఎక్కువగా కలుషితం అవుతున్నాయి. పెరిగిన వాహనాల సంఖ్య, కల్తీపెట్రోల్, ట్రాఫిక్, దెబ్బతిన్న రహదారులు, నిర్మాణరంగం, పరిశ్రమలు, తదితర కారణాల వల్ల కాలుష్యం రోజురోజుకు రెట్టింపవుతున్నది. ప్రధానంగా హైదరాబాద్‌లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. డ్రైనేజీ, చెత్త వంటి వ్యర్థ పదార్థాల నిర్వహణ మరో ముఖ్యమైన సమస్య. రాష్ట్రంలోని 72 పట్టణ, స్థానిక సంస్థల్లోనూ ఘనవ్యర్థాల శాతం పెరుగుతున్నది. ప్రమాదకర స్థాయికి చేరుకుంటున్న కాలుష్యాన్ని అరికట్టడానికి క్లీన్ ఎయిర్ అథారిటీని ఏర్పాటు అంశాన్ని మంత్రి కేటీఆర్ పరిశీలిస్తున్నారు. జపాన్ దేశం 1980 నుంచి ఘనవ్యర్థాలను సమర్థంగా నిర్వహిస్తున్నది. పక్కా చర్యల్ని తీసుకున్నది. 2001లో టోక్యోలో క్లీన్ ఎయిర్ అథారిటీ ఏర్పాటైంది. 1990 నుంచి డీజిల్ వాహనాలను నియంత్రించారు. ఫలితంగా అక్కడ ఎక్కడా చెత్త అనేది కన్పించదు. ఈ విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం కోసం ఇటీవల ఉన్నతస్థాయి బృందాన్ని జపాన్ పర్యటనకు పంపించింది. అక్కడి నుంచి తిరిగొచ్చిన అధికారులు మంత్రిని కలిసి తమ పర్యటన విశేషాల్ని వివరించారు. దీంతో ఇక్కడ కూడా టోక్యో తరహా విధానాలను అవలంబిస్తే బాగుంటుందని అనుకుంటున్నారు.

హరితహారంలో కలెక్టర్లు చాంపియన్లు

- పంద్రాగస్టుకు ఘనంగా ఏర్పాట్లు చేయండి: సీఎస్ ఎస్పీ సింగ్ ఆదేశం



హరితహారం పురోగతిపై మంగళవారం సచివాలయం నుంచి జిల్లాల అన్నిశాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసి కలెక్టర్లు చాంపియన్లుగా నిలువాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ సూచించారు. హరితహారం పురోగతిపై మంగళవారం అన్నిశాఖల అధికారులతో సీఎస్ ఎస్పీ సింగ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొక్కలునాటి, జియో ట్యాగింగ్ చేయటంతోపాటు గ్రీన్ బ్రిగేడ్లను ఏర్పాటుచేయాలని కలెక్టర్లకు సూచించారు. భవిష్యత్తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి రూపొందించారని చెప్పారు. హైవేలు, ప్రధాన రహదారుల వెంటనాటిన మొక్కల రక్షణట్రీగార్డులు చాలాచోట్ల చోరీకి గురవుతున్నాయని తెలుపగా.. వారిని అరెస్టు చేసి జైలుకు పంపాలని హోంశాఖ కార్యదర్శి రాజీవ్ త్రివేదిని సీఎస్ ఆదేశించారు.

బతుకమ్మ చీరల పంపిణీకి ప్రణాళిక రూపొందించండి.

రాష్ట్రవ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సీఎస్ ఎస్పీ సింగ్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వారితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్ పంద్రాగస్టుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని స్పష్టంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షల చీరలు మహిళలకు పంపిణీ చేయాల్సి ఉన్నందున గ్రామాలవారీగా తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు.

మిషన్ భగీరథ పనులపై సమీక్షించండి

మిషన్ భగీరథ కింద డిసెంబర్ నాటికి అన్ని గ్రామాలకు తాగునీరు అందాల్సి ఉన్నందున జిల్లా కలెక్టర్లు పనుల తీరును సమీక్షించాలని ఆయన ఆదేశించారు. ఈ పథకం కింద 19 ఇన్‌టేక్ వెల్స్ నిర్మించాల్సి ఉండగా 16 పూర్తయ్యాయని తెలిపారు. మిషన్ భగీరథ పథకంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి అధర్‌సిన్హా, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అశోక్‌కుమార్, ఆర్థికశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఆబ్కారీ కమిషనర్ చంద్రవదన్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ నీతూప్రసాద్, చేనేత, జౌళిశాఖ కమిషనర్ శైలజా రామయ్యార్, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి ఎండీ ఎక్కా, సింగరేణి ఏజీఎం వివేక్‌బాబు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

బీసీ మంత్రిత్వశాఖకు కేంద్రం సానుకూలం



బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో మంగళ వారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన మహాధర్నాలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ. చిత్రంలో ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ తదితరులు

- కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టడానికి, జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, ఓబీసీల సంక్షేమం కోసం ప్రత్యేకంగా మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయడానికి కూడా కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉన్నదని కేంద్ర కార్మికశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ స్పష్టం చేశారు. విద్య, ఉద్యోగాలతోపాటు రాజకీయాల్లో (చట్టసభల్లో) ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో మంగళవారం జరిగిన మహాధర్నాకు ఆయన హాజరయ్యారు. దేశ జనాభాలో 56 శాతం బీసీలు ఉన్నా వారిని అనాథలుగానే చూస్తున్నారని టీఆర్ఎస్ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ఆవేదన వ్యక్తంచేశారు. ధర్నాకు కాంగ్రెస్ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్, మాజీ ఎంపీలు వీ హనుమంతరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ చైర్మన్ ప్రొఫెసర్ బబన్‌రావ్ తైవాడ్, పార్లమెంటు సభ్యుడు, ఓబీసీ మాజీ కన్వీనర్ కుశాల్‌సింగ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు.

గిరిజన భూముల అభివృద్ధికి 112.60 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని గిరిజనుల వ్యవసాయ భూములను సాగుకు అనుకూలంగా మార్చేందుకు ఈ ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.112.60 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ కార్యదర్శి బెనహర్ మహేశ్‌దత్ ఎక్కా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నిధులతో గిరిజనుల వ్యవసాయ భూములను సాగుకు అనుకూలంగా మార్చడం, బోర్లువేయడం, పంపు సెట్లు, విద్యుత్ సౌకర్యం కల్పించడం వంటి పనులు చేపట్టాలని సూచించారు. తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ట్రైకార్) ద్వారా గిరిజన వ్యవసాయ భూముల అభివృది చేస్తామన్నారు.

22న కృష్ణాబోర్డు సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు 22న విజయవాడలో సమావేశం కానున్నది. వాస్తవానికి 18న సమావేశం నిర్వహించాలని తొలుత భావించారు. కానీ 17, 18 తేదీల్లో పార్లమెంటరీ కమిటీ పర్యటిస్తున్న నేపథ్యంలో తేదీలో మార్పుచేశారు. 22న జరిగే సమావేశంలో ఏడు ప్రధాన అంశాలను ఎజెండాగా ఎంచుకున్నారు. గత ఫిబ్రవరిలో జరిగిన బోర్డు ప్రత్యేక సమావేశంతో పాటు ఐదో బోర్డు సమావేశాల్లోని మినిట్స్ అంశాలపై శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో ప్రస్తుతం నమోదుచేసే స్థాయిలో ఇన్‌ఫ్లో లేనందున ఏం చేయాలనే విషయమై చర్చించే అవకాశాలున్నాయి. 2017-18లో జల పంపిణీ విధానం(మెకానిజం)పై చర్చించనున్నారు.

ఉన్నతవిద్యామండలి వైస్‌చైర్మన్లకు బాధ్యతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ఉన్నత విద్యామండలి నూతన వైస్ చైర్మన్లుగా ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ వెంకటరమణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, సభ్యులు ఓవన్‌రెడ్డి సమక్షంలో వైస్ చైర్మన్లు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. డిగ్రీ, పీజీ, బీటెక్ కాలేజీల్లో సంస్కరణలను తీసుకోస్తామని వారు పేర్కొన్నారు.

పదోన్నతులపై రాజీవ్‌శర్మతో డీజీపీ భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలీసుల పదోన్నతి అంశంపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మతో డీజీపీ అనురాగ్‌శర్మ మంగళవారం భేటీఅయ్యారు. పదోన్నతులపై తీసుకుంటున్న నిర్ణయాలపై ఈ సందర్భంగా చర్చించారు. పోలీసుశాఖలో పదోన్నతుల విషయంలో అమలులో ఉన్న విధానాలు, తాజాగా తీసుకుంటున్న నిర్ణయాలను డీజీపీకి రాజీవ్‌శర్మ వివరించారు. పోలీసుశాఖలో పదోన్నతులపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉందనే సంకేతాలు వచ్చినట్టు తెలిసింది. దీంతో రాజీవ్‌శర్మతో అనురాగ్‌శర్మ సమావేశమై పదోన్నతుల అంశంపై చర్చించారు.

విద్యుత్ ట్రేడ్ యూనియన్ల ఎన్నికలు వాయిదా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యుత్ కార్మిక సంఘాల ఎన్నికలు సెప్టెంబర్ 8వ తేదీకి వాయిదా పడ్డాయి. మంగళవారం జరుగాల్సిన ఈ ఎన్నికలను వాయిదా వేయాలని విద్యుత్ సంస్థల యాజమాన్యాలు, కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేయడంతో రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. ఓటర్ల జాబితాలో కొందరి పేర్లు చేర్చాలని, ఫైర్ అండ్ సెక్యూరిటీ విభాగం ఉద్యోగులను ఓటర్ల జాబితా నుంచి తొలిగించాలని, ముసాయిదా ఓటర్ల జాబితాకు తుది రూపుదిద్దాలని ఉద్యోగులు విజ్ఞప్తిచేశారు.

పదవీ విరమణ వయోపరిమితి పెంచాలి

తెలంగాణ సివిల్ ఇంజినీర్ల ఫోరం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని 58 నుంచి 60 ఏండ్లకు పెంచాలని తెలంగాణ సివిల్ ఇంజినీర్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కోదాటి శ్యాంసుందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పబ్లిక్ హెల్త్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశైలం తదితరులతో కలిసి మం గళవారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేసిన ఉద్యోగులను బంగారు తెలంగాణ కార్యక్రమంలో భాగస్వాములను చేసేందుకు వారి పదవీ విరమణ వయోపరిమితిని పెంచాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఏపీలో ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును 60 ఏండ్లకు పెంచారని, అదే మాదిరిగా మన రాష్ట్రంలోనూ పెంచాలన్నారు. ప్రభుత్వ వైద్యుల రిటైర్మెంట్ వయసును కూడా 63 ఏండ్లకు పెంచాలన్నారు.

నయీం కేసు దర్యాప్తు త్వరలో పూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్యాంగ్‌స్టర్ నయీం అరాచకాలపై నమోదైన అన్ని కేసుల దర్యాప్తును త్వరలోనే పూర్తిచేస్తామని అదనపు డీజీపీ అంజనీకుమార్ మంగళవారం మీడియాకు తెలిపారు. త్వరలోనే అన్ని కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేస్తామని చెప్పారు. దర్యాప్తు పూర్తయిన కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేశామని వెల్లడించారు. కేసుల దర్యాప్తుకు ఏర్పాటుచేసిన సిట్‌కు డీజీపీ అంజనీకుమార్ చీఫ్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. నయీం ఎన్‌కౌంటర్ జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా కేసుల పురోగతిని వెల్లడించారు. నయీం గ్యాంగ్ అరాచకాలపై 227 కేసులు నమోదయ్యాయని, దర్యాప్తులో భాగంగా 895 సాక్షులను విచారించి, 128 మందిని రిమాండ్‌కు తరలించామన్నారు. అరెస్టయిన వారిలో 14 మందిపై పీడీ యాక్ట్ అమలుచేశామని చెప్పారు. అరెస్టయిన వారిలో ఎనిమిదిమంది రాజకీయ నాయకులు ఉన్నారని తెలిపారు. నయీంతో సంబంధాలున్న పోలీసులపై చర్యలు తీసుకున్నామన్నారు. శేషన్న కోసం బృందాలు గాలిస్తున్నాయని, దర్యాప్తు సమయంలో వివరాలు చెప్పకూడదన్నారు.

పచ్చదనంలో తెలంగాణ టాప్

దేశవ్యాప్తంగా 16.83 లక్షల హెక్టార్లలో అభివృద్ధి • ఒక్క తెలంగాణలోనే 4.36 లక్షల హెక్టార్లు
నాటిన మొక్కల్లో 26శాతం ఇక్కడే • కేంద్ర పర్యావరణ మంత్రి హర్షవర్ధన్ వెల్లడి



న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ:

అడవుల పెంపకం, పచ్చదనం అభివృద్ధి , మొక్కలు నాటడం వంటి అంశాల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. జాతీయ అటవీ పాలసీలోని గ్రీన్ మిషన్, మొక్కల పెంపకం విభాగాల్లో తెలంగాణ ముందువరుసలో ఉంది. 2016-17లో దేశవ్యాప్తంగా నాటిన మొక్కల్లో తెలంగాణ 26శాతం వాటా సాధించింది. కేంద్ర పర్యావరణమంత్రి హర్షవర్ధన్ మంగళవారం లోక్‌సభలో ఈ వివరాలు ప్రకటించారు. 2016-17లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి 80,446 హెక్టార్లలో పచ్చదనాన్ని అభివృద్ధిచేసే లక్ష్యాన్ని నిర్దేశిస్తే, రాష్ట్రం 4,36,913 హెక్టార్లలో ఫలితాన్ని సాధించింది. ఇది నిర్దేశిత లక్ష్యంకంటే ఐదురెట్లు ఎక్కువ. 2015-16లో సైతం 59970 హెక్టార్ల లక్ష్యానికిగాను 2.36,598 హెక్టార్లలో ఫలితాన్ని సాధించింది. దేశంలో ఏ రాష్ట్రం కూడా తెలంగాణకు దరిదాపుల్లో కూడా లేదు. కాగా ఆంధ్రప్రదేశ్ 2.45 లక్షల హెక్టార్లు, ఒడిశా 1.97 లక్షల హెక్టార్ల ఫలితాన్ని సాధించాయి. లోక్‌సభలో కేంద్ర పర్యావరణ మంత్రి ఈ వివరాలు వెల్లడించారు.

దేశంలో 26శాతం వాటా..

2016-17లో దేశవ్యాప్తంగా పచ్చదనం అభివృద్ధి, అడవుల పెంపకంలో లక్ష్యాలను మించిన ఫలితాలు వచ్చాయి. మొత్తం 10.89 లక్షల హెక్టార్ల లక్ష్యాన్ని పెట్టుకోగా 16.83 లక్షల హెక్టార్ల ఫలితం వచ్చింది. ఈ ఫలితాల్లో ఒక్క తెలంగాణ వాటాయే దాదాపు 26శాతానికి పైగా ఉంది. తెలంగాణకు 80,446 హెక్టార్లలో పచ్చదనం అభివృద్ధి లక్ష్యం ఇవ్వగా డిసెంబరు చివరి నాటికే 4,36,913 హెక్టార్ల ఫలితాన్ని (543% ఎక్కువ) సాధించింది.

మొక్కల పెంపకంలో రికార్డు..: మొక్కల పెంపకంలో తెలంగాణ రికార్డు సృష్టించింది. 2016-17లో దేశవ్యాప్తంగా 70.82 కోట్ల మొక్కలు లక్ష్యం కాగా 133.43 కోట్ల మొక్కలు నాటారు. అందులో ఒక్క తెలంగాణలోనే 36.73 కోట్ల మొక్కలను నాటారు. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రానికి 5.22 కోట్ల మొక్కల లక్ష్యాన్ని మాత్రమే ఇచ్చారు. అయినా 9 నెలల వ్యవధిలోనే 36.73 కోట్ల మొక్కలను నాటారు. 2015-16లో కూడా 3.89 కోట్ల లక్ష్యాన్ని అధిగమించి 13.78 కోట్ల మొక్కలను నాటినట్లు కేంద్ర మంత్రి వివరించారు. ఇది లక్ష్యం కంటే దాదాపు 705% (ఏడు రెట్లు) ఎక్కువ. దేశం మొత్తంమీద నాటిన మొక్కల సంఖ్యతో పోలిస్తే ఒక్క తెలంగాణ రాష్ట్రం వాటానే 27.52%గా ఉందని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత 2014 జూన్ మొదలు 2016 డిసెంబరు వరకు రెండు సంవత్సరాల మూడునెలల కాలంలో రాష్ట్రంలో 54.97 కోట్ల మొక్కలు నాటారని, 7,53,957 హెక్టార్లలో పచ్చదనాన్ని అభివృద్ధి చేశారని మంత్రి తెలిపారు. కాగా తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా 230 కోట్ల మొక్కలు నాటాలని సీఎం కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నారు. కేంద్రమంత్రి చెప్పిన వివరాల్లో మొదటి, రెండో విడత నాటిన మొక్కల వివరాలు మాత్రమే పొందుపరిచారు. గత నెలలో చేపట్టిన మూడో విడుత వివరాలు మంత్రి సమాధానంలో లేవు.

కులవృత్తిదారులు గౌరవంగా బతుకాలి

నాయీబ్రాహ్మణులకు రూ.250 కోట్లు కేటాయింపు
అధునాతన సెలూన్లు, పరికరాల ప్రదర్శనలో మంత్రి జోగు రామన్న



మంగళవారం బేగంపేట ప్యాలెస్‌లో అధునాతన సెలూన్లు, పరికరాల ప్రదర్శనలో పాల్గొన్న మంత్రులు జోగు రామన్న, తలసాని, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కులవృత్తిదారులు ఆత్మగౌరవంతో జీవించడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.250 కోట్లు కేటాయించిందని చెప్పారు. నాయీ బ్రాహ్మణులు తమ వృత్తి నైపుణ్యం పెంచుకునేందుకు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సహకార సంఘాల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం బేగంపేట ప్యాలెస్‌లో అధునాతన సెలూన్లు, పరికరాల ప్రదర్శన ఏర్పాటుచేశారు. దీనిని మంత్రులు జోగు రామన్న, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. జోగు రామన్న మాట్లాడుతూ కుల వృత్తులను ఆధునికరించేందుకు కార్యాచరణ చేపట్టామన్నారు. రాష్ట్ర మత్స్య, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ టీఆర్‌ఎస్ సర్కారు అన్ని వర్గాల అభివృద్ధికి కృషిచేస్తున్నదని అన్నారు. ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ సంస్థల్లో నాయీ బ్రాహ్మణ వృత్తి విద్యలను కోర్సులుగా చేర్చాలని కోరారు. ప్రభుత్వం బీసీల సంక్షేమంపై దృష్టిపెట్టిందని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి అశోక్‌కుమార్, బీసీ కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయగౌడ్, జూలూరి గౌరీశంకర్, ప్రభుత్వ సలహాదారు రామలక్ష్మణ్, కార్పొరేటర్ ధరణి, బీసీ సంక్షేమశాఖ కమిషనర్ విజయ్‌కుమార్, నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ ఎండీ రమాదేవి, రజకుల సమాఖ్య ఎండీ చంద్రశేఖర్, బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్యభట్టు, జేడీ రాజశేఖర్, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు నరేందర్, రాచమల్ల సూర్యనారాయణ, సూరిరాజు తదితరులు పాల్గొన్నారు. క్షౌర వృత్తిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదని నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక ఛైర్మన్ మహేశ్ చంద్ర, కన్వీనర్ ఎం లింగం, కార్యదర్శి జీ శ్రీనివాస్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు.

అంతర్రాష్ట్ర బదిలీలకు మార్గదర్శకాలు

మొదటిపేజీ తరువాయి...

ఉంటారు. బదిలీలు పారదర్శకంగా జరుగాలని, ఏపీ నుంచి వచ్చే ఉద్యోగి తప్పకుండా తెలంగాణ స్థానికతను కలిగి ఉండాలని తెలంగాణ ఉద్యోగ సంఘాల నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల విభజన పూర్తి చేసి జాబితాలను ఆమోదించిన శాఖలన్నింటిలో పరస్పర బదిలీల కోసం ఉద్యోగదంపతులు చేసుకునే విజ్ఞప్తులను పరిశీలిస్తారు. ఇదివరకు పరిగణనలోకి తీసుకోలేకపోయిన దంపతుల ఇబ్బందులను కూడా పరిశీలించి వారు కోరుకున్న రాష్ట్రానికి బదిలీ చేస్తారు. ఇందుకోసం ఉద్యోగులు నెలరోజులలోపు నిర్ణీత నమూనాలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం రెండు మాసాలలో ఈ ప్రక్రియను పూర్తి చేస్తుంది. ఉద్యోగి తాను పనిచేస్తున్న కార్యాలయం శాఖాధిపతి ద్వారా దరఖాస్తు పంపించాలి. శాఖాధిపతులు పూర్తి వివరాలతో ఆయాశాఖల ముఖ్యకార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి వాటిని సమర్పించాలి. ఈ దరఖాస్తులను రాష్ట్రపతి ఉత్తర్వులలోని పేరా 5(2)(సీ),5(2)డీ ప్రకారం పరిశీలిస్తారు. మొత్తం సర్వీసు కాలంలో ఒకసారి మాత్రమే ఈ పద్ధతిలో బదిలీకి దరఖాస్తు చేసుకునేందుకు ఉద్యోగులకు అవకాశం ఉంటుంది. అంతరాష్ట్ర బదిలీల నిబంధనలు, వ్యక్తిగత ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో ఉద్యోగులు చేసుకునే దరఖాస్తులను పరిశీలిస్తారు. క్లియర్ వేకెన్సీలు ఉన్న సందర్భంలోనే అంతరాష్ట్ర బదిలీకి అనుమతిస్తారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం జిల్లా, జోనల్, మల్టీజోనల్ స్థాయిలో కూడా పరస్పర బదిలీలను అనుమతించినప్పటికీ, క్లియర్ వేకెన్సీ, స్థానికత నిబంధనలను అమలు చేస్తారు. స్పౌజ్ నిబంధనల ప్రకారం భార్య లేదా భర్త ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీ కోరుకుంటున్న సందర్భంలో వారు తప్పకుండా వారు బదిలీ కోరుకున్న రాష్ట్రంలో స్థానికత కలిగి ఉండాలనే నిబంధనను కచ్చితంగా పాటిస్తారు. ఒక రాష్ట్రంలోని స్థానిక సంస్థల నుంచి మరో రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు బదిలీ కోరుకునే వారికి కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి. ఒకే క్యాటగిరీలో, ఒకే రకమైన స్థానికసంస్థలకు పరస్పర బదిలీ కోరుకునే ఉపాధ్యాయుల విజ్ఞప్తులను సైతం రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది. ప్రతీ ఉద్యోగి తాను బదిలీ కోరుకున్న రాష్ట్రంలో సీనియారిటీలో చివరలో ఉండేందుకు అంగీకరించినట్లుగా తప్పకుండా నమూనా దరఖాస్తులో సంతకం చేయాల్సి ఉంటుంది.

సీఎం కేసీఆర్ చొరవ ఫలితమిది..

సీఎం చొరవ వల్లనే రెండు రాష్ట్రాలలోని ఉద్యోగులకు ప్రయోజనం జరిగే ఉత్తర్వులు వచ్చాయి. దీనిని ఉపయోగించుకొని ఏపీ స్థానికత గల ఉద్యోగులూ తెలంగాణకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణకు వస్తున్న ప్రతీ ఉద్యోగి స్థానికతను నిబంధనల ప్రకారం పరిశీలించి అనుమతించాలి.

- గుండవరపు దేవీప్రసాద్, తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్

దరఖాస్తులను నిశితంగా పరిశీలించాలి..

పరస్పర బదిలీలు, ఉద్యోగదంపతుల బదిలీల విషయంలో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఒక అవగాహనకు రావడం సంతోషకర పరిణామం. వేల సంఖ్యలో ఉద్యోగులు అంతరాష్ట్ర బదిలీ కోరుకుంటున్నారు. వారి దరఖాస్తులను నిశితంగా పరిశీలించాలి.

- కారం రవీందర్‌రెడ్డి, టీఎన్జీవో అధ్యక్షుడు

విజ్ఞప్తిని పరిశీలించాలి

నిబంధనల ప్రకారం కేవలం 800 మంది ఉద్యోగులకు మాత్రమే పరస్పర బదిలీ ప్రయోజనం జరుగనున్నది. రెండువేల మంది ఏపీ స్థానికత గల ఉద్యోగులు తెలంగాణ నుంచి ఆ రాష్ట్రానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. వారి విజ్ఞప్తిని ఏపీ పరిశీలించాలి. తెలంగాణలో రిలీవ్ అయిన 24 మంది ఎస్వోలను వెంటనే ఏపీ ప్రభుత్వం చేర్చుకోవాలి.

- వీ శ్రీనివాస్‌గౌడ్, టీజీవో వ్యవస్థాపక అధ్యక్షుడు

అక్కడి వారిని ఎక్కువ సంఖ్యలో రానీయరాదు..

పరస్పర బదిలీలపై సర్క్యులర్ జారీని ఆహ్వానిస్తున్నాం. ఈ సందర్భంలో ఎక్కువ సంఖ్యలో ఏపీ ఉద్యోగులు తెలంగాణకు వచ్చే అవకాశం ఉంది. అట్లా జరుగకుండా కట్టడి చేయాలి. తెలంగాణకు వస్తున్న ప్రతీ ఉద్యోగి స్థానికత, సీనియారిటీ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరుచాలి.

-ఏ పద్మాచారి, అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యోగుల సంఘం

మన వాళ్లను తీసుకురావాలి..

ఏపీలోని తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగులను తెలంగాణకు తీసుకురావడానికి గట్టి ప్రయత్నాలు జరుగాలి. పరస్పర బదిలీలకు ఉత్తర్వులు ఇచ్చినందుకు కృతజ్ఞతలు.

-మామిండ్ల రాజేందర్, టీఎన్జీవో ప్రధానకార్యదర్శి

పీఆర్టీయూటీఎస్ హర్షం

అంతర్రాష్ట్ర బదిలీలకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంపై పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర నాయకులు పీ సరోత్తంరెడ్డి, చెన్నకేశవరెడ్డి హర్షం ప్రకటించారు. దీనివల్ల తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తున్న భార్యాభర్తలకు పరస్పర బదిలీలకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. అర్హులైన ఉపాధ్యాయులు, ఉద్యోగులు నెలలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పరస్పర బదిలీలను వ్యక్తుల మధ్య కాకుండా రెండురాష్ట్రాల మధ్య అనుమతించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఏ నర్సిరెడ్డి, చావ రవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రాజెక్టులపై జీఎస్టీ వద్దు



మంగళవారం ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి అనంత్‌గీతేకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ జితేందర్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి...

ప్రస్తావించారని, మళ్లీమళ్లీ దీనిపై చర్చించాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. దీనికి జితేందర్‌రెడ్డి బదులిస్తూ, తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌పై పడే భారాన్ని ఇంతకుముందే సభలో ప్రస్తావించినప్పుడు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ దీనిని జీఎస్టీ కౌన్సిల్‌లో చర్చిస్తామని బదులిచ్చారని, శనివారం జరిగిన జీఎస్టీ కౌన్సిల్‌లో దీనిపై తెలంగాణ తరపున హాజరైన ప్రతినిధులు ప్రస్తావించారని, కౌన్సిల్ వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని తాము డిమాండ్ చేస్తున్నామని వివరించారు. తెలంగాణను ఆర్థిక భారం నుంచి కాపాడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర ఆర్థిక వనరులపై ప్రభావం పడుతుందని, బడ్జెట్ భారం పెరుగుతుందని చెప్పారు.

హైదరాబాద్ హెచ్ఎంటీని పునరుద్ధరించండి: జితేందర్‌రెడ్డి

హైదరాబాద్‌లోని హెచ్ఎంటీ (ప్రాగా టూల్స్ విభాగం) కంపెనీని పునరుద్ధరించాలని కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి అనంత్‌గీతేను మంగళవారం కలిసి ఎంపీ జితేందర్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. హెచ్ఎంటీ ఉద్యోగులకు 1997 నాటి వేతన సవరణ సంఘం సిఫారసుల ప్రకారమే వేతనాలు చెల్లిస్తున్నారని చెప్పారు. అనేక కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు కేంద్రం 2017 సిఫారసుల ప్రకారం వేతనాలను చెల్లిస్తున్నదని, హెచ్ఎంటీకి దీనిని వర్తింపజేయడంలేదని వివరించారు. హెచ్ఎంటీ ఇంటర్నేషనల్ అనే సంస్థలో పదవీ విరమణ వయస్సును 58 ఏండ్ల నుంచి 60 ఏండ్లకు పెంచినా హైదరాబాద్ హెచ్ఎంటీ సంస్థలో మాత్రం యథాతథంగా 58 ఏండ్ల గరిష్ఠ వయసు నిబంధననే అమలుచేస్తున్నారని చెప్పారు. ఈ వివక్షను సవరించాలని కోరారు. పైగా 1997 నాటి నిర్ణయాల ప్రకారమే వేతనాల చెల్లిస్తున్నారని, 1997 జనవరి నుంచి 2014 ఫిబ్రవరి వరకు అన్ని బకాయిలను ఉద్యోగులకు చెల్లించాలని కోరారు. గత పదిహేనేండ్లుగా హైదరాబాద్ హెచ్ఎంటీలో ఖాళీల భర్తీకి నియామకాలు జరుగడమే లేదని, వెంటనే ఈ ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. మూడేండ్లలో పదవీ విరమణ చేసిన అనేకమంది ఉద్యోగులకు గ్రాట్యూటీ తదితరాలను యాజమాన్యం చెల్లించడం లేదని, ఐదు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై దృష్టి సారించాలని కేంద్ర మంత్రిని కోరారు. మేక్ ఇన్ ఇండియా నేపథ్యంలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో హెచ్ఎంటీ సంస్థను పనిచేయించేలా దీన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తిచేశారు.

సెన్సెక్స్	నిఫ్టీ
32,014	9,978
↘ 259	↘ 79

బంగారం ధరలు

ముంబై

24 క్యారెట్లు	28,590
22 క్యారెట్లు	28,440
వెండి (కిలో)	37,375

ముడి చమురు (బ్రెంట్)

↗ 52.08

సమాచార సంపన్న దేశంగా భారత్!



ఆధార్ ప్రాజెక్టు మాజీ చైర్మన్ నందన్ నీలేకని

బెంగళూరు, ఆగస్టు 8: మూడేండ్లలో భారత్ సమాచార సంపన్న దేశంగా ఎదుగనుందని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు, ఆధార్ ప్రాజెక్టు మాజీ డైరెక్టర్ నందన్ నీలేకని అన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటైన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..' త్వరలో డాటా సునామీ రాబోతున్నది. చాలా మంది భారతీయులు శ్రీమంతులుగా ఎదిగేకంటే ముందు డిజిటల్ సంపన్నులుగా మారనున్నారు' అని ఆయన పేర్కొన్నారు. బిగ్ డాటా సాంకేతికత దేశంలో ఆర్థిక వృద్ధి, ఉద్యోగ కల్పన సమస్యల పరిష్కారంలో దోహదపడనుందని, చిన్న వ్యాపారులకు రుణాలిచ్చే విషయంలో మరింత కచ్చితంగా నిర్ణయం తీసుకోగలిగే సమాచారాన్ని పంచగలదన్నారు. 'ప్రస్తుతం వ్యాపార సంస్థల ఆర్థిక పరిస్థితిని తెలిపే డాటా అందుబాటులో ఉండటం లేదు. జీఎస్టీ హయాంలో లావాదేవీల రికార్డులను సంక్షిప్తం చేయడం ద్వారా సంస్థల వద్ద సమాచార నిల్వలు పెరుగనున్నాయి. తద్వారా దాదాపు 80 లక్షల చిన్న వ్యాపారాలకు రుణాల లభ్యత పెరుగనుంది. దాంతో వారి వ్యాపారాలు వృద్ధి చెందితే మరిన్ని కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి' అని నీలేకని అన్నారు.

ఐఐఎం ప్రవేశపరీక్ష రాయలేకపోవడమే నా అదృష్టం

దేశంలోని ప్రముఖ బిజినెస్ మేనేజ్‌మెంట్ స్కూల్స్ 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్' (ఐఐఎం) ప్రవేశపరీక్ష రాయలేకపోవడమే నా అదృష్టంగా భావిస్తానని నీలేకని అన్నారు. లేదంటే ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తితో అనుబంధం ఏర్పడి ఉండేది కాదన్నారు. మూర్తితో కలిసి ఇన్ఫోసిస్‌ను ప్రారంభించిన తరువాత చరిత్ర అందరికీ తెలిసిందేనని ఆయన పేర్కొన్నారు.

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.01	67.26
ఆస్ట్రేలియా డాలర్	45.91	53.15
బహ్రెయిన్ దినార్	157.18	180.03
యూరో	68.50	79.45
జపాన్ యెన్/100	52.43	60.82
కువైట్ దినార్	174.55	217.43
ఒమన్ రియాల్	153.80	176.01
సౌదీ రియాల్	15.42	18.28
సింగపూర్ డాలర్	42.61	50.48
స్టెర్లింగ్ పౌండ్	75.68	87.75
యూఏఈ దిర్హామ్	15.79	18.45

కోడిగుడ్ల ధరలు

	నెక్	హెచ్ఎల్ఎఫ్ఏ
హైదరాబాద్	324-00	324-00
రంగారెడ్డి	324-00	324-00
మెదక్	324-00	324-00
కరీంనగర్	326-00	---
వరంగల్	326-00	---
రిటైల్ ప్రైస్	3-95	3-95

చికెన్ ధరలు

ఫారం ధర	77.00
రిటైల్ లైవ్	91.00
డ్రెస్డ్	127.00
స్కిన్‌లెస్	150.00

మార్కెట్లకు షెల్ షాక్!



10,000 దిగువ స్థాయికి నిఫ్టీ
సెన్సెక్స్ 260 పాయింట్లు డౌన్
1.43 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై, ఆగస్టు 8: స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో లిస్టయిన అనుమానిత షెల్ (ఉత్తుత్తి) కంపెనీలపై క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి 'సెబీ' కొరడా ఝుళిపించడంతో ట్రేడింగ్ వర్గాలు అప్రమత్తమయ్యాయి. మున్ముందు సెబీ మరిన్ని చర్యలు చేపట్టవచ్చన్న ఆందోళనలతో అమ్మకాలకు పాల్పడ్డారు. ఫలితంగా ప్రామాణిక స్టాక్ సూచీలు నేలచూపులు చూడాల్సివచ్చింది. మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో ట్రేడింగ్ ముగిసేసరికి 259.48 పాయింట్లు (0.80 శాతం) కోల్పోయిన సెన్సెక్స్ 32,014.19 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 78.55 పాయింట్లు (0.78 శాతం) నష్టపోయి 9,978.55 వద్ద నిలిచింది. దాంతో సూచీ 10వేల కీలక స్థాయి దిగువకు పడిపోయినట్లైంది. ప్రధాన కంపెనీలతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి సంస్థ షేర్లు అధిక ఒత్తిడికి లోనయ్యాయి. దాంతో బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 1.20 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.27 శాతం క్షీణించాయి. ఫలితంగా స్టాక్ మార్కెట్‌లోని లిస్టెడ్ కంపెనీల మార్కెట్ సంపద రూ.1.43 లక్షల కోట్ల మేర తగ్గి రూ.131, 84,912 కోట్లకు జారుకుంది.

సెన్సెక్స్ లిస్టెడ్ కంపెనీల్లో డాక్టర్ రెడ్డీస్ మార్కెట్ విలువ అత్యధికంగా 4.91 శాతం క్షీణించింది. కోల్ ఇండియా, ఎస్‌బీఐ, ఐటీసీ షేర్లు 2 శాతానికి పైగా పడిపోయాయి. ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్‌టీపీసీ, పవర్ గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, ఓఎన్‌జీసీ, సన్‌ఫార్మా, మారుతి సుజుకీ, హీరోమోటోకార్ప్, కొటక్ మహీంద్రా బ్యాంక్ ఒక శాతానికి పైగా నష్టపోయాయి. టాటా స్టీల్ 2.63 శాతం లాభంతో సెన్సెక్స్ టాప్‌గెయినర్‌గా నిలిచింది. సిప్లా 2.32 శాతం పెరిగింది. రంగాలవారీగా చూస్తే.. బీఎస్ఈలో రియల్టీ సూచీ 4.53 శాతం పడిపోగా.. ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ ఇండెక్స్‌లు 2 శాతానికి పైగా క్షీణించాయి. పవర్, ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్, హెల్త్‌కేర్ సూచీలు ఒక శాతానికిపైగా నష్టపోవాల్సి వచ్చింది.

'ఉత్తుత్తి' జాబితాలో ప్రముఖ కంపెనీలు

తెరపైకి పార్శ్వనాథ్ డెవలపర్స్, ఎస్క్యూఎస్, ప్రకాశ్ ఇండస్ట్రీస్, జే కుమార్ పేర్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 8: క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి 'సెబీ'కి కేంద్ర ప్రభుత్వం పంపిన 331 అనుమానిత షెల్ కంపెనీల జాబితాలో పార్శ్వనాథ్ డెవలపర్స్, ఎస్క్యూఎస్, ప్రకాశ్ ఇండస్ట్రీస్, జే కుమార్ వంటి ప్రముఖ సంస్థలు కూడా ఉన్నాయి. ఈ సంస్థలు పన్ను ఎగవేత, ఇతర అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. అయితే, సంస్థలు మాత్రం తామేం తప్పు చేయలేదంటున్నాయి. సెబీ, స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల నిబంధనలకు లోబడే వ్యాపారం కొనసాగిస్తున్నామని అన్నాయి. తమ సంస్థ పేరును జాబితా నుంచి తొలిగించాలని ఎక్స్ఛేంజ్‌లకు అప్పీలు చేసుకొన్నాయి. మరికొన్ని సంస్థలు నేరుగా సెబీనే సంప్రదించాలని అనుకుంటున్నాయి. వీలైతే సెక్యూరిటీస్ అపిల్లెట్ ట్రిబ్యునల్‌ను (శాట్) ఆశ్రయించే అవకాశం కూడా ఉంది. ఈ అనుమానిత షెల్ కంపెనీలపై సెబీ ఇప్పటికే కొరడా ఝుళిపించింది. ఆ సంస్థల షేర్ల ట్రేడింగ్ లావాదేవీలను నెలపాటు నిలిపివేయాలని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లను ఆదేశించింది. ఈ కంపెనీల షేర్లను స్టేజ్ -4 గ్రేడెడ్ సర్వేలెన్స్ మెకానిజంలో ఉంచాలని కోరింది. ఈ గ్రేడ్‌లోని షేర్లను నెలకు ఒకసారి, అదీ ట్రేడ్ టు ట్రేడ్ కేటగిరిలో లావాదేవీలకు మాత్రమే అనుమతిస్తారు. ఈ కంపెనీలపై అవసరమైతే ఫోరెన్సిక్ ఆడిటింగ్ జరుపాలని సెబీ ఎక్స్ఛేంజ్‌లను ఆదేశించింది. ఈ అనుమానిత షెల్ కంపెనీల జాబితాలో బెంగాల్‌కు చెందిన 127 సంస్థలు ఉండటం గమనార్హం. గుజరాత్, ఢిల్లీకి చెందిన పలు సంస్థలు కూడా ఈ లిస్ట్‌లో ఉన్నాయి. సెబీ, స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల ఆంక్షలతోపాటు ఐటీ శాఖ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐవో) ఇంకా ఇతర ఏజెన్సీలు జరిపే దర్యాప్తులో వెలుగులోకి వచ్చే నిజాల ఆధారంగా ఈ కంపెనీలపై భవిష్యత్‌లో మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

ఇన్‌ఫ్రాటెల్‌లో 3.65% వాటా విక్రయం

ఎయిర్‌టెల్‌కు రూ.2,570 కోట్ల నిధులు

న్యూఢిల్లీ, ఆగస్టు 8: రుణ భారంతో సతమతమవుతున్న దేశీయ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ తన సబ్సిడరీ సంస్థల్లో వాటాలను విక్రయిస్తున్నది. దీంట్లో భాగంగా టవర్ల నిర్వహణ సంస్థ భారతీ ఇన్‌ఫ్రాటెల్‌లో తనకున్న వాటాల్లో 3.65 శాతానికి సమానమైన 6.7 కోట్ల షేర్లను బహిరంగ మార్కెట్లో విక్రయించింది. దీంతో సంస్థకు రూ. 2,570 కోట్ల నిధులు సమకూరాయి. మరో సబ్సిడరీ సంస్థయైన నెట్‌లీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్‌కు ఉన్న వాటాను అమ్మింది. సోమవారం స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి నమోదైన షేరు ధరతో పోలిస్తే నాలుగు శాతం తక్కువకు విక్రయించింది. అంటే ఒక్కో షేరుకు రూ.380.6 చొప్పున విక్రయించిందన్న మాట. రుణాలను తగ్గించుకోవాలనే ఉద్దేశంతో ఈ వాటాను విక్రయించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. వాటా విక్రయించిన అనంతరం ఇన్‌ఫ్రాటెల్‌లో ఎయిర్‌టెల్ వాటా 58 శాతానికి తగ్గింది. మార్చి 30తో ముగిసి త్రైమాసికంలో రూ.91,400 కోట్లుగా ఉన్న ఎయిర్‌టెల్ అప్పు ఆ తర్వాతి త్రైమాసికానికిగాను రూ.87,840 కోట్లకు తగ్గింది. అప్పులను తగ్గించుకోవడానికి సబ్సిడరీ సంస్థల్లో వాటాలను విక్రయించనున్నట్లు గతేడాది ఎయిర్‌టెల్ ప్రకటించింది. ప్రస్తుతం భారతీ ఇన్‌ఫ్రాటెల్, ఇండస్ టవర్లను కలుపుకొని



90,255 టవర్లను నిర్వహిస్తున్నది. ఇన్‌ఫ్రాటెల్‌లో పూర్తిస్థాయి వాటాలను విక్రయించే ఉద్దేశమేది లేదని గతంలో ఎయిర్‌టెల్ ప్రకటించింది. కానీ రోజు రోజుకు పెరుగుతున్న రుణ భారాన్ని తగ్గించుకోవడానికి గత్యంతరం లేకపోవడంతో గడిచిన ఆర్థిక సంవత్సరంలో 10.3 శాతం వాటాను కేకేఆర్, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డుకు విక్రయించింది. దీంతో సంస్థకు రూ.6,193.90 కోట్ల నిధులు సమకూరాయి. అలాగే ఇదే సమయంలో నెట్‌లీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.6,806 కోట్ల విలువైన 11.32 శాతం వాటాను బదిలీ చేసింది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి ఇన్‌ఫ్రాటెల్ షేరు ధర 3.98 శాతం తగ్గి రూ.382.05కి చేరుకోగా, ఎయిర్‌టెల్ షేరు స్వల్పంగా పెరిగి రూ.418 వద్ద స్థిరపడింది.

కావేరి సీడ్స్ రూ.3 మధ్యంతర డివిడెండ్

హైదరాబాద్, ఆగస్టు 8: రాష్ట్రానికి చెందిన ప్రముఖ విత్తనాల తయారీ సంస్థ కావేరి సీడ్స్ ఆర్థిక ఫలితాలకు అమ్మకాలు దన్నుగా నిలిచాయి. జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 31.10 శాతం పెరిగి రూ.202.37 కోట్లకు చేరుకున్నట్లు ప్రకటించింది. 2016-17 ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి రూ.154.36 కోట్లుగా ఉంది. ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో కంపెనీ ఆదాయం రూ.499.41 కోట్ల స్థాయి నుంచి రూ.594.84 కోట్లకు చేరాయి. సమీక్షకాలంలో కంపెనీ నిర్వహణ ఖర్చులు రూ.390.22 కోట్లకు పెరిగినప్పటికీ లాభాల్లో వృద్ధిని నమోదు చేసుకోవడం విశేషం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.3 మధ్యంతర డివిడెండ్‌ను (150 శాతం) బోర్డు ప్రకటించింది. సిద్దిపేట జిల్లాలోని దేవక్కపల్లి వద్ద ఉన్న 24.25 ఎకరాల స్థలాన్ని విక్రయించడానికి బోర్డు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. దీంతో సంస్థకు రూ.15 కోట్ల మేర నిధులు సమకూరనున్నాయని అంచనా.

టెక్స్‌టైల్ రంగానికి భారీ ఊరట

జీఎస్టీ రేటు తగ్గించడాన్ని స్వాగతించిన పరిశ్రమ



న్యూఢిల్లీ, ఆగస్టు 8: జీఎస్టీలో భాగంగా టెక్స్‌టైల్ రంగంలో ఉపాధి పొందుతున్నవారిపై విధించే రేటును కేంద్ర ప్రభు త్వం తగ్గించడంపై కాటన్ టెక్స్‌టైల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్(టెక్స్‌ప్రొసిల్) స్వాగతించింది. గత శనివారం జీఎస్టీ కౌన్సిల్ సమావేశమై..టెక్స్‌టైల్ రంగంలో ఉపాధి పొందుతున్న వారిపై విధించే రేటును 5 శాతానికి తగ్గించింది. గతంలో వీటిపై 18 శాతం విధించారు. కౌన్సి ల్ తీసుకున్న నిర్ణయం స్వాగతించదగినదని, దీంతో ఈ రంగం మరింత వృద్ధిని నమోదు చేసుకునే అవకాశం ఉందని టెక్స్‌ప్రొసిల్ చైర్మన్ ఉజ్వల్ లహోటి తెలిపారు. విలువ పరంగా చూస్తే మరింత తగ్గే ఆస్కారం ఉందన్నారు. టెక్స్‌టైల్ రంగంలో అత్యధిక భాగం తయారీ విభాగంలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి, జీఎస్టీ రేటు తగ్గడంతో ఈ రంగానికి భారీ ఊరట లభించినట్లు అయిందని చెప్పారు.

జీఎస్టీఎన్ పోర్టల్‌లో పన్ను రిటర్న్‌ల దాఖలు ప్రారంభం

జీఎస్టీఎన్ పోర్టల్‌లో వ్యాపారవేత్తలు పన్ను రిటర్నులు, చెల్లింపులు ప్రారంభమయ్యాయి. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 5 వరకు జీఎస్టీఆర్-3బీ పూర్తిస్థాయిలో నిర్వహించినట్లు జీఎస్టీఎన్ చైర్మన్ నవీన్ కుమార్ తెలిపారు. పన్ను చెల్లింపుదారులు జీఎస్టీఎన్ పోర్టల్ కింద లాగిన్ అయి చెల్లింపులు జరుపుకోవచ్చునని ఆయన సూచించారు.

జుపిటర్‌లో క్లాసిక్ ఎడిషన్



ధర రూ.55,266

న్యూఢిల్లీ, ఆగస్టు 8: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్..దేశీయ మార్కెట్లోకి జుపిటర్‌లో క్లాసిక్ ఎడిషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఢిల్లీ షోరూంలో ఈ స్కూటర్ ధరను రూ.55,266గా నిర్ణయించింది. గతంలో విడుదల చేసిన దాంతో పోలిస్తే ఈ నూతన వెర్షన్‌లో సరికొత్త మార్పులు చేసినట్లు ముఖ్యంగా యూఎస్‌బీ చార్జర్, వైండ్‌షీల్డ్, వెనుకవైపు ఒరుగడానికి ప్రత్యేక సీట్‌ను ఏర్పాటు చేసింది. 110 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన ఈ స్కూటర్‌ను భావితరాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 2013లో దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టిన ఈ స్కూటర్ కంపెనీ వాటా పెరుగడానికి దోహదపడింది. ఇప్పటి వరకు 15 లక్షల యూనిట్ల విక్రయాలు జరిపింది.

యాక్సిస్ బ్యాంకూ అర కోత పెట్టింది!

రూ.50 లక్షల వరకు పొదుపు ఖాతా డిపాజిట్లపై వడ్డీరేటు 3.5 శాతానికి

ముంబై, ఆగస్టు 8: దేశంలో మూడో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకింగ్ సేవల సంస్థ యాక్సిస్ బ్యాంక్ కూడా పొదుపు ఖాతాల్లో సొమ్ముపై చెల్లించే వడ్డీరేటును అరశాతం తగ్గించింది. సేవింగ్స్ ఖాతాల్లోని రూ.50 లక్షల వరకు డిపాజిట్లపై చెల్లించే వడ్డీరేటును 4 శాతం నుంచి 3.5 శాతానికి తగ్గిస్తున్నట్లు బ్యాంక్ ప్రకటించింది. ఈ సవరణ మంగళవారం నుంచే అమలులోకి వచ్చింది. యాభై లక్షల కంటే అధిక మొత్తంలో డిపాజిట్లపైన మాత్రం యధావిధిగా 4 శాతం వార్షిక వడ్డీ ఆదాయం లభించనుందని తెలిపింది. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ గతనెల 31న సేవింగ్ అకౌంట్ డిపాజిట్ రేటును అర శాతం తగ్గించింది. అప్పటినుంచి వడ్డీరేటును తగ్గించిన సంస్థల్లో యాక్సిస్ బ్యాంక్ నాలుగోది. ఎస్‌బీఐ తర్వాత బ్యాంక్ ఆఫ్ బరోడా, కర్ణాటక బ్యాంక్‌లు కూడా సేవింగ్ అకౌంట్ డిపాజిట్ రేటును అర శాతం తగ్గించాయి.

1.62 లక్షల కంపెనీల గుర్తింపు రద్దు!

అందులో హైదరాబాద్‌కు చెందినవి 20,588 సంస్థలు

న్యూఢిల్లీ, ఆగస్టు 8: దీర్ఘకాలంగా వ్యాపారం కొనసాగించకుండా అచేతనంగా ఉన్న 1.62 లక్షలకు పైగా కంపెనీల గుర్తింపును రద్దు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గుర్తింపు రద్దయినవాటిలో సగానికిపైగా సంస్థలు హైదరాబాద్, ముంబై, ఢిల్లీకి చెందినవేనని పార్లమెంట్‌కు తెలిపింది. 'కంపెనీల చట్టం-2013లోని సెక్షన్ 248 ప్రకారంగా.. గతనెల 12 నాటికి 1,62,618 సంస్థలను రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌వోసీ) నుంచి తొలిగించడం జరిగింది' అని కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ రాజ్యసభకు లిఖితపూర్వకంగా వెల్లడించారు. రెండు ఆర్థిక సంవత్సరాలకు పైగా ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు కొనసాగించని కంపెనీల గుర్తింపు రద్దు చేసేందుకు ఆర్‌వోసీకి సెక్షన్ 248 కింద అధికారం ఉంది. గుర్తింపు రద్దయిన వాటిలో 76,451 సంస్థలు ముంబై, ఢిల్లీ, హైదరాబాద్‌కు చెందినవే. అందులో 33 వేలు ఆర్‌వోసీ ముంబై పరిధిలోని సంస్థలు కాగా.. ఆర్‌వోసీ ఢిల్లీ పరిధిలో 22,863, ఆర్‌వోసీ హైదరాబాద్ పరిధిలో 20,558 సంస్థల గుర్తింపు రద్దయింది. పన్ను ఎగవేతలకు పాల్పడుతున్న 37 వేల షెల్ కంపెనీలను గుర్తించినట్లు, పెద్ద నోట్ల రద్దు తర్వాత అనుమానాస్పద లావాదేవీలు జరిపిన 3 లక్షలకు పైగా సంస్థలపై ప్రభుత్వం నిఘా పెట్టిందని గతనెల ప్రధాని మోదీ వెల్లడించారు.

మొదటి 3 నెలల్లో 6.5 లక్షల కోట్లకు ప్రభుత్వ వ్యయం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్30తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ1) ప్రభుత్వ వ్యయం 27 శాతం పెరిగి రూ.6.50 లక్షల కోట్లకు చేరుకుంది. ఆర్థిక సంవత్సరం మొత్తానికి వ్యయాల కోసం కేటాయించిన బడ్జెట్‌తో పోలిస్తే ఈ మొత్తం 30.3 శాతానికి సమానం. ఈ సారి బడ్జెట్‌ను ఒక నెల ముందుగా ప్రవేశపెట్టడంతో ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే వ్యయ అవసరాలకు నిధులు కేటాయించగలుగుతున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రాజ్యసభకు లిఖితపూర్వకంగా తెలిపారు. గతంలో బడ్జెట్‌ను ఫిబ్రవరి చివర్లో ప్రవేశపెట్టే సంప్రదాయం కొనసాగేది. ఈసారి మాత్రం జైట్లీ ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి (ఏప్రిల్ 1) ముందే బడ్జెట్ ఆమోదం పొందింది.

రూ.2.55 కోట్ల విలువైన నకిలీ నోట్ల జప్తు

పెద్ద నోట్ల రద్ద తర్వాత (గత ఏడాది నవంబర్ 9 నుంచి జూలై 14, 2017 వరకు) రూ.2.55 కోట్ల విలువైన నకిలీ నోట్లను జప్తు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు తెలిపింది. జప్తు చేసిన నకిలీ నోట్లలో అధికశాతం గుజరాత్‌లో పట్టుబడినవేనని కేంద్రం వెల్లడించింది.



27 శాతానికి తగ్గిన డీజిల్ కార్ల విక్రయాల వాటా

గడిచిన ఆర్థిక సంవత్సరం (2016-17) దేశంలో అమ్ముడైన మొత్తం కార్లలో నాలుగింట మూడోవంతు పెట్రోల్ వాహనాలే. గతసారి విక్రయాల్లో డీజిల్ కార్ల వాటా 27 శాతానికి పడిపోయింది. 2012-13లో ఈ కార్ల వాటా 47 శాతంగా నమోదైంది. 2013-14లో 42 శాతానికి, 2014-15లో 37 శాతానికి, 2015-16లో 34 శాతానికి పడిపోయింది. గతసారి 25 శాతానికి పరిమితమైంది. అదే సమయంలో పెట్రోల్ కార్ల సేల్స్ క్రమంగా పెరుగుతూ గత ఆర్థిక సంవత్సరంలో 73 శాతానికి చేరుకుంది.

ఏప్రిల్ -మేలో వ్యవసాయ రంగంలోకి 355 కోట్ల ఎఫ్‌డీఐలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి రెండు నెలల (ఏప్రిల్-మే) కాలానికి వ్యవసాయ రంగంలోకి రూ.354.77 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో (2016-17) అగ్రి సెక్టార్‌లోకి రూ.515.49 కోట్ల ఎఫ్‌డీఐలు రాగా.. అంతక్రితం ఏడాదిలో పెట్టుబడులు రూ.553.14 కోట్లుగా నమోదయ్యాయని వ్యవసాయ శాఖ సహాయ మంత్రి ఎస్ఎస్ అహ్లూవాలియా పార్లమెంట్‌కు వెల్లడించారు.

గతేడాది రూ. 13,715 కోట్ల నల్లధనం వెలికితీత

గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఐటీ శాఖ సర్వేల ద్వారా రూ.13,715 కోట్ల నల్లధనాన్ని వెలికితీసిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ తెలిపారు. అలాగే, 1,152 గ్రూపులకు చెందిన 5,102 ప్రాంతాల్లో సోదాలు జరిపిన ఐటీ అధికారులు రూ.15,496 కోట్ల అనధికార ఆదాయాన్ని గుర్తించారన్నారు. గతేడాది పన్ను చెల్లింపుదారుల జాబితాలోకి కొత్తగా 1.26 కోట్ల మంది చేరారని ఆయన రాజ్యసభకు లిఖితపూర్వకంగా వెల్లడించారు.

జీవో 13 నిలిపివేతకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ వృత్తి విద్యాకళాశాలల్లో బీ క్యాటగిరీ సీట్ల భర్తీ కోసం మౌఖిక పరీక్షకు కాలేజీ యాజమాన్యాలకు అవకాశం కల్పిస్తూ జారీచేసిన జీవో 13ను నిలిపివేయడానికి హైకోర్టు మంగళవారం నిరాకరించింది. మూడేండ్ల క్రితం జారీచేసిన జీవోను నిలిపివేయాలని అభ్యర్థించడం ఏమిటని పిటిషనర్ లక్ష్మారెడ్డిని ధర్మాసనం ప్రశ్నించింది. జీవో చట్టబద్ధతకు సంబంధించిన వివరాలను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.

భూసేకరణ తొలినోటిఫికేషన్‌పై వివరణ ఇవ్వండి

హైదరాబాద్: భూసేకరణ (సవరణ) చట్టం-2016 అమలుకు ముందు ప్రజల అభ్యంతరాలను కోరుతూ జారీచేసిన తొలి నోటిఫికేషన్‌పై వివరణనివ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టంచేసింది. రెండు వారాల్లోగా ప్రమాణపత్రం దాఖలు చేయాలని పేర్కొంది. గెజిట్ అందుబాటులో లేకుండా, అభ్యంతరాలను స్వీకరించకుండా తుది నోటిఫికేషన్ జారీచేసి భూసేకరణ చేపడుతున్నారని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కూలీలసంఘం హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసింది. గత వారంఇచ్చిన ఆదేశాల మేరకు గెజిట్ ప్రతులను ఏజీ ప్రకాశ్‌రెడ్డి సమర్పించారు.

అభివృద్ధి బాటలో విజయ డెయిరీ

నూతనంగా వందకుపైగా పార్లర్ల ఏర్పాటు

తక్కువ ధరల్లో అందుబాటులోకి ఉత్పత్తులు

తార్నాక: ప్రైవేటు డెయిరీలకు దీటుగా ప్రభుత్వ ఆధ్వర్యంలోని విజయ డెయిరీ తమ ఉత్పత్తులను వినియోగదారుకులకు అందుబాటులోకి తెస్తున్నది. నాణ్యమైన ఉత్పత్తులను తక్కువ ధరలకు అందించేందుకు నూతనంగా మిల్క్ పార్లర్ సెంటర్లను (కెఫే) ఏర్పాటు చేస్తున్నది. హైదరాబాద్ మెట్రో స్టేషన్లతోపాటు ఇతర ప్రాంతాల్లో ఇప్పటికే వందకుపైగా పార్లర్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో సైతం వీటిని ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో విజయడెయిరీలో ఉత్పత్తి అవుతున్న దూద్‌పేడ, పన్నీరు, బట్టర్‌మిల్క్, పెరుగు, లస్సీ, ఐస్‌క్రీం, మ్యాంగో, ఆరెంజ్ లస్సీ, ప్లెయిన్ కోవా, వెన్న, నెయ్యి వంటివాటిని వినియోగదారులకు అందుబాటులో ఉంచుతారు. యువతను ఆకర్షించేవిధంగా కెఫే నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే 109 పార్లర్లను ఏర్పాటు చేసిన అధికారులు.. మొత్తం 500 పార్లర్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. పెండ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు కూడా పాల ఉత్పత్తులను సరఫరా చేయనున్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులకు పార్లర్ ఏర్పాటుకు అవకాశం కల్పిస్తారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, ఇతరులు రూ.వెయ్యి నుంచి రూ.10వేల వరకు డీడీ తీస్తే పాల ఉత్పత్తులను అందజేసి పార్లర్ ఏర్పాటుకు అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తారు. ప్రైవేటుకు దీటుగా ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చి, సంస్థకు లాభాలు వచ్చేవిధంగా కృషి చేస్తున్నామని పాడిపరిశ్రమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ లోక భూమారెడ్డి, డెయిరీ సీనియర్ అధికారి మల్లయ్య పేర్కొన్నారు.



నూతనంగా ప్రవేశపెట్టిన (కెఫే) పార్లర్

బోరుబావుల ప్రమాదాల పై ఇంత నిర్లక్ష్యమా?

రెవెన్యూ ముఖ్యకార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో బోరుబావుల్లో పడి చిన్నారులు మృతిచెందుతున్న ఘటనలపై వివరణ ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. అంతర్గతంగా జరిగిన చర్చలపై డాక్యుమెంట్‌ను సమర్పించడాన్ని కోర్టు ధిక్కార చర్యగా ఎందుకు భావించకూడదో వివరణ ఇవ్వాలంటూ షోకాజ్ నోటీసు జారీచేసింది. న్యాయవాది బుద్ధారపు ప్రకాశ్ వేసిన పిల్ విచారణ సందర్భంగా హైకోర్టు స్పందించింది.

మల్లన్నసాగర్ టెండర్ నోటిఫికేషన్లపై వివరణ ఇవ్వండి

హైదరాబాద్: మల్లన్నసాగర్ నిర్మాణానికి జారీచేసిన టెండర్ నోటిఫికేషన్లపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పర్యావరణ అనుమతులు లేకుండా నిర్మాణ పనులు చేపట్టడంపై వివరణ ఇవ్వాలని జస్టిస్ ఏ రామలింగేశ్వర్‌రావు ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది. సిద్దిపేట జిల్లా తొగుట మండలం వేములఘాట్‌కు చెందిన పలువురు దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం కోర్టు విచారించింది. విచారణను గురువారానికి వాయిదా వేసింది.

వాహ్ తీజ్...



గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన తీజ్ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. జనగామ జిల్లా పాలకుర్తి మండలం దర్దేపల్లి శివారు టీఎస్‌కే తండాలో లంబాడీలు నిర్వహించిన వేడుకల్లో పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు గిరిజనులతో మమేకమయ్యారు. వారితో కలిసి నృత్యం చేశారు. -పాలకుర్తి రూరల్





కరీంనగర్‌లో తెలంగాణ జాగృతి మెగా జాబ్ మేళాను ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్.. హాజరైన పలు కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగులు

జాగృతి మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

హాజరైన 1623మంది నిరుద్యోగులు

ముకరంపుర: తెలంగాణ జాగృతి కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభించింది. ప్రధాన్ మంత్రి కుషాల్ వికాస్ యోజనలో భాగంగా చేపట్టిన ఈ మేళాలో జిల్లా నుంచే కాకుండా వివిధ జిల్లాల నుంచి 1623 మంది నిరుద్యోగులు హాజరై రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. సుమారు 48 కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి 600 మందిని ఎంపిక చేసుకున్నాయి. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. నిరుద్యోగ యువతలో నైపుణ్యాన్ని పెంపొందించి, జాబ్ మేళా లాంటి మంచి కార్యక్రమాలు చేపడుతున్న తెలంగాణ జాగృతి ప్రతినిధులను అభినందించారు. జెడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, నగర మేయర్ రవీందర్‌సింగ్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి జాగృతి సీఈఓ జగన్‌మోహన్, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులు బీ అనంతరావు, ఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ రూరల్ జిల్లా సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఉపముఖ్యమంత్రి కడియం, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తదితరులు

దేశానికే ఆదర్శంగా మెగా టెక్స్‌టైల్ పార్క్

17న సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన?

ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి

సంగెం, వరంగల్‌రూరల్ జిల్లా : వరంగల్ రూరల్ జిల్లాలో నిర్మించతలపెట్టిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు దేశంలోనే ఆదర్శంగా నిలవబోతున్నదని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం ఆయన సంగెం, గీసుగొండ మండలాల్లోపర్యటించారు. చింతలపల్లిశివారు టెక్స్‌టైల్ పార్కు భూముల్లో మొక్క నాటారు. సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వరంగల్‌ను టెక్స్‌టైల్ పార్కుకు అనువైన ప్రాంతంగా గుర్తించి ఇక్కడ ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఈ పార్కు కోసం 1190ఎకరాల భూమిని సేకరించినట్టు చెప్పారు. 1150కోట్లతో పార్కు నిర్మాణం జరుగనుందని, వీలైతే ఈ నెల 17న సీఎం టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన చేసే అవకాశం ఉందని సూత్రప్రాయంగా వెల్లడించారు.

గొల్ల కురుమల అభ్యున్నతికి చర్యలు

కొల్లాపూర్‌టౌన్: గొల్ల కురుమల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నారని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మాచినేనిపల్లిలో యాదవులకు గొర్రెలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గొల్ల కురుమల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చి దేశంలో ఎక్కడా లేని విధంగా సబ్సిడీపై గొర్రెల యూనిట్ల పథకాన్ని అమలు చేస్తుందన్నారు.



గొర్రెను అందిస్తున్న మంత్రి జూపల్లి

జూరాలకు 7251 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జోగుళాంబ గద్వాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి : జూరాల ప్రాజెక్టుకు వరదరాక పెరిగింది. మంగళవారం రాత్రి వరకు 7,251 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 11,359 క్యూసెక్కులు వదులుతున్నారు. ఆల్మట్టి నుంచి నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గింది. 6003 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో నమోదవుతున్నది. జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరగడంతో నీటి నిల్వ పెరుగుతున్నది. మంగళవారం రాత్రి వరకు 6.325 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ప్రాజెక్టు నుంచి ఔట్‌ఫ్లో కొనసాగుతున్నప్పటికీ నీటి నిల్వ పెరిగింది.

'పునర్జీవం'తో సాగునీటి సమస్యకు చెక్

సీఎం సభకు భారీగా తరలిరావాలి: మంత్రి ఈటల రాజేందర్

బోధన్/ఆర్మూర్, నమస్తే తెలంగాణ: ఆంధ్రా పాలకుల నిర్లక్ష్యం వల్లే శ్రీరాంసాగర్ వట్టిపోయిందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ విమర్శించారు. ఎస్సారెస్పీని ఎప్పుడూ నిండుకుండలా ఉంచేందుకు పునర్జీవ పథకానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారన్నారు. పోచంపాడ్‌లో గురువారం నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు నిజామాబాద్ జిల్లాలోని బోధన్, ఆర్మూర్‌లో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో మంత్రి ఈటల మాట్లాడారు. కాళేశ్వరం నుంచి గోదావరి జలాలను వివిధ దశల్లో ఎత్తిపోయడం, రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీని నింపే పథకానికి గురువారం పోచంపాడ్‌లో సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేస్తున్నారన్నారు. ఈ సభకు రైతులు ఇంటికొకరు చొప్పున సంకలో చద్దిమూటతో పోచంపాడ్‌కు తరలి రావాలని పిలుపునిచ్చారు.

అలీసాగర్, గుత్ప పథకాలకు ఢోకా ఉండదు: మంత్రి పోచారం

మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎస్సారెస్పీ పునర్జీవ పథకం పూర్తయిన తర్వాత శ్రీరాంసాగర్ ఎగువన నిర్మించిన జిల్లాలోని అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాలకు ఢోకా ఉండదన్నారు. ఈ పథకం ద్వారా నిజామాబాద్, కామారెడ్డి ఉభయ జిల్లాల్లోని ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.

పునర్జీవ సభకు భారీగా తరలిరండి : ఎంపీ కవిత

పోచంపాడ్‌లో నిర్వహించే పునర్జీవ సభపై ఎంపీ కవిత ప్రత్యేక దృష్టి సారించారు. నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్ల టీఆర్ఎస్ ఇన్‌చార్జీలతో ఫోన్‌లో మాట్లాడారు. రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.



నిజామాబాద్ జిల్లా బోధన్‌లో సన్నాహక సభలో మాట్లాడుతున్న మంత్రి ఈటల



నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

'ఎస్సారెస్పీ పునర్జీవం' ఓ బృహత్తర పథకం

ఖానాపూర్: ఎస్సారెస్పీ పునర్జీవం ఓ బృహత్తర పథకమని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గ టీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడారు. ఈ పథకానికి సీఎం కేసీఆర్ గురువారం శంకుస్థాపన చేస్తారని, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే రేఖానాయక్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి వేణుగోపాలచారి, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ కృషి అభినందనీయం



నిర్మల్, నమస్తే తెలంగాణ: సాగునీటి ప్రాజెక్టుల సాధనలో సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి అభినందనీయమని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి ఎస్ వేణుగోపాలచారి అన్నారు. ఎస్సారెస్పీ ద్వారా సాగునీరు అందించేందుకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేస్తున్న శ్రీరాంసాగర్ పునర్జీవ పథకం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. గురువారం జరిగే సీఎం సభకు నిర్మల్ జిల్లా నుంచి భారీ సంఖ్యలో జనం పాల్గొనాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన నిర్మల్‌లో విలేకరులతో మాట్లాడారు. పునర్జీవ పథకంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, ముథోల్, ఖానాపూర్, లక్సెట్టిపేట్ నియోజకవర్గాలకు సాగునీరు అందుతుందన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, చిత్రంలో కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

కోటి ఎకరాల మాగాణమే సీఎం లక్ష్యం

త్వరలో మల్కాపూర్ రిజర్వాయర్‌కు టెండర్లు

విలేకరుల సమావేశంలో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి

వరంగల్ ప్రధాన ప్రతినిధి/నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించే మహాయజ్ఞం సాగుతున్నదని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం వరంగల్‌లోని టీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ఆధునీకరించడం, కొనసాగుతున్న ప్రాజెక్టులకు నీటి లభ్యత ఆధారంగా రీ-డిజైనింగ్ చేయడం, కొత్త ప్రాజెక్టులను చేపట్టడం అనే మూడు అంశాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతున్నదన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రతి మంచిపనికి అడ్డుచెప్పడమే పనిగా విపక్షాలు వ్యవహరించడం విడ్డూరంగా ఉన్నదన్నారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే గురువారం నిజామాబాద్ జిల్లా పోచంపాడ్ వద్ద శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు దేశంలో ఎక్కడాలేనివిధంగా ఎస్సారెస్పీ పునర్జీవ పథకానికి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయనున్నారని, ఈ సభకు రైతులు, ప్రజలు భారీగా తరలి రానున్నారని చెప్పారు. రాష్ట్రం ఏర్పాటయ్యాక కృష్ణా, గోదావరి నదీ జలాల్లో న్యాయమైన తెలంగాణ వాటాను దక్కించుకోవడం కోసం ప్రాజెక్టుల రీ-డిజైనింగ్ చేస్తూ దేవాదుల, కాళేశ్వరం, తుపాకులగూడెం వంటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన విషయాన్ని ఉదహరించారు. పూర్వపు ఏడు జిల్లాల వరప్రదాయినిగా ఎస్సారెస్పీని తీర్చిదిద్దేందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేయడమే కాకుండా కాకతీయ కాలువ ఆధునీకరణకు రూ.1091 కోట్లు కేటాయించడం గొప్ప విషయమన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు రిజర్వాయర్ లేనిలోటును తీర్చాలని సీఎంకు విజ్ఞప్తి చేస్తే 10.78 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యంతో మల్కాపూర్ రిజర్వాయర్ మంజూరు చేసి, డీపీఆర్‌ను కూడా సిద్ధం చేయించారన్నారు. త్వరలో టెండర్లను ఆహ్వానిస్తామన్నారు. సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, నగర మేయర్ నన్నపునేని నరేందర్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి పాల్గొన్నారు.

ప్రాజెక్టులను అడ్డుకుంటే పుట్టగతులు ఉండవు

ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్

నిజామాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: తెలంగాణను సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులను అడ్డుకునే వారికి పుట్టగతులు ఉండవని ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన నిజామాబాద్‌తోపాటు, మెండోరా మండలం పోచంపాడ్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకున్నందుకు కాంగ్రెస్, టీడీపీలు ఇది వరకే పాతాళంలోకి పడిపోయాయన్నారు. ఇప్పుడు రైతుల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలను అభాసుపాలు చేయాలని చూస్తే ప్రజలే తగిన బుద్ధిచెబుతారన్నారు. గురువారం నిర్వహించే సీఎం కేసీఆర్ సభకు కరీంనగర్, నిజామాబాద్ పాత జిల్లాలతో సహా నిర్మల్, వరంగల్ జిల్లాల నుంచి కూడా రైతులు పెద్ద ఎత్తున సమావేశానికి తరలివస్తారని, ఆ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ వీజీగౌడ్, ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, ఆశన్నగారి జీవన్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు, మేయర్ ఆకుల సుజాత తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈటల, చిత్రంలో మంత్రి పోచారం, ఎమ్మెల్సీ వీజీ గౌడ్, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్ గుప్తా



మిషన్ భగీరథ, శ్రీరాంసాగర్, దత్తత గ్రామాలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వీడాలి

సూర్యాపేట, నమస్తే తెలంగాణ ప్రతినిధి: సూర్యాపేట జిల్లాలో మిషన్ భగీరథ పనులు ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా.. అనుకున్నంత వేగంగా జరుగడం లేదు.. దీనికి అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదని విద్యుత్ శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యాన్ని వీడి సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ, శ్రీరాంసాగర్, దత్తత గ్రామాల అభివృద్ధి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు 3,100 కిలోమీటర్ల పైపులైన్ పనులు జరుగాల్సి ఉండగా కేవలం 2వేల కి.మీ. మాత్రమే పూర్తయినట్టు కాంట్రాక్టర్లు చెప్పడంతో మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ మాసాంతానికి పనులు పూర్తి కావాలని, తదనుగుణంగా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. సూర్యాపేట జిల్లాకు సాగునీటిని అందించే శ్రీరాంసాగర్ రెండో దశ పనులపై జరిగిన సమీక్షలో అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నియోజకవర్గంలోని తన దత్తత గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై మంత్రి చర్చించారు. సమావేశంలో ఎమ్మెల్యే గాదరి కిశోర్, కలెక్టర్ సురేంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	6003	6003	1705	1704.72	128.72	128.19
నారాయణపూర్	4779	11359	1615	1613.58	37.646	36.03
జూరాల	7251	4657	1045	1039.21	9.66	6.325
తుంగభద్ర	16890	305	1633	1614.53	100.86	44.68
శ్రీశైలం	411	55	885	778.1	215.807	19.65
నాగార్జునసాగర్	0	621	590	500.40	312.045	115.94
పులిచింతల	1551	1233	175	111.42	45.77	2.12
ప్రకాశం బ్యారేజీ	8054	8054	57.05	55.55	3.070	2.69



(జూన్1 నుంచి ఇప్పటివరకు 320.733 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	3506	3524	1522	1512.18	102.732	66.78
కడెం	125	70	700	687.18	7.6	4.71
ఎస్సారెస్పీ	0	432	1091	1055.20	90.313	9.44
సింగూరు	0	355	1717.93	1708.87	29.91	17.75
నిజాంసాగర్	0	234	1405	1380.20	17.803	1.331
ఎల్లంపల్లి	16	418	485	471.82	20.175	10.35
లోయర్‌మానేరు	0	129	920	893.55	24.07	7.354
ధవళేశ్వరం	37228	37228	45	45	2.93	2.93

అనుమానాస్పదస్థితిలో చిరుత మృతి

ఇబ్రహీంపట్నం: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేట శివారులోని అటవీ ప్రాంతంలో మంగళవారం చిరుత కళేబరాన్ని స్థానికులు గుర్తించారు. హరితహారంలో భాగంగా మొక్కలను నాటేందుకు స్థల పరిశీలనకు అటవీ ప్రాంతానికి వెళ్లిన ఫీల్డ్ అసిస్టెంట్ చిరుత మృతి చెందిన విషయాన్ని గమనించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో రమేశ్ మాట్లాడుతూ అనారోగ్యంతోనే చిరుత మృత్యువాత పడిందన్నారు. చిరుత కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి అవయవాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతామని పేర్కొన్నారు.



చిరుత కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

కాజీపేట(వరంగల్): ప్రేమ విఫలం కావడంతో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం వెలుగుచూసింది. కాజీపేట రైల్వే జీఆర్పీ ఎస్సై దయాకర్ కథనం ప్రకారం.. మంచిర్యాల సీసీఎస్ ప్రాంతానికి చెందిన మేక నరేశ్(24) వరంగల్ నగరంలోని వాగ్దేవి కళాశాలలో ఎంబీఏ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాడు. నరేశ్ సోమవారం రాత్రి హసన్‌పర్తి రోడ్ స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమ విఫలం కావడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నట్టు రాసిన సూసైడ్ నోటు మృతుడి జేబులో లభించింది. సంఘటన స్థలం వద్ద దొరికిన సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చినట్టు రైల్వే ఎస్సై దయాకర్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్టు ఆయన పేర్కొన్నారు.

జీవన వాహిని 'కాళేశ్వరం'

- ఆశ్చర్యానికి లోనైన రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారుల బృందం
- ప్రాజెక్టు ఏర్పాటుతో రాష్ట్రం సుభిక్షం

రామడుగు : తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్ర ప్రజల ప్రమాణాలను పెంచే జీవన వాహినిగా వెలుగొందుతుందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ శివారులో నిర్మిస్తున్న కాళేశ్వరం ఎనిమిదో ప్యాకేజీ పనులను సుమారు 17మంది పోలీసు ఉన్నతాధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సీపీ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఒక మహత్తరమైన యజ్ఞం అన్నారు. ఇక్కడి ప్రాజెక్టు పనుల్లో దేశీయ పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రపంచస్థాయిలో ప్రాజెక్టు నిర్మాణం చేయడం ఐపీఎస్‌లందరినీ ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. బీహెచ్‌ఈఎల్‌తోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమైన ఐఐటీ, తదితర విద్యాలయాల నుంచి అనుభజ్ఞులైన ఇంజినీర్ల సహకారంతో స్వదేశీ పరిజ్ఞానం ఉపయోగించి ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందేవిధంగా ఈ ప్రాజెక్టు ద్వారా నీటిసరఫరా జరుగనుందని వివరించారు. ప్రాజెక్టు పనులను పరిశీలించిన వారిలో హైదరాబాద్ నగర జాయింట్ సీపీ(ట్రాఫిక్) రవీందర్, డీసీపీ అవినాశ్ మహంతి, సెంట్రల్ జోన్ డీసీపీ జోయల్ డేవిస్, డీసీపీ సౌత్‌జోన్ సత్యనారాయణ, డీసీపీ (ట్రాఫిక్ 2) రంగనాథ్, డీసీపీ (ట్రాఫిక్ 1) ఎల్ఎస్ చౌహాన్, డీసీపీ సుమతి, లా అండ్ ఆర్డర్ ఏసీపీ శ్రీనివాసరావు, ఏసీపీ మురళీకృష్ణ, సైఫాబాద్ ఏసీపీ సురేందర్‌రెడ్డి, చిక్కడపల్లి ఏసీపీ నరసయ్య, కరీంనగర్ సీపీ కమలాసన్‌రెడ్డి, ఎస్‌హెచ్‌వోలు, ఇంజినీర్లు ఉన్నారు.



ఇంజినీర్ల పనితీరును వీక్షిస్తున్న ఐపీఎస్ అధికారులు





వరంగల్ నగరంలో కురుస్తున్న వర్షం.. అలుగుపోస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం పారికలవాగు చెరువు

పలు జిల్లాల్లో వర్షం

మరో మూడు రోజులపాటు కురువనున్న వానలు

హైదరాబాద్/న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ: ఛత్తీస్‌గఢ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకు తెలంగాణ, రాయలసీమ మీదుగా ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో కొన్నిచోట్ల సోమవారం రాత్రి, మరికొన్ని చోట్ల మంగళవారం వర్షం కురిసింది. కాగా మరో మూడు రోజులపాటు వానలు కురువనున్నాయి. నిజామాబాద్, సిద్దిపేట, వరంగల్ తదితర జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి.

అత్యధికంగా ఆశ్వాపురంలో..

రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా ఖమ్మం జిల్లా ఆశ్వాపురంలో 10 సెం.మీ., పాల్వంచ, చంద్రుగొండ, పాలకుర్తి, కొత్తగూడెం, పర్వతగిరిలో 6 సెం.మీటర్ల చొప్పున, ముల్కలపల్లి, దుమ్ముగూడెం, బయ్యారం, అశ్వారావుపేటలో 5 సెం.మీ., వెంకటాపురం, గాంధారి, రెంజల్, వర్నిల్లో 4సెం.మీ., చొప్పున వర్షం కురిసినట్టు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

అలుగులు పోస్తున్న చెరువులు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చెరువులు అలుగులు పోస్తున్నాయి. మంగళవారం రాత్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్ రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

నేటినుంచి మూడురోజుల పాటు..

రాష్ట్రంలో పలుచోట్ల మరో మూడు రోజులపాటు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకే రెడ్డి తెలిపారు. ముఖ్యంగా ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, మహబూబాబాద్, భద్రాద్రి, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో బుధవారం అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు.

జడ్డూ తొలిసారి

దుబాయ్: రవీంద్ర జడేజా టెస్ట్‌ల్లో నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా అవతరించాడు. ఇప్పటికే బౌలింగ్‌లో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్న జడ్డూ తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్ ఆల్‌రౌండర్‌గా నిలిచాడు. శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌లో అద్భుత ప్రదర్శన ద్వారా బంగ్లా క్రికెటర్ షకీబల్ హసన్(431)ను అధిగమిస్తూ జడేజా(438) తన కెరీర్‌లో మొదటిసారి నంబర్‌వన్ ర్యాంక్‌ను కైవసం చేసుకున్నాడు. అశ్విన్(418) మూడో ర్యాంక్‌లో ఉన్నాడు. బౌలింగ్‌లో జడేజా(893) టాప్‌లో ఉండగా, అశ్విన్(842) మూడుకు పడిపోయాడు. బ్యాటింగ్ విభాగంలో పుజార(888) ఒక ర్యాంక్ ఎగబాకి మూడో ర్యాంక్‌లో నిలువగా, కెప్టెన్ కోహ్లీ(813) ఐదో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. కొలంబో టెస్ట్‌లో సెంచరీతో మెరిసిన రహానే(776) ఐదు స్థానాలు మెరుగుపర్చుకుని ఆరో ర్యాంక్‌లో నిలువగా, ఆసీస్ కెప్టెన్ స్టీవ్‌స్మిత్(941) టాప్‌లో ఉన్నాడు.

కైనన్‌కు ఆసియా షూటింగ్‌లో కాంస్యం



న్యూఢిల్లీ: హైదరాబాద్ షూటర్ కైనన్ చినాయ్ మరోసారి అంతర్జాతీయ వేదికపై సత్తా చాటాడు. కజకిస్థాన్‌లోని అస్థానాలో జరిగిన ఆసియా షాట్‌గన్ చాంపియన్‌షిప్‌లో కైనన్ పతకంతో మెరిశాడు. పురుషుల ట్రాప్ ఈవెంట్‌లో కైనన్ కాంస్య పతకం సాధించాడు. తొలుత క్వాలిఫయింగ్ రౌండ్‌లో కైనన్ 125 పాయింట్లకు 116 స్కోరు చేసి ఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. ఆ తర్వాత ఫైనల్స్‌లో కైనన్ 30 పాయింట్లు స్కోరు చేసి మూడోస్థానంలో నిలిచాడు. 39 పాయింట్లు స్కోరుచేసిన కువైట్ షూటర్ అబ్దుల్ రెహమాన్ ఈ టోర్నీలో సరికొత్త రికార్డుతో స్వర్ణం ఎగురేసుకుపోయాడు. కువైట్‌కే చెందిన తలాల్ అల్ రషీద్ 38 పాయింట్లతో రజత పతకం అందుకున్నాడు. మిగతా భారత షూటర్లలో జొరావర్‌సింగ్ సంధూ, బీరేన్‌దీప్ సోధిలు వరుసగా 17, 36వ స్థానాల్లో నిలిచి ఫైనల్స్ చేరకుండానే వెనుదిరిగారు.

జడేజా స్థానంలో అక్షర్ పటేల్!

న్యూఢిల్లీ: శ్రీలంకతో మూడో టెస్టులో ఆడకుండా సస్పెన్షన్ వేటు పడిన రవీంద్ర జడేజా స్థానంలో లెఫ్టార్మ్ స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను జట్టులోకి తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. చైనామెన్ బౌలర్ కుల్దీప్ యాదవ్‌కు తుది జట్టులో చోటు ఖాయమైన నేపథ్యంలో అతనికి కవర్‌గా అక్షర్ జట్టులోకి రానున్నాడు. ప్రస్తుతం లంకలోనే ఉన్న చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్.. కోచ్ రవిశాస్త్రితో సంప్రదించిన తర్వాత దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఒకవేళ అక్షర్ ఎంపిక ఖాయమైతే.. దక్షిణాఫ్రికాలో ఉన్న అతను గురువారం జట్టుతో కలిసే అవకాశముంది. మరోవైపు తండ్రి మరణం కారణంగా దక్షిణాఫ్రికా నుంచి భారత్‌కు వచ్చేసిన స్పిన్నర్ జయంత్ యాదవ్‌ను కూడా ప్రత్యామ్నాయంగా పరిశీలిస్తున్నారు. కానీ అతను కోలుకోవడానికి మరి కొంత సమయం పట్టనుండటంతోఅక్షర్‌ను తీసుకునే చాన్స్ ఎక్కువగా ఉంది.



ఆత్మవిశ్వాసమే అతనికి ఆలంబన. అలుపెరుగకుండా బౌలింగ్ చేయడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. ప్రత్యర్థి ఎవరైనా పడగొట్టడమే అతని లక్ష్యం. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు తాను ఉన్నానంటూ మీసం మేలేసే తత్వం. సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత వరుస విజయాల్లో అతని పాత్ర అమోఘం. అనతి కాలంలోనే జట్టుకు ఆయువుపట్టుగా ఎదిగిన అతనే టీమ్‌ఇండియా సూపర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా. అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌నూ ఇరుగదీస్తున్న జడ్డూ ఇప్పుడు టెస్టుల్లో నంబర్‌వన్ ఆల్‌రౌండర్.

నంబర్..1

ఆల్‌రౌండర్, బౌలింగ్ విభాగాల్లో జడేజాకు టాప్ ర్యాంక్

(నమస్తే తెలంగాణ క్రీడావిభాగం)

రవీంద్రసిన్హ్ అనిరుధ్‌సిన్హ్ జడేజా..సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత వరుస విజయాల పరంపరలో కీలక భూమిక పోషిస్తున్న జడేజా పూర్తి పేరు ఇది. గుజరాత్‌లోని సౌరాష్ట్ర నుంచి జాతీయస్థాయికి ఎదిగిన 28 ఏండ్ల జడేజా అనతికాలంలోనే టీమ్ ఇండియాలో కీలక ఆటగానిగా మారాడు. కెరీర్ ఆరంభంలో నిలకడలేని ఆటతీరుతో పలుమార్లు జాతీయజట్టులోకి వస్తూ పోయిన జడ్డూ ఆ తర్వాత తనకంటూ సుస్థిర స్థానాన్ని ఏర్పర్చుకున్నాడు. చోటు కోల్పోయిన ప్రతిసారి దేశవాళీ టోర్నీల్లో సత్తాచాటుతూ తిరిగి జట్టుకు ఎంపికయ్యాడు. ముఖ్యంగా గత ఏడాదిన్నర కాలంగా అతను ఆడని టెస్ట్ మ్యాచ్ లేదంటే విశేషం. సహచర స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ జతగా టీమ్‌ఇండియాకు చిరస్మరణీయ విజయాలందించాడు. భారత్ పర్యటనకు వచ్చిన న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియాపై వరుస సిరీస్ విజయాలు సాధించడంలో జడ్డూది ముఖ్య పాత్ర. సంప్రదాయ స్పిన్‌కు స్వర్గధామమైన ఉపఖండ పిచ్‌లపై ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌కు సింహస్వప్నంలా మారుతూ వికెట్లు పడగొట్టడంలో అతనిది అందవేసిన చేయి. లెఫ్ట్‌ఆర్మ్ స్పిన్ మాయాజాలంతో బ్యాట్స్‌మెన్‌కు ఉక్కిరిబిక్కిరి చేస్తూ సాగుతుంది అతని బౌలింగ్. అశ్విన్‌తో పోటాపోటీగా సాగే జడేజా బౌలింగ్‌లో చాలా వైవిధ్యం ఉంటుంది. ఇతగాడు గత 14 టెస్ట్‌ల్లో 84 వికెట్లు పడగొట్టడమే ఇందుకు నిదర్శనం. దీనికితోడు ఆరు అర్ధసెంచరీలు తన ఖాతాలో వేసుకున్నాడు. శ్రీలంకతో కొలంబోలో జరిగిన రెండో టెస్ట్‌లో సుడిగాలి ఇన్నింగ్స్‌తో భారత్‌కు భారీ స్కోరు కట్టబెట్టాడు. ఇదే జడేజాను నంబర్‌వన్ ఆల్‌రౌండర్, బౌలర్‌గా నిలబెట్టింది.

ఎంజాయ్‌మెంట్‌కు దూరంగా

కొలంబో టెస్ట్‌లో ఘనవిజయం తర్వాత జట్టు ఆటగాళ్లందరూ కలిసి సేదతీరితే జడేజా మాత్రం చీఫ్ కోచ్ రవిశాస్త్రితో పాటు సహాయక సిబ్బందితో గడిపాడు. మొదటి ఇన్నింగ్స్‌లో అర్ధసెంచరీకి తోడు రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన జడేజా దురుసు ప్రవర్తన కారణంగా మూడో టెస్ట్‌కు దూరమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో క్లిష్ట సమయాల్లో ఆటగాళ్లకు అండగా నిలబడే శాస్త్రి.. మరోమారు తన గురుతర బాధ్యత తను నిర్వర్తించాడు. జడ్డూలో ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసే ప్రయత్నం చేశాడు శాస్త్రి. సహజంగా దుందుడుకు స్వభావి అయిన జడేజా గతంలోనూ ప్రత్యర్థి జట్ల ఆటగాళ్లతో ఒకింత దురుసుగా ప్రవర్తించాడు. 2014 ఇంగ్లండ్ పర్యటనలో పేసర్ జేమ్స్ ఆండర్సన్‌తో పెవిలియన్‌లో బాహాబాహీగా గొడవకు దిగాడు. ఇరు దేశాల క్రికెట్ బోర్డులు కలుగజేసుకోవడంతో వివాదం సద్దుమణిగి 50 శాతం మ్యాచ్ ఫీజు జరిమానాతో బయటపడ్డాడు. అప్పటి కెప్టెన్ ధోనీ..జడేజాకు పూర్తి మద్దతుగా నిలిచాడు. తాజాగా లంకతో రెండో టెస్ట్‌లో కరుణరత్నే పట్ల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన కారణంగా ఐసీసీ టెస్ట్ మ్యాచ్ సస్పెన్షన్‌తో పాటు 50 శాతం జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకుంది. దీన్ని కొంత మంది భారత మాజీ ఆటగాళ్లు తీవ్రంగా వ్యతిరేకించారు. జరిమానాతో వదిలేయాల్సింది పోయి సస్పెండ్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని విరుచుకుపడ్డారు. ఇక జడేజా గైర్హాజరీలో చైనామన్ బౌలర్ కుల్దీప్‌యాదవ్ మూడో టెస్ట్‌లో బరిలోకి దిగే అవకాశముంది.

విదేశాల్లోనూ మెరువాలి

స్వదేశంలో భారత్‌కు తిరుగులేదు. ఎదురైన ప్రత్యర్థి జట్లను స్పిన్‌తో పడగొడుతూ వరుస విజయాలతో దూసుకెళుతున్నది. ఈ క్రమంలో ఇప్పటికే దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, ఇంగ్లండ్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా లాంటి జట్లను మట్టికరిపించి నంబర్‌వన్‌ర్యాంక్‌ను అధిరోహించింది. 2015 నుంచి ఇప్పటి వరకు వెస్టిండీస్, శ్రీలంక పర్యటనలు మినహా వేరే దేశాల్లో భారత్ పర్యటించలేదు. కానీ వచ్చే ఏడాదిలో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా రూపంలో కఠినమైన పర్యటనలు మనకు ఎదురవుతున్నాయి. ఉపఖండ పిచ్‌లపై స్పిన్‌తో విజయాలు నమోదు చేసుకున్న టీమ్‌ఇండియాకు పేస్‌కు స్వర్గధామంగా నిలిచే విదేశీ పిచ్‌లపై స్పిన్ అస్త్రం పారకపోవచ్చు. ఈ నేపథ్యంలో అంతోఇంతో స్పిన్‌కు సహకరించే విదేశీ పిచ్‌లపై కూడా మనోళ్లు మెరువాలన్నదే ఆశ.

అతను విలువైన ఆటగాడు

ఈ మాట అంటుంది మరెవరో కాదు సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత్‌కు అప్రతిహత విజయాలందిస్తున్న కెప్టెన్ కోహ్లీ. 'బ్యాటింగ్, బౌలింగ్‌లోనూ మెరుగ్గా రాణించగల జడేజా లాంటి ఆటగాళ్లు దొరకడం కష్టం. అందుకే అతను ఎంతో విలువైన ఆటగాడు. టెస్ట్‌ల్లో జడ్డూ పాత్ర అమోఘం. ఇలాంటి నిఖార్సైన ఆల్‌రౌండర్ వల్లే..జట్టు సమతుల్యానికి ప్రధాన కారణం. ఆట ఏ దశలోనైనా వేగంగా 60–70 పరుగులు సాధించడంలో జడేజా సిద్ధహస్తుడు' అని కోహ్లీ ప్రశంసలు కురిపించాడు.



జట్టు నుంచి నన్ను తీసేయమని అడిగా

కోల్‌కతా: మహిళల ప్రపంచ కప్ తొలి రెండు మ్యాచ్‌ల్లో తన ప్రదర్శన బాగా లేకపోవడంతో జట్టు నుంచి తప్పించాలని కోరినట్లు పేసర్ జులన్ గోస్వామి వెల్లడించింది. కానీ కోచ్ ఇందుకు ఇష్టపడకపోవడం, కెప్టెన్ మిథాలీ బాగా మద్దతివ్వడంతో తర్వాతి మ్యాచ్‌ల్లో పుంజుకున్నానని చెప్పింది. మంగళవారం నేతాజీ ఇండోర్ స్టేడియంలో జరిగిన బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (క్యాబ్) వార్షిక అవార్డుల కార్యక్రమంలో భాగంగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ.. జులన్‌ను ఘనంగా సత్కరించింది. క్యాబ్ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీతో కలిసి రూ. 10 లక్షల చెక్‌ను ఆమెకు అందజేసింది. 'టోర్నీ ఆరంభంలో నా ప్రదర్శన నిరాశపర్చింది. వెస్టిండీస్‌తో మ్యాచ్ తర్వాత నా బౌలింగ్ అంచనాలకు అనుగుణంగా లేదు. తర్వాతి మ్యాచ్‌లకు నన్ను తప్పించమని కోచ్ తుషార్ దగ్గరకు వెళ్లి అడిగా. కానీ అతను నో అన్నాడు. నీవు జట్టులో ఉండాల్సిందే, బౌలింగ్ సారథ్యం వహించాల్సిందేనని ఖరాఖండిగా చెప్పాడు' అని జులన్ పేర్కొంది. కోచ్ వ్యాఖ్యలు తనకు బాగా స్ఫూర్తినిచ్చాయని చెప్పిన జులన్.. మిథాలీతో కలిసి ఎక్కువసేపు ప్రాక్టీస్ చేశానని వెల్లడించింది. దాని ఫలితం ఆసీస్ కెప్టెన్ మెగ్ లానింగ్‌ను డకౌట్ రూపంలో కనిపించిందని చెప్పింది. 'ఆసీస్‌పై గెలువడం మాకు చాలా కీలకం. ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టు వాళ్లది. లానింగ్ బెస్ట్ ప్లేయర్. స్క్వేర్ కట్స్‌లో కొట్టడంతో ఆమె దిట్ట. నీవు కోరుకున్నట్లు బౌలింగ్ చేయమని మిథాలీ కూడా నాకు మంచి మద్దతిచ్చింది. అంతే సరైన ప్రాంతాల్లో బంతులు వేస్తూ లానింగ్‌ను డకౌట్ చేశా. ఆ తర్వాత అన్ని మాకు అనుకూలంగా రావడంతో మ్యాచ్ గెలిచాం' అని జులన్ పేర్కొంది. తన క్రికెట్ కెరీర్‌లో క్యాబ్ అన్ని రకాలుగా చాలా సహకారం అందించిందని కృతజ్ఞతలు తెలిపింది.



జులన్ గోస్వామిని సన్మానిస్తున్న పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, క్యాబ్ అధ్యక్షుడు గంగూలీ

అయ్యర్ అదరగొట్టాడు



శ్రేయాస్ అయ్యర్ (140★)

యువ భారత్‌దే ముక్కోణం టైటిల్

ప్రిటోరియా: ముక్కోణపు వన్డే సిరీస్‌ను యువ భారత్ మళ్లీ నిలబెట్టుకుంది. మంగళవారం జరిగిన ఫైనల్లో భారత్ 'ఎ' 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా 'ఎ'పై ఘనవిజయం సాధించింది. సఫారీలు నిర్దేశించిన 268 పరుగుల లక్ష్యాన్ని శ్రేయాస్ అయ్యర్(131 బంతుల్లో 140, 11ఫోర్లు, 4సిక్స్‌లు) అజేయ సెంచరీతో భారత్ 'ఎ' 46.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అయ్యర్ సెంచరీకి తోడు విజయ్ శంకర్(72) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. 20 పరుగులకే శాంసన్(12), కరుణ్ నాయర్(4) వికెట్లు కోల్పోయిన దశలో వీరిద్దరు కలిసి మూడో వికెట్‌కు 141 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ముఖ్యంగా టోర్నీ లీగ్ మ్యాచ్‌ల్లో విఫలమైన అయ్యర్..సఫారీ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. డాలా(2/49)కు రెండు వికెట్లు దక్కాయి. తొలుత బెహర్డీన్(101 నాటౌట్), ప్రిటోరియస్(58) రాణించడంతో దక్షిణాఫ్రికా 'ఎ' నిర్ణీత 50 ఓవర్లలో 267/7 స్కోరు చేసింది. 115 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న దశలో వీరిద్దరు కలిసి ఆరో వికెట్‌కు 101 పరుగులు జోడించారు. శార్దుల్ ఠాకూర్(3/52), సిద్దార్థ్ కౌల్(2/55) ఆకట్టుకున్నారు. సెంచరీతో రాణించిన అయ్యర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కగా, మనీశ్ పాండేకు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' లభించింది.

హర్యానా బోణీ



నాగ్‌పూర్: ప్రొ కబడ్డీ సీజన్ -5లో అరంగేట్రం చేసిన హర్యానా స్టీలర్స్ ఎట్టకేలకు శుభారంభం చేసింది. లీగ్‌లో పరాజయమన్నదే లేకుండా అజేయంగా దూసుకెళుతున్న గుజరాత్ ఫార్చ్యూనర్ జట్టును ఓడించి తొలి గెలుపును అందుకున్నది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో హర్యానా 32–20 పాయింట్ల తేడాతో నెగ్గింది. హర్యానా జట్టులో మోహిత్ చిల్లార్ 7, వికాస్ కాందోలా 6, సురేందర్ నాడా 6 పాయింట్లు చొప్పున సాధించారు. సమిష్టిగా రాణించడంలో విఫలమైన గుజరాత్ జట్టు పరాజయం పాలైంది. తొలి ఏడు నిమిషాల్లోనే 18–11 తేడాతో ముందంజ వేసిన హర్యానా స్టీలర్స్ ఆట ఆద్యంతం ఆధిక్యాన్ని కాపాడుకున్నారు. హర్యానా జట్టుపై గుజరాత్ డిఫెన్స్‌లో ఘోరంగా విఫలం కాగా.. రైడర్లు కూడా అంతగా ఆకట్టుకోలేకపోయారు. గుజరాత్ జట్టులో రాజ్‌పుత్ 5, సచిన్ 8 పాయింట్లు సాధించారు. రెండు జట్లూ 10 రైడింగ్ పాయింట్లు సాధించినా.. ట్యాకిల్ పాయింట్లలో హర్యానా పైచేయి ప్రదర్శించింది. గుజరాత్ జట్టు 9 ట్యాకిల్ పాయింట్లు సాధించగా.. 16 ట్యాకిల్ పాయింట్లతో హర్యానా స్టీలర్స్ ఘన విజయాన్నందుకుంది.

టైటాన్స్ 21.. బెంగళూరు 21

వరుస పరాజయాల నుంచి తెలుగు టైటాన్స్‌కు కాస్త ఊరట దక్కింది.. వరుసగా 5 మ్యాచ్‌లలో పరాజయంతో ఆత్మవిశ్వాసం కోల్పోయిన జట్టు మంగళవారం బెంగళూరు బుల్స్‌తో జరిగిన టఫ్ ఫైట్‌లో సత్తా చాటింది. తొలుత వెనుకబడినా అద్భుతంగా పుంజుకున్న జట్టు అసమాన పోరాటంతో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. నిర్ణీత సమయం ముగిసే సరికి ఇరుజట్లు 21–21 పాయింట్లతో సమవుజ్జీలుగా నిలువడంతో రెండు జట్లు పాయింట్లను పంచుకున్నాయి. టైటాన్స్ జట్టులో కెప్టెన్ రాహుల్ చౌదరి మరోమారు చెలరేగాడు. రాహుల్ 8 రైడింగ్ పాయింట్లు సాధించగా.. విశాల్ భరద్వాజ్ 2, రోహిత్ రానా1, రాకేశ్2 పాయింట్లతో రాహుల్‌కు అండగా నిలిచారు. బెంగళూరు బుల్స్‌లో ఆశిష్ 3, ప్రీతమ్ చిల్లార్, మహేంద్రసింగ్ రెండేసి రైడింగ్ పాయింట్లు సాధించారు. తెలుగు టైటాన్స్ మొత్తంగా 14 రైడింగ్ పాయింట్లతోపాటు 6 ట్యాకిల్ పాయింట్లు సాధించినా.. జట్టు ఓసారి ఆలౌట్ కావడంతో మ్యాచ్‌లో విజయం సాధించే అవకాశం చేజారింది. బెంగళూరు జట్టు 10 రైడింగ్ పాయింట్లు, 7 ట్యాకిల్ పాయింట్లతోపాటు 2 ఎక్స్‌ట్రా పాయింట్లు సాధించి టైటాన్స్ విజయాన్ని అడ్డుకుంది.

ఒలింపిక్స్‌లో క్రికెట్‌పై మీ వైఖరేంటి?

- **బీసీసీఐతో నేటి భేటీలో చర్చించనున్న సీవోఏ**

న్యూఢిల్లీ: ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చడంపై బీసీసీఐ అభిప్రాయం ఏంటీ? దేశవాళీ ఆటగాళ్లకు జీతభత్యాలు ఎంత ఇవ్వాలి? వంటి అంశాలపై బుధవారం జరిగే సమావేశంలో పరిపాలన కమిటీ (సీవోఏ).. బోర్డు ఉన్నతాధికారులతో చర్చలు జరుపనుంది. దీంతోపాటు రాష్ట్ర సంఘాల్లో చోటు చేసుకున్న ఆర్థిక అవకతవకలపై డెలాయిట్ సమర్పించే నివేదికను క్షుణ్ణంగా పరిశీలించనుంది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ప్రవేశపెట్టాలని ఐసీసీ శతధా ప్రయత్నిస్తున్నది. ఇది సాధ్యంకావాలంటే బీసీసీఐ మద్దతు చాలా అవసరం. కానీ బోర్డులోని చాలా మంది ఐసీసీ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తుండటంతో సీవోఏ దీనిపై దృష్టిపెట్టింది. జస్టిస్ లోధా సిఫారసులను అమలు చేయడంలో ఎదురవుతున్న పరస్పర విరుద్ధ ప్రయోజనాలపై కూడా కమిటీ చర్చించనుంది. మరోవైపు స్వదేశంలో జరిగే సిరీస్‌ల కోసం కొంత మంది కామెంటేటర్లను ఎంపిక చేసిన బోర్డు దానికి ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. అయితే ఇందులో హర్షాబోగ్లే పేరు ఉందా? లేదా? అన్నది సస్పెన్స్‌గా మారింది.

ఇంకెన్నాళ్లు వేచి చూడాలి!

- **ప్రభుత్వ ఉద్యోగం కోసం ఒలింపిక్ పతక విజేత విజయ్ కుమార్ ఆవేదన**



షిమ్లా: తనకు ఇస్తానన్న ప్రభుత్వ ఉద్యోగం కోసం ఇంకెన్నాళ్లు వేచి చూడాలని లండన్ ఒలింపిక్స్ రజత పతక విజేత, టాప్ షూటర్ విజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశాడు. హామీ ఇచ్చి ఐదేండ్లు గడిచినా.. ఇంతవరకు అది ఆచరణ సాధ్యం కాలేదని వాపోయాడు. ప్రభుత్వ పెద్దలను ఎన్నిసార్లు కలిసినా తన మొర ఆలకించడం లేదన్నారు. 'హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసి నా ఆవేదనను చెప్పా. ఉద్యోగం ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంలో క్లాస్–1 ఉద్యోగం వస్తుందని ఆశ పెట్టుకున్నా. కానీ ఆ కల నెరవేరేలా లేదు' అని విజయ్ పేర్కొన్నాడు. మహిళల ప్రపంచకప్‌లో ఆకట్టుకున్న సుష్మా వర్మకు హిమాచల్ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం డీఎస్‌పీ ఉద్యోగాన్ని ఇచ్చిన నేపథ్యంలో విజయ్ ఈ వాఖ్యలు చేశాడు. కామన్వెల్త్‌లో స్వర్ణంతో పాటు దాదాపు 150 పతకాలు సాధించిన విజయ్.. లండన్ ఒలింపిక్స్‌లో రజతం నెగ్గి భారత్ ప్రతిష్ఠను ఇనుమడింపచేశాడు. దీంతో విజయ్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా.. అది ఇంకా అమలు చేయలేదు. సుష్మకు ఉద్యోగం ఇచ్చిన ప్రభుత్వం.. ఒలింపిక్ పతక విజేత అయిన విజయ్ అంశంపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనా చేయకపోవడం విచారకరం.

జమైకా పసిడి గెలిచె



మెక్‌లాయిడ్

లండన్: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జమైకా స్టార్లు ఉసేన్ బోల్ట్, ఎలానీ థాంప్సన్‌లు నిరాశపరిస్తేనేం, ఆ దేశానికి చెందిన మరో అథ్లెట్ పసిడి గెలిచి మురిపించాడు. పురుషుల 110 మీటర్ల హర్డిల్స్‌లో ఒమర్ మెక్‌లాయిడ్ చాంపియన్‌గా నిలిచి జమైకాకు తొలి స్వర్ణ పతకాన్ని అందించాడు. 23ఏండ్ల మెక్‌లాయిడ్ 13.04 సెకన్లలో హర్డిల్స్‌ను దాటి స్వర్ణం అందుకున్నాడు. డిఫెండింగ్ చాంపియన్ సెర్జీ షుబెన్‌కోవ్ రజత పతకానికి పరిమితమయ్యాడు. హంగేరీ అథ్లెట్ బలజాస్ కాంస్యం నెగ్గాడు.

'ఆసియా కప్‌ను భారత్ నుంచి తరలించండి'

కరాచీ: భారత్‌లో జరుగాల్సిన అండర్–19 ఆసియా క్రికెట్ కప్ టోర్నమెంట్‌ను మరో వేదికకు తరలించాలంటూ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) డిమాండ్ చేస్తున్నది. షెడ్యూల్ ప్రకా రం ఆసియా కప్ నవంబర్‌లో భారత్‌లోని బెంగళూరులో జరుగాల్సింది. అయితే, తమకు భద్రత కారణాల రీత్యా టోర్నీని భారత్‌లో గాకుండా తటస్థ వేదికలో నిర్వహించాల్సిందిగా ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ)ను కోరనున్నట్లు పీసీబీ చెప్పింది. 'ఈనెల చివరివారంలో కొలంబో వేదికగా ఆసియా క్రికెట్ కౌన్సిల్ అభివృద్ధి కమిటీ సమావేశం జరుగనుంది. ఆ భేటీలో ఆసియా కప్ సమస్యను ఏ సీసీ దృష్టికి తీసుకెళ్తాం. ఇటీవల భారత్‌లో జరిగిన పలు ఈవెంట్లకు పాక్ క్రీడాజట్లకు వీసాలు ఇచ్చేందుకు తిరస్కరించారు. ఈ పరిస్థితుల్లో అక్కడ మేం ఆడాలంటే భద్రత సమస్యలు తలెత్తుతాయన్న సందేహాలున్నాయి. అందుకే ఆసియా కప్‌ని తరలించాలని అడుగుతున్నాం' అని పీసీబీ ప్రతినిధి తెలిపారు.

హెరాత్‌కు విశ్రాంతి

పల్లెకెలె: భారత్‌తో మూడో టెస్టు నేపథ్యంలో శ్రీలంక స్టార్ స్పిన్నర్ హెరాత్‌కు విశ్రాంతినిచ్చారు. వెన్నునొప్పితో పాటు పనిభారం పెరుగడం వల్లే ఈ నిర్ణ యం తీసుకున్నామని లంక బోర్డు ప్రకటించింది. మూడు వారాల నుంచి హెరాత్ నాన్‌స్టాప్‌గా క్రికెట్ ఆడుతున్నాడని పేర్కొంది. జింబాబ్వేతో జరిగే ఏకైక టెస్టులో అతను 71.1 ఓవర్లు, భారత్‌తో రెండు టెస్టుల్లో 91 ఓవర్లు బౌలింగ్ చేయడంతో బాగా అలసటకు గురైనట్లు సమాచారం.



హైదరాబాద్‌లో జరిగిన ఆలిండియా ఓపెన్ ఫిడే రేటెడ్ చెస్ టోర్నీలో విజేతగా నిలిచిన చక్రవర్తి రెడ్డికి ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

ఆగస్టు, సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతం

భారత వాతావరణశాఖ అంచనా



న్యూఢిల్లీ: రానున్న రెండు నెలల్లో దేశవ్యాప్తంగా సాధారణ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. సగటు వర్షపాతంతో పోల్చితే ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 94-100 శాతం వర్షపాతం నమోదు కావచ్చునని ఐఎండీ డైరెక్టర్ జనరల్ కేజే రమేశ్ మంగళవారం తెలిపారు. ఆగస్టులో 99 శాతం వర్షపాతం నమోదవుతుందని అంచనా వేశారు. జూన్ 1వ తేదీ నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు సాధారణం కంటే మూడు శాతం తక్కువ వర్షాలు కురిశాయన్నారు. దేశంలోని చాలా ప్రాంతాల్లో సగటుకన్నా తక్కువ వర్షపాతం నమోదైందని, ఫలితంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని ఎక్కువ ప్రాంతాల్లో అనావృష్టి పరిస్థితులు ఉన్నట్లు వెల్లడించారు. అదేసమయంలో గుజరాత్, రాజస్థాన్‌తోపాటు ఈశాన్య భారతదేశంలోని పలు రాష్ట్రాలు అధిక వర్షాలు, వరదలతో ఇబ్బంది పడ్డాయన్నారు. ఎల్‌నినో, పసిఫిక్ సముద్రంపై నుంచి వీచిన వేడిగాలుల ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిశాయని పేర్కొన్నారు. 2018 వర్షాకాలం వరకు వీటి ప్రభావం కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం హిందూ మహాసముద్రంపై ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయని దీంతో రాబోయే రెండు నెలలపాటు సాధారణ వర్షపాతం కురుస్తుందని వివరించారు.

వరంగల్‌లో టాస్క్ కేంద్రం

ఎమ్మెల్యేల వినతికి సానుకూలంగా స్పందించిన మంత్రి కేటీఆర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని ఐటీ, పరిశ్రమశాఖ మంత్రి కే తారక రామారావు అన్నారు. ఇప్పటికే ఐటీ కంపెనీలను నెలకొల్పామని చెప్పారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ శాఖను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, దాస్యం వినయ్‌భాస్కర్ మంగళవారం సచివాలయంలో మంత్రి కేటీఆర్‌ను కలిసి వరంగల్‌లో టాస్క్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలో 30 వేల మంది విద్యార్థులు కోచింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారని, టాస్క్ కేంద్రం ఏర్పాటు చేసి వారికి శిక్షణ అందించాలన్నారు. ఈ నేపథ్యంలో త్వరలో వరంగల్‌లో పర్యటించి టాస్క్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవాలని టాస్క్ సీఈవో సుజీవ్ నాయర్‌ను మంత్రి కేటీఆర్ ఆదేశించారు. వరంగల్‌లో టాస్క్ శాఖను ఏర్పాటు చేస్తే సహకారం అందిస్తామని మేధా ఇంజినీరింగ్ వర్క్స్, యశోద దవాఖాన యాజమాన్యాలు ముందుకొచ్చాయి.

నవంబర్‌లో హైదరాబాద్‌కు ఇవాంక!

జీఈఎస్ సమ్మిట్‌కు హాజరుకానున్న ట్రంప్ కూతురు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూతురు ఇవాంక ట్రంప్ హైదరాబాద్ రానున్నారు. ఈ ఏడాది నవంబరు చివర్లో జరిగే గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్ (జీఈఎస్)లో ఆమె పాల్గొంటారు. ఇటీవల అమెరికా పర్యటనకు వెళ్లిన భారత ప్రధాని నరేంద్రమోదీ భారత్‌లో జరిగే జీఈఎస్‌లో పాల్గొనాల్సిందిగా ఇవాంకను ఆహ్వానించారు. మోదీ ఆహ్వానం పట్ల ట్రంప్ అప్పట్లో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సదస్సుకు హాజరయ్యే అమెరికా ప్రతినిధుల బృందానికి ఆమె నేతృత్వం వహిస్తారు. నిత్యం రాజకీయాలకు దూరంగా ఉండటానికే ఆసక్తి చూపించే 35 ఏండ్ల ఇవాంక.. భర్త జారేడ్ కుష్నర్‌తో కలిసి డొనాల్డ్ ట్రంప్‌నకు కీలక సలహాదారుగా వ్యవహరిస్తున్నారు. ప్రప్రథమంగా గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌ను 2010లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా వాషింగ్టన్ డీసీలో ఆరంభించారు. 2017లో జీఈఎస్ సమ్మిట్‌ని భారత్‌లో నిర్వహిస్తామని ఈ ఏడాది మోదీ, డొనాల్డ్ ట్రంప్ కలిసి సంయుక్తంగా ప్రకటించారు. ఆధునిక ఆవిష్కరణలకు సరికొత్త చిరునామాగా నిలుస్తున్నందు వల్లే ఈ సదస్సుకు భారతదేశాన్ని ఎంపిక చేసినట్లు వారు వెల్లడించారు. ఈ సదస్సుకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నారు. భారత్‌లో జీఈఎస్ నిర్వహణపై ఉన్నతాధికారుల బృందం తీవ్రంగా చర్చించి వేదికగా హైదరాబాద్‌ను ఎంపిక చేసింది. ఈ సదస్సు నిర్వహణకు నీతి ఆయోగ్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్నది.

హెచ్-1బీ ఆంక్షలతో అమెరికాకే నష్టం!

సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ వెల్లడి



వాషింగ్టన్, ఆగస్టు 8: హెచ్-1బీ వీసాపై ఆంక్షలు విధించడం వల్ల అమెరికాకే నష్టం జరుగుతుందా? అమెరికా ఆదాయంపై దీని ప్రభావం పడనుందా?.. అవునని అంటున్నది ఓ నివేదిక. ఈ వీసాపై ఆంక్షలు విధించడం వల్ల భారత్ తదితర దేశాల నుంచి వచ్చే మేధావుల సంఖ్య తగ్గిపోతుందని, తద్వారా వారి సేవలను అమెరికా కోల్పోవాల్సి వస్తుందని సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్(జీసీడీ) తన నివేదికలో పేర్కొన్నది. ఫలితంగా ఐటీ ఉత్పత్తుల్లో పేరొందిన అమెరికా క్రమంగా తన స్థానాన్ని కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించింది. అమెరికాలోని ఐటీ రంగంపై రూపొందించిన ఈ నివేదికలో 2000 నుంచి అమెరికాలో వలసలు, ఐటీ ఉత్పత్తుల మధ్య సంబంధాన్ని జీసీడీ పరిశీలించింది. 2010లో అమెరికా ఉద్యోగుల్లో ఒక్కొక్కరు 431 డాలర్ల విలువైన సేవలను ఉత్పత్తి చేయగా.. ఇతర దేశాలకు చెందిన వాళ్లు సగటున 1,345 డాలర్ల సేవలను ఉత్పత్తి చేశారు. ఇదంతా హెచ్-1బీ వీసాల వల్లనే సాధ్యమైందని నివేదిక తెలిపింది. ఈ వీసా విధానం వల్ల అమెరికా ఐటీ ఉద్యోగులు కొన్ని ప్రతికూలతలను ఎదుర్కొంటున్నప్పటికీ అమెరికా, భారత్ కలిసి సుమారు 17.3 బిలియన్ డాలర్ల మిగులు ఆదాయాన్ని సాధించాయని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో ఐటీ రంగంలో ఇరుదేశాలు సహకరించుకోవడం మంచిదని, భవిష్యత్ తరాలకు కూడా ప్రయోజనకరంగా ఉంటుందని నివేదిక సూచించింది.

జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి హోదాపై

నెలరోజుల్లో సమాధానమివ్వండి

కేంద్రాన్ని కోరిన సుప్రీంకోర్టు

ఢిల్లీ, ఆగస్టు 8:

జమ్ముకశ్మీర్ ప్రత్యేక స్వయంప్రతిపత్తి హోదాను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సమాధానమివ్వాల్సిందిగా సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక స్వయంప్రతిపత్తి హోదాను కల్పించిన ఆర్టికల్ 370ని రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ఏప్రిల్11న ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. దీనిపై సర్వోన్నత న్యాయస్థానంలోనే తేల్చుకోవాల్సిందిగా సూచించడంతో, పిటిషనర్ విజయలక్ష్మి ఝా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అంతేగాక జమ్ముకశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక రాజ్యాంగాన్ని న్యాయవిరుద్ధమైనదిగా, చట్టపరిధిలోకి రానిదిగా గుర్తించాలని కూడా పిటిషన్‌లో కోరారు. దీనిని విచారణకు స్వీకరించిన చీఫ్‌జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్‌లు ఆదర్శ్ గోయల్,డీవై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై నాలుగువారాల్లోగా తన



స్పందనను తెలియజేయాలని కేంద్రాన్ని కోరింది. తన పిటిషన్‌ను పూర్తిగా చదువకుండానే హైకోర్టు తోసిపుచ్చిందని విజయలక్ష్మి ఝా తెలిపారు. ఆర్టికల్ 370 అనేది తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనని, 1957లో రాజ్యాంగ పరిషత్ రద్దు కావడంతోనే దాని కాలవ్యవధి ముగిసిందని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్రపతి నుంచికానీ, పార్లమెంటు, భారత ప్రభుత్వం నుంచి కానీ ఎలాంటి అనుమతి పొందాల్సిన అవసరమే లేని విశేషాధికారం జమ్మూకశ్మీర్ ప్రత్యేక రాజ్యాంగానికి కల్పించడం అసంబద్ధమైనదని ఆమె తెలిపారు. ఆర్టికల్ 370పై 1969లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రస్తుత అంశానికి భిన్నమైనదని, దానిని ఇప్పుడు ప్రస్తావించలేమని విజయలక్ష్మి ఝా అభిప్రాయపడ్డారు. 'నా పిటిషన్‌ను స్వీకరించిన 13నెలల తర్వాత హైకోర్టు తిరస్కరిస్తున్నట్లు ప్రకటించింది' అని ఆమె వివరించారు.

ముస్లిమేతరులకు మైనార్టీ హోదాపై పిటిషన్

జమ్ముకశ్మీర్‌లో ముస్లిమేతరులకు మైనార్టీ హోదా ఇవ్వాలన్న అంశంపై మూడునెలల్లోపు తన స్పందనను తెలియజేయాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. జమ్మూకు చెందిన న్యాయవాది అంకుర్ శర్మ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్‌లు ఏకే గోయల్, డీవై చంద్రచూడ్‌లతో కూడిన బెంచ్ మంగళవారం విచారణ చేపట్టింది. తగిన సంప్రదింపులు, చర్చలు జరిపేందుకు వీలుగా కేంద్రానికి మూడునెలల గడువిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది.

కశ్మీర్‌లో శాశ్వత నివాసులకే అన్ని హక్కులు

ఇదీ 35ఏ అధికరణం ప్రాముఖ్యత!

న్యూఢిల్లీ, ఆగస్టు 8: ఇటీవలి వరకు భారత రాజ్యాంగంలోని '35ఏ' అధికరణం గురించి చాలా మందికి తెలియదు. కానీ ప్రస్తుతం దేశవ్యాప్తంగా విస్తృతస్థాయిలో చర్చ జరుగుతున్నది. జమ్ముకశ్మీర్‌లో 'శాశ్వత నివాసులు', వారికి గల ప్రత్యేక హక్కులు, అధికారాలను నిర్వహించే అధికారం ఆ రాష్ట్ర అసెంబ్లీకి దఖలు పరిచేందుకు రూపొందించిందే ఈ '35ఏ' అధికరణం. జమ్ముకశ్మీర్ ప్రభుత్వ అనుమతితో 1954లో రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా రాజ్యాంగంలో ఈ అధికారాన్ని జోడించారు.

ఇలా భారత్‌లో కశ్మీర్ విలీనం

జమ్ముకశ్మీర్ పాలకుడు మహారాజా హరిసింగ్ 1927, 1932ల్లో అమలులోకి తెచ్చిన చట్టాలతో పౌరుల హక్కులను నిర్వచించడం ద్వారా రాష్ట్రంలోకి వలసలు నియంత్రించారు. 1947 అక్టోబర్‌లో జమ్ముకశ్మీర్ భారత్‌లో విలీనమైంది. తర్వాత సీఎంగా బాధ్యతలు స్వీకరించిన షేక్ అబ్దుల్లా 1949లో కేంద్ర ప్రభుత్వంతో జరిపిన చర్చల ఫలితంగా రాజ్యాంగంలో 370వ అధికరణం చేరింది. 1952నాటి ఢిల్లీ ఒప్పందం, 1954నాటి రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా పలు అధికరణాలను వర్తింపజేసినట్లే కశ్మీర్‌కు 35ఏ అధికరణాన్ని జోడించారు.

కశ్మీర్ రాజ్యాంగంలోనూ 'శాశ్వత నివాసులు'

1956లో ఏర్పాటైన జమ్ముకశ్మీర్ రాజ్యాంగంలో 'శాశ్వత నివాసులు' అంశంపై మహారాజా హరిసింగ్ నిర్వచనమే కొనసాగింది. దీని ప్రకారం 1911కి ముందు, తర్వాత రాష్ట్రంలో జన్మించినవారు పదేండ్లకు తక్కువ కాకుండా నివాసం ఉన్నవారు మాత్రమే శాశ్వత నివాసులవుతారు. వీరికి మాత్రమే స్థిరాస్తుల కొనుగోళ్లతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు, స్కాలర్‌షిప్‌లు, సాయం పొందే అవకాశం లభిస్తుంది. 2002 హైకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రేతరులను పెండ్లాడిన కశ్మీరీ మహిళలకు శాశ్వత హక్కు కొనసాగనుండగా, వారి వారసులకు అది వర్తించదు.

రాహుల్ కనిపించడం లేదు.. అమేథీలో పోస్టర్లు

అమేథీ: కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, అమేథీ ఎంపీ రాహుల్‌గాంధీ కనిపించడం లేదని ఆయన నియోజకవర్గంలో పోస్టర్లు వెలిశాయి. వివిధచోట్ల రాహుల్‌గాంధీ ఫొటోతో పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. ఆరునెలలుగా నియోజకవర్గాన్ని రాహుల్ పట్టించుకోకపోవడంతో అభివృద్ధిపనులు ఆగిపోయాయని పోస్టర్లో పేర్కొన్నారు. అయితే ఇది బీజేపీ, ఆరెస్సెస్ పని అని కాంగ్రెస్ విమర్శించింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కాంగ్రెస్ నేత యోగేంద్ర మిశ్రా తెలిపారు.

జాప్యానికి కారణం ప్రభుత్వాధికారులే

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్య

ముంబై: ప్రభుత్వాధికారుల జాప్యం వల్లే వివిధ పథకాలు, ప్రాజెక్టుల అమలులో జాప్యం జరుగుతున్నదని కేంద్ర ఉపరితల రవాణా, నౌకాయాన శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. ముంబైలో మంగళవారం జల పర్యాటకంపై జరిగిన సెమినార్‌లో గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'పథకాల అమలులో జాప్యానికి మంత్రిని నిందించొద్దు. ప్రభుత్వ వ్యవస్థ, అధికార యంత్రాంగానిదే తప్పు' అన్నారు. తాము ఐదేండ్లే ప్రభుత్వంలో ఉంటామని, కానీ అధికారులు 58 ఏండ్లు వచ్చేవరకు ఉంటారని చెప్పారు. బంద్రా-వర్లీ సీ లింక్ పనుల్లో జాప్యం వల్ల రూ.1400 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు.

నేడు జిల్లా కలెక్టర్లతో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'న్యూ ఇండియా మంథన్'లో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న జిల్లా కలెక్టర్లతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా బుధవారం రాత్రి 7 గంటలకు రాష్ట్రంలోని కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. నవీన భారత నిర్మాణానికి ఎలాంటి చర్యలు అవలంబించాలి, అభివృద్ధి కార్యక్రమాల అమలు ఎలా ఉన్నది? ఏ విధంగా మీ జిల్లాల్లో అభివృద్ధి చేస్తున్నారు. తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ల సలహాలు, అనుభవాలు తెలుసుకోనున్నారు. ప్రధాని మోదీ నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ ఎస్పీ సింగ్‌కూడా పాల్గొంటారు.

పాక్ కాల్పుల్లో భారత సైనికుడి మృతి

జమ్ము, ఆగస్టు 8: జమ్ముకశ్మీర్ సరిహద్దుల్లో పాకిస్థాన్ మరోసారి కాల్పులకు తెగబడింది. మంగళవారం మధ్యాహ్నం 12.50 గంటల సమయంలో పూంచ్ జిల్లాలోని నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంబడి పాక్ సైన్యం జరిపిన కాల్పుల్లో భారత సైనికుడు మృతి చెందారు. పాకిస్థాన్‌కు దీటుగా సమాధానమిచ్చామని సైనికాధికారి తెలిపారు. కృష్ణగాటీ సెక్టార్ పరిధిలోని భారత సైనిక పోస్టులను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ అకారణంగా కాల్పులకు పాల్పడింది. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన సిపాయి పవన్ సింగ్ సుగ్రా (21)ను దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందారని ఆ అధికారి తెలిపారు. పవన్‌సింగ్ ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని పిథోర్‌గఢ్ జిల్లా, సుగ్రీ గ్రామ వాసి అని తెలిపారు.

చిన్న వయస్సులోనూ నరాలను దెబ్బతీసే 'నాడీ పొరల వ్యాధి'

'మల్టిపుల్ స్క్లెరోసిస్'కు యశోద హాస్పిటల్స్‌లో అత్యాధునిక చికిత్స

డిపార్ట్‌మెంట్ ఆఫ్ న్యూరాలజీ & న్యూరోసర్జరీ
యశోద హాస్పిటల్స్ - హైదరాబాద్
సికింద్రాబాద్ - సోమాజిగూడ - మలక్‌పేట్
ఫోన్: 81210 22333

మనలో చాలా మందిమి మల్టిపుల్ స్క్లెరోసిస్ (ఎం.ఎస్.)వ్యాధి గూర్చి వినివుంటాం లేదా ఆ వ్యాధిగ్రస్థులను చూసి ఉంటాం. కానీ ఈ నాడీ పొరల వ్యాధికి సంబంధించి మనం విన్న, తెలుసుకున్న విషయాలు ఎంతవరకు నిజం? ఇది ఓ ఆటోఇమ్యూన్ (శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ సొంత శరీరానికే వ్యతిరేకంగా పనిచేసే) వ్యాధి. దీనిలో రోగనిరోధ వ్యవస్థ స్వొంత నాడీమండలం పైన దాడిచేస్తుంటుంది. ప్రతీ లక్షమంది భారతీయులలో కనీసం ఎనిమిది మంది ఈ వ్యాధి పీడితులేనని అఖిల భారత వైద్య విజ్ఞాన శాస్త్రాల సంస్థ (ఎ.ఐ.ఎం.ఎస్.) ఇటీవల వెల్లడించింది. అయితే మల్టిపుల్ స్క్లెరోసిస్ వ్యాధి కారణాలు, లక్షణాలు, తీవ్రతను గూర్చి అనేక అపోహలు ప్రచారంలో ఉన్నాయి. శాస్త్రీయంగా నిర్ధారించిన నిజాలు తెలుసుకోవటం ద్వారా నాడీపొరల వ్యాధిని సరిగ్గా అర్థంచేసుకునేందుకు అవకాశం కలుగుతుంది.

అపోహ: మల్టిపుల్ స్క్లెరోసిస్ అంటే జీవితపు ఒత్తిడి, అలసట, వయసు పైబడటం వల్ల శారీరక బలహీనత.

వాస్తవం: ఇది సాధారణమైన శారీరక బలహీనత కాదు. నాడీవ్యవస్థలోని నరాలను దెబ్బతీసే వ్యాధి. దాని లక్షణాలను చూసి చాలా మంది ఆ విధంగా పొరబడతారు. ఆ దిశలో స్వయంగానో, స్థానికంగా ఉండే జనరల్ ప్రాక్టీషనర్ల వద్ద చికిత్స చేయించుకొంటు వుంటారు. ఇది ఉపశమనం కలిగించకపోగా సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. మల్టిపుల్ స్క్లెరోసిస్ తీవ్రమైన ఆరోగ్య సమస్య. వ్యక్తి శరీరంలోని సహజ రోగనిరోధ వ్యవస్థ స్వంత నాడీ మండలంపైన చేసే దాడిలో మెదడు, వెన్నులోని నాడులపై తొడుగులా ఉండే మైలిన్ విచ్ఛినం అవుతుంది. దీనివల్ల మెదడు నుంచి శరీర అవయవాలకు వెళ్లే సందేశాలు, శరీర అవయవాల నుంచి మెదడుకు చేరే ప్రతిస్పందనలలో ఆటంకం కలుగుతుంది. నరాలను కప్పి ఉంచే మైలిన్‌ను శరీరం వెలుపలి నుంచి ప్రవేశించిన ప్రమాదకర పదార్థంగా భావించిన రోగనిరోధక వ్యవస్థ ఆ పొరమీద దాడులు చేస్తుంది. అంటు వ్యాధులకు కారణమయ్యే బాక్టీరియా, వైరస్ పట్ల వ్యవహరించి గెలిచినట్లుగానే మైలిన్‌ను నిర్మూలించటానికి పూనుకుంటుంది. దీనివల్ల ఎం.ఎస్. వ్యాధి ఏర్పడుతుంది. అనేక రకాల వ్యాధి లక్షణాలుగా అది వ్యక్తమవుతుంది. ఎం.ఎస్.లో నాలుగు రకాలు ఉన్నట్లు గుర్తించారు. వీటి లక్షణాలు తేలికపాటి నుంచి తీవ్ర స్థాయిలో వ్యక్తం అవుతుంటాయి. ఒక వ్యక్తికి సోకింది ఏ రకమైన ఎం.ఎస్. అన్నది గుర్తించటం చికిత్సలో స్పష్టతతో మెరుగైన ఫలితాలు వేగవంతంగా పొందేందుకు వీలవుతుంది.



అపోహ: బాగా వయసు పైబడిన వృద్ధులకే ఎం.ఎస్. వ్యాధి వస్తుంది.

వాస్తవం: ఇది వృద్ధులకే పరిమితమైన వ్యాధి ఎంతమాత్రం కాదు. మనదేశంలో యువజనుల ఆరోగ్యం పై దాడిచేస్తున్న నాలుగు ప్రధాన వ్యాధుల్లో ఎం.ఎస్. ముఖ్యమైనదిగా ఇటీవలి అధ్యయనాలలో వెల్లడి అయ్యింది. దేశవ్యాప్తంగా ఈ వ్యాధి పీడితులలో దాదాపు ఎనభై శాతం మంది 18-35 సం. ల మధ్యవయస్సు వారే. ఎ.ఐ.ఎం.ఎస్. వెల్లడించిన వివరాల ప్రకారం బాలబాలికలలో కూడా ఈ వ్యాధి కనిపిస్తున్నది. మొత్తం మీద ప్రపంచ వ్యాప్తంగా ఎం.ఎస్. సోకిన వారిలో పదిశాతం మనదేశంలోనే ఉన్నారు. వయోజనులైన పురుషులలో కంటే స్త్రీలలో, ప్రత్యేకించి రుతుక్రమం ముగిసిన-మధ్యవయస్సు స్త్రీలలో ఈ వ్యాధి అధికంగా ఏర్పడుతున్నది.

పొగత్రాగే అలవాటు ఉన్న పురుషులు తేలికగా ఎం.ఎస్.కు గురవటమే కాకుండా, వారిలో ఈ వ్యాధి వేగంగా ముదురుతున్నట్లు గుర్తించారు. ఈ వ్యాధి కొన్ని కుటుంబాలలో వంశపారంపర్యంగా వస్తుండటం కూడా గమనించారు. మల్టిపుల్ స్క్లెరోసిస్ వ్యాధి రావటానికి దారితీస్తున్న కారణాలను గుర్తించేందుకు పరిశోధనలు జరుగుతున్నాయి. ఖచ్చితమైన కారణాలేవీ ఇప్పటి వరకూ వెల్లడి కానప్పటికీ కొన్ని పరిస్థితులు, అలవాట్లు ఎం.ఎస్. వ్యాధి వచ్చే అవకాశాలను బాగా పెంచుతున్నట్లు తెలిసింది. రోగనిరోధక వ్యవస్థలో లోపాలు, వాతావరణ పరిస్థితులు, అంటు వ్యాధులు, విటమిన్-డిలోపం వంటివి ఇందుకు దోహదపడుతున్నట్లు గుర్తించారు.

అపోహ: ఎం.ఎస్. వ్యాధి వచ్చిందంటే ఇక చక్రాల కుర్చీకే పరిమితం.

వాస్తవం: మల్టిపుల్ స్క్లెరోసిస్ వ్యాధి సోకినవారిలో అత్యధికులకు చక్రాల కుర్చీ గానీ, నడవటానికి ఇతర సాధనాల సాయంగానీ ఏమాత్రం అవసరం ఉండదు. తీరని అలసట, శరీరం మొద్దుబారినట్లు-అక్కడక్కడా పొడుస్తున్నట్లు అనిపిస్తూ, కండరాల నొప్పులతో నడవటం కష్టంగా ఉన్నప్పుడు ఎం.ఎస్. వ్యాధి కావచ్చునని అనుమానిస్తారు. అయితే లక్షణాలు ఇతర వ్యాధులను కూడా సూచించేట్లు ఉండటం వల్ల మల్టిపులు స్క్లెరోసిస్ (ఎం.ఎస్.) సోకినట్లు ప్రకటించరు. వ్యక్తిలో ఏర్పడిన ఆరోగ్య సమస్యలకు ఇతర వ్యాధులు కారణం కావని ఒక్కటొక్కటిగా తేల్చుకుంటూ వెళ్లి చివరకు దీనిని నిర్ధారించుకోవలసి ఉంటుంది. ఇందుకోసం డాక్టర్లు పూర్తి న్యూరొలాజికల్ ఎగ్జామ్స్‌తోపాటు మానసిక, ఉద్వేగ-భాషాపరమైన, శారీరక దృఢత్వం వంటి అనేక పరీక్షలు చేయించి ఆపైన ఒక అంచనాకు వస్తారు. ఆపైన వెంటనే చికిత్స ప్రారంభిస్తారు.

అపోహ: నాడీపొరవ్యాధి నిర్ధారణ అయ్యిందంటే కొద్ది కాలంలోనే మరణం ఖాయం.

వాస్తవం: ఎంత మాత్రం నిజం కాదు. ఈ వ్యాధి సోకినవారు పూర్ణాయుష్కులుగా జీవితం గడపగలుగుతారు. అయితే నాడీపొరల వ్యాధి జీవితాంతం ఉండే రుగ్మత. ఎం.ఎస్. వ్యాధిగ్రస్థుల జీవితాలను ఎప్పటికప్పుడు మరింత మెరుగుపరచేందుకు దేశవిదేశాలలో విస్తృతమైన పరిశోధనలు జరుగుతున్నాయి. వ్యాధి సోకినప్పటికీ వ్యక్తి దాదాపు మామూలు జీవితం గడిపేట్లు చేయటానికి వైద్యులు చికిత్సా ప్రణాలికను రూపొందిస్తారు.

మల్టిపుల్ స్క్లెరోసిస్‌తోసహా నాడీ సంబంధమైన వ్యాధులకు సంబంధించి తమ సంస్థలో అత్యాధునిక వ్యాధి నిర్ధారణ-చికిత్సా ఏర్పాట్లు ఉన్నాయని, దేశంలోని అత్యుత్తమ న్యూరోఫిజీషియన్లు-న్యూరోసర్జన్లు అందుబాటులో ఉంటున్నారని యశోద హాస్పిటల్స్‌లోని యశోద న్యూరో ఇనిస్టిట్యూట్‌కు చెందిన వైద్యనిపుణులు చెప్పారు. నాడీ సంబంధిత వ్యాధుల చికిత్సలో అత్యవసర సేవల కోసం ఈ ఇనిస్టిట్యూట్‌లో ప్రత్యేక ఐ.సి.యూ. పనిచేస్తోంది. మరోవైపు ఎం.ఎస్. వల్ల తలెత్తే ఉద్వేగ సంబంధిత, భౌతిక సమస్యలను అధిగమించేందుకు కూడా చికిత్స అవసరం అవుతుంది. నడక బాగా నెమ్మదించటం, శారీరక బలహీనత, కండరాల నొప్పి, దృష్టి సంబంధమైన సమస్యలు, మానసిక కృంగుబాటు, తీరని అలసట వంటి సమస్యల పరిష్కారానికి వాటి తీవ్రతను బట్టి విడివిడిగా మందులను సిఫార్సు చేస్తుంటారు.

మల్టిపుల్ స్క్లెరోసిస్‌ను అదుపుచేసేందుకు డాక్టర్లు పలురకాల మందుల వాడకం, ఇతర చికిత్సలను ఉపయోగిస్తూ బహుముఖ వ్యూహాన్ని అనుసరిస్తారు. ఎం.ఎస్. వ్యాధి తీవ్రతను తగ్గించటం, మళ్లీ మళ్లీ రాకుండా నివారించటం, వ్యాధిలక్షణాల అదుపు ద్వారా ఉపశమనం లక్ష్యంగా చికిత్స సాగుతుంటుంది. ఇందుకోసం ప్రస్తుతం పదిరకాల మందులను సిఫార్సు చేస్తున్నారు. వీటిలో కొన్నిటికి సైడ్ ఎఫెక్ట్ ఉన్నప్పటికీ ఎం.ఎస్. వ్యాధిలో సమస్యలను అదుపుచేసే సాధారణ జీవితాన్ని పునరుద్ధరించేందుకు ఉపయోగిస్తున్నారు. ఇటువంటి మందులలో కార్టికో స్టెరాయిడ్స్ ఒక భాగం. ఇవి శరీరంలో వాపులను తగ్గించి రోగ నిరోధక వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయి. అనేక సైడ్‌ఎఫెక్ట్స్ కారణం అవుతుంటాయి. అయితే సైడ్ ఎఫెక్ట్స్ తీవ్రతను తగ్గించటానికి వేరే మందులను, అలవాట్లను సూచించటంతోపాటు కొద్దిపాటి అసౌకర్యాలను తట్టుకునేందుకు వ్యాధిగ్రస్థులను సంసిద్ధులను చేస్తుంటారు.

సంకేతభాష తెలిసిన తొలి ఒరాంగ్‌టాన్ మృతి



అట్లాంటా, ఆగస్టు 8: అమెరికాలోని అట్లాంటా జూలో సంకేతభాష (సైన్ లాంగ్వేజ్) నేర్చుకున్న 39 ఏండ్ల చన్‌టెక్ అనే మగ ఒరాంగ్‌టాన్ గుండె సంబంధ వ్యాధితో సోమవారం మృతిచెందింది. ఇది తన గదిని తానే శుభ్రం చేసుకోవడంతోపాటు రెస్టారెంటుకు వెళ్లివచ్చే దారిని గుర్తుపట్టేది. చన్‌టెక్‌ను తన సొంత పిల్లల్లాగే చూసుకుంటూ.. సంరక్షకుడు లైన్‌మైల్స్ దానికి ఈ భాషను నేర్పించారు. గుండె సంబంధ వ్యాధి నెక్రోప్సీ కారణంగా అది మృతి చెందిందని జూ అధికారులు తెలిపారు. చన్‌టెక్ ఉత్తర అమెరికాలోనే పెద్దవయసు ఒరాంగ్‌టాన్. అట్లాంటాలోని యెర్కేస్ రీజినల్ ప్రైమేట్ రీసెర్చ్ సెంటర్‌లో జన్మించిన చన్‌టెక్ 1997 నుంచి అట్లాంటా జూలో ఉంటున్నది.

పశ్చిమబెంగాల్‌లో కాలువలో పడిన బస్సు

ఎనిమిది మంది మృతి, 36 మందికి గాయాలు

క్రిష్ణనగర్(పశ్చిమబెంగాల్), ఆగస్టు 8: పశ్చిమబెంగాల్‌లో ఓ బస్సు కాలువలో పడిపోవడంతో ఎనిమిది మంది చనిపోయారు. 36 మంది గాయపడ్డారు. ఈ సంఘటన మంగళవారం నాడియా జిల్లాలోని గాలకాట ప్రాంతంలో జరిగింది. క్రిష్ణనగర్‌లో ప్రయాణికులను ఎక్కించుకున్న బస్సు పాలస్సేపరకు బయలుదేరింది. అయితే గాలకాట ప్రాంతానికి చేరుకునే సరికి డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో బస్సు వేగంగా మలుపు తిరిగి కాలువలో పడిపోవడంతో ఎనిమిది మంది మృతిచెందారు. గాయపడిన 36 మందిని దవాఖానకు తరలించారు.

రాజస్థాన్‌లో నీటిలో మునిగిన పడవ

మహిళ మృతి.. ఐదుగురు గల్లంతు

జైపూర్, ఆగస్టు 8: రాజస్థాన్‌లో ఓ పడవ నీటిలో మునిగిపోవడంతో ఓ మహిళ మృతిచెందారు. ఐదుగురు గల్లంతయ్యారు. ఈ సంఘటన మంగళవారం ఝులావర్ జిల్లాలో జరిగింది. ఓ పడవలో దాదాపు 15 మంది పర్‌బన్ నదిలో ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగి పడవ బోల్తాపడింది. దీంతో ఓ మహిళ మృతిచెందగా, ఐదుగురు గల్లంతయ్యారు.

ప్రపంచ యుద్ధం నాటి మలేరియా ఔషధానికి పునరుజ్జీవం

భారతీయ శాస్త్రవేత్తల పరిశోధన



న్యూఢిల్లీ: రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఎంతోమంది ప్రాణాలు రక్షించిన ఓ ఔషధాన్ని ఇప్పుడు సరికొత్త ఆయుధంగా మలేరియాపై సంధించేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. వ్యాధి నివారణకు వినియోగిస్తున్న ఔషధాలను రోగకారక మలేరియా క్రిములు తట్టుకుంటుండటంతో భారతీయ పరిశోధకులు గత శతాబ్దంలో విజయవంతంగా పనిచేసిన 'అక్రిఫ్లేవిన్/ఏసీఎఫ్' వైపు దృష్టి సారించారు. ఆ ఔషధం మలేరియా క్రిములను అరికట్టడంలో విజయవంతంగా పనిచేస్తున్నట్టు కనుగొన్నారు. నానో టెక్నాలజీని ఉపయోగించి ఆ ఔషధాన్ని మరింత ప్రభావవంతంగా పనిచేయించేందుకు పరిశోధనలు సాగిస్తున్నారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనవర్సిటీలోని మాలిక్యూలర్ మెడిసిన్ పరిశోధకులు ఇప్పటికే ఏసీఎఫ్‌లోని మలేరియా వ్యతిరేక లక్షణాలపై పేటెంట్‌ను పొందారు. ఔషధ సూత్రీకరణకు, జంతువులపై ప్రయోగించి దాని సామర్థ్యాన్ని పరీక్షించేందుకు వారు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీ (ఎన్ఐఐ) శాస్త్రవేత్తలతో చేతులు కలిపారు (ఇండియా సైన్స్ వైర్ సౌజన్యంతో).